
# కథా కౌముది

2022 - part -2





శ్రీ

కౌముది

మీ మనసుల్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 255




## కౌముది మాసపత్రికలో

## 2022 జూలై నుంచి డిసెంబర్ 2022 వరకూ వచ్చిన కథలు


| క్రమసంఖ్య | కథపేరు | రచయిత(త్రి)పేరు | పేజి |
|---|---|---|---|
| 1 | దృశ్యాలు | కె. వరలక్ష్మి | 4 |
| 2 | లాఫింగ్ బుద్ధా! | డా.భైరవభట్ల విజయాదిత్య | 10 |
| 3 | నా త్రిజన్మ పయనం | రజనీకాంత్ వేదుల | 20 |
| 4 | పోగు బంధం | యశస్వి జవ్వాది | 25 |
| 5 | జీనా ఇసీ కా నామ్ హై! | తోట ప్రసాద్ | 33 |
| 6 | 100 ప్లస్ 1 | కృపాకర్ పోతుల | 38 |
| 7 | సంభవామి | అన్నపూర్ణ దేవరకొండ | 45 |
| 8 | అన్ ప్రొఫెషనల్ బ్రోకర్ | శ్రీధర్ బొల్లేపల్లి | 50 |
| 9 | కూత్తరసన్ | డా.రాయపెద్ది వివేకానంద్ | 57 |
| 10 | మరణ వాఙ్మూలం | జి వి రమణ | 69 |
| 11 | రక్షక భటుడు | జయంతి ప్రకాశ శర్మ | 76 |
| 12 | పుస్తక సామ్రాట్ | రాచపూటి రమేశ్ | 83 |
| 13 | కల్తీ లేని దుఃఖం | దమ్మవళం శ్రీనివాస్ | 95 |
| 14 | ఓం నమఃశివాయ | ఎలక్ట్రాన్ | 103 |
| 15 | అంతర్మథనం | అర్చన కోవూరు | 109 |

| | | | |
|---|---|---|---|
| 16 | బాట లేని బాటసారి | నిర్మలాదిత్య(భాస్కర్ పులికల్) | 120 |
| 17 | ఎంత చేరువో...అంత దూరమూ | రమాదేవి నెల్లుట్ల | 129 |
| 18 | శౌచం | వడలి రాధాకృష్ణ | 140 |
| 19 | శ్రేయోభిలాషి | శెట్టిపల్లి అరుణా ప్రభాకర్ | 145 |
| 20 | స్వర్గం కన్నా మిన్న | డా.కనుపూరు శ్రీనివాసులు రెడ్డి | 147 |
| 21 | ఊయల | తటవర్తి నాగేశ్వరి | 160 |
| 22 | నిష్క్రియత్వం | నవులూరి వెంకటేశ్వర రావు | 169 |
| 23 | యానం | స్ఫురిత మైలవరపు | 185 |
| 24 | జంప్ జిలాని | జి.ఎస్.లక్ష్మి | 189 |

# దృశ్యాలు

కె. వరలక్ష్మి

## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో బహుమతి పొందిన కథ

**ఐదో అంతస్తు** బాల్కనీలో కూర్చుని ఉన్నాడు ప్రభాకరమూర్తి. అతని ముందు విశాలమైన రోడ్డు. రోడ్డు కవతల అంతా దరీ లేని సముద్రం. గత రెండేళ్ళుగా సముద్రాన్ని అలా కళ్ళల్లో నింపుకుంటూనే ఉన్నాడు. నిరంతరం సముద్రం అలా రోడ్డుమీది కొచ్చి కెరటాల్ని వొంపి వెనక్కెళ్ళడం. విసుగు విరామం లేని చర్య.

ఈ భవంతిని నిర్మించినప్పటినుంచీ ఎన్నో ఏళ్ళుగా అతనెన్నడూ సముద్రాన్ని గమనించిందే లేదు. ఈ రెండేళ్ళుగా నిద్రపోయేటప్పుడు తప్ప గమనించకుండా ఉన్నదీ లేదు. ఎంతో ఇష్టంగా ఏ వ్యూ నుంచి చూసినా సముద్రం కనిపించేలా ప్లాన్ చేసి నిర్మించుకున్న భవంతి అది.

ఆ సముద్రంలాగే రెండేళ్ళ క్రితం వరకు విసుగు విరామం లేని పరుగుల జీవితం గడిపాడు మూర్తి. ఏనాడూ అతనికి వయసు గుర్తుకు రాలేదు. ఆ పరుగుల జీవితంలోని ఆనందాన్ని. దానివల్ల వచ్చిపడే సంపదని చాలా ఎంజాయ్ చేసాడు. ఉన్నట్టుండి ఉధృతంగా ప్రవహించే నదికి అడ్డుకట్ట వేసినట్లు అనారోగ్యం తనని సంకెళ్ళు వేసి ఆపేసింది. హాస్పిటల్ రిజిస్టర్‌లో చూస్తే గుర్తుకొచ్చింది నిరుడే తన వయసు డెబ్బైని దాటిందని.

అయితే ఏమైంది, ఇదో లెక్క కాదు తనకి. ఎంత డబ్బైనా ఖర్చు చేసి తిరిగి సంపూర్ణారోగ్యాన్ని పొందుతాడు. ఎప్పటిలాగే లేడిలాగా పరుగులెత్తుతాడు. అనుకున్నాడు. కాని, చిత్రంగా ఆ పరుగులకి కళ్ళెం వేస్తూ కాళ్ళు రెండూ పట్టేసాయి. ఎన్నెన్నో పరీక్షలు, ఎందరో డాక్టర్లు, ఏవేవో అర్థంకాని పేర్లు. మూడు నెలల హాస్పిటల్ వాసం ముగిసి వీల్ ఛెయిర్‌లో ఇంటికి చేరుకున్నాడు. ఇప్పుడిక ఆ చెయిర్ కున్న చక్రాలే అతనికి కాళ్ళయ్యాయి.

ఇంటికొచ్చిన తర్వాత ఆరునెలలపాటు మందులు మింగుతూ లేచి తిరగగలనని ఎదురు చూసాడు. క్రమంగా ఆ ఆశ అడుగంటిపోయింది. మింగిన మందుల సైడ్ ఎఫెక్ట్ వల్ల వెన్నెముక బలహీనమైపోయింది. ఒంట్లో ఓపిక హరించి

పోయింది. అయినా మొండిగా వీల్ ఛెయిర్‌తోనే తిరగాలని చూసాడు. అతని వ్యాపారం అలాంటిది. నిరంతరం విమానాల్లో తిరిగినవాడు తిరిగినట్టే ఉండేవాడు.

కాని, కొడుకు రాహుల్ అతని సాహసాన్ని సమర్ధించలేదు. ఇక పరుగులు ఆపమన్నాడు. అన్నీ తను చూసుకుంటానన్నాడు. బైటికి కదలకుండా కట్టడి చేసేసాడు. మూర్తి భార్య కూడా కొడుకునే వెనకేసుకొచ్చింది.

"ఆ, పిల్లకాకి. వాడికేం తెలుసులే. కాళ్ళ బేరానికి రాకపోడు" అనుకున్నాడు మూర్తి, కాని, అలా జరగలేదు. మొదట్లో తన సలహాల కోసం వచ్చేవాడు. అన్నీ తండ్రితో సంప్రదించేవాడు రాహుల్ క్రమంగా అతని ప్రమేయాన్ని తగ్గిస్తూ వచ్చాడు.

'ఇప్పుడిక మూర్తి ఉత్సవమూర్తి అయిపోయాడు ' అని మూర్తి అనుకోని రోజు ఉండడం లేదు.

అతని బుర్రలో ఎన్ని ఆలోచనలు గింగిరాలు తిరుగుతున్నా అతని చూపులు మాత్రం సముద్రం మీదే నిలిచి ఉంటాయి. సముద్రంలో తిరుగుతున్న బోట్స్ మీద అతని చూపు అతుక్కుపోయింది.

ఎన్నిసార్లు తను బోటింగ్‌కి వెళ్ళాలని అనుకున్నాడు. ఎన్నిసార్లు షిప్‌లో ఎక్కడికైనా ట్రిప్ వేస్తానని భార్య లక్ష్మికి మాటివ్వలేదు. ఇప్పుడిక అవేవీ సాధ్యపడవు.

క్రమంగా తన లోపలి ధైర్యం, స్పోర్టివ్‌నెస్ అడుగంటిపోయింది. అసంతృప్తి ఆవరించుకుంది. దానివల్ల కోపం, దిగులు అలుముకుంటున్నాయి. ఊహించని ఈ విపత్తు తనమీద ఇలా విరుచుకు పడుతుందని మూర్తి కలలో కూడా అనుకోలేదు.

ఈ మధ్య అతనికి మరో అనుమానం మొదలైంది, తన మాటను ఎవరూ ఖాతరు చెయ్యడం లేదని, డైనింగ్ టేబుల్ దగ్గర అతను ఏదో చెప్పబోతే ఎవరూ వినిపించుకోనట్టే ఎవరి సంభాషణల్లో వాళ్ళుంటున్నారు. కొన్ని విషయాలు అతనికి తెలియాలి అన్నట్టు చెప్తారే కాని అతని నిర్ణయాన్ని ఎవరూ అడగడంలేదు. కొన్ని విషయాలు తనకు చెప్పకుండానే దాటవేస్తున్నారని అతను గమనించాడు. ఒకటే పరుగుతో సంపాదించిన కోట్ల ఆస్తి తనను ఈనాడు ఆదుకోవడంలేదు. ఆ ఆస్తితో తనకేమీ అవసరం లేకుండా పోయింది. తనిప్పుడు కావాల్సినంత ఖర్చుపెట్టలేడు. అసలు తనకు డబ్బుతో అవసరమే లేకుండా పోయింది. అన్నీ వాళ్ళే చక్కబెట్టుకుంటున్నారు. తన చేతుల్లో డబ్బులుండవని తెలీడంవల్ల తన కేర్ టేకర్‌కి కూడా తనమీద గౌరవం పోయినట్టుంది.

తను బాగా ఉన్నప్పుడు నంగినంగిగా చేతులు నలుపుకుంటూ బక్షీస్ అడిగే బాలగాడు ఇప్పుడు తన దగ్గర డబ్బు ప్రసక్తి తేవడం మానేసాడు. చివరికి వంటలక్క వరాలమ్మ కూడా 'ఏం వండమంటారు?' అని అడగడం మానేసింది. డ్రైవర్ రాజు మాత్రం అప్పుడప్పుడు పలకరించి వెళ్తూంటాడు.

సముద్రంలో దూరంగా దిగంతం దగ్గర చిన్న గీతలా కనిపించిన ఓడ ఒకటి పైపైకి వస్తూ పెద్దదౌతోంది.

వేసుకున్న బట్టలనుంచి ఆడో మగో తెలీడం లేదుకాని, చిన్న పిల్లలిద్దరు ఒడ్డున ఇసకలో పరుగులెత్తుతూ ఆడుకుంటున్నారు. అక్కడికి దగ్గర్లో వాళ్ళ తల్లిదండ్రులు కాబోలు వాళ్ళనే చూస్తూ కబుర్లు కలబోసుకుంటున్నారు.

థేంక్ గాడ్. కళ్ళద్దాలలోంచి తను అన్నీ చూడగలుగుతున్నందుకు. హఠాత్తుగా తన బాల్యం గుర్తుకొచ్చింది మూర్తికి.

ఇన్నేళ్ళుగా మరచిపోయిన బాల్యం.

ముందుగా పెద్దక్క గుర్తుకొచ్చింది.'ఒరే ప్రభా' అని పిలిచే పెద్దక్క. మూర్తికి ఇద్దరక్కలు, ఒక తమ్ముడు, ఒక చెల్లి. తల్లీ తండ్రీ వాళ్ళ పనుల్లో తీరికలేకుండా ఉంటే వాళ్ళ పెద్దక్కే అందర్నీ చూసుకునేది. స్నానాలు చేయించడం, అన్నాలు తినిపించడం, పాఠాలు చదివించడం ఆటలాడించడం, కథలు చెప్పడం, నిద్రపుచ్చడం. అందరూ ముఖ్యంగా తను పెద్దక్కను అంటిపెట్టుకుని తిరిగేవాడు. పెద్దక్క చెప్పే కథలు ఎంతో బావుండేవి. ఎప్పుడూ పుస్తకాలు చదువుతూ ఉండే పెద్దక్క నిద్రపోయేముందు రోజూ కథలు చెప్పేది. పెద్ద పందిరి మంచం మీద మధ్యలో పెద్దక్క అటు ఇద్దరు, ఇటు ఇద్దరు తమ్ముళ్ళు చెల్లెళ్ళు. అక్క చెప్పే కథ బాగా వినపడాలని తనెప్పుడూ అక్క పక్కనే చేరేవాడు. ఒకోసారి మిగిలిన ముగ్గురూ ఏడ్చి గొడవపెడితే చీటీలు వెయ్యాల్సి వచ్చేది. ఆ చీటీలు తనే రాసి అన్నిటిమీదా తన పేరే రాసుకునేవాడు.

మూర్తి పెదవుల మీద నవ్వు పొంగింది.

'బాల్యం ఎవరికైనా మధురమైంది'అని ఎందుకంటారో అర్థమైంది. పదిహేనేళ్ళకే పెళ్ళిచేసి పంపించిన పెద్దక్క ఎప్పుడొస్తుందా అని ఎదురుచూసేవాళ్ళు తాము నలుగురూ.

చిన్నక్క తాను చెప్తానని సిద్దమయ్యేది కానీ అవి ఎవరికీ నచ్చేవికావు. అసలు చిన్నక్కకి కథలు చెప్పడమే రాదు అని తేల్చేసాడొకసారి తను. చిన్నక్క ఉడికిపోయి పక్కనే ఉన్న రాగిచెంబుతో తన నెత్తిమీద ఒక్కటిచ్చింది. అప్రయత్నంగా తల తడుముకున్నాడు మూర్తి.

చిలిపి తగాదాల్లోనే ఎంతెంత ప్రేమలు! ఎంతెంత అభిమానాలు! పెదద్దై ఎవరి జీవితాలు వాళ్ళవయ్యాక ఆ ప్రేమలు అభిమానాలు ఎప్పుడింకిపోయాయో గుర్తుకు రావడంలేదు.

లేదు లేదు వాళ్ళు నలుగురూ తనకి ఉత్తరాలు రాసీ, తర్వాత కాలంలో ఫోన్లు చేసీ తనతో బంధాన్ని వదులుకోకూడదని చాలా ప్రయత్నించేవారు. తనే సంపాదన అనే బిజీలో కూరుకుపోయి వాళ్ళని పట్టించుకోవడం మానేసాడు. తనని చూడాలని వాళ్ళు వస్తే పలకరించడానికి తనకి టైముండేదికాదు. అన్నీ లక్ష్మి చూసుకుంటుందిలే అని వదిలేసేవాడు. తను కారుల్లోను వాళ్ళు కాలి నడకన తిరిగే వ్యత్యాసం వచ్చాక లక్ష్మి కూడా వాళ్ళని దూరం పెట్టింది. ఆర్థిక పరమైన అవసరాల కోసం వాళ్ళెవరూ చెయ్యి చాచి తన దగ్గరకి ఎప్పుడూ రాలేదు. వస్తారేమో అనే భయం లక్ష్మికి ఉండేది. వాళ్ళెవరి పిల్లల పెళ్ళిళ్ళకి, శుభకార్యాలకి వెళ్ళిన గుర్తులేదు తనకి.

ఎక్కడి వరకో ఎందుకు తన తండ్రిపోయాక తల్లి వచ్చి తమ ఇంట్లో ఉన్నప్పుడు ఇంటికెవరైనా గెస్టులు వస్తే ఆమెని ఒక గదిలో పెట్టి తలుపు గడియ వేసేసేది లక్ష్మి. పల్లెటూరులో జీవించి, నలిగిన చీరల్లోనే జీవితం గడిపితే మాత్రం అమ్మకి ఆ మాత్రం గ్రహింపు ఉండదని తాము ఎలా అనుకున్నారు? కాదు కాదు, ఉంటే ఉండనీలే అని ఒక నిర్లక్ష్యం. ఆ మర్నాడే అమ్మ తన బట్టలు సర్దుకుని ఎందుకెళ్ళిపోయిందో తనకి తెలీదా? అవన్నీ తనకి తెలియకుండా జరిగిపోయాయని ఇప్పటికీ తనని తను మభ్యపెట్టుకోవడం ఎంతవరకు సమంజసం?

మూర్తి కళ్ళల్లోకి నీళ్ళొచ్చాయి. ఈ మధ్య ఎందుకో పిలవకుండానే కన్నీళ్ళు ఉబికి వస్తున్నాయి. భుజం మీది టవల్‌తో ఒత్తుకున్నాడు. ఇప్పుడు తన తల్లి లేదు. రెండో అక్కలేదు. మిగిలినవాళ్ళు ఎలా ఉన్నారో తనకి తెలీదు. తను ఇలా అయిపోయాడని వాళ్ళకి తెలుసో లేదో.

వాళ్ళ ఫోన్ నెబర్లు కూడా లేవు తన దగ్గర.

బీచ్‌లో పిల్లల ఆట ముగిసింది. తల్లిదండ్రుల్తో కలిసి వెళ్ళడానికి సిద్దమయ్యారు. ఈ లోపల రోడ్డుమీద వెళ్తున్న వాహనాలన్నిటికీ చెయ్యి ఊపుతూ పగలబడి నవ్వుకుంటున్నారు.

అందులో అంత ఆనందం ఏముందో?

మూర్తి కళ్ళల్లోకి ఆనంద్మ పొంగి వచ్చింది.

అంతలో మరో దృశ్యం మీదికి అతని దృష్టి మళ్ళింది.

ఒక ఆడమనిషి తనంత పొడవున్న ప్లాస్టిక్ సంచి ఒకటి భూజాన్నేసుకుని రోడ్డు పక్కన దొరుకుతున్న ఏదో పనికిరాని పాతసామాన్లు ఏరుకుంటోంది. ఆమె కూతురు కాబోలు ఆరేళ్ళ పిల్ల రోడ్డుకి అవతలి పక్క ఏం దొరికిందో ఆనందంగా ఇవతలికి పరుగెత్తుకొస్తోంది. హఠాత్తుగా ఆటో ఒకటి ఆ పిల్లను రాసుకెళ్ళినంత వేగంగా వెళ్ళింది. మూర్తికి గుండె ఆగినంతపనైంది. ఆ పిల్లగాని తల్లిగాని అదేమీ పట్టించుకున్నట్టే లేరు. ఆ పిల్ల అదే వేగంతో వచ్చి తల్లిని వాటేసుకుంది. ఆనందంగా ఏదో చెప్తోంది. ఆ తల్లి వినిపించుకోకుండా ముందుకెళ్ళిపోతోంది.

చిన్నప్పుడు తను తల్లినలా వాటేసుకుంటే ఆమె చేస్తున్న పనిని పక్కన పెట్టి తన జుట్టు నిమిరి, బుగ్గలు పుణికి ముద్దు పెట్టుకునేది.

గుండెమీది నుంచి చేతిని తీస్తూ చూసుకున్నాడు మూర్తి. ముంజేతుల నిండా ముడతలు, అద్దంలో చూసుకుంటే ముఖం నిండా ముడతలు, ఈమధ్య డై వేసుకోక జుట్టంతా ఎప్పుడో ముగ్గుబుట్టైపోయింది. ఎంత ముసలివాడైపోయాడో తను.

మూర్తికి మళ్ళీ దుఃఖం పొంగిపొరలింది. ఎంతో దిగులుగా ఉంది.

హఠాత్తుగా కోడలు ప్రవీణ పిల్లవాణ్ణి వెంట పెట్టుకుని హరీబరీగా వచ్చింది. "పెట్టు పెట్టూ తొందరగా. తాతగారి కాళ్ళకి దణ్ణం పెట్టు" అంటోంది ఇంగ్లీషులో. వాడు ఫోన్లోకి చూసుకుంటూ ఏదో లోకంలో ఉన్నాడు.

"చెయ్యి పట్టండి" అంటూ చేతిలో అక్షతలు కొన్ని ఎత్తి పడేసింది. పన్నెండేళ్ళ పిల్లవాడు. ఫోన్ లోకి తప్ప మరిదేనికీ తలవంచని వాడి తలని బలవంతంగా రెండించులు వంచగలిగింది. మూర్తి అక్షతలు పైకి చల్లాడు. కొన్ని కోడలి తలమీదకూడా పడ్డాయి. ఆమె చికాకును కనపడనీయకుండా దులుపుకుంది. తిరిగి పిల్లవాడి రెక్కపట్టుకుని ఈడ్చుకెళ్తూంటే వెనకనుంచి అడిగాడు "ఏవిటమ్మాయ్ విశేషం ఇవేళ?"

"పండగ కదా ఈవేళ" అందామె. ఒక్క క్షణం ఆగి, 'ఏం పండగ' అంటాడేమోనని "వినాయక చవితి" అంది.

"ఎవరు తరుముకొస్తున్నారని అంతపరుగులు" అనుకున్నాడు మూర్తి. రెండేళ్ళ క్రితం వరకు తనూ ఇలాగే పరుగులు పెట్టిన విషయం మరచిపోయాడు.

సముద్రం మీద ఏదో పక్షులు గుంపుగా వాలి పైకి లేస్తున్నాయి.

'పండుగలన్నీ ఎప్పుడో వాట్సప్ మెసేజ్‌లకి పరిమితమైపోయాయి. నలుగురూ కలిస్తేనే కదా పండగ' అనుకున్నాడు మూర్తి. తన ఇద్దరు కూతుళ్ళు, మనవరాలు అంతే కొడుకు కూతురు భూగోళానికి అవతలి పక్క ఉన్నారు. పండగలకి పబ్బాలకి రాలేరు. తన బాల్యంలో పండగంటే ఎంత సందడి ఉండేది. మేనత్తలు, అక్కలు కుటుంబాల్తో రావడం, తలంట్లు, కొత్తబట్టలు, పిండి వంటలు, ఊరిమీద పడీ తిరగడాలు, సినిమా హాళ్ళలో ఇరుక్కుని సినిమాలు చుడడాలు, అర్ధరాత్రి దాటేవరకూ కబుర్లు, ఎక్కడ చోటు దొరికితే అక్కడ పడి నిద్రపోవడాలు. ఎంత బావుండేది. వాళ్ళంతా వెళ్ళిపోయాక ఇల్లు చిన్నబోయి మళ్ళీ పండగెప్పుడొస్తుందా అని ఎదురు చూడడం తను కలిగినింటి అమ్మాయిని పెళ్ళి చేసుకుని సిటీకి వచ్చేసాక రెండుసార్లు కాబోలు వెళ్ళగలిగారు తమ ఇంటి పండగలకి. అక్కడ లక్ష్మి తన వాళ్ళెవ్వరితోనూ కలవలేకపోయేది. పైగా అదంతా అనాగరిక పద్ధతి అని తేల్చేసింది. అలాంటి చోట్లకి వెళ్తే తన పిల్లలు చెడిపోతారు అని భయపడింది. ఆమె ఆస్తి అనే నిచ్చెన మెట్లెక్కి పైకొచ్చే ప్రయత్నంలో ఉన్నతను ఆమె అన్నదేదీ కాదని ఖండించలేకపోయేవాడు 'నేనూ అక్కడినుంచే వచ్చాను కదా!' అని అనలేకపోయాడు.

ఇప్పుడొకసారి కాలం వెనక్కి నడిచి ఒక్కసారి.. ఒకే ఒక్కసారి తన వాళ్ళందరితో గడపగలిగితే..

జనం సందడి తగ్గడం వల్ల సముద్రపు హోరు స్పష్టంగా వినిపిస్తోంది.

హఠాత్తుగా గుర్తుకొచ్చింది. ఒకసారి తన తమ్ముడేదో ఆర్ధికపరమైన ఇబ్బందిలో ఉండి తనను సాయం అడగాలని వచ్చాడట. తను సరిగ్గా పలకరించలేదని అడగకుండానే వెళ్ళిపోయాడట. తర్వాత తల్లి చెపితే తెలిసింది. అప్పుడైనా తను 'అడగొచ్చుకదా, తనేమైనా పరాయివాడా' అనలేదు.

ఇంకోసారి తన ప్రాణస్నేహితుడింట్లో పెళ్ళికి వెళ్ళినప్పుడు తను తిరిగి వచ్చెయ్యబోతూంటే చెల్లెలు చొరవగా తన కారు దగ్గరకొచ్చింది పెద్ద బేగ్ నిండా బట్టలు సర్దుకుని "అన్నయ్యా, నాకు ఒంట్లో నలతగా ఉంటోందిరా, డాక్టరు పెద్ద హాస్పటల్లో చూపించుకోమంటున్నాడు. నువ్వొస్తావని, నీతో వద్దామని ఆగాను. మీ బావకూడా వెళ్ళి చూపించుకో అంటున్నాడు" అంది.

ఇలా చెప్పా పెట్టకుండా తీసుకెళ్తే లక్ష్మి ఎలా రియాక్టవుతుందో తనకి బాగా తెలుసు. "ఎక్కడికొస్తావ్?" అన్నాడు.

ఎంత మామూలుగా అందామనుకున్నా తన గొంతు హార్ష్ గా పలికింది. తన ముఖంలోకే చూస్తున్న చెల్లెలు అక్కడి చికాకును కూడా గమనించి దెబ్బ తిన్న పక్షిలా చూసింది. గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది. అదే చివరిసారి తనామెను చూడడం. చిన్నప్పుడంతా 'అన్నయ్యా.. అన్నయ్యా' అంటూ తన వెంట వెంట తిరిగిన తమ్ముడు, చెల్లి అలా దూరంగా జరిగిపోయారు. లక్షి వచ్చింది. పండగ అలంకరణ కాబోలు పట్టుచీర కట్టుకుని నగలన్నీ అలంకరించుకుంది. "ఇంకా ఇలాగే ఉన్నారా పండగ పూట? రాహుల్ మీకోసం పొందూరునుంచి కొత్త పంచెలు తెప్పించాడు" అంటూనే "బాలా, ఎక్కడ చచ్చేవ్" అని అరిచింది. వాడు పరుగెత్తుకొచ్చాడు.

"అయ్యగారికి స్నానం చేయించి కొత్తబట్టలు కట్టాలని తెలీదా?"

"తెలుసమ్మగారూ అయ్యగారే ఎప్పుడూ అలా సంద్రాన్ని సూస్తా ఉండిపోతారు. ఏటుందో మరి సంద్రంలో" అని గొణుగుతూ గీజర్ ఆన్ చెయ్యడానికి వెళ్ళాడు.

"పోన్లే చూసుకోనీ, ఎంత చూసినా ఇంక కొన్నాళ్ళేకదా. రాహుల్ బాబు సముద్రానికి దూరంగా కడుతున్న ఇరవై అంతస్తుల ఫ్లాట్స్‌లోకి మారిపోదామంటున్నాడులే" అంది లక్షి .

'అవునా, తనతో ఒక్కమాట కూడా అనలేదే'

అతనికి మళ్ళీ దుఃఖం పొంగి వచ్చింది. ఆసరా కోసమన్నట్టు ఆమె నడుముని చేతుల్తో చుట్టేసాడు.

"ఉండండి ఏంటిది? చీర నలిగిపోతుంది" అంటూ వదిలించుకుని దూరంగా జరిగింది.

అతనికి నీరసంగా, నిస్సహాయంగా అనిపించింది. గొంతు పెగుల్చుకుని అభ్యర్ధనగా అడిగాడు "లక్ష్మీ! మా వాళ్ళందర్నీ చూడాల్నిపిస్తోంది. ఒక్కసారి పిలిపిస్తావా" అన్నాడు. అంతలోనే అనుమానంగా "వస్తారంటావా?" అన్నాడు.

"ఏం, ఎందుకురారు? అసలే వాళ్ళు డబ్బు మనుషులాయె" అంది లక్షి .

" అయినా ఇప్పుడేమైందని? ఏమైనా అయితే ఎలాగూ తప్పదు" అంది వెనక్కి తిరుగుతూ.

# లాఫింగ్ బుద్ధా!

డా. భైరవభట్ల విజయాదిత్య

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
బహుమతి పొందిన కథ

" ఒరేయ్! రారా! దమ్ముంటే బయటకు రా! నువ్వు మీసమున్న మొగోడివే అయితే రారా తేల్చుకుందాం" సత్యానందం అరుస్తున్నాడు.

ఏంచేయాలి? అని ఒక క్షణం ఆలోచించాను. ఒకసారి నన్ను నేను చూసుకున్నా మగవాడినే..పైగా మీసం కూడా ఉంది. అంతే రెట్టించిన ఉత్సాహంతో బయటకు ఉరికాను.

ఒక్కసారిగా అంతా అయోమయం గందరగోళం. ఏం జరుగుతోందో తెలిసే లోపు ఏవేవో జరిగిపోయాయి.

సీను అయిపోయింది!

'బానే చేసాను' అనుకున్నాను. ఈలోగా వచ్చాడు అసిస్టెంట్ డైరెక్టరు. వాడిని చూస్తేనే ఒళ్ళు మండిపోతొంది. వస్తూనే ఒక పెదవి విరుపు.

" ఇక్కడ బయటకు రాకూడదు. పాత్ర పరంగా సహనంగా ఉండాలి."

" కానీ .. అతడు పిలుస్తున్నాడు కదా.. ఆ డైలాగుల బట్టి వెళ్ళాలనుకున్నా.."

" వాడి పాత్ర అది... నువ్వే..ముందు వెనుకా ఆలోచించకుండా తప్పుగా చేసావు."

ఆలోచించకుండా.. అసలు ఆలోచించడానికి, సరిగా చేయడానికి ముందు ఏమైనా తెలిస్తే కదా!

" నాకెలా తెలుస్తుంది? మీసం కూడా ఉంది కదా..! పాత్ర మనస్తత్వం నాకు చెప్తే.."

"అలా చెప్తే సహజంగా రాదు.. ఈ సినిమాకి అంతా అసంకల్పితంగా జరగాలి. అదే దీని గొప్పతనం. ఇప్పటివరకూ కనీవినీ ఎరుగని ఒక గొప్ప ప్రక్రియ. అజరామరమై మిగిలిపోయే చిత్రం అవుతుంది"

నా పాత్ర మనస్తత్వం నాకే తెలియకుండా.. ఇదెక్కడి సినిమా.. ఖర్మ!

“ పోనీ.. మళ్ళీ చేద్దామా?” సమాధానం తెలిసి ఆశగా అడిగాను.

నావైపు చూసి ఓ పిచ్చి నవ్వు నవ్వి. “ తెలిసి కూడా ఎందుకు అడుగుతావు. డైరక్టరు గారు ముందే చెప్పారుగా. రిహార్సిల్ ఉండదు. రీటేకులు ఉండవు”

“ మరి ఇప్పుడు చేసిన సీను సినిమాలో ఉంటుందా?”

“ అది డైరెక్టర్ గారి ఇష్టం. ఏమో ఆయన అనుకున్న దానికి అనుగుణంగా చేయకపోతే అసలు నువ్వే సినిమాలో ఉండక పోవచ్చు.”

“ ఇప్పటి వరకూ చేసిన దాని బట్టి... ఏమి.. అనుకుంటున్నారు..?” భయంగా అడిగాను.

“ డైరెక్టర్ గారేమనుకుంటున్నారో అది తరువాత.. నా వరకూ అయితే నువ్వు చెత్త చెత్త చేస్తున్నావు..”

గుండె జారిపోయింది.

‘డైరెక్టర్ ఏమనుకున్నాడో చెప్పకుండా, ఎలా చెయ్యాలో నాకెలా తెలుస్తుంది సామీ!’ అందామనుకున్నా. ధైర్యం చాలలేదు.

★★★★★★★★★★

హాస్పిటల్ బెడ్ పై పడుకుని ఉన్నా. తలకి పెద్ద గాయం. అంతలో ఒకావిడ వచ్చింది. వస్తూనే “ బాబూ!” అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. బాగుంది ఇది మదర్ సెంటిమెంట్ సీను. నేను కూడా సెంటిమెంట్ బత్తాయి పండించేసి జ్యూసు పిండేద్దామని “అమ్మా!” అని నోరు తెరిచే లోపల నర్సు వచ్చి ఆమెను బయటకు తరిమేసింది. లైటు ఆర్పేసింది. జ్యూసంతా నేలపాలయ్యింది. అసలా డైరెక్టర్ ఉన్నాడే.. ఛాఛా!! మళ్ళీ ఆ అమ్మతో సెంటి మెంటు సీను వస్తుందో లేదో. ఎంతలా అనుకున్నాను. పుసుక్కున సీను మార్చేశాడు.

అసలు ఈ సినిమాకి నేను హీరోని. అలా అనే చెప్పారు. అలా అనే అనుకుంటున్నాను. కాని జరిగేది చూస్తుంటే చాలా అనుమానంగా ఉంది. నటించే ప్రతి వారూ ఎవరికీ వారే హీరోనా హీరోయినో అనుకుంటున్నారని అనిపిస్తూ ఉంది. వాళ్ళకీ అలానే చెప్పారేమో అని నా పెను భూతం.

ఒక సీనులో నేను సెంటర్ ఆఫ్ అట్రాక్షన్. అందరు నా కోసమే ఉన్నట్టు హడావుడి చేస్తారు. మరో సీనులో నేను వాడికి వీడికి ఊడిగం చేస్తూ ఉండాలి. ఒక సీనులో మంచివాడిగా, మరో దానిలో చెడ్డవాడిగా..

ఒకొొక్కప్పుడు నా సీనులో నాకు మాటలే ఉండవు! ఆ వెనుక వేళ్ళాడే గుబ్బం మొహం పెయింటింగ్ లాగానో, ఓ మూల షోకేసులో లాఫింగ్ బుద్ధా లాగానో ఉంటాను. ఆ మాత్రం దానికి నేనెందుకు అక్కడ.. అదే.. హీరో ఎందుకు అక్కడ?

కాని ఇప్పటి వరకూ తీసిన సినిమాలో ప్రతి సీను లోను నేనున్నా!.. అనే అనుకుంటున్నా?!

నేనున్న సీనులు మాత్రమే నాకు చూపిస్తున్నారో ఏమో తెలియదు. నా వెనుక ఏదైనా కుట్ర జరుగుతోందో ఏమో! అన్నీ అనుమానాలు .. అన్నీ భయాలు.

ఆ మధ్య ఒక సీను. నేను చేయని నేరానికి అన్యాయంగా నన్ను తిట్టి అవమానించే సీను. అద్భుతంగా వచ్చింది. నన్ను తిట్టిన పాత్ర విక్రాంత్ నిజంగానే కసిగా నన్ను తిట్టిపోశాడు. నేను మాట్లాడలేదు. సీను అయిపోయింది. అసిస్టెంట్ డైరెక్టర్ ఏమి అనలేదు. అంటే నేను సరిగానే చేసానని అర్థం.

ఆ తరువాత ఎప్పుడో ఒక సీనులో నేరం నాది కాదు ఆ విక్రాంత్ దే అని ఋజువు అయ్యింది. దాని బట్టి ఆ తరువాత సీను మళ్ళీ ఆ విక్రాంత్ తో నా ముఖాముఖి రావాలి కదా. అపుడు నేను వాడిని కసిగా తిట్టవచ్చు అని అనుకున్నా. దానికి తగ్గట్టు రాత్రి అంతా అదే అనుభూతితో, కొత్త కొత్త తిట్లు తలుచుకుని తలుచుకుని నాలోనే నేను సీను తయారు చేసుకుని, ఎదురుగా వాడిని ఊహించుకుని ఎన్నిసార్లు రిహార్సల్ వేసుకుని తిట్టుకున్నానో లెక్క లేదు.

తీరా చూస్తే మర్నాడు ఆ సీను లేదు. పైగా హీరోయిన్ తో పార్కులో సీను వచ్చి పడింది. చిలిపి అల్లరి చెయ్యాలి. నాకు నిన్నటి తిట్లు తప్ప ఇంకేం మనసులో లేవు. ఏవో మాటలు అవుతున్నాయి. నేనెక్కడో ఉన్నాను. సీను అట్టరు ఫ్లాపు! ఎలాగో మొత్తానికి అయ్యిందనిపించా.

నా కసి మాత్రం నాలోనే ఉండిపోయింది. ఇప్పటికి ఇంకా ఆ విక్రాంత్ తో సీను రాలేదు. వస్తుందో లేదో తెలియదు. ప్రతిసారి తరువాత ఆ సీను వస్తుందని అనుకుని మనసులో అదే కసిని నిలుపుకోవడం, పెంచుకోవడం, ఆ సీను రాకపోవడం. దానితో చేస్తున్న సీనులు దుంపనాశనం. ఇదే తంతు. ఆ సీను ఎప్పుడు వస్తుందో అసిస్టెంట్ డైరెక్టర్ చెప్పడు. ముందు చెప్తే సహజత్వం పోతుందంటాడు. డైరెక్టర్ రూలంటాడు. వెధవది కనీసం ఆ సీను ఉందో లేదో కూడా చెప్పడు.

ఇదీ వరుస. ఆ డైరెక్టర్ గొప్ప మూర్ఖుడో తెలియదు భయంకరమైన మేధావో తెలియదు. చాలా పిచ్చిగా ఉంది. చేతిలో స్క్రిప్ట్ లేదు. ఏ డైలాగులు చెప్పాలో తెలియదు. డైరెక్ట్ గా సీనులోకి వెళ్లి ఆ జరిగేదానికి అనుగుణంగా చేసేయాలి. అదో కొత్తరకం ప్రయోగాత్మక చిత్రంట! వీడి సృజనాత్మకత మండిపోను! ఒక్కోసారి మానేసి పోదామా అని కూడా అనిపిస్తుంటుంది. కాని తెలిసిన వాళ్లందరూ ఇదో గొప్ప అవకాశం అంటారు. థర్టీ యియర్స్ ఇండ్రస్ట్రీ హిరోలందరూ ఈ అవకాశం కోసం కళ్ళు కాయలు కాచేలా విచ్చుకుని చూస్తుంటారు. ఏ జన్మలో ఏ పుణ్యం చేసుకున్నానో అని నన్ను చూసి కుళ్ళుకుంటారట కూడానూ. సినిమా లోకంలో ఆ డైరెక్టర్ దేవుడితో సమానం మరి.

మొదట్లో ఎలా చేసినా మెచ్చుకునేవారు. హాయిగా ఉండేది. ఆ ఊపులో నేను చేసినదేదైనా సరియే అనేంతగా కొట్టుకుపోయాను. అంతలో వచ్చాడు ఈ అసిస్టెంట్ డైరెక్టరు.. చచ్చిపోతున్నాను వీడితో. ఎలా చేసినా స్క్రిప్ట్

లో అలా లేదంటాడు. సరిగా చెయ్యలేదంటాడు, డవిలాగు బాగోలేదంటాడు. అలా కాదు ఇలా అంటాడు. ఇలా కాదు అలా అంటాడు. పోనీ అదేదో ముందు చెప్పవయ్యా అంటే చెప్పడు. పైగా దిక్కుమాలిన ప్రామ్టింగు ఒకటి!

★★★★★★★★★

" నేను నిన్ను ప్రేమిస్తున్నా.."

ఇదేదో బాగుందే.. లవ్వు సీను.. అమ్మాయి బాగుంది. ఎంత యాక్టింగ్ అని తెలిసినా మనసు ఉరుకుంటుందా! మనకి సీనులో ఇంవాల్వుమెంటు కొంచెం ఎక్కువే! అయినా బుద్ధున్నవాడెవడైనా కాదంటాడా! నా పాత్రకు బుద్ధి ఉందా లేదా? ఆ అలోచించే సమయం లేదు. ఆలోచించాలని కూడా అనిపించలేదు. 'అవును!' అనకపోతే సీను పాడైపోతుంది అని మాత్రమే అనిపించింది ఆ క్షణంలో.

" ఉమా! నేను కూడా.. నిన్ను మనస్పూర్తిగా ప్రేమిస్తున్నా!" అనేసాను ఒకింత నిజంగానే.. లొట్టలేసుకుంటూ.

అలా అన్నానో లేదో ప్రామ్టర్ లో అసిస్టెంట్ డైరెక్టర్ " లేదు ఉమా! నీకు నాకు సరిపోదు. నీది ప్రేమ కాదు. నాకు ప్రేమ లేదు! జీవితం ఒక రైలు ప్రయాణం. కొద్ది దూరం మాత్రమే కలిసి ప్రయాణిస్తాం. మన కంపార్ట్ మెంట్ ఒకటి కావచ్చు, వాడే వాష్ బేసిను ఒకటి కావచ్చు, ఈ కటకట మని తిరిగే ఫేను ఒకటి కావచ్చు, ఆ ఆరుతూ వెలిగే లైటు ఒకటి కావచ్చు.. ఆ మూల ఉండే కంపు కొట్టే టాయిలెట్టూ ఒకటి కావచ్చు కాని.. కాని చివరకి ఎవరి స్టేషన్ వస్తే వారు దిగిపోవాలి ఉమా! దిగిపోవాలి. ఈ చరాచర సృష్టిలో మనము కూడా అంతే. ఈ ప్రేమ అనుబంధాలు ఇవన్నీ అశాశ్వతాలు. వీటిని నమ్ముకుని, ట్రైనే నిజమనుకుని నేను ఉండలేను ఉమా! ఉండలేను! " అని అన్నాడు.

అదిట! నేను చెప్పవలసిన డవిలాగు!! ఇంత కొండవీటి చాంతాడంత డవిలాగు, నాకు నేను ఉహించేసుకుని, అప్పటికప్పుడు ఆశువుగా చెప్పాలని ఈ డైరెక్టరు అనుకున్నాడా? వాట్ నాన్సెన్స్!!

ఇప్పుడు నా పరిస్థితి ఏంటి? అన్న మాట వెనక్కి ఎలా తీసుకొను? ఇప్పుడు ఈ మాటలు ఎలా అనను? పాపం ఉమ! అసలు అయినా అలా అనవలసిన అవసరమేమిటి? కారణం ఏమిటి? నా పాత్రేమిటి? ఆ కథేమిటి?

ఏం చెయ్యాలో తెలిసేలోగా సీనులు సీనులు మారిపోయాయి. పెళ్లిసీను వచ్చేసింది. నోరు విప్పాల్సిన ప్రతి సారీ ఈ అసిస్టెంట్ డైరెక్టరుగాడు అదే డవిలాగు ప్రామ్టింగు నాకు. కానీ ఆ సందర్భంలో ఎలా...?

★★★★★★

సందు దొరికితే ఆ అసిస్టెంట్ డైరెక్టర్ సూటిపోటి మాటలతో తప్పు చేసానని బుర్ర తినేస్తున్నాడు. నాతోనే ఇలానా అందరికీ ఇలానే బుర్ర తింటాడా? ఎవరికి వారు గొప్పగా నటించేస్తున్నట్టే పైకి బిల్డప్పులిస్తున్నారు. అది నిజమా కాదో నాకు తెలిసే అవకాశం లేదు. ఎవడి పాత్ర ఏమిటో? అసలు స్క్రిప్టులో ఏముందో తెలిస్తే కదా!

డైరెక్టరును కాకా పట్టే ప్రయత్నాలు కూడా చేస్తున్నా కాని ఇప్పటికి ఫలించలేదు. ఆ విక్రాంత్ గాడు వాడికి ఫలించిందన్నాడు. అది నిజమో వాడి బిల్డప్పో తెలియదు.

ఎలా కాకా పట్టావురా? అనడిగితే ఇలా కాదు, అలా కాదు అంటాడే తప్ప ఎలా అన్నది చెప్పాడు. సినిమా గురించి అడిగితే పెద్ద వేదాంతిలా ఓ నవ్వు నవ్వి నీకెందుకు అంతా డైరెక్టర్ చూసుకుంటాడులే అని చక్కా పోతాడు.

ఒక్కోసారి తిక్క రేగి అసిస్టెంట్ డైరెక్టర్ ని పిలిచి తిట్టి పడేస్తాను.

దానికి ప్రతిగా వాడు 'నీ ఖర్మ... ఏడూ...' అనేలా ఓ చూపు విసురుతాడు.

మళ్ళీ నేనే తగ్గి బతిమాలుకుంటా. ఎంత తిట్టుకున్నా ఈ సినీలోకంలో కొద్దో గొప్పో నాతో మాట్లేడేది, నా మంచి చెడ్డలు చూసేది వాడే. మిగిలిన వాళ్ళు ఎవరి ఉరుకులు వారివి ఎవరి పరుగులు వారివి.

ఇప్పటి వరకూ అయిన సినిమా అంతా చూపించమని బ్రతిమాలితే చూపించేది మరి వీడే. అలా చూసినప్పుడు ఏదో కథ ఉన్నట్టే అనిపిస్తుంది. కాని దాని బట్టి తరువాత ఏ సీను అన్నది మాత్రం తెలియటం లేదు. ముగింపు అసలు ఉహించలేం! నేను చేసిన/చెయ్యని అనవసరమైన భయంకరమైన ఏక్టింగ్ మహా పాతకాలన్ని కనిపిస్తాయి. ప్రత్యేకంగా అవి రివైండ్ చేసి మరీ చూపిస్తాడు.

అయితే అప్పుడప్పుడు ఈ అసిస్టెంట్ డైరెక్టరు సీను గురించి హింట్లు ఇస్తుంటాడు. అప్పుడు మాత్రం సీను ఇరగదీస్తాను. వాడి మూడు బట్టి.

వాడి ప్రామ్టింగ్ టైమింగ్ మాత్రం నమోస్తు నారాయణ.

ఓసారి ఇంక ప్రామ్టింగు వచ్చిన తరువాతే ఏదైనా అని నిశ్చయించుకున్నా!

" తొందరగా ఎక్కు!" ఉమ పిలుస్తోంది. రైలు కూత పెడుతోంది. ఎదురుచూస్తున్నా.. ఏం చెయ్యాలా అని. నాకైతే ఎక్కాలి అని అనిపిస్తోంది. కాని సీనులో అలా ఉందో లేదో .. అందుకే ఆగా. ఏ క్షణాన నైనా ప్రామ్టింగు రావచ్చు. సిద్ధంగా ఉన్నా.

" ఎక్కకు ..." ప్రామ్టింగు వినిపించినట్లయ్యింది. సరే! అనుకున్నా. ఉమ నన్ను చూసి అసహ్యించు కుంటున్నది.

రైలు కదిలింది. వేగం పెరిగింది. శబ్దం నెమ్మదించింది.

" ఎక్కకుండా దిక్కులు చూస్తావేం .. ఎక్కు !" ప్రామ్టింగు ఖంగు మంది! .

అదేంటి..? ఇందాకా..! ఇప్పుడు..! ఏమర్థం కాలేదు! పరుగుపెట్టా..

అప్పటికే రైలు వెళ్ళిపోయింది.

దూరంగా అసిస్టెంట్ డైరెక్టర్ అసహనంగా నా వైపు చూసి, వీడింతే అని తిట్టేసుకుని, తల కొట్టేసుకుని బయటకు పోయాడు. మళ్ళీ అభద్రతా, అయోమయం, ఆత్మన్యూనత నన్ను చుట్టుముట్టాయి. మళ్ళీ ఉమతో సీను ఉంటుందో లేదో! అసలు మళ్ళీ ఆమెను చూస్తానో లేదో అదొక బాధ.

★★★★★★★

బారులో ఒక సీను. ఎదురుగా మందు, సిగరెట్టు. నాకేమో వద్దు అనిపిస్తోంది. అసిస్టెంట్ డైరెక్టర్ తాగమని చెవిలో ఒకటే ప్రాంప్టింగు. ఈ దరిద్రమైన పాత్ర నాకే రావాలా. ఇన్ని డిఫరెంట్ షేడ్లు ఉన్న పాత్ర! అన్ని కలగలసి దట్టమైన తారు డబ్బా తయారయింది. లోలోపల తిట్టుకుంటూ పైకి ఉల్లాసంగా దమ్ము కొట్టాను. మందు కొట్టాను. ఆ మత్తులో ఇంకెవరినొ కూడా కొట్టాను. మళ్ళీ గందరగోళం.

మత్తు ఎక్కిన తరువాత మాట వినమంటే ఎలా కుదురుతుంది. మత్తులో ఏం చేస్తామో! అది మన బాధ్యత అంటే ఎలా? ముందు ముందర మందు పెట్టకూడదు. ఆపై తాగమని చెవిలో ఒకటే నస పెట్టకూడదు. చేసినదంతా చేసి, చేయించి.. తరువాత నాది తప్పంటే ఎలా? ఆ డైరెక్టర్ పెద్ద శ్యాడిష్టులా ఉన్నాడు.

నా పాత్ర నిడివి ఎంతో తెలియదు. తీరా ఎపుడో సెట్ కి వచ్చాక నీ సీన్లు ఇంక అయిపోయాయి అంటే నా పరిస్థితి ఏంటి? తలచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తోంది. ఆ విక్రాంత్ గాడు మళ్ళీ కనపడనే లేదు. నన్నూ అలా అర్ధాంతరంగా ఆపేస్తే!

ఈసారి లాభంలేదు ఆ అసిస్టెంట్ డైరెక్టర్ గాడు రాగానే అడిగేయాలి .. కడిగేయాలి. ఇప్పటికే అర్థంలేకుండా చాలా సాగదీసారు.

అనుకోవడం ఆలస్యం ఎదురుగా తయారు!

" చూడు .. నా వల్ల కావడం లేదు. అసలేంటి ఈ సినిమా కథ? నా పాత్ర ఏంటి? నేనేం చెయ్యాలి .. ఎలా చెయ్యాలి? .. సమాధానం చెప్పక పోతే .. " అని ఆగాను.

ఏం చెయ్యగలవు అన్నట్టు చూశాడు వాడు. నేను ఈ సినిమాని వదులుకోలేనని తెలుసు.

" ప్లీజ్.. చెప్పవా?" ప్రాధేయపడ్డాను. వాడి పెదవులు మరింత బిగుసుకున్నాయి.

ఏం చెయ్యను?ఏం చెయ్యగలను? అసహాయత కమ్మింది. అప్రయత్నంగా నా కళ్ళనుండి ధారగా కన్నీరు. ఆపుకోలేని అశక్తతతో అలానే ఉండిపోయా.

" ఏం తెలుసుకోవాలని అనుకుంటున్నావు?"

" అసలు నేను ఈ సినిమా హీరోనేనా?"

" నువ్వే హీరో!"

" ఇది సుఖాంతమేనా!"

కొంచం ఆలోచించాడు.

" డైరెక్టర్ గారి ఉద్దేశ్యం అదే"

" అంటే.. సినిమా అంతా హాయిగా ఉంటుందా.. లేక అంతా హీరో బరువు బాధ్యతలు అంటూ కష్టాలు కన్నీళ్ళు పడి చివర సీనులో ఓ నీతి ఓ చిరునవ్వు ఓ శుభం కార్డు లాంటి రియలిస్టిక్ ఫిల్మా?

" లేదు..లేదు.. ఇది ఎంటర్ టేయిన్ మెంట్ మూవీ"

హమ్మయ్య అనుకున్నా. మనసు కాస్త తెప్పరిల్లింది.

"థీమ్ .. ఏమిటి.. థ్రిల్లరా .. ఫ్యాక్షనా... కామెడీనా.. సస్పెన్సా.. హారరా.. "

" సకుటుంబ సపరివారంగా చూసి ఆనందించదగ్గ వినోదాత్మక చిత్రం చెయ్యాలనే సంకల్పం"

"మంచిది... నేను వచ్చినప్పుడు కూడా డైరెక్టర్ గారు ఇలానే చెప్పినట్టు గుర్తు."

నవ్వేసాడు అసిస్టెంట్ డైరెక్టర్ " ఆయన ఎప్పుడూ మారరు... "

" మరి .. ఈ సీనులేంటి... ఇలా.. నా పాత్ర.. అసలు మంచో చెడో అర్థంకాకుండా.. ఆనందంగా నవ్విన ఉన్న సీనులు ఎన్ని ఉన్నాయి.... ఎప్పుడు చూడు ఏదో ఓ గొడవో, తలనోప్పో.. కనీసం రోమాన్స్ లో కూడా ఆ అనుభూతి లేక చప్పగా.. "

" ఇది ఒక ప్రయోగాత్మకమైన చిత్రం... తెలుసు కదా! ఒక పాత్రలో సహజంగా మీరు ఎలా ఉంటారో.. పరిస్థితులకు ఎలా స్పందిస్తారో... ఏ మాటలు అంటారో.. అది కావాలి."

" కానీ అప్పుడు స్క్రిప్ట్ కి అనుగుణంగా ఎలా కుదురుతుంది?"

" నువ్వు హీరో అని నీకు ముందే చెప్పారు, ఇది సుఖాంతం అని కూడా చెప్పారు. ప్రతి సీను హాయిగా అనందంగా ఉండాలి అని కూడా మీకు ముందే చెప్పారు కదా..!"

" అవును.. కానీ.."

" మరి దానికి తగినట్టు ఎందుకు చేయడంలేదు?"

" అంటే ఆ పరిస్థితులలో .. ఒకోసారి ..ప్రతిస్పందన .. "

" పరిస్థితులు సరే.. ఒక హీరో.. సకుటుంబ సపరివార చిత్రంలో హీరో ఎలా స్పందించాలో అలా ఎందుకు చెయ్యలేకపోతున్నావు? పాత్రలో ఎందుకు లీనం అవ్వలేక పోతున్నావు? అయితే అస్సలు నటించకుండా ఉండిపోతున్నావు లేదంటే పిచ్చిగా చేస్తున్నావు. పాత్రకి తగినట్టు మాత్రం చేయడం లేదు"

" సీనులు అలా వస్తున్నాయి .. హీరోగా ఉండే అవకాశం ఇవ్వడం లేదు..."

" నీ పెర్ఫార్మెన్స్ బట్టే సీన్లు వస్తాయి.. నువ్వు తప్పుల మీద తప్పు చేస్తుంటే.. డైరెక్టర్ మాత్రం ఎంతకన్న ఎడిట్ చేస్తారు.. ఎంత కన్న సీన్లు మారుస్తారు..కథలో ఓ నడక, ఓ పద్ధతి ఉండాలి కదా.. అప్పటికీ ఎన్నో అవకాశాలు ఇచ్చారు"

" తప్పో ఒప్పో ఎలా తెలుస్తుంది.. మొన్న ఆ సత్యానందం గాడు వచ్చి నన్ను బయటకు రమ్మని పిలిచాడు.. రావాలా వద్దా ఎలా తెలుస్తుంది? పరిస్థితి బట్టి రావాలనుకున్నా... ఆ తరువాత రాకుడదని నువ్వు చెప్పావు.. అది ముందు తెలిస్తే... "

" రావాలని ఎందుకు అనిపించింది... "

" అంటే.. నేను హీరోని కదా...వాడు కచ్చితంగా విలన్ అవ్వాలి .. నేను బయటకు రాకపోతే వాడి పాత్ర హైలైట్ అయిపోతుందని.."

" హీరో అని గుర్తుంది కానీ ఇది ఫ్యాక్షన్ సినిమా కాదు... అన్నది గుర్తు లేదా?"

" వాడికీ అది గుర్తుండాలి కదా!"

" వాడూ నీలాగే.. చెప్పినది సరిగా గుర్తుండదు. అర్థమవ్వదు. పాత్రలో లీనమవ్వడు.. దానివల్ల సీనులో మార్పులు ... "

" వాడూ... హీరోనేనా?"

" అసలు వాడు ఎందుకు రమ్మన్నాడు.. కారణం.. ఏ సీనో తెలుసుగా?" సమాధానం ఇవ్వకుండా దాటవేసి ప్రశ్నించాడు అసిస్టెంట్ డైరెక్టర్.

తలదించుకున్నాను

" అంటే... ఆ ముందు సీనులో వాళ్ళ చెల్లి ఉంది.. అందంగా ఉంది కదా హిరోయిన్ అనుకుని.. కాస్త... "

" కనిపించిన ప్రతి అమ్మాయినీ నీ హీరోయిన్ అనుకుని మీద పడిపోతే ఎలా?"

" అంటే.. నేను హీరో.. కదా.. ఆ సీనులో అలా చేస్తేనే కదా హీరోయిజం.."

" హీరో అంటే ఉన్నతంగా, ఉత్తమంగా ఉండాలి!!...అంతేకాని అందరూ నీ కోసం ఉండాలి, నీ కింద ఉండాలి,, పది కార్లు ఉండాలి. వెనుక వంద మంది ఉండాలి. చుట్టూ అమ్మాయిలు ఉండాలి.. పిచ్చి పంచ్ డైలాగులు అనాలి .. నువ్వేం అనుకుంటే అది అయిపోవాలి.. నువ్వేం చేస్తే అదే రైటు.. అని కాదుగా.."

ఏమనాలో తెలియలేదు.. తను చెప్పింది నిజమనే అనిపిస్తోంది.. కాని సీనులోకి వెళ్తేనే.. ఇవేవి గుర్తుండటంలేదు. ఏదో మైకం.

“ సరే.. అదలా ఉంచు.. మరి ఉమతో ప్రేమ సీను.. ఆనందం .. హాయి.. అన్నావు.. హీరో అన్నావు.. ప్రేమిస్తున్నానంటే ‘అవును!’ అని కాకుండా ఏదో అర్ధంకాని అర్థంలేని భయంకరమైన డవిలాగు చెప్పావు.. అదెలా కుదురుతుంది.” అనుమానంగా అడిగాను.

“ అసలు ‘అవును!’ అని నువ్వు ఎందుకు చెప్పావు... ఒక్కసారి ఆలోచించు..?”

“ అంటే.. అమ్మాయి చూడడానికి బాగుంది..”

“ ఆ పాత్రతో అంతకు ముందు ఎన్ని సీన్లు అయ్యాయి నీకు?”

“ ఒకటి.. లేదు.. రెండు.. ఆ పార్టీ సీనులో ఉన్నది.. అంటే మాటలు లేవు.. కాని.. ఆ తరువాత ఒక సీనులో.. బస్సులో పక్కన కూర్చున్న సీను.. నా భుజంపై తల పెట్టుకుని పడుకుంది కదా..”

“ ఆ పాత్ర గురుంచి ఏం తెలుసు...”

“ అంటే .. అందంగా ఉంది..”

“ ఇంకా.. “

“ మంచి సెంటు వాసన.. హస్కీ వాయిస్.. నన్ను ప్రేమిస్తోంది.. అన్నాది “

“ అంతేనా... “

“ అంతే... ఇంకేం తెలియాలి”

తలపట్టుకున్నాడు.

“ చూడడానికి బాగుంది.. అవకాశం దొరికింది అని అది ప్రేమ అనుకుంటే ఎలాగయ్యా. అది హీరో లక్షణం కాదు చిత్తకార్తె కుక్కల లక్షణం. రెండు సీన్లు అయ్యాయో లేదో అప్పుడే ప్రేమ.. నీ తప్పు వల్ల ఎన్ని సీనులు మార్చాల్సి వచ్చింది.. అప్పటికీ ప్రతిసీనులోను చెప్తునే ఉన్నా .. నువ్వు నేను చెప్పిన డైలాగు ఆమెతో ఆనవు.. అనుంటే ఏదోలా ఎడిట్ చేసి మళ్ళీ కథ స్క్రిప్ట్ లోకి తెచ్చేవాడిని. నీకు ఆ ఊసే లేదు”

“ అంటే.. బాగుండదని..“

“ ఎవరికి..?”

“ నాకు.. అదే.. పాత్రకి.. “

“ మధ్యలో నీకు బాగెంటి? ఇది సినిమా అన్న విషయం మరచిపోతే ఎలా? పాత్ర గురించి డైరక్టర్ గారు ఉన్నారు కదా.. నీకెందుకు బాధ”

“ అంటే.. సీనులో... హీరో .. అలా అంటే బాగుండదని..”

" ఆ.. అలా అనుకునే పెళ్లి సీను దాకా తెచ్చుకున్నావు.. నీ ఇష్టారాజ్యంగా చేస్తూ సినిమాలో నీ పాత్ర మాత్రం ఆనందంగా ఉండేలా చేయ్యాలంటావు! ఎట్లా చచ్చేది నీతో."

" అప్పటి దాకా ఆ సీన్లు చాలా బాగా ఆనందంగానే వచ్చాయి కదా...మరింకేం"

" అదే మరి... నువ్వు ఆలోచించాలి.. నీ పాత్ర చదువు అవ్వలేదు.. ఉద్యోగం లేదు.. ఆ ఉమ పాత్ర ఎలాంటిదో తెలియదు.. ఒకటి రెండు సీన్ల ఆనందం కోసం తరువాత సీన్లు అన్ని తగలేసుకున్నావు. హాయిగా ఓ పద్ధతిలో వెళ్ళవలసిన కథ అనవసరంగా .. "

" .. కానీ.. మరి .. ఆ రోజు ఆ బార్ లో సీను.. నా చేత అనవసరంగా... ఎందుకు ... తాగించావు... అది హీరో చెయ్యొచ్చా..? " ఉక్రోషంగా అడిగా.

" బుద్ధి గడ్డితిని! నీ మీద నమ్మకం పోయి.. చిరాకు వచ్చి.. ఎంత కన్న నేను చూడను? చచ్చిపోతున్నా నీతో! చెప్పి ఉపయోగం లేదని .. ఊరుకున్నా"

" అయితే ఇప్పుడు నా పరిస్థితి ఏంటి?" ఆదుర్దాగా అడిగాను.

" తెలియదు.. నువ్వు ఇప్పటి నుండి అయినా బ్యాలెన్స్ గా చేస్తే, చేయగలిగితే.... హీరోగా పరిచయమవుతావు.. లేదంటే.. "

" లేదంటే.. " భయంగా అడిగాను.

" ఆ వెనుక వేళ్ళాడే గుబ్బం మొహం పెయింటింగ్ లానో ..ఈ మూల షోకేసులో లాఫింగ్ బుద్ధా లానో.. ఉండీ లేనట్లుగా... కనీ కనిపించకుండా..." ఆగిపోయాడు.

ఆలోచనలు అలలు అలలుగా ఎగసి పడుతున్నాయి.. నా దృష్టిలో నేనే జారిపోతూ..

' ఎందుకీ పనికిమాలిన సినిమా.. మానేసేయ్.. వదిలేసెయ్.. వెళ్ళిపో.. ' చెవిలో ఏవో అస్పష్టంగా... వినిపిస్తున్నాయి..!

ఎదురుగా అసిస్టెంట్ డైరెక్టర్ మూగగా బిత్తరచూపులు చూస్తున్నాడు...

మరి మాటలు?! ఉలిక్కిపడ్డా!

అసంకల్పితంగా చేవిదగ్గరకు చేయి వెళ్ళింది.

బయటకు కనపడని వేలి గోరు అంత చిన్నది బ్లూటూత్!! అదెలా వచ్చింది? ఎప్పుడు పెట్టుకున్నాను?!

"నువ్వు.. ఆ సీనులో తాగమని... ప్రాంప్టింగ్ .. చేసావా..?" తడబడుతూ అడిగాను.

ఆశ్చర్యపోయాడు అసిస్టెంట్ డైరెక్టర్..

"లేదు.. నేనసలు ఆ షాట్ చేసినప్పుడు లేను.. నీ మీద విసుగుతో... బయటకు.. ఏమయ్యింది?" విప్పారిన నా కళ్ళను చూసి అందోళనగా అడిగాడు.

మరి ఆ ప్రాంప్టింగ్?!... ఈ బ్లూటూత్?

సత్యానందం రమ్మన్నప్పుడు.. వెళ్లాలని నేనే అనుకున్నానా?.. లేక ఈ...!!

అంటే.. నేను ఇప్పటి వరకూ చేసినదంతా...? ఇలాగే...!!

తన చేతిలో తెల్ల కాగితాలు సర్దుకుంటూ అసిస్టెంట్ డైరెక్టర్ వెళ్ళిపోయాడు.

లాఫింగ్ బుద్ధా నన్ను చూసి విరగబడి నవ్వుతున్నాడు... ఆనందంగా!

## నా త్రిజన్మ పయనం

రజనీకాంత్ వేదుల

ఆ రాత్రి ఒంటరి దాన్ని ఐపోయాను. ఆ మెరుపులు, ఉరుములు, భయంకరమైన పిడుగుల శబ్దాలు ఈ నాటికీ హృదయంలో నే కాదు, నరాల్లో కూడా జీర్ణించి పోయేయి. ఎవరికి చెప్పుకోను ఆ శబ్దాలుతో వచ్చిపడిన వ్యధ. ఒప్పుగుంటాను, ఒక పెళ్ళైనా, ఉత్సవమైనా, ఎన్నికల ప్రచారమప్పుడు, ఆఖరికి అంతిమ యాత్రకీ జనాలు అనుభవించే రొదలు ఇంచుమించు అలాంటివే. ఆ శబ్దాలు వినడానికి చెముడు మెషిన్ ఎంత ఖరీదైనా ఆభరణాలుగా వాడుతున్నారు ఈ మనుషులు. కానీ నా ప్రాణానికి మాత్రం అవన్నీ సంకటమే.

భరించలేని ఈ రొద తట్టుకోలేక ఎంత రాత్రయినా ముందు పాదాలతో, ఇంకా అయితే, గోళ్ళతో నో డాడీని గాఢనిద్ర నుండి లేపడం నాకు అలవాటే. ఆ పటాసులు పేల్చే వాళ్ళని తిట్టుకుంటూ పక్కనున్న కళ్ళజోడు వెతుక్కుంటూ చీకట్లో నన్నెంతో ప్రేమతో మెడకిందా, వీపుమీదా , తలమీదా నిమురుముతూ, డాడీ నన్ను ఓదార్చడానికి ఇక్కడ లేదు. ఇప్పుడు వడిగా పారుతున్న సెల యేరు, కీచు రాళ్లు, విహరించే గుడ్లగూబ, గబ్బిలాల శబ్దాలు ఎంతో ఇంపుగా ఉన్నాయి. ఎప్పుడో "రుద్ర బాబు" పిల్లల పుస్తకాల్లోనే చూసేను ఇటువంటి ప్రకృతి బొమ్మలు. ఎదురింటి వాళ్ళ టామీ గంభీరంగా అరవడం వింటేనే భయం వేసేది. అది ధృఢంగానూ, ఎత్తుగాను, నా కంటే బలంగానూ కనిపించడంతో అందరికీ భయం వేసేది. ఆది నాపాలిటి మానవులు మా జాతిని హేళన చేసే గ్రామ సింహమే. అలా అని మా జాతి ని హేళన చేసే మానవులు కూడా మాదేముదు కాలభైరవుని ఆరాధిస్తారు. డాడీ దృష్టిలో నేను కాలభైరవుడి

అంశమే. ఒక సారి డాడీ నాతో ఎంతో బాధ పడుతూ అన్నాడు: 'కాశీలో చదువుకుంటున్న రోజుల్లో అన్నాళ్లూ ఉండీ ఒకసారి కూడా కాలభైరవుని దర్శించలేదే' అని. డాడీ నన్ను మొదటి సారి ఎత్తుకుంటూ, ప్రేమతో, ' భైరవా' అని పిలిచేడు. కానీ, డాడీని కొట్టి పారేసి, శాంతి, రమేష్ , మిగతా కుటింబీకులూ నామకరణం చేసేరు, 'రియో' అని. నన్ను డాడీ పౌండ్ నుంచి వాళ్ళింటికి తీసుకొచ్చిన రొజుల్లో ఏవో అంతర్జాతీయ క్రీడలు రియోడిజనీరోలో జరుగుతున్నాయని నాకాపేరు పెట్టేరు. పైగా డాడీపై ఛలోక్తి విసేరేరు 'ఇదే నీ భైరవుడు' అంటూ.

చిన్నప్పటినుంచీ అమ్మ చేతితో తినిపిస్తేనే తినడం అలవాటయింది. డాడీకి శుభ్రం ఎక్కువ. చుట్టూ కోడిలా నేలంతా నేను నెరపిన భోజనం, కిందా మీదా పోసుగోవడం డాడీకి నచ్చేదికాదు. రొట్టెలు, గుడ్లూ మధ్యాన్నం పూట, రోజువిడిచి రోజు, పొట్లం భోజనం అమ్మ పెట్టేది. శాంతి ప్రత్యేకంగా నాల్రోజులకో సారి మాంచి రుచిగా ఉన్న చేప వండి తినిపించేది. ఆ చేప డబ్బా బాగా ఖరీదైనది, 'సాల్మన్' అంటారు. నేను అది తినక పోతే అందరూ కంగారు పడిపోయేరు. సాయంకాలమయేసరికి శాంతి డాక్టరుకి ఫోన్లో చెప్తూ ఏడ్చినంత పనిచేసింది. ఆ తరువాత అమ్మ మీద విరుచుకు పడడం, అమ్మ చిన్నమొహం చేసుకోవడం నాకు కష్టమనిపించింది. నేనూహించగలను ఏమన్నాదో అమ్మతో: ' ఆ స్టీల్ పళ్లెంలో ఖరీదైన కంపెనీ ముద్రవున్న బిళ్ళలూ ఉండగా దానికి పాలు ఎందుకు పోసేవు, చేగోడీలు ఎందుకిచ్చేవు , చక్కిలాలు, తీపి ఇవ్వొద్దు ఎన్నిసార్లు చెప్పినా వినవు'. నాకు ఇంట్లోవారు జరిపించిన ముద్దూ ముచ్చటలు ఇంకా ఎన్నో చెప్పాలని ఉన్నా ది. ఏం జాతకం, ఏం పుణ్యం చేసుకున్నావే కిందటి జన్మలో, ఈ ఇంట్లో ఏం భోగమే నీకు జరుగుతోంది అంటూంటూంది అన్నపూర్ణ పిన్ని.

కర్మ మాకు కూడా వర్తిస్తుంది కదా! భోజనం దగ్గరనుండి రాత్రి తలగడ పైన సుఖంగా తెల్లవార్లూ కలలు కంటూ నిద్రపోయేవరకూ నాకు ఏ లోటు జరగకుండా నన్నందరూ చూసుకునేవారు. కలలు మాట ఎలా ఉన్నా గురక మాత్రం అందరికన్నా ఎక్కువగా పెడతాననేవారు.

కనిపించే దూరంలో మరుగవుతున్న రైల్ నుంచి పచ్చజెండా వైపు ఆశ నిస్పృహ దుఃఖంతో దిక్కూ తెన్నూ తోచక ఈ అడివిలో చిక్కుకున్నాను. డాడీ వెనుతిరిగి నా కోసం చూడలేదా ? తప్పకుండా రైలంతా గాలిస్తూ ఉంటాడు. మంచి నీళ్లకోసం డాడీ వెంట నేనూ దిగడం, కూత వేస్తూ రైల్ కదలడం, డాడీ పరుగెడుతూ ఒక పెట్లోకి ఎక్కడం, నేను నిస్సహాయురాలిగా ట్రైన్ వెనకాతలే పరుగెత్తడం జరిగిపోయాయి.

రాబోయే భవిష్యత్తు చీకటిగా కనిపించింది.

ఎప్పుడో చాలా సంవత్సారాల క్రితం నాలాగే పెళ్ళివారిసందడిలో "వాసు మామ" కూడా రైల్ లొంచి దిగిపోయి కొన్ని గంటలు తప్పిపోయేడుట. ఉన్న బంధువులు, శాంతి మేనత్త దుఃఖం చెప్పలేనిదని అనుకున్నారు. "గోపీ" మామ కూడా ఒకసారి తప్పిపోయేడట. డాడీ చెప్పారు: డాడీ ,అమ్మ, శాంతి , గోపి మామ ఇటలీ యాత్రలో

ప్రసిద్ధ సిస్టైన్ ఛాపెల్ చూడడానికి వెళ్ళేరు. విపరీతంగా జనం కిక్కిరిసి ఉన్నారు. యాత్రీకులు అంతా ఆనందిస్తు న్నారు. మరుక్షణంలో గోపి మామ కనబడలేదు. అప్పుడు గోపీ పదేళ్ల వయసువాడు. ఆ తల్లి హృదయ క్షోభ, ఆవేదన, ఎవరూ వర్ణించ లేరు. అందరూ అచేతనంగా స్తంభించి పోయేరు. మరి కొద్దిసేపట్లో అందరూ నిట్టూర్పు విడిచేరు. గోపి మామ ప్రయత్నం లేకుండానే ప్రత్యక్ష మయేడు. "విఘ్నేశ్వరుడిని పోసుకో అమ్మా " అని మాలక్ష్మి పిన్ని వెంటనే సలహా ఇ చ్చిందిట. గోపి మామకి ఇదో అలవాటు కాబోలు. మస్కట్ దేశంలో కూడా గోపి మామ కార్లో ఎక్కలేదు . లెక్కకి ఒకడు తక్కువ. వెనక్కి వెళ్లి వెదికితే జనంలో ఉన్నాడు మామ. అమ్మ కానీ, జాలితో నన్ను చేరదీసిన డాడీ కానీ ఈ సమయంలో నన్ను తల్చుకుంటు న్నారా ? లేక అప్పుడే నన్ను మరచిపోయేరా?

మాకు భగవంతుడు ఇచ్చిన వరములలో జ్ఞాపక శక్తి ఒకటి; ఆకారాలు, వాసనలూ ఎన్నడూ మరువం. మానవ జాతికి దేవుడు మరుపు అన్నది పెట్టి ఉంచాడు. వారి మనసు నాకంటే వేగంగా పరుగెడుతుందిట. పూర్వజన్మ స్మృతి భూమి మీద పడగానే పోతుంది అంటారు. నాకు అది ఉందేమో అనిపిస్తుంది ఒక్కొక్కప్పుడు. ముఖ్యంగా డాడీ పురాణాలు చదివి వినిపించేటప్పుడు. మేం విన్నది, చెప్పింది గ్రహిస్తాం. కాని అది మానవులులా వ్యక్త పర్చలేము. దేవాలయాల్లోనూ , ధర్మ ప్రవచనాలు జరిగేచోటా సంచరించ గలడం నా అదృష్టం. ఇది పూర్వజన్మ స్మృతి ఉండవలననే అనుకుంటాను.

ఎవరినైనా ఒక్క సారి చూస్తే చాలు. గుర్తు పట్టగలను, అతనిని మళ్లీ చూసినప్పుడు.. అంతకంటే అతని వాసన ఇంకా బాగా గుర్తుపట్టగలను. డాడీకి పరిచయమైన ఒకతను తరచు మా ఇంటికి వచ్చేవాడు. అతన్ని చూడగానే నాకు తెలిసి పోతుంది. ఆయన ముసు గు వేసుకున్నా అతనిని గుర్తు పెట్టగలను, అతని ఒంటి వాసన గుర్తించి. ఆయన కూడా ఏంతో ప్రేమతో నన్నెత్తుకుంటాడు.

డాడీ చెప్పాడు ఒక గొప్ప విషయం. నాలాగే "టామీ" ని పెంచుకున్న మోహన్ గారు అకస్మాత్తుగా ఊరెళ్ళేరు .ఎందుకో ఆయన తిరిగి రాలేదు. అన్నం, నీరు ముట్టలేదు. రైల్వే స్టేషన్ కి పొద్దున పోయి సంధ్య వేళ వరకు అయన కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూసేదిట. జాలి పడి ఎవరైనా బిస్కట్టు ఇస్తే తినకుండా ఉపవాసమే ఉండేది. చిక్కి శల్యమై పోయి పాపం అనాధగా కాలం చేసింది. మనుషులు దీన్నే "విశ్వాసం" అని ఎంతో మెచ్చు కుంటూ ఉంటారు . ధర్మరాజుని విడువకుండా స్వర్గ ద్వారాల వరకూ తోడు వెళ్లిన మా జాతి శిరోమణి యొక్క విశ్వాసం పురాణాల్లో, చరిత్రలో శాశ్వతంగా నిలిచిన ఉదంతం వినే ఉంటారు. అలా వెంట వెళ్ళినది ధర్మదేవతే. మోహన్ ఏవిధంగా మా టామీని అనాధగా ఒంటరిగా వదిలి పెట్టివెళ్ళిపోయేడో!

బెంగుళూరు ఊరి బయట ఎకరాల విస్తారమైన జాగాలో పదిహేను అంతస్తుల ఇంట్లో జరిగింది : ఎంతో విశ్వాసంతో సంవత్సరాల తరబడి ఉంటూ మాజాతి గౌరవం నిల బెడ్తున్న మా జాతి వారిద్దర్ని ఇంటిలో

ఉంచేసి, తలుపులకి తాళాలు వేసి ఊరు వదిలి వెళ్ళి పోయేరు. నాలుగు గోడల మధ్యలో ఆహారం, చివరికి త్రాగడానికి నీరు కూడా లేకుండా రోజుల తరబడి ఎంత అరిచినా ఎవరూ, వాళ్ళని చెర విడిపించలేదు. ఇక అరవడానికి ఏ మాత్రం శక్తీ మిగలలేదు. చివరికి క్రిమికీటకాలు శరీరమంతా ప్రాకి ఆ గది అంతా దుర్గం ధం సోకింది. ఇదే రాక్షసత్వానికి పరాకాష్ట. దేవుడే దిగి వచ్చేడా అన్నట్లు ఎవరో తలుపులు బద్దలు కొట్టి వెంటనే ఆస్పత్రికి, ఆ తరువాత మా జంతుజాలాల శరణాలయానికి తీసుకె ళ్ళేరు. ఆ భగవంతుడే సహృదయులైన వారిని ఆసరాగా నిలిపేడు.

ఇంచుమించు నలభై సంవత్సరాల క్రితం మాట, డాడీ చెప్పారు: కుటుంబంతో సహా పైదేశం ఉద్యోగ రీత్యా డాడీ వెళ్ళవలసి వచ్చింది. అప్పుడు ఇంట్లో నాలాగే ''డైసీ'' ఉండేది. ఒక ఏడాది వయసు పిల్ల. అందచందాల్లో నేనూ డైసీ ఒకరికి ఒకరూ ఏమీ తీసిపోముట. ఒళ్ళంతా నున్నటి మెరిసే తెల్లటి జుత్తు, మెరిసే కళ్ళు చూసి అందరూ ఈర్ష్య పడేవారు. ఏమీ చెయ్యలేక రోహిణి గారింట్లో వదలి పెట్టేరు, ఎంతో బాధతో. రెండు సంవత్సరాల తరువాత సెలవులకి వచ్చినపుడు డాడీని, అమ్మని, పిల్లలిద్దిరినీ చూసి కోపంతో అలిగి దగ్గరికి రాకుండా సోఫా కిందకి దూరిపోయి మరి బయటికి రాలేదుట.

వర్షం, ఉరుముల ఉధృతం తగ్గింది. ఈ నిశిరాత్రిలో దారీ తెన్నూ తెలియడం లేదు. అంతా నీరూ బురదా మయంగాఉంది. ఒక వైపు ఆకలి, మరోవేపు నిద్ర లేకా భరించలేని నీరసం కృంగదీసింది.

సూర్యోదయం కావొస్తోంది . పచ్చి మంచినీళ్లేనా నిన్నటినించి ముట్టలేదు. కాళ్ళలో శక్తి క్షీణిస్తోంది. లేత సూర్యకిరణాలని కూడా తట్టుకోలేకపోతున్నాను. నన్ను నేనే గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాను. ఒళ్ళంతా మన్నూ బంకా బురదా పట్టేసి ఉంది. చెట్ల కొమ్మ లమధ్యల్లోంచి కానవచ్చేది మసకగా మబ్బో లేక పొగ మంచో తెలియడంలేదు. మరికొంచెం దగ్గరకి వెళ్లే సరికి ఒక మంటా, పొయ్యిమీద ఎదో ఉడుకుతున్నట్లు మకనిపించింది. పొయ్యి సెగ వెచ్చని ఆవిరితో విపరీతమైన చలి బాధకు ఒక్కసారి ఉపశమనం అయింది. పొయ్యి మీద ఘుమఘుమలతో ఉడుకుతున్నది గంజి అనుకుంటాను. ఎవరో వస్తూన్న అలికిడి అయింది. లేని శక్తి తెచ్చుకుని రెండంగలు వేద్దామని ప్రయత్నించి విఫలమయ్యేను. దగ్గిరికి వచ్చిన వ్యక్తి ఏంతో జాలిగా, ఆప్యాయంగా నా తల ఓదారుస్తున్నట్లుగా నిమిరేడు. నా కనీళ్ళధార చూసి నన్ను దగ్గరకి తీసుకున్నాడు. అతను వెంటనే తాగడానికి నీళ్లిచ్చేడు. ఎక్కడి నుంచి వచ్చిందో, ఎలా తప్పిపోయిందో! ఎవరి పెంపుడు కుక్కో అయి ఉంటుందని భావిస్తున్నట్లు న్నాడు. నేను రియోని, మా డాడీ, నేనూ విడిపోయేము రైలు ప్రయాణంలో అని నాకు చెప్పాలని ఉన్నాది. మమ్మల్ని నోరు లేనివాళ్ళగా సృష్టించేడు ఆ పైవాడు. కేవలం కాపలా కోసమే నోరు పెట్టాడు. ఇప్పుడు నేను నోరు విప్పితే దగ్గరకొచ్చిన వ్యక్తి భయపడిపోతాడు. అతను నన్ను చాలా సేపు చూస్తూ ఎదో ఆలోచిస్తున్నాడు. ముందు పొయ్యిమీద గంజి అవగానే సంచీ లోంచి ఓ పళ్లెం తీసేడు. ఆవిరితో ఉన్న గంజిని పళ్లెంలో

పోసి నా నోటి దగ్గిర పెట్టేడు. వేడి ఆరబొయ్యడానికి ఊదుతున్నాడు, నోటికి చురకుండా. ఆ వ్యక్తి ప్రేమ, ఆదరణా చూస్తే, వెంటనే మా అమ్మ, డాడీ, శాంతి, జ్ఞాపకం వచ్చి .

పక్కనే పారుతున్న వాగులో నాకు స్నానం చేయించేడు. మా డాడీ లాగే. పల్లెటూళ్లలో మన్నుతోనే ఒళ్ళు కడుక్కునేవారుట కాలవ గట్టున మా డాడీ వాళ్ళ పెద్దలు. సబ్బు, షాం పూ, ఇంట్లో బాత్ రూమ్ అన్నీ జ్ఞాపకం వచ్చేయి.

నా అస్సలు తెల్లటి రూపు, నల్లటి కళ్ళు, గులాబీ రంగు ముక్కూ చూసి అతని ముఖంలో ఆశ్చర్యం కనిపించింది. చేతి సంచిలోనున్న తువ్వాలుతో చక్కగా నన్ను తుడిచేడు. శాంతి దువ్వెనతో జుట్టు దువ్వేది.

చల్లారేక గంజి తాగేక ఓపిక, శక్తీ, వచ్చేయి. అతను కూడా గంజితో పాటు ఏదో నంచుకున్నా డు. తన మూటా సంచీ సర్దుకుని నావంక రమ్మని సైగ చేసేడు. రా, కూర్చో, తిను, ఒద్దు, తా గు, లాంటి మాటలు అర్ధమౌతాయి. నవ్వుకుంటూ ముందుకి అడుగులు వేసేడు నేను వెంట బడగా.

చెట్లూ , పుట్టలూ, తోటలూ దాటుకుంటూ పక్కనే ఉన్న పల్లెటూరికి చేరుకున్నాం. బాగా ప్రొద్దెక్కింది. ఒక గుడిసె దగ్గెర ఆగేడు. లోపలనించి ఒక కోతిపిల్ల చెంగున గెంతి అతని భుజం మీద కూర్చుంది. కీచ కీచుమంటూ ఏదేదో ఆయనతో మాట్లేడేస్తోంది. ముగ్గురమూ రోడ్డు మీద పడ్డాం. గంగిరెద్దుని వీధులన్నీ తిప్పడం నాకు తెలుసు. మనం కూడా అదే పనిలోఉన్నామని అర్ధమైపోయింది. జనాలు నన్ను కన్నార్పకుండా చూడ్డం నాకెంతో వింతగా అనిపించింది. మేము మిట్టమధ్యాన్నం అయేక ఓ చెట్టు కింద కూర్చుని ఆపూ ట దండుకున్నది, కాఫీ హోటల్లో దొరికిన ఇడ్లీలు, ఓ నాలుగు బిస్కట్లూ, పంచుకుని తిన్నాం.

రోజూ అమ్మ పెట్టే భోజనం తల్చుకుని ఏం ప్రయోజనం ? గతం, రేపు, మరచి ప్రస్తుతం లోనే ఉండమనే కదా వేదాంతులు చెప్తారు? కానీ ఆచరించేది ఎవరు? నిన్నటి దుఃఖం ఇప్పుడు లేదు నాకు, ఏంతో సుఖంగా ఉంది. రేపటి గురించి ఆలోచనే లేదు. ఇదే గదా అసలైన ఎరుక !

ఏదో విధంగా పగలూ రాత్రీ గడిచిపోతున్నాయి, ఏ చెట్టు కిందో, అరుగుమీదనో, ఇంకా ఏ రోడ్డు వారనో రోజులు తిరుగుతున్నాయి. కోతిపిల్ల చేష్టలూ, చుట్టూ చేరే పిల్లలు నాతో కలిసిమెలిసి ఆడే ఆటలతో సమయం తెలియకుండా సాగిపోతోంది. అతను నన్ను "కుట్టీ" అని పిలుస్తూంటాడు. అమ్మ కూడా "శాంతికుట్టి" అని పిలవడం విన్నాను. ఎక్కడో ఉన్న మలయాళ దేశంలో అడపిల్లల్ని "కుట్టీ " అని పిలుస్తారుట. అమ్మ, డాడీ కూడా చాలా సంవత్సరాలు అటుపక్కే ఉన్నారు. దీన్ని బట్టి ఈయన అక్కడివాడే అయుండాలి అని అనుకున్నాను. మాన వత, ప్రేమాభిమానాలూ అన్ని దేశాల వారికీ ఉంటాయి.

కాలచక్రంలో ఇంచుమించు ఆరునెలలు గడచిపోయేయి. అనుకోకుండా ఒక మలుపు తిరి గింది నా జీవిత యాత్రలో. సైకిల్ రిక్షాలో ఒక "మైకు" నుండి జంబో సర్కస్ చూడండి, ఆనందించండి, మీ పిల్లల్ని తీసుకు రండి, పెద్దలు కూడా ఎంతో ఆనందిస్తారు, రండి, రండి , నేడే ప్రారంభం స్కూల్ గ్రౌండ్స్ ప్రక్కనే అంటూ రిక్షా వెళ్తోంది. అందులో పులులూ , సింహాలూ, ఏనుగులూ , ఎలుగుబంట్లూ, రకరకాల పక్షులూ , ఇంకా కడుపుబ్బించే హాస్య గాళ్ళు, పైగా అటూ ఇటూ ఎత్తు నుంచి ఉయ్యాలలూగే అమ్మాయిలూ, ఇంకా ఎన్నోవింతలు చూడండి, ఆనందించండి అని ప్రచారం చేస్తున్నది అర్థమయింది. ఇప్పటి వరకూ నన్ను ఆపదనుండి, అడవినుండీ, రక్షించిన ఆపద్బాంధవుడు పేరు పిళ్ళై అని తెలిసింది, ఎవరో అతనిని అలా పలకరించగా. నన్ను సంకలోను, భుజం మీద కోతిపిల్లని పెట్టుకుని. టిక్కెట్లు కొనడానికి లైనులో నిలుచున్నాడు. వెనకనున్న గేలరీ బెంచీలమీద సర్దు కున్నాం. సర్కస్ ఆట మొదలైంది దేదీప్యమైన వెలుతురులో. ఎంతో వింతగా బహు రకాల జంతు వులూ , పక్షులూ ప్రత్యక్షంగా ఒకే చోట చూడడం అదృష్టమే. ఎత్తుగా టెంట్ మీద నుండి బలమైన త్రాళ్లతో వేలాడుతున్న ఉయ్యాలల నుండి ఆకాశంలో పక్షులు ఎగురుతున్నట్లే అతి సునాయాసంగా అటూ ఇటూ ఊగుతూ సామర్థ్యాల ప్రదర్శనలు చేసేరు. ఏనుగు సైకిల్ తొక్కడం, చిలక తుపాకీ పేల్చడం, పులి నోట్లో మనిషి తల పెట్టడం వంటి చమత్కారాలు చూపించేరు. సర్కస్ చూశాక మైదానంలో పిడతకింద పప్పు, ఉల్లిపా యల బజ్జీలు, మురీ ఉండలు లాంటి వన్నీ పెట్రోమాక్స్ లైట్ వెల్తుర్లో ఆకర్షణీయంగా ఆమ్ము డవుతున్నాయి. పిడతకింద పప్పు తిన్నాం. అక్కడనుంచి బయటకొస్తూండగా సర్కస్ కర్మచారి ఒకడు పిళ్ళైకు 'సర్కస్ యజమాని గారు పిలుస్తున్నారు నీతో యేదో మాట్లాడుతారుట' అని చెప్పాడు. నన్నూ, కోతినీ తీసుకుని మేనేజర్ గారి ఆఫీస్ కి పిళ్లై వెళ్ళేడు. మమ్మల్ని ఎంతో మర్యాదగా కూర్చోమని టిఫిన్ తింటారా, కూల్ డ్రింక్స్ కావాలా అని మేనేజర్ అడిగేరు.పిళ్ళై గారు, కోతీ, కావలసినంత తిని చివరలో అరిటి పండు అడిగి మరీ తిన్నారు. పైగా తేనుపులు కూడాను. అమ్మ పెట్టినా, శాంతి పెట్టి నా నేను తృప్తిగా తినగలను, కానీ బయటవాళ్లెవరైనా పెట్టుతే నాకు తినాలనిపించేది కాదు. అలాగే ఇప్పుడు పిళ్ళై తినిపిస్తేనే తప్ప ఏదీ ముట్టను.

అసలు విషయం మేనేజర్ గారు చెప్పేరు. నన్ను చూసినప్పటినుంచి ఆయనకు సర్కస్ కంపెనీలో నాకు తగిన తర్ఫీదు ఇచ్చి నన్ను సర్కస్సులో చేర్చుకొనాలని ఉన్నదట. తన ఇంటి పెంపుడు వ్యక్తిగానే చూసుకుంటానని హామీ ఇస్తూ రెండు వందల రూపాయలు పిళ్ళై చేతులో పెట్టేరు. మహదానందంగా వెనక్కి చూడకుండా కోతితో సహా నన్నక్కడ వదలి పిళ్ళై వెళ్ళిపోయేడు.

ఈ ఆరు నెలల్లో నన్ను చూసి నేర్చుకున్నదిదేనా ? డబ్బు కోసం కన్న పిల్లలనైనా అమ్ము కొనే మనుష్యులుంటారుట. చివరకు నేను అమ్ముడుపోయేనా ? ఇది చూస్తే మరో జన్మలా ఉంది. మరో జన్మ ఎత్తకుండానే ! నాకు తెలిసినంతవరకూ నేను ఏ పాపమూ చేసినట్లు లేదు. అందుకే నాకు ఈ మరో జన్మ దేముడు పెట్టాడేమో!

మేనేజర్ గారు నన్ను వారింటికి కార్లో తీసికెళ్ళేరు. అది పెద్ద ఇల్లు. ఐదో ఆరో గదులున్నా యి. పనివాళ్లున్నారు కానీ ఎక్కడా పిల్లల అలికిడి లేదు. మేనేజర్ గారి భార్యను చూస్తే అమ్మని చూసినట్లే ఉంది. ఆమె కళ్ళల్లో ఏంతో ఆప్యాయత ప్రేమ ఉట్టిపడుతోంది. నన్ను దగ్గరికి తీసుకుని కన్న బిడ్డని చూసినంత మురిసిపోయింది. పిల్లలు లేని వెలితి ఆమెలో కనిపించింది. ముందుగా పాలు ఇచ్చేరు. వాళ్ళ గదిలోనే మరొక చిన్న మంచం మీద మెత్తటి బొంత, వెచ్చగా ఉండడానికి పల్చటి దుప్పటి ఇంకా ఓ చిన్న తలగడా ఏర్పాటు చేసేరు. ఇది కలయో, మాయయో తెలియక ఆనందంతో తబ్బిబ్బైపోయేను. డాడీ, అమ్మనీ, శాంతిని తల్చుకుంటూ నిద్రలోకి జారిపోయేను. నాలుగు రోజుల తర్వాత మేనేజర్ గారు కారులో సర్కస్ కంపెనీకి తీసికెళ్ళేరు అమ్మగారు ఎంత చెప్పినా వినకుండా . చిన్న చిన్న విద్యలు నేర్పిద్దామని రెండు మూడు గంటలు కంపెనీలో ఉంచేరు. ముందుగా రింగు లోంచి దూకడం ప్రాక్టీస్ చేయించేరు. అలాగే చిన్నచిన్న సైజ్ రింగులులోంచి దూకడం,, వెనక కాళ్ల మీద నిలబడడం, ఏదైనా వస్తువు నోటితో పట్టుకొని తేవడం, న్యూస్ పేపర్ , గ్లాస్ లాంటి వస్తువులు తెచ్చి అందిచడం నేర్చుకున్నాను. చివరికి ఎవరైనా ఇంటికొస్తే ముందు కాళ్ళు రెండూ జోడించి నమస్కారం చెప్పడమూ కూడా తెలిసేయి. భయం లేకుండా పులు లు సింహాలు దగ్గిరకి వెళ్ళి పలకరించడం బాగా అలవాటయింది. నా భోజనం పళ్లెం నోటితో తెచ్చుకుని భోజనం వడ్డించే వరకూ వేచి ఉండి సరే అనేదాకా కూర్చునే ఉంటాను. ఈ క్రమశిక్షణ నేర్పినందుకు అతనికి నేనెంతో ఋణపడి ఉన్నాను. అప్పుడప్పుడు వారింటికి వచ్చిన అతిధులకు నా ప్రజ్ఞలు చూపిస్తూ వారందరిలో ఒకరిగా కలిసిపోయేను. పిల్లలూ, పసి పాపలూ ఎంతో నాతో చనువుగా ఆడుకుంటారు . ఒక రోజు సాయంకాలం బంధుమిత్రు లు, ఆడుకుంటున్న చిన్న పిల్లలతో, ఇల్లు కోలాహలంతో కళకళలాడుతోంది. ఆనాటి విందుకి ప్రత్యేక అతిథి పోలీస్ కమిషనర్ "రవి" గారు. మేనేజర్ గారూ ఆయనా ఏవేవో మాట్లాడుకున్నారు.

చూడడానికి చిన్నది గాను చలాకీగానూ ఉన్నాను కాబట్టి సెక్యూరిటీ పనికి తగునని చెప్పి నన్ను పోలీసు సిబ్బందిలో తీసుకుంటామని అడిగినట్లున్నారు. కానిస్టేబుల్తో మర్నాడు నన్ను క్యాంపుకి తీసుకుని రమ్మని అడిగినట్లున్నారు.

నాకు సెక్యూరిటీ ట్రైనింగ్ ఇచ్చాక రైల్వే స్టేషన్లోనూ, ఎయిర్పోర్ట్ లోను, ఫ్యాక్టరీల లోనూ పని చేసేను, నా అనుభవానికి బాగా గుర్తింపు వచ్చింది. మరో ఏడాది తరువాత పోలీస్ సెక్యూరిటీ పనిలో ఉన్న మాజాతి వారికి పోటీలు పెట్టేరు. సెక్యూరిటీ పనులలో, ముఖ్యంగా ప్రయాణీకుల సంచీల వాసనను బట్టి నేరస్థులని పసిగట్టటంలో నేను ఆరితేరిపోయేను. ఇందుకుగాను ఒక రకమైన హోదాతో సహా ఒక పతకం లభించింది.

ఆనాడు నాకు ఒక పండుగలా అనిపించింది. పెద్ద మైదానంలో అందరి ముందూ కమీషనర్ రవి గారు స్వయంగా మా కుక్కల స్క్వాడ్ ని సత్కరిస్తారని నన్ను అందంగా అలంకరించి ముందుగా నిలబెట్టేరు. కమిషనర్ గారు

వంగుని నాకు మెడల్ సత్కరి స్తూండగా చిరు నవ్వు నవ్వేరు. అతని వాసన అంది, పరిచయమున్నట్లుగానే తోచి, తోక ఆడించేను. వెంటనే, ఆయన కూడా  పడి పడి నవ్వడం మొదలెట్టేరు.

ఆనాటి ఉత్సవం అవగానే కానిస్టేబుల్ని  పిలిచి మరునాడు ఫస్ట్ ఏసీ లో హైదరాబాద్ కి నా ప్రయాణం ఏర్పాటు చేయమన్నారు. ఎందుకో కారణం చెప్పకుండా నన్ను తిన్నగా స్టేషన్ కి తీసుకురమ్మన్నారు. ఇదేదో జన్మలో మూడో జన్మ కాబోలు.

కమిషనర్ గారు స్వయంగా నాకు దగ్గర తోడుగా ఫస్ట్ ఏసీలో ఉండడం ఏమీ పాలుపోలేదు.  కమీషనర్ గారు నా  పతకాలు, సర్టిఫికెట్లు , మెడల్స్ తీసుకొచ్చేవా అని కానిస్టేబుల్ని  గదమాయించేరు. అంతా అయోమయంగా ఉంది. ట్రైన్ కదిలింది. మరునాడు పొద్దు న్నే హైదరాబాద్ స్టేషన్లో దిగేం. కార్ నడుస్తున్నంత సేపూ ఎక్కడికో తెలియని భయంతో  కూర్చున్నాను. బేగంపేట వచ్చేసరికి  నేను ఆనందం పట్టలేక కమిషనర్ గారి  ముఖం అంతా ఫేషియల్ ట్రీట్మెంట్ చేసేసేను. కారులో గెంతులు వేస్తూ అరుస్తూ చెప్పలేని హడా విడి చేసేసేను. కారు ఆగింది.

ఆ ఇల్లూ, గేటూ చూడగానే తెలిసిపోయింది. రవిగారు మెడల్ వేస్తూ ఎందుకు నవ్వేరో! నేను అడవి స్టేషనులో రైలు తప్పి పోయేక డాడీ, అమ్మా, ఎంతగానో విచారిస్తూ పేపర్లలో నా ఫోటోలు ఉంచి నా ఆచూకీ తెలియపరచమని ఎడ్వర్ టైజె చేసినట్లున్నారు. అదంతా కమీష్ నర్ గారే చూసుకున్నారు కదా! రవి కారు తలుపు తెరవగానే నేను ఉండబట్ట లేక బయట జాగా అంతా గెంతులేస్తూ అరుస్తూ, చుట్టుముట్టుతూ ఉండిపోయేను. రవి మెయిన్ డోర్ బెల్లు కొట్టగానే నేను దుబుక్కున డాడీమీదకు ఉరికి హంగామా చేసేస్తూండగా 'మామయ్యా  చూడు ఎవరిని తీసుకొచ్చేనో' అంటే, డాడీ అన్నారు: 'మా రియోని పట్టుకుని తీసుకొచ్చేవురా, సెభాష్' అన్నారు.

నా అగమ్య పయనానికి అద్భుత ఫలితం ఏమని వర్ణించ గలను?

## పోగు బంధం — యశస్వి జవ్వాది

ఎదురుగా పెద్ద భవనం, లోపలున్న అందరూ తెలిసినవాళ్లే, అప్పుడప్పుడు వెళ్లే ఇల్లే. అయినా ఇంటి వాకిలి గుమ్మందాకా వచ్చిన జానకి, మరో పదడుగులు లోపలకు వెయ్యడానికి ఆలోచిస్తోంది. బుద్ధి వెళ్లమంటున్నా మనసు మాత్రం వద్దంటుంది. అంత పెద్ద ఇంట్లో, అలవాటైన మనుషులతో అప్పుడప్పుడు వచ్చి మాట్లాడి వెళ్లడం వేరు,

శాశ్వతంగా ఉండిపోవడం వేరు. జీవితంలో చివరిదశకు వచ్చిన వయసులో కుక్కిన పేనులాగా ఒక చోట ఉండకుండా, డబ్బు బలంతో చలాకీగా వుండే మనుషుల మధ్య ఇమడగలనా అనే సందేహం ఓపక్క వారిస్తోంది. 'కూతురు రమ్మందని ఎగేసుకుని వచ్చావ'ని వియ్యపురాలు దెప్పిపొడుపు మాటలు అంటే పరిస్థితేంటని ఆలోచిస్తూ, తలుపు తోసుకుని వెళ్ళాలా? వద్దా అని సంశయంతో ఆగింది.

ఈలోపు వెనుకనుండి "ఏంటి!? ఇలా ఎలా వచ్చారు!?" అని గంభీరమైన రాజారావు గొంతు వినిపించింది. ఒక్కసారిగా హడలిపోయి వెనక్కితిరిగి చూసింది. అజానుబాహుడు, దీర్ఘకాయుడైన అల్లుడు వున్నాడు. మనసులో, 'అమ్మాయి నేను వస్తున్న విషయం చెప్పలేదా ఏంటి!?' అనుకుని ఏదో చెప్పాలని మాట తడబడబోతుంటే, "సరె సర్లేండీ!! ముందు లోపలకు పదండి" అని ఇంట్లోకి ఆహ్వానించాడు. వాకిట మొక్కలున్న తోట, వరండా దాటి, లోపలికి అడుగుపెట్టగానే హాల్లో వియ్యపురాలు శాంతమ్మ ఉండటం చూసి కుశలప్రశ్నలు వేసింది. ఆమె మొహంలో కూడా అదే అయోమయం. చెప్పాపెట్టకుండా వచ్చిన జానకీని, తెచ్చుకున్న సామాన్లు చూసి, 'ఇదేంటి!! బిచాణం మొత్తం వేసుకొచ్చింది. ఇక్కడ పాతుకుపోతుందేంటి!?' అనుకుంటూ, పైకి చిరునవ్వుతో పలకరించింది.

జానకి గొంతు విని, వసుంధర పరుగున వచ్చి తల్లిని చూసి మురిసిపోయింది. అమ్మ మొహంలో భయం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. జానకీ చూడటానికి చాలా గంభీరంగా ఉన్నా, అమాయకురాలు, భయస్థురాలు. చుట్టాలతో ఎక్కువ చనువుగా మాట్లాడితే, పెడర్థాలు తీసుకుని గొడవలొస్తాయని స్వీయానుభవం వల్ల తెలుసుకుని చాలా తక్కువగా మాట్లాడుతుంది. వసుంధర ఒక్కగానొక్క కూతురు. భర్త అభ్యుదయభావాలు కలిగిన వ్యక్తి. వేరే కులం అయినా, ఆ భేదం పట్టించుకోకుండా ప్రేమించి తనని పెళ్లి చేసుకున్నాడు. కూతురుది కూడా ప్రేమ వివాహమే. జానకి, వసుంధర అంటే అల్లుడువైపు బంధువులకు చిన్నచూపు. భర్త గుండెపోటుతో కాలంచేస్తే కాలంతో ఒంటరిగా పోరాడుతున్న అమ్మని తన దగ్గరకు రమ్మన్న కూతురు పిలుపుకు వచ్చింది.

స్నానం సాకుతో కూతురుతో పాటు గదిలోకెళ్లి, "వసూ!! అల్లుడు, వియ్యపురాలు నావంక అదోలా చూస్తున్నారు,. నువ్వు వాళ్ళని ఒప్పించే కదా నన్ను పిలిచావు!" అని అడిగింది.

"లేదమ్మా!! నాకు సమయం ఎక్కడ దొరికింది. మెల్లిగా ఈయనకు చెప్తాను. ఒప్పుకుంటే అత్తయ్యకు కూడా ఈయననే చెప్పి ఒప్పించమని చెప్తాను" అంటూ విషయం చెప్పింది. దెబ్బకు జానకీ గుండెల్లో రాయిపడినంత పనయ్యి, "ఒసేయ్ వసూ!! ఇలా చేశావేంటే!! ఒప్పుకోకపోతే నా పరువు పోతుంది. నువ్వు సొంత నిర్ణయాలు తీసుకుంటున్నావని నిన్ను ఆడిపోసుకుంటే., ఒకవేళ అయిష్టంగా ఒప్పుకుంటే ఈ కొంపలో నాకు దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షవుతుంది నా బ్రతుకు. దీనికి నేను ససేమిరా ఒప్పుకోనూ" అని గద్గదస్వరంతో చెప్పింది.

"అమ్మా!! నీకు కొడుకైనా నేనే, కూతురైనా నేనే అని నువ్వన్నావు. ఆ బాధ్యత నన్ను తీర్చుకొనివ్వు...." అంటూ తలుపు దగ్గరకెళ్లింది. లోపలకు వస్తున్న భర్తని గమనించి, ముందుగా సిద్ధంచేసిన గదిలోకి తల్లిని పంపింది. జానకి మనసంతా గందరగోళంగా ఉంది. ముందుకంటే ఇప్పుడే భయంగా ఉంది ఏమవుతుందోనని. తనవల్ల కూతురు కాపురంలో చిచ్చు రాజుకుంటుందేమోనని ఒకటే ఆలోచన కుదురుగా నిలబడనివ్వడం లేదు, కూర్చోనివ్వడం లేదు. పదేపదే తలుపు దగ్గరకు వెళ్లడం, వెనక్కిరావడం చెయ్యసాగింది.

ఈలోపు బయట నుండి పెద్దపెద్దగా మాటల శబ్దం వినిపించసాగింది. జానకీ గుండె ఒక్కసారిగా అదిరింది. మెల్లిగా తలుపు తీసి హాల్లోకి వెళ్లి చూస్తే, తీరా అది వియ్యపురాలి సీరియల్స్ గొడవని అర్థమయ్యింది. జానకీని చూసినా వియ్యపురాలు ఒక్కమాట కూడా మాట్లాడకుండా, బలవంతంగా నవ్వింది. ఆమెను చూసి తనుకూడ మొహమాటంగా నవ్వుతూ, వంటగదిలో ఉన్న కూతురు దగ్గరకెళ్ళి మెల్లిగా, "అమ్మాయ్!! నన్ను కూడా చెయ్యి వెయ్యనివ్వు,, త్వరగా పూర్తవుతుంది" అంటూ వంటపనిలో పడింది. అనుభవం వల్ల త్వరగా చాలా రుచిగా, వండేసి టేబుల్ మీద సర్దింది. అల్లుడు కూడా సిద్ధమయ్యి, అందరితోపాటు తినడానికి కూర్చున్నాడు.

శాంతమ్మకు, వియ్యపురాలి వంట నచ్చినా ఒక్కమాట మాట్లాడకుండా తినసాగింది. అమ్మ చేతివంట వసుంధరకు కడుపును రోజూకన్నా కాస్త ఎక్కువగా నింపింది. రాజారావు, "వంటలు అదరగొట్టారు!! ఇకనుండి వంట సెక్షన్ పూర్తిగా మీదే., వచ్చేనెల నుండి వంటమ్మాయిని రావద్దని చెప్తాను. మీ అమ్మాయికి ఆరు నెలలు నిండాయి. మావయ్య ఎలాగూ లేరు. మీరా, అన్ని ఖర్చులు భరించి కాన్పు చేయించలేరు. మీకే కష్టంగా ఉన్నట్టుంది. డెలివరీ అయ్యేంత వరకూ ఇక్కడే ఉండండి. ఈ విషయంలో మీ అమ్మాయికి సాయం చెయ్యండి!!" అని మొహమాటం లేకుండా అనేశాడు. శాంతమ్మ కొడుకు మాటలను విని ఒక్క క్షణమాగి, 'అవునవును!' అన్నట్టు అంగీకారంగా తలాడించింది.

అల్లుడు అన్నమాటలు జానకీని బాధపెట్టినా ఆర్థిక ఇబ్బందులు ఆలోచించుకుని కిక్కురుమనలేదు గానీ, మనసులో నొచ్చుకుంది. భోజనాలు పూర్తయ్యాయి. డైనింగ్ టేబుల్ సర్దుతూంటే కూతురు వెనకెనకే తిరుగుతూ, కబుర్లు చెబుతూ, తల్లిని నవ్వించింది. అది చూసి, కూతురి ప్రేమ అర్థమై, అల్లుడి మాటలను పక్కకి తోసేసింది, పనయ్యాక మెల్లిగా తన గదిలోకెళ్లింది. వసుంధర, శాంతమ్మతో కలసి టీవీ ముందు కూర్చుంది. రాజారావేమో ల్యాప్ ట్యాప్ ముందేసుకుని కూర్చున్నాడు. లోపలికొచ్చిన ఆమె తనతో పాటు తెచ్చుకున్న భర్త, కూతురుతో పాటు కలసి దిగిన ఫోటో ఒకటి తీసింది. గోడమీద ఆగిపోయిన గడియారం తీసి, దాని స్థానంలో ఆ ఫోటో తగిలించుకుని, మనసుని స్థిమితపరుచుకుని పడుకుంది.

తెల్లవారింది. యధావిధిగా ఇంట్లో లేచినట్టు లేచిన జానకీ, స్నానం చేసి బయటకొచ్చింది. బయటకొచ్చేసరికి, హాల్లో ఆఫీస్ వెళ్ళడానికి అల్లుడు సిద్ధమై ఉన్నాడు. పొద్దుపొద్దునే బయటకు వెళ్లేటప్పుడు ఎందుకు ఎదురు పోవడమని సోఫా వెనకాల నుండి వంటగది వైపు అడుగులు వేసింది. తీరిగ్గా వచ్చిన జానకీని చూసినా రాజారావు

అగ్గిమీద గుగ్గిలమయినట్టు, "అప్పుడే లేచారేంటి!? మీ గదిలో ఆగిపోయింది గడియారం ఒక్కటే బయట ప్రపంచం కాదు!!" అని వెటకారం, కోపం కలబోసుకుని అన్నాడు. పక్కనే ఉన్న శాంతమ్మ కొడుకుని అలానే చూడసాగింది.

"వెళ్ళండి!! వెళ్ళండి!! వంటమ్మాయి ఈరోజు నుండే రావడం లేదు. ఇంటిపని, వంటపని మీరూ, మీ కూతురే చూసుకోవాలి. ఎలా పడతారో పడండి" అంటూ బ్యాగు తీసుకుని శాంతమ్మ వైపు చూసి గుంభనంగా నవ్వి వెళ్లిపోయాడు. అల్లుడు వెళ్ళగానే జానకి వంటగదిలో పని పూర్తిచేసి బయటకొచ్చింది. అలసిపోయి బయటకొచ్చిన జానకీని చూసి, 'పాపం!! అలసిపోయినట్టుంది. తినడానికి పిలుద్దాము!!' అని మనసులో అనుకున్నదే గానీ, పిలవలేదు శాంతమ్మ. అంతలోనే వసుంధర పిలిచి టిఫిన్ చెయ్యమని చెప్పింది.

రాజారావు బట్టలు ఇస్త్రీ చేస్తుంది వసుంధర. లోపలకు వెళ్లిన జానకి, "అమ్మా వసూ!! ఊసుపోవడం లేదు. ఇంట్లో ఏవైనా పుస్తకాలుంటే ఇవ్వు. కొద్దిగా కాలక్షేపం అవుతుంది" అని అడిగింది. అత్తగారికి చెప్పి ఆమె గదిలోని పుస్తకాల్లో రెండు తల్లికి ఇచ్చింది వసుంధర. ఈలోపు ఆఫీసు నుండి ఫోన్ చేసాడు అల్లుడు, విషయం ఏమిటని అడిగింది. "తను రావడం లేటవుతుందటమ్మా. పక్క సందులోనే కదా కూరగాయల సంత. మీఅమ్మని వెళ్లి వారానికి సరిపడా తెమ్మని చెప్పు!! అని అన్నారాయన, కనీసం నా సమాధానం వినకుండా పెట్టేశారు" అన్నది వసుంధర. సంభాషణ అంతా వింటూనే ఉంది శాంతమ్మ. మధ్యాహ్నం భోజనాల తర్వాత ఒక పెద్ద జాబితా రాసి ఇచ్చి, ఏమనుకుందో తాను కూడా వస్తాను అనగానే, అల్లుడు తన తల్లిని కూడా తీసుకెళ్తే ఏమంటాడోనని, "వదినగారూ!! నన్నొక్కదాన్నే వెళ్ళమన్నారు అల్లుడుగారు, మీరొద్దులేండీ" అంటూ తనకు ఇదివరకే తెలిసిన పక్క వీధి సంతకి వెళ్ళింది. వసుంధర అమ్మొక్కతే అన్ని సరుకులు, కూరగాయలు ఎలా తీసుకువస్తుందోనని కంగారుగా కాలుకాలిన పిల్లిలాగా అటూఇటూ తిరుగుతూ జానకీ వస్తుందో లేదో చూడటం కోసం తలుపు దగ్గరకు వెళ్లి చూడసాగింది. కొద్దీ సమయానికి జానకీ అన్ని సరుకులు తీసుకుని వచ్చింది. అమ్మని కొంచెం సమయం ప్రశాంతంగా కూర్చోమని మెల్లిగా తాను కూరగాయలు, సరుకులు సర్దింది. వచ్చిన అన్ని సరుకులు చూసుకుంటే కొత్తిమీర కట్టలు వచ్చేటప్పుడు ఎక్కడో పడిందని అర్థమయ్యింది.

రాజారావు చెప్పినట్టుగానే ఆలస్యంగా వచ్చాడు. స్నానం అదీ కానిచ్చి, ఆకలితో అవురావురుమంటూ వచ్చి అన్నం ముందు కూర్చున్నాడు. వసుంధరకు తాను చేయమని చెప్పిన కొత్తిమీర పచ్చడి కోసం వెతికాడు, దొరకలేదు. అసలు విషయం తెలుకుని "ఏంటండి ఇంత అశ్రద్ధగా ఉన్నారు!? ఇలా ఉంటే ఎలా? ఇప్పుడంటే కొత్తిమీరనే!! తర్వాత ఇంకా విలువైనది అయితే ఎలాగ? ఇలానే చేస్తారా!? పెద్దవాళ్ళు,, కష్టపడి సంపాదించే డబ్బు విలువ తెలియాలి.. అక్కడ ఒళ్ళుహూనం అయ్యేలాగా పనిచేసి కడుపునిండా తినాలని వస్తే ఇలా చేశారు..." అంటూ విసురుగా పక్కన నీళ్లు తీసుకుని అన్నంలో చెయ్యి కడుక్కుని విసురుగా వెళ్ళిపోయాడు.

అల్లుడి చర్యకు జానకి హృదయం కదిలిపోయింది. కంటివెంట నీరు అసంకల్పితంగా రాసాగింది. శాంతమ్మ జరిగిన తంతు అంతా చూసి ఒక్కమాట కూడా మాట్లాడకుండా, మళ్ళీ అన్నం పెట్టించుకోకుండా తాను కూడా చెయ్యికడుక్కుని వెళ్ళిపోయింది. అత్తగారికి ఏం కోపం వచ్చిందోనని వసుంధర ఆమె వెంట హడావిడిగా వెళ్ళిపోయింది. జానకి మనసు కకావికాలం అయ్యింది. తాను ఏదైతే జరగకూడదని దేవుడ్ని ప్రార్థించిందో అదే జరిగింది. ఇక ఈ ఇంట్లో ఉండే ప్రసక్తే లేదని, రేపే వెళ్లిపోవాలని నిశ్చయించుకుంది. జరిగిన సంఘటన తలుచుకుని తలుచుకుని నిద్రపట్టక రాత్రంతా జాగారం చేసి తెల్లవారుజామునే ఊరెళ్లడానికి సిద్ధమయి కూర్చుంది.

ఎవరి పనిలో వాళ్ళున్నారు. వంటగదిలో పక్కనే నిలబడి సాయం చేస్తున్న కూతురుకి తాను వెళ్లిపోవాలనుకున్న సంగతి చెప్పాలనుకుంది. అంతలో గిన్నెలు తీసుకుని వెళ్తున్న వసుంధర కాలు జారి తూలింది. అదాటున తూలిన ఆమెను జానకి ఒక్క అంగలో వచ్చి పట్టుకుంది. కాలు మెలికపడి చూస్తుండగానే వాచిపోయింది.. ఆ కాలు చూసి జానకి గుండె ఆగినంత పనైంది. నెమ్మదిగా నడిపించుకుంటూ తీసుకొచ్చి, దగ్గరలో ఉన్న కుర్చీలో కూర్చోబెట్టి, అల్లుడికి చెప్పింది.. అతను హడావుడిగా వచ్చి భార్య కాలును పరీక్షించి, డాక్టర్ కు ఫోన్ చేశాడు.. భార్యను ఆ స్థితిలో చూసిన అతని మొహం వాడిపోయింది. అల్లుని అలా చూసిన జానకికి తన కూతురి స్థితికి ఒకవైపు బాధ, తనతో ఎలా ఉన్నా, అల్లుడికి కూతురిపై ఉన్న ప్రేమకు మరోవైపు సంతోషంతో మనసు ఉక్కిరిబిక్కిరి అయ్యింది.. ఇంతలో డాక్టర్ వచ్చి కాలు బెణికిందని, అందులో ఆమె గర్భవతి కూడా కావడంతో, అత్యవసర మందులు మాత్రమే ఇచ్చి, ఒక నెల రోజులు జాగ్రత్తలు తీసుకోవాలి అని చెప్పి వెళ్ళిపోయాడు. డాక్టర్ మాటలు విన్న జానకీ తన ప్రయాణం వాయిదా వేసుకుంది. అన్ని పనులు తానే అయి చేసుకోసాగింది. అప్పుడప్పుడు చిన్న చిన్న పొరపాట్లు జరగడం పరిపాటే. అసలే మొహమాటస్థురాలు, జానకి చేసే పొరపాట్లను, భూతద్దంలో చూసినట్లు రాజారావు అయినదానికీ కానిదానికి వంకలు పెట్టి సూటిపోటి మాటలనడం మాత్రం రెట్టింపు అయ్యాయి. ప్రతిసారీ కొడుకు ప్రవర్తన చూస్తుంటే శాంతమ్మకు, చిరాకు మొదలై పది రోజుల్లోనే అది విపరీతమైన అసహనానికి దారితీసింది.. జానకి తప్పు ఏమీ లేదని కూడా అర్థంచేసుకుంది. ఆమె పరిస్థితికి జాలి పెరిగింది. కోడలి మంచితనం ఆమెకు తెలుసు, ఆమె తనతో ప్రవర్తించే తీరుకు, తన కొడుకు ఆమె తల్లితో ప్రవర్తిస్తున్న తీరుకు తేడాను స్పష్టంగా గమనించింది. ఇలా మారిన కొడుకు వ్యక్తిత్వం శాంతమ్మకు సుతరామూ నచ్చడంలేదు. ఇలా నెమ్మదిగా మూడువారాలు గడిచాయి. అల్లుడు చేతిలో చివాట్లు తినడం అలవాటైపోయింది.

ఒకానొక సందర్భంలో శృతిమించి వాగిన కొడుకుని చూసి కోపం ఆపుకోలేక, "ఒరేయ్ రాజా!! ఏంటసలు నువ్వు? ఆమె వచ్చినప్పటి నుండి చూస్తున్నాను. పెద్దా, చిన్నా అని చూడకుండా, పట్టుకుని సాధిస్తున్నావు. ఆమెది కూడా నాలాంటి ముసలి ప్రాణమే కదా!! కాకపోతే నీ అమ్మకాదు అంతే. ఎందుకింత రాద్ధాంతం చేస్తున్నావు? రానురాను నీ పద్ధతేమి బాగోలేదు, నాకు నచ్చడం కూడా లేదు. ఇంట్లో పనులు ఇదివరకూ అమ్మాయి నేను చేసుకునేవాళ్ళం. ఇప్పుడు

కోడలు లేవలేని పరిస్థితి. మేమిద్దరం ఒకరికొకరు చేదోడువాదోడుగా వుంటూ ఇల్లు చక్కదిద్దేందుకు ప్రయత్నం చేస్తాము. నువ్వు ఇంకోమాట గానీ ఆమెను అన్నావంటే ఆమెను తన ఊరికి పంపేస్తాను. వయసులో పెద్దవాళ్ళతో ఎలా మాట్లాడాలో కూడా తెలియడం లేదు నీకు.., ఇదే నేను నీకు చెప్పడం!!" అని అప్పటివరకూ శాంతంగా ఉన్న శాంతమ్మ కొడుకు మీద ఉగ్రరూపమెత్తింది.

ప్రతి సమాధానం చెప్పబోతున్న కొడుకుతో, "ఇంకోమాట మాట్లాడితే నన్ను చంపుకుని తిన్నంత ఒట్టే!! ముందు నువ్వు ఆఫీసుకెళ్ళు!!" అని కొడుకుని బయటకు పంపింది. జరిగింది చూసిన జానకి తనవల్లనే ఇదంతా జరుగుతుందని అర్థం చేసుకుని నేరుగా సామాన్లు తీసుకుని, కూతురుకి చెప్పి వెళ్లిపోదామని ఆమె గదిలోకి వెళ్ళింది. లోపల నవ్వుతూ ఫోను మాట్లాడుతున్న వసుంధరను అయోమయంగా చూసింది. తాను తీసుకున్న నిర్ణయం చెప్పి, "అల్లుడుగారికి నేను ఇక్కడుంటే మనశ్శాంతి ఉండదు. నావల్ల అమ్మా, కొడుకుల మధ్య గొడవలొచ్చాయి. ఈనింద నేను భరించలేను" అంటూ ఏడుపు కళ్లతో, ఇక ఉంటాను అని చెప్పింది. అమ్మని ఆపి బలవంతంగా కూర్చోబెట్టి బయట ఒకసారి చూసి తలుపేసింది.

"చూడమ్మా!! అసలు నిన్ను ఇంట్లోకి తీసుకురమ్మని చెప్పిందే ఆయన. నీమంచి కోసమే ఇదంతా చేశారు. నీకు ఆయన ఫ్రెండు మనోహర్ సైకాలజిస్ట్. ఆయనతో ఉండి ఉండి, ఈయనకు మనుషుల సైకాలజీ కొంత అవగాహన చేసుకున్నారు. నిన్ను ఇక్కడ ఉండమని చెప్తే చులకన అయిపోతావని, అత్తయ్య నోటినుండి ఆ మాట రప్పించడం కోసం ఇలా ప్రవర్తించారు. నువ్వు రావడం అత్తయకు ఇష్టం లేదేమో అనిపించింది. అందుకే అత్తయ్య ముందు ఆయన కటువుగా వ్యవహరించారు. నిన్ను ఆయన కసురుకున్న ప్రతీసారి అత్తయ్యగారికి నీపట్ల తన అభిప్రాయం మారింది. అందుకే ఈరోజు ఆయన మీద కోప్పడింది. ఇకనుండి ఆయన నిన్ను పల్లెత్తు మాట అనరు. నిన్ను అన్న ప్రతీమాటకు నాకు వేలసార్లు క్షమాపణ చెప్పారు. రేపటినుండి అంతా సర్దుకుంటుంది. నువ్వెళ్ళి విశ్రాంతి తీసుకో ఎక్కువగా ఆలోచించకు" అని చెప్పి ప్రేమగా అమ్మను గదిలోకి తీసుకెళ్లి పడుకోబెట్టింది వసుంధర.

కూతురు బయటకు వెళ్ళగానే గోడకు తగిలించిన ఫోటో తీసేసి అల్లుడుతో ఉన్న ఫోటో గోడకు తగిలించి పడుకుంది. జానకి పరిస్థితి ఎలావుందో చూడటానికి వచ్చిన వసుంధర మారిన ఫోటోవంక చూసి, నీళ్లు తిరిగిన కళ్ళతో తన ఫోనులో ఫోటోతీసి భర్తకు పెట్టింది. వచ్చిన ఫోటో చూసిన రాజారావు దీర్ఘశ్వాస తీసి తన పర్సులో ఉన్న తల్లి ఫోటో బయటకు తీసి, ' నన్ను క్షమించు అమ్మా!! ఇది మనందరి మంచి కోసమే!!' అని మనసులో అనుకున్నాడు.

# జీనా ఇసీ కా నామ్ హై! తోట ప్రసాద్

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
### బహుమతి పొందిన కథ

కృష్ణుడి చెరువు గట్టు ఎదురుగానే లక్ష్మీనారాయణ ఇల్లు.

ఇంకా ఈ రోజుల్లో కూడా దాన్ని దాబా ఇల్లుగా మార్చుకోలేదు. నాలుగు వాటాల పెంకుటిల్లు. మూడువాటాలు అద్దెకిచ్చి, ఓ వాటాలో తను ఒంటరిగా ఉంటున్నాడు లక్ష్మీనారాయణ.

ఆయన ఉద్యోగం నుంచి రిటైర్ అయి, పదేళ్ళపైనే అవుతోంది. భార్య చనిపోయి పదమూడేళ్ళు అవుతుంది.

భార్యపోయిన ఒంటరితనం నుంచి ఉద్యోగపు చివరి దశ కొంత కాపాడింది.

వెళ్ళడానికి ఆఫీస్ లేదు. ఇంట్లో ఉండటానికి ఇల్లాలు లేదు. పిల్లలంతా తలోదారిన ఎక్కడెక్కడో స్థిరపడ్డారు.

ఆ వాటాల మీద వచ్చిన అద్దె – డబ్బులు ముగ్గురు కూతుళ్ళకి ప్రతినెలా ఫస్ట్ తారీఖున ఠంచన్‌గా వెళ్ళిపోతుంది.

చేసింది గవర్నమెంట్ జాబ్ కాబట్టి, లక్ష్మీనారాయణకి పెన్షన్ వస్తూ ఉంటుంది. దానితో జాగ్రత్తగా కాలక్షేపం చేస్తుంటాడాయన.

ఏడుపదులకి దగ్గరున్న ఆయనకి నలభై ఏళ్ళ నాకూ స్నేహం కుదరడం విచిత్రమే.

వయసుని బట్టి ఏర్పడే స్నేహాలు స్కూల్, కాలేజి, ఆఫీసులకి మాత్రమే పరిమితం.

*అసలైన స్నేహాలన్నీ బయట ప్రపంచంలోనే ఉంటాయి.*

నేను ఓ ప్రముఖ తెలుగు దినపత్రికకి మా ఊరిలో రిపోర్టర్‌గా పని చేస్తున్నాను. పేరుకి రిపోర్టర్ గానీ, జీతానికి మాత్రం స్ట్రింగర్‌ని. అంటే పబ్లిష్ అయిన వార్తకి – ఓ లైనుకి 23 పైసల చొప్పున లెక్కకట్టి ఇస్తుంటారు. నిజానికి ఆ డబ్బులు నా పెట్రోల్ ఖర్చులకికూడా రావు.

విజయా సినిమా థియేటర్ పక్కనే నాకో స్టేషనరీ షాప్ ఉంది. దానిమీద వచ్చే ఆదాయంతో నా సంసారం నడుస్తూ ఉంటుంది.

జర్నలిస్ట్ అనే పదంతో వచ్చే పలుకుబడి, ఏర్పడే పరిచయాలు నాకు ఇష్టం. మా ఊళ్ళో ఉన్న నలుగురయిదుగురు జర్నలిస్టుల్లో నేనొకడిని.

ఒకసారి మా ఊరి టౌన్‌హాల్ లైబ్రరీలో జరిగిన ఓ సమావేశానికి లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా వచ్చినప్పుడు పరిచయమైంది. కొనకళ్ళ వెంకటరత్నం పాటల గురించి లక్ష్మీనారాయణ చాలా విపులంగా మాట్లాడారు.

'మొక్కజొన్న తోటలో' అనే ఒకనాటి పాపులర్ సినిమా పాట రాసింది కొనకళ్ళగారనే విషయం అంతవరకూ నాకు తెలియదు. అలాగే ఆయనది మా పరిసర ప్రాంతాలే అనే విషయం మరింత సంతోషం కలిగించింది.

సభ అయిపోయాక, "బాబూ నువ్వు ఎటు వెళ్తున్నావు?" అనడిగాడు లక్ష్మీనారాయణ.

"జీవకారుణ్య సంఘం వీధి" అని చెప్పాను.

"అవునా – అయితే దార్లోనే. నేనుండేది కృష్ణుడి చెరువు ఎదురిల్లు" అని అన్నాడాయన.

ఆయనని డ్రాప్ చేయడానికి వెళ్తున్నప్పుడు ఆయన వ్యక్తిగత విషయాలు నాకు తెలిశాయి.

అప్పటినుంచి మా పరిచయం స్నేహంగా మారింది.

పాత చందమామ, యువ, జ్యోతి, స్వాతి ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథలు, సీరియల్స్ అన్నీ బైండ్ చేసి పెట్టుకున్నాడు.

అవి చదువుతుంటే “అక్షరాల టైమ్ మిషన్ తనని తన పాతరోజుల జ్ఞాపకాల్లోకి తీసుకెళ్తోంది” అనేవాడాయన.

ఆయనకి వంటరాదు, వంటమనిషిని పెట్టుకున్నాడు. ఆమె పేరు సంపూర్ణమ్మ. మొగుడికి యాక్సిడెంట్ అయి, పనిలోకి వెళ్ళలేకపోతుంటే ఇంటి దగ్గర ఇస్త్రీ షాప్ పెట్టించింది. తను నాలుగిళ్ళల్లో వంటలు చేస్తుంటుంది.

మతం మార్చుకుంది కాబట్టి కాలవ అవతల పాత ఊరులోని చర్చికి ఆదివారం వెళ్తుంది. ఆ రోజు పనిలోకి రాదు.

ఆ రోజంతా మోడరన్ కెఫేలోనే ఆయన టిఫిన్లు, భోజనాలు.

పిల్లలకి టిఫిన్లు కట్టించడానికి నేను వెళ్ళినప్పుడు, మా పిల్లల టిఫిన్లు కూడా ఆయనే పార్సిళ్ళు చేయించేవాడు. మా పిల్లలకి ఏం ఇష్టమో, నాకన్నా ఆయనకే ఎక్కువ తెలుసు.

ఎప్పుడూ మా ఇంటికి రమ్మన్నా భోజనానికి వచ్చేవాడు కాదు.

సాయంత్రం పూట రామాలయానికి వెళ్ళి, పురాణ కాలక్షేపం చేసేవాడు. అంటే ఆయన పురాణాలు చదివి, అర్థాలు చెబుతుండేవాడు.

ఓ వ్యాసపీఠం, పుస్తకం చేతిలో పట్టుకుని, ఆయన గుడిమంటపంలో కూర్చునేవాడు.

వినడానికి ఒకరిద్దరు ఉన్నా, ఆయన చెప్పుకుంటుపోయేవాడు.

అది చూసి, నేను నవ్వేవాడిని. "యూట్యూబ్‌లో ఇలా నొక్కితే అలా ఎన్నో ప్రవచనాలు? ఇంకా గుళ్ళో ఎవడు వింటాడండీ ఈ పురాణాలు?" అనేవాడిని.

"ఫోన్ లేనివాడికి కూడా తెలియాలి కదండీ. వేల ఏళ్ళ క్రితం నాటి ఈ పురాణాలు, ధర్మాలు ఒకరి దగ్గరినుంచి మరొకరికి చెప్పుకుంటూ వెళ్ళడం వల్లే నిలిచాయి. నేను రచయితను కాదు. మంచి పాఠకుడిని. నాకు తెలిసింది నాకు అర్థమైంది. నలుగురికి పంచుకోకపోతే ఎట్లా?" అనేవాడు లక్ష్మీ నారాయణ.

రాత్రుళ్ళు సంగమ్, కారవాన్‌లోని కిషోర్‌కుమార్, ముఖేష్ పాత హిందీ పాటలు వింటుండేవాడు. పదకొండు – పన్నెండు గంటలప్పుడు వింటుండేవాడు. పదకొండు పన్నెండు గంటలప్పుడు ఆ కృష్ణుడి చెరువు గట్టున నిలబడి, సిగరెట్ తాగుతూ కనబడేవాడు. అప్పుడు ఆయనచేత 'కిసీ కీ ముష్కారత్ పే హా నిసార్' అనే ముఖేష్ పాట పాడించుకునేవాడిని.

ఆయన సిగ్గుపడకుండా, ఇబ్బందిపడకుండా, పదేపదే అడిగించుకోకుండా హాయిగా పాడేవాడు. అప్పుడే సిగరెట్ తాగడం వల్లనేమో ఆయన గొంతులో ఓ ప్రత్యేకమైన జీర ఉండేది.

ఒక మనిషి ఒంటరిగా బతకగలడా అనే సందేహం ఎవరికైనా ఉంటే, ఆయనని చూస్తే, పటాపంచలు అయ్యేవి.

అప్పుడప్పుడూ డెస్కటాప్‌లో పిల్లలతో వీడియో కాల్స్ మాట్లాడేవారు. పిల్లలు వాళ్ళ ఇంటికి రమ్మన్నా వెళ్ళేవాడు కాదు.

"ఇంతకాలం బంధాల మధ్యనే సర్దుకుపోయి, బతుకుతూ వచ్చాను. చచ్చిపోయేంత వయసు వచ్చాక కూడా ఇంకా నేనేమీ ఇబ్బంది పడతాను? వాళ్ళనేం పెట్టాలి" అనేవాడు.

ఆ మాట ఆయన ఊతపదం. చివరికి ఎవర్నీ ఇబ్బంది పెట్టకుండానే ఓ రాత్రి నిద్రలో కన్నుమూశాడు.

పెద్దగా అనారోగ్య సూచనలు ఉన్నట్లు కూడా లేవు. రెండు మూడు రోజులముందు మాత్రం పాదాల వాపు వచ్చిందని నాకు చూపించాడు.

హోమియో డాక్టర్ దగ్గరికి వెళ్ళి చూపించుకుంటానన్నాడు. కాని అంతలోనే అలా ముగిసిపోయింది.

సంపూర్ణమ్మ మా ఇంటికి పొద్దున్నే పరుగెత్తుకుంటూ వచ్చింది. "బాబూ – లక్ష్మీ నారాయణగారు సచ్చిపోయారండీ.. పొద్దున్నే టిఫిన్ చేసి పెడదామని వెళ్ళానండీ. రాత్రి పెసరట్లకు రుబ్బుమన్నారు. డూప్లికేట్ తాళం నా దగ్గరుంది. తలుపు తీసి చూశాను. బాత్ రూమ్ ముంగిట అలా కూలబడిపోయి ఉన్నారండీ. వళ్ళంతా నల్లగా ఐస్ ముక్క అయిపోయిందండీ " అని చెబుతోంది సంపూర్ణమ్మ.

నేను పరుగు పరుగున వెళ్ళాను.

ఇరుగు పొరుగు సాయంతో లక్ష్మీనారాయణ పార్థివ దేహాన్ని వరండాలో పడుకోబెట్టాను.

ఓ గ్లాసులో బియ్యం పోసి, అగరొత్తులు వెలిగించింది సంపూర్ణమ్మ.

లక్ష్మీనారాయణ ఒక మాట అంటుండేవారు.

"ఏమోయ్ నేను చనిపోయాక ఆ భగవద్గీత క్యాసెట్లు పెడతారేమో చచ్చిపోతాను. తప్పు చక్కగా ముఖేష్ పాటలు పెట్టండి. అలా హాయిగా వెళ్ళిపోతాను ' అన్నాడు.

కారవాన్‌లో 'జీనా యహా – మర్ నా యహా ' అనే పాట పెట్టాను.

అక్కడికి వచ్చినవాళ్ళందరూ నన్ను విచిత్రంగా చూస్తున్నారు.

ఆయన పిల్లలకి కబురు చేశాను. సాయంత్రానికి ఇద్దరు వచ్చారు. ఓ కొడుకు, కూతురు.

మిగిలిన ఇద్దరు కూతుళ్ళు విదేశాల్లో ఉన్నారు. వీలయినంతమటుకు పెద్ద కర్మకి వస్తామన్నారు.

ఆయన కొడుకు పేరు – ముఖేష్ చంద్ర. లక్ష్మీనారాయణ మీద ఇంకా ముచ్చటేసింది.

కార్యక్రమాలన్నీ ముగిశాయి. అగ్ని సంస్కారం అయిన తర్వాత వస్తుంటే, పక్కన పడేసిన లక్ష్మీనారాయణ దిండు కనబడింది. నాకు కన్నీళ్ళు ఆగలేదు.

ఇన్నాళ్ళు ఆయన తలని, కలలని, ఆలోచనలని, కన్నీళ్ళని పంచుకున్న ఆ దిండు పక్కనే పడేసి ఉంది. మంటల్లో తనని ఎందుకు పడేయలేదన్నట్లుగా దిగాలుగా చూస్తోంది.

నా దుఃఖాన్ని గమనించి, ముఖేష్ చంద్ర భుజం నొక్కాడు. అసహజంగా అనిపించింది నాకు.

మూడోరోజు భోజనాలయ్యాయి. చివరిసారి ఆయన్ని మోసిన నలుగురి భుజాలకి పాలు రాశారు. ఆ పాల స్పర్శకి లక్ష్మీనారాయణ నిమురుతున్నట్లు అనిపించింది నాకు.

అలమారాలో ఒంటరైపోయిన పుస్తకాలని చూస్తుంటే, వెనకనే వచ్చి, నిలబడ్డాడు ముఖేష్ చంద్ర. "ఒక చిన్న హెల్ప్ చేయగలరా సోమసుందర్‌గారు? అదీ మా అక్కావాళ్ళు కెనడా, సౌదీ నుంచి రాకముందే జరిగిపోవాలి" అన్నాడు ముకేష్.

తెలియని ఆశ్చర్యంతో వెనక్కి తిరిగాను.ముఖేష్ చంద్ర చేతిలో లక్ష్మీనారాయణ బ్యాంక్ పాస్‌బుక్ కనబడింది.

నొసలు చిట్లించాను.

'నాన్నగారి అకౌంట్‌లో ఉన్న డబ్బులు నాకు త్వరగా వచ్చేలా చూడాలి. మీరు జర్నలిస్ట్ కాబట్టి డెత్ సర్టిఫికేట్, బ్యాంకు పనులు త్వరగా చేసిపెట్టగలరు ' అనడిగాడు ముఖేష్ చంద్ర నా రెండు చేతులు పట్టుకుని.

చాలా కంపరం అనిపించింది. లక్ష్మీనారాయణ (ఆత్మ)కి ఈ సంగతి తెలిస్తే, ఎంత బాధపడతాడో

'అంటే..' అని నేను నసుగుతున్నాను.

ముఖేష్ చంద్ర తన జేబులోనుంచి ఓ కాగితం తీశాడు.

"ఆరోజే నాన్నగారి కార్యక్రమం జరుగుతుండగానే నాన్నగారి ఆధార్ కార్డ్ సబ్మిట్ చేశాను. నిన్న వెళ్ళి, డెత్ సర్టిఫికెట్ తీసుకొచ్చాను" అని చూపిస్తున్నాడు.

నిర్వికారంగా చూశాను. బతుకు– చావు – ఓ కార్డు – ఓ కాగితం.

“రేప్పొద్దున్నే బ్యాంక్ తెరిచే టైమంకి వెళ్ళిపోదాం” అన్నాడు ముఖేష్ చంద్ర నా సమాధానం కోసం కూడా ఎదురుచూడకుండా.

తల కొరివి పెట్టినవాడు, పెద్దకర్మ అయ్యేంతవరకూ గడపదాటకూడదంటారు.

కానీ ముఖేష్ చంద్రకి అలాంటి సెంటిమెంట్స్ ఏమీ లేవనుకుంటాను. బ్యాంక్ మేనేజర్‌ని కలిశాం.

ఆయన రిజిస్టర్ తెప్పించి, లక్ష్మీనారాయణ తన వారసుడుగా ముఖేష్ చంద్ర పేరు రాశాడా లేదా అని చెక్ చేశాడు. లక్ష్మీనారాయణ కొడుకునే వారసుడిగా చూశాడు.

"టైమ్ పడుతుందండీ. బ్యాంక్ కి మీరు కొంత డబ్బులు కూడా కట్టాల్సి వుంటుంది" అన్నాడు మేనేజర్.

"ఎంత?" అనడిగాడు ముఖేష్.

"ఎందుకూ?" అనేది నా ప్రశ్న.

"లక్ష్మీ నారాయణగారు మినిమమ్ బ్యాలెన్స్ కూడా మెయింటైన్ చేయలేదు. ప్రతి నెలా లైబ్రరీకి అని, ఏదో బ్లడ్ బ్యాంక్ అని, గుడికని, ఛారిటీకని డబ్బులు పంపిస్తుండేవారు. మినిమమ్ బ్యాలెన్స్ పదివేలు. మీరు ఎనిమిది వేల మూడొందలు ప్లస్ ఫైన్ ఆరువేలు కడితే అకౌంట్ క్లోజ్ చేయొచ్చు" అని చెబుతున్నాడు మేనేజర్.

“ఇంతకీ బ్యాలెన్స్ ఎంత ఉంది?” ఆత్రుతగా అడిగాను. ముఖేష్ చంద్రకన్నా ముందే.

ముఖేష్ ఏమీ మాట్లాడటంలేదు. తల దించుకుని కూర్చున్నాడు.

"పదిహేడువందల ముప్పై రెండు పైసలు" అని చెప్పాడు మేనేజర్.

నాలోపలి ఒక సైతాన్ డాన్స్ చేయడం మొదలుపెట్టాడు.

తండ్రి చనిపోయాడనే బాధకూడా లేకుండా వీడు పరుగెత్తుకుంటూ తండ్రి డబ్బులకోసం పరుగెత్తుకుంటూ వచ్చాడు. ఇలాంటి నాకొడుకులకి ఇలా శాస్తి జరగాల్సిందే.

“తెలుసు” అన్నాడు ముఖేష్ చంద్ర అతి కష్టం మీద గొంతు పెగల్చి.

నేను అయోమయంగా చూస్తున్నాను.

"ఎందుకు సార్? వేస్ట్ మీరు పదిహేనువేలు కడితే, మీకు తిరిగొచ్చేది రెండువేలు కూడా ఉండదు. మినిమమ్ బ్యాలెన్స్ లేదు కబట్టి, అకౌంట్ ఎలాగూ డెడ్ అయిపోతుంది" అని సలహా ఇచ్చాడు మేనేజర్.

"ఆ! ఆయన చెబుతుంది కరెక్ట్" అన్నాను.

"ఆ పదిహేడువందలు ఏమైపోతాయి?" అనడిగాడు ముఖేష్ చంద్ర.

"ఏమవుతాయి? సముద్రంలో కాకిరెట్టలా గవర్నమెంట్ ఖాతాలో జమ అవుతాయి" అని చెప్పాను.

"అదే నాకిష్టం లేదు. ఆ పదిహేడువందలు మా నాన్న కష్టార్జితం. బతికినన్నాళ్ళూ ఒక్క రూపాయి కూడా లంచం తీసుకోకుండా నిజాయితీగా బతికాడు.

అవి మా నాన్న చిట్టచివరి రూపాయిలు. అవే కాగితాలు కాకపోవచ్చు. కాని వాటి విలువ మా నాన్న ప్రేమ, నిజాయితీ. ఆ డబ్బులు నాకే కావాలి. జీవితాంతం నేనెంత సంపాదించినా, నేనెలా సంపాదించాలో పాఠాలు నేర్పే గురువులు ఆ రూపాయిలు. ఎంత ఖర్చయినా ఫర్లేదు. ఎన్ని రోజులయినా పర్లేదు. ఆగుతాను. కాని మా నాన్న చివరి రూపాయి నాకే కావాలి" అన్నాడతను.

“కోట్ల ఆస్తి ఇస్తేనే వారసత్వం అనుకుంటారు అందరూ. కాని మీ ఫాదర్ హానెస్టీకి ఆవేవో రాజులు ముద్రించిన నాణేల్లా ఈ డబ్బులని ఫీలవుతున్నావు చూడు – అదీ గ్రేట్. క్యాష్ కౌంటర్‌లో డబ్బులు కట్టేసిరండి. నేను స్పీడప్ చేస్తాను" అని ముఖేష్ చంద్రతో కరచాలనం చేశాడు బ్యాంక్ మేనేజర్.

నేను ముఖేష్ భుజం మీద చేయివేసి, దగ్గరకు తీసుకున్నాను.

లక్ష్మీనారాయణగారు పాడిన పాట గుర్తొస్తుంది – 'జీనా ఇసీ కా నామ్ హై’ అలలు అలలుగా గాల్లో నాకు మాత్రమే వినబడుతూ.

నా చేతి స్పర్శకి ముఖేష్ గుండెల్లో తడి తెలుస్తోంది.

# 100 ప్లస్ 1

కృపాకర్ పోతుల

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
బహుమతి పొందిన కథ

సాయంత్రం ఏడుగంటలు కావస్తోంది. సభాభవనం ఆహూతులతో కిటకిటలాడిపోతోంది. సమావేశం ఇంకామొదలుకాలేదేమో, అక్కడంతా 'హలో', 'హాయ్', 'బాగున్నారా' 'ఏంటి విశేషాలు' 'మీటింగుకి వచ్చేరా' వంటి పలకరింపులతో సందడిగా, ఎటుచూసినా పండగవాతావరణం నెలకొని ఉంది.

దేదీప్యమానంగా వెలుగుతున్న లైట్లతో, రంగుబల్బుల తోరణాలతో ఆడిటోరియం బయటా లోపటా కూడా ధగధగ మెరిసిపోతోంది. ఎటుచూసినా "గౌరవనీయులైన సుందర్రావుగారికి సుస్వాగతం", "లాంగ్ లివ్ సుందర్రావ్ గారు" అంటూ ఆహ్వానం పలుకుతున్న బేనర్స్ దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా సుందర్రావుగారి నిలువెత్తు కటౌట్లు రెండు, ఆడిటోరియం ప్రవేశద్వారానికి అటొకటీ ఇటొకటీ మెడలో బంతిపూలదండలు ధరించి, ఆయన రాకకోసమే ఎదురుచూస్తున్నట్టు నవ్వుతూ నిల్చొని ఉన్నాయి.

★★★★★

రాష్ట్రంలోనే అత్యంతపెద్దదైన, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పట్టణం అది. జనాభా పాతికలక్షలకు తక్కువ ఉండదు. అంత పెద్ద పట్టణ చరిత్రలో నూరుసంవత్సరాలు జీవించిన 'అదృష్టవంతులె'వరూ అంతవరకూ, ఒక్కరంటే ఒక్కరుకూడా లేరు. అటువంటి అద్వితీయమైన ఘనత సాధించిన మొట్టమొదటి వ్యక్తి సుందర్రావుగారే. అందుకే ఆ శుభసందర్భాన్ని పురస్కరించుకొని, ఆయనను ఘనంగా సన్మానింప తలపెట్టారు పురప్రముఖులంతా.

"చావు రాక, చావలేక బతుకీడుస్తున్నవాడ్ని. నాకెందుకు నాయనా ఈసన్మానాలూ అవీను. దయచేసి నా మానాన నన్నిలా బ్రతకనివ్వండి" అని సుందర్రావుగారు వారింహినా వినిపించుకోలేదెవ్వరూ. ఆయనకు సన్మానం చెయ్యడం పట్టణపౌరులుగా తమ బాధ్యత అనీ, సన్మానం జరిపించి తీరాల్సిందేననీ గట్టిగా పట్టుపట్టారు. అందుకు సుందర్రావుగారు సమ్మతించేలా చేయడంలో సఫలీకృతులయ్యారు.

సన్మానకార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించేందుకుగాను, వివిధ రంగాలకు చెందిన పురప్రముఖులతో విస్తృతమైన కమిటీనొకదాన్ని ఏర్పాటు చేసారు. నగరంలోని పెద్దపెద్ద పారిశ్రామిక, వ్యాపారసంస్థల నుండి విరాళాలు సేకరించారు. నగరంలో అతిపెద్ద సభాభవనాన్ని ఎంపికచేసి, భారీఎత్తున సన్మానకార్యక్రమం జరిపించడానికి అన్ని ఏర్పాట్లూ విజయవంతంగా పూర్తిచేసేరు.

ఆ రోజే సుందర్రావుగారి నూటాఒకటవ జన్మదినం; ఆయనకు సన్మానం జరుగుతున్నది ఆరోజే. అందుకే అక్కడ ఆ ఆర్భాటం, హడావుడీ...అంతా.

★★★★★

కార్యక్రమానికి పట్టణంలోని అనేకమంది ప్రముఖులూ, ప్రజలూ మాత్రమేకాక, జిల్లాకు చెందిన మంత్రివర్యులు కూడా హాజరయ్యారు. సన్మానకార్యక్రమం అంగరంగవైభోగంగా జరిగింది. వక్తలు సుందర్రావుగారిపై పొగడ్తల వర్షం కురిపించారు.

మంత్రిగారు మాట్లాడుతూ, నూరేళ్ళ నిండుజీవితం జీవించే అదృష్టం, పూర్వజన్మలోనూ, ఈజన్మలోనూ కూడా ఎంతో పుణ్యంచేసుకున్న అదృష్టవంతులకు తప్ప ఇతరులెవరికీ లభించదనీ, అట్టి అదృష్టాన్ని స్వంతంచేసుకున్న సుందర్రావుగారు అదృష్టవంతులు మాత్రమేకాక గొప్ప పుణ్యాత్ములుకూడాననీ శ్లాఘించారు.

ఇంకొక వక్త మాట్లాడుతూ శ్రీ సుందర్రావుగారు తమ పట్టణానికి చెందినవారు కావడం పట్టణప్రజలు చేసుకున్న అదృష్టమనీ, సుందర్రావుగారి పెరుగుదలా, నగరాభివృద్ధీ రెండూ సమకాలీనమైనవి కావడాన, పట్టణచరిత్రకూ, దాని అభివృద్ధికీ వారు సజీవసాక్ష్యమై నిలుస్తారని ప్రశంసించారు.

సుందర్రావుగారు ఇంకొక వందసంవత్సరాలు ఇలాగే ఆయురారోగ్యాలతో జీవించాలని ఉపన్యసించిన వక్తలందరూ బలంగా ఆకాంక్షించారు.

ఉపన్యాసాలు పూర్తైన తరవాత సుందర్రావుగారిని పూలమాలలతో ముంచెత్తారు. దుశ్శాలువ కప్పి సత్కరించారు. విలువైన జ్ఞాపిక కూడా బహూకరించారు. ఆఖరుగా తనకు పురప్రజలు గావించిన ఘనసన్మానానికి సన్మానగ్రహీత ఉచితరీతిని కృతజ్ఞతలు తెలియజేసిన తరవాత, కార్యక్రమంముగించి, పదిగంటలకల్లా సుందర్రావుగారిని సగౌరవంగా ఇంటికి సాగనంపారు.

★★★★★

శతాయుష్మంతులైన సుందర్రావుగారు, శారీరకంగానూ, మానసికంగానూ కూడా సంతృప్తికరమైన ఆరోగ్యం కలిగిఉన్న భాగ్యవంతులు. భగవంతుని దయవలన చక్కటి ధారణశక్తి కూడా కలిగియున్నవారు. నిన్నమొన్న జరిగిన విషయాలే కాకుండా, ఎప్పుడో డెబ్బై ఎనభై సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనలు కూడా స్పష్టంగా తేదీలతో సహా చెప్పగలరాయన. ఆయన అవసరాలు చూసుకోవడానికి ఒక 'ఫుల్ టైం మెయిడ్ సర్వెంట్' ఆయనతో పాటూ ఉంటున్నాసరే, తన పనులన్నీ తానే స్వయంగా చేసుకుంటారు ఇప్పటికీ. ప్రతీరోజూ ఉదయం భక్తిగా పూజా, సాయంత్రం కనీసం అరగంట సేపు నడకా, నియమం తప్పకుండా చేస్తారు. 'హిందూ' పేపర్ చదువుతారు.

అయినా సరే, రెండుగంటలపాటు జరిగిన సమావేశంలో పాల్గొనడంవల్ల కలిగిన శ్రమని తట్టుకోవడం నూరేళ్ళ సుందర్రావుగారి వల్ల కాలేకపోయింది. బాగా అలసిపోయారాయన. దానితో ఇంటికి చేరుకోగానే, కాస్త పాలు మాత్రం పుచ్చుకొని విశ్రమించారు.

అయితే శారీరకమైన అలసటవల్లనో, మానసికంగా కలత చెందడం చేతనోగాని, ప్రతీరోజూ సునాయాసంగా దరిచేరే నిద్రాదేవత, ఆరాత్రి ఆయనమీద సీతకన్నేసింది. దరిదాపుల్లోకి కూడా రాలేదు. మంచంమీద అశాంతిగా అటూఇటూ దొర్లుతున్న సుందర్రావుగారి కళ్ళ ముందు ఆరోజు జరిగిన సన్మానకార్యక్రమమం సినిమాలా కనిపిస్తోంది. వక్తల ఉపన్యాసాలు ఆయన చెవుల్లో గింగిరుమంటూ, అనేకమైన ఆలోచనల్నీ, అసహనాన్నీ రేకెత్తిస్తున్నాయి.

"పిచ్చా వెధవలకి. వఋడులా వందసంవత్సరాలు బతికిన నన్ను అదృష్టవంతుడంటారేంటి వీళ్ళంతా. ఇంతకాలం బతికి, అనుభవించిన బాధా, వేదనా చాలనట్టు ఇంకొక వందేళ్ళు కూడా బ్రతకాలట. బ్రతికేంచెయ్యాలి. ప్రియమైనవన్నీ... ఒక్కొక్కరూ, ఒక్కొక్కటీ, కళ్ళముందు నుంచి అదృశ్యమైపోతుంటే కళ్లప్పగించి చూస్తూ కూర్చోవాలి...ఏడుస్తూ. అంతేకదా" అనుకున్నారు బాధగా.

తన పిల్లలు గుర్తొచ్చారాయనకి. వారితో పాటూ 'భగవంతుడా మాసంతానం మాకంటే ముందు నిన్ను చేరుకునే దుర్గతి ఎట్టి పరిస్థితుల్లోనూ మాకు పట్టించకు. వారికంటే ముందే మమ్మల్ని నీ సన్నిధికి పిలుచుకో దేవా' అని ఆఫ్రికాఖండంలో జీవించే ఆటవికతెగవారు ఎవరోగాని... వారు రోజూ చేసే ప్రార్ధన...ఎక్కడో, ఎప్పుడో చదివినది ... గుర్తొచ్చింది అప్రయత్నంగా.

సుందర్రావుగారి ఐదుగురు సంతానంలో, పెద్దవారు నలుగురూ కొడుకులు. కడగొట్టుది ఆడపిల్ల. పిల్లలందర్నీ, కూతురుతో సహా, చక్కగా చదివించారు. కొడుకులు మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కూతురుకి రాజాలాంటి సంబంధం చూసి పెళ్ళిచేసారు.

"నీకేంటోయ్ సుందర్రావ్ అదృష్టవంతుడివి. పిల్లలందరూ చక్కగా చదువుకుని, బాగా సెటిల్ అయ్యారు. వడ్డించిన విస్తరి నీ జీవితం" అని స్నేహితులూ బంధువులూ పొగుడుతుంటే పొంగిపోయేవారు. అయితే, ఏనాడూ ఆయన అడగకుండానే దీర్ఘాయువు ప్రసాదించిన కరుణాసంపన్నుడు, తన కళ్ళముందే పిల్లలు ఐదుగుర్నీ, ఒకరి తరవాత ఒకరిని, తనదగ్గరకు పిలుచుకొనిపోతుంటే, మండుతున్న గుండెతో, కన్నీళ్ళు ఇంకిపోయి, ఎర్రబడిన కళ్ళతో చూస్తూ జీవచ్ఛవంలా మిగిలిపోయారు సుందర్రావుగారు. అనుభవించినవాడికి తప్ప ఇంకొకడికి అర్ధంకాని కడుపుకోత ఆయనది. పగవాడికైనా ఏనాడూ రాకూడని భయంకరమైన కష్టం అది.

"వందేళ్ళు బ్రతకబట్టే కదా ఈ బాధా, ఈ వేదనా. భగవంతుడు నన్ను కూడా మా నాన్నలా అరవైఐదేళ్ళకే తీసుకుపోయిఉంటే, ఈ కడుపుకోత తప్పేదికదా" అనుకున్నారు మండుతున్న కళ్ళు నెమ్మదిగా రుద్దుకుంటూ.

సమయం పదకొండు దాటింది. నిద్రాదేవి ఎక్కడా కనుచూపుమేరలో కనబడట్లేదు. ఆలోచనలు ప్రవాహంలా ముంచెత్తుతునే ఉన్నాయి. ప్రశ్నలు పుట్టగొడుగుల్లా పొడుచుకొస్తూనే ఉన్నాయి.

'పట్టణ చరిత్రకీ, అది సాధించిన ప్రగతికీ నేను సజీవసాక్ష్యాన్నట; ఈ ఊరూ నేనూ కలిసి పెరిగామట ' కోపంగా అనుకున్నారు మరొక పురప్రముఖుని ఉపన్యాసం గుర్తుకురాగా. ఆయనా ఊరూ కలిసి పెరిగాయనడం వరకూ వాస్తవమే. అందులో అతిశయోక్తిగాని అబద్ధంగాని లేవు. అయితే గత యాభై, అరవై సంవత్సరాల్లో తను ప్రాణసమానంగా ప్రేమించే తన ఊరు ఊహించనంత మార్పులకు లోనుకావడం మాత్రం సుందర్రావుగారిని తీవ్రమైన ఆగ్రహానికి గురిచేసే విషయం.

"యాభైఏళ్ల క్రితం ఎంత అందంగా ఉండేది నా ఊరు. ఎంత చల్లగా...ఎంత ప్రశాంతంగా ఉండేది. ఊరి ప్రజల్లో సగంమంది స్నేహితులో, సహోద్యోగులో, కనీసం ముఖపరిచయం ఉన్నవారో అయ్యుండేవారు. ఇంట్లోనుండి బయటకు వచ్చి పదడుగులు వేసేలోపే పలకరింపుగా నవ్వేవారు పదిమందైనా ఎదురయ్యేవారు కాదూ. పక్కవారి కష్టసుఖాలు తమవే అనుకునేవారు. ఏ అవసరానికైనా మేమున్నామంటూ అరడజనుమంది పరుగెత్తుకొచ్చేవారు. గడిచిన అర్ధశతాబ్దంలో ఊరు బహుముఖంగా విస్తరించింది. పారిశ్రామికంగా అభివృద్ధిచెందింది."

"టౌను కాస్తా సిటీగా రూపాంతరం చెందింది. మునిసిపాలిటీ, కార్పొరేషన్ అయ్యింది. ఎక్కడెక్కడినుంచో డబ్బులున్నవారు వాటిని సంచుల్లో నింపుకొని దిగబడ్డారు. ఎన్నెన్నో పరిశ్రమలు స్థాపించారు. వ్యాపారాలు ప్రారంభించారు. ఊరుని గొప్పగా 'డెవలప్' చేసేరు. అయితే...ఈ పరిణామక్రమంలో ఊరి సంస్కృతీ, విలక్షణతా సర్వనాశనం చేసేసారు."

"మానవసంబంధాలు మంటగలిసిపోయి, వాటిస్థానాన్ని ఆర్థికసంబంధాలు ఆక్రమించేసాయి. ప్రజలమధ్య అంతరాలూ, దూరాలూ పెరిగిపోయాయి. మన పక్కింటివాడెవడో, వాడిపేరేంటో కూడా తెలియకుండానే బ్రతికేసే దౌర్భాగ్యం దాపురించింది. అదంతా 'డెవలప్మెంటే'నట. అలాంటి 'డెవలప్మెంట్' కావాలనుకుంటే ఇలాంటి చిన్నచిన్న సైడ్ ఎఫెక్ట్సూ, సేక్రిఫైజెస్సూ తప్పవట" అనుకున్నారు కసిగా.

"మార్పు సహజంరా 'సుందరీ' నువ్వూ, నేనూ చిన్నప్పుడున్నట్టే ఉన్నామా? కాలంతోపాటూ మారలేదూ? అలాగే మన ఊరుకూడా మారింది. విప్ హేవ్ టు ఏక్సెప్ట్ ఇట్. అంతేగాని, నా ఊరు మారిపోయింది, నా చిన్నప్పుడున్నట్టులేదు. నేనది భరించలేను అంటే...నో బడీ కెన్ హెల్ప్ యూ" అంటూ మెత్తమెత్తగా చీవాట్లేసే చిన్ననాటి మిత్రుడు 'సత్తిగాడు' గుర్తొచ్చాడు.

"ఏడి వాడు? ఎక్కడున్నాడు? ముప్పైఏళ్ళు కాలేదూ వాడు చల్లగా జారుకొని. అలా జారిపోయిన వాడు అదృష్టవంతుడా లేకపోతే నాది కాకుండా పోయిన ఈఊరిలోనే నిర్వేదంగా నూరేళ్ళు బ్రతికేసిన నేనా?" సుందర్రావుగారికి సమాధానం తెలిసిన ప్రశ్నే. అయినా పదేపదే వేసుకుంటూనే ఉంటారు.

"సువాసినిగా వెళ్ళిపోవాలన్న కోరిక తీర్చుకోవడానికా అన్నట్టు ఒంటరిని చేసి అంతర్ధానమైపోయింది అగ్నిసాక్షిగా తాళికట్టిన భార్య. గుండెలమీద పెట్టుకొని పెంచిన కన్నబిడ్డలు కడుపుకోత మిగిల్చి వెళ్ళిపోయారు. చిన్ననాటి స్నేహితులూ, కలిసి పనిచేసిన సహోద్యోగులూ, సమవయస్కులైన బంధువులూ అందరూ అంతర్ధానమైపోయారు. తోటివారు కనీసం ఒక్కరంటే ఒక్కరన్నా మిగల్లేదు నేనొక్కడ్ని తప్ప. నన్ను పిలవడం మరచిపోయాడా భగవంతుడు. ఎప్పుడు గుర్తొస్తానో, అసలు గుర్తొస్తానో, రానో ఆ దయామయునికి" అనుకున్నారు సుందర్రావుగారు నిస్పృహగా.

దాహంగా అనిపిస్తుంటే నెమ్మదిగా లేచి ప్రక్కనే టేబుల్ మీద ఉన్న గ్లాసులో నీళ్ళతో గొంతు తడుపుకొని మళ్ళీ మంచంమీద వాలిపోయారు నిస్త్రాణగా.

"నేరకపోయి ఒప్పుకున్నానీ సన్మానానికి. 'ఒద్దు' అన్నమాటమీదే గట్టిగా నిలబడిపోయింటే ఈ చిత్తక్షోభ ఉండేదికాదు" అని తనని తను నిందించుకున్నారు మరొకమారు.

★★★★★

టైం చూసారు. అర్ధరాత్రి పన్నెండు దాటి పదినిమిషాలైంది. కంటిమీదకు కునుకు రావట్లేదు 'ఈరాత్రి జాగరణ తప్పేలాలేదు' విసుగ్గా అనుకున్నారు. నెమ్మదిగా మంచం దిగి, చేతికర్ర తీసుకొని, బయట వరండాలోకి వచ్చి, కొంచెంసేపు అటూ ఇటూ పచార్లు చేసారు. పది నిమిషాల తరవాత అలసటగా అనిపించింది. తిరిగి గదిలోకి వచ్చేసారు.

పడుకుందామని మంచంవేపుకి వెళ్ళబోతూ, ఏదో గుర్తొచ్చినట్టు తలపంకించి, నెమ్మదిగా వెళ్ళి, కబోర్డ్ తెరిచి, అందులో ఉన్న ఫోటో ఆల్బం చేతిలోకి తీసుకొని, పక్కనే ఉన్న ఈజీ చెయిర్లో కూర్చున్నారు. ఆల్బంవేపు ఆర్తిగా చూస్తూ, రెండుచేతులతో ప్రేమగా తడిమారు కొన్ని క్షణాలపాటూ.

అన్నింటిలోనూ ఆ ఆల్బమ్ ఆయనకు మిగిలియున్న అత్యంత విలువైన జ్ఞాపిక అని అంటారాయన.

'దానిలో ఉన్నవి ఉత్త ఫోటోలు మాత్రమే ' అంటే ఆయన ఒప్పుకోనే ఒప్పుకోరు. కోపం వస్తుంది కూడా.

'అందులో ఉన్నవన్నీ నా జ్ఞాపకాలూ వాటి జాడలూనూ' అంటారు. 'వాటిని చూస్తే సంతోషం దుఃఖం రెండూ ఒకసారే ముప్పిరిగొంటాయంటారు.' 'అందుకే దాన్ని తెరవాలంటే నాకు భయం' అని కూడా చెప్తుంటారాయన.

వాటిలో చాలా ఫోటోలు సుందర్రావుగారు స్వయంగా తీసినవే. ఆరోజుల్లో సుందర్రావుగారికి స్వంత కేమరా ఉండేది. 'రోలిఫ్లెక్స్' అని, జెర్మన్ మేడ్ కేమరా అది. ఆరునెలల పాటు గీచిగీచి మిగిల్చిన జీతం డబ్బులతో కొనుక్కున్న సెకండ్ హేండ్ కేమరా అది. చేతికి రెండుంగరాలో, మెళ్ళోకి గొలుసో చెయ్యించుకోకుండా డబ్బులలా తగలేసినందుకు నాన్న చేసిన రాద్ధాంతం గుర్తొచ్చింది సుందర్రావుగారికి. అంత చిరాకులోనూ కూడా చిన్న చిరునవ్వొకటి బలహీనంగా మెరిసి మాయమైంది ఆయన పెదాలమీద.

నెమ్మదిగా ఆల్బమ్ పేజీలు తిరగెయ్యసాగారు.

మొదటి పేజీలో అమ్మా నాన్నల ఫోటో. కేమరా కొనుక్కున్నాక సుందర్రావుగారు తీసిన మొట్టమొదటి ఫోటో అది. కేమరా మీద కోపం నాన్న కళ్ళలో ఎంత ప్రస్పుటంగా కనిపిస్తుందో ఆ పోటోలో; చిన్న నవ్వైనా లేకుండా, మొహం గంటు పెట్టుకొని చూస్తున్నారు కేమరా వేపు. అమ్మమాత్రం, ఎప్పటిలాగానే, హాయిగా, హుషారుగా, నవ్వుతూ... తల్లిదండ్రుల మొహాలవేపు తదేకంగా చూస్తూ ఉండిపోయారాయన కొన్ని క్షణాలపాటూ.

తరవాత పేజీలో తన పెళ్ళినాటి ఫోటో. అది మాత్రం స్టూడియోలో తియ్యించుకున్నది. 'ఎంత అమాయకంగా, అందంగా ఉంది సుమతి. పదహారేళ్ళు తనకి అప్పుడు; నాకు ఇరవై రెండు' అనుకున్నారు భార్య ఫోటోను పెదాలకు అద్దుకుంటూ.

'తను ఉన్నంతకాలం హాయిగా నిర్విచారంగా గడిచిపోయింది జీవితం. ఎంత ప్రేమగా చూసుకుంది నన్ను.' అనుకున్నారు వేదనగా. 'అంత ప్రేమించిన దానివి, ఎలా వెళ్ళిపోయావు నన్నొంటరిగా వదిలేసి' నిష్టూరంగా ప్రశ్నించారావిడ ఫోటోని. '

'ఇన్నిరోజులు, ఒంటరిగా, ఇక్కడ ఇలా ఉండిపోతానని అనుకోలేదు కదూ. నేను కూడా ఆలస్యం చెయ్యకుండా నీవెంట వచ్చేస్తాననుకున్నావు కదూ. లేకపోతే నువ్వలా వెళ్ళిపోయేదానివి కాదు నన్ను వదిలేసి. నాకు తెలుసు' అని తన ప్రశ్నకు తనే సమాధానం కూడా చెప్పుకుంటున్నప్పుడు గుండెలో సుడులు తిరుగుతున్న దుఃఖం ఉండచుట్టుకొని, గొంతుకడ్డం పడింది. గొంతులో మాట గొంతులోనే మిగిలిపోయింది.

కూతురి చిన్నప్పటి పోటో ఆయన మనసుపొరల్లో నిక్షిప్తమై ఉన్న మరిన్ని జ్ఞాపకాలను ఒక్క కుదుపు కుదిపి వదిలిపెట్టింది. పిల్లలైదుగురిలోనూ కూతురంటే ప్రత్యేకమైన ప్రేమ సుందర్రావుగారికి. గుండెలమీద పెట్టుకొని పెంచారామెను. 'ఐస్ ఫ్రూట్' కొనిపెట్టమని మారాం చేస్తున్న ఐదేళ్ళ పాపలాగే గుర్తుంటుంది కూతురు ఆయనకు ఇప్పటికీ. "ఎంత ముద్దుగా ఉండేది చిన్నప్పటి దాని అల్లరి" అనుకున్నారు పదేళ్ళ క్రితం వెళ్ళిపోయిన కూతురు ఐదేళ్ళప్పటి ఫోటో అనురక్తితో చూస్తూ.

"ఆడపిల్లని ఆడపిల్లలాగే పెంచు. మగరాయుడిలా కాదు. నెత్తికెక్కించుకొని తెగ ముద్దు చేస్తున్నావు" అని అందరూ సుద్దులు చెప్పినవారే ఆయనకు. ఆ విషయంలో మాత్రం ఎవరిమాటా, ఆఖరుకు తండ్రిమాట కూడా, ఖాతరు చెయ్యలేదు సుందర్రావుగారు. తను కోరుకున్నట్టే పెంచారు. ఆరోజుల్లోనే పోస్ట్ గ్రాడ్యుయేషన్ చెయ్యించేరు కూడా.

ఆల్బంలో ఒక్కొక్క ఫోటో చూసేకొద్దీ, ఒకదాని తరవాత ఒకటి, తెరలు తెరలుగా జ్ఞాపకాలు...ఎప్పటెప్పటివో...తుఫాను తాకిడికి సముద్రంలో ఎగసిపడుతున్న అలల్లా. రాయి దెబ్బతిని చెలరేగుతున తేనెటీగల్లా!!!

సమయం మూడు కావస్తోంది. అలసటతో కళ్ళు మండుతున్నాయి సుందర్రావుగారికి. ఆలోచనల ఉధృతికి తలనొప్పి కూడా మొదలైంది. 'ఇంకా ఎన్నాళ్ళిలా' అన్న ఆలోచన ఆ రోజు మరింత భయానికి గురి చేస్తోందాయనని.

ఆల్బం ఇక చూడాలనిపించలేదు. దాన్ని మూసేసి, మంచంమీద, తల దగ్గర పెట్టుకున్నారు. కుర్చీలోనుండి లేచి, లైట్ ఆఫ్ చేసి, నెమ్మదిగా మంచం మీద వాలారు. వాలుతున్నప్పుడు చిన్నగా కలుక్కుమంది ఆయన గుండెలో; చేతివేళ్ళు సన్నగా కంపించేయి; నుదిటిమీద పలచగా, చిరుచెమట కమ్ముకుంది. దుప్పటి గుండెలవరకూ లాక్కొని, మండుతున్న కళ్ళు మూసుకున్నారు అలసటగా.

★★★★★

మగతనిద్రలోకి జారుకుంటున్నసుందర్రావుగారి కనురెప్పల మాటున కోటిసూర్యుల వెలుగు...ఆ వెలుగులో...'రా! వచ్చెయ్' అన్నట్టు చేతులు చాచి ఆహ్వానిస్తూ ఆయన భార్యా పిల్లలూ, తల్లిదండ్రులూ, సత్తిగాడూ, ఇతర స్నేహితులూ, బంధువులూ...ఆయనను ఏకాకిని చేసి వెళ్ళిపోయిన ఆయన ఆత్మీయులందరూ!!! ఆనందంగా నవ్వుతూ!!!

అంతవరకూ ఆయన హృదయాన్ని అదిమేస్తున్న ఆవేదన ఏ అమృతమూర్తో తన అమృతహస్తంతో మృదువుగా తొలగించినట్టు ఒక్కసారిగా అదృశ్యమైపోయింది. దాని స్థానంలో వర్ణనకందని ప్రశాంతత చోటుచేసుకొని, మనసు దూదిపింజెలా తేలికయ్యింది.

వెలుగులు నింపుతూ, వెచ్చని సూర్యకాంతిలాంటి ప్రకాశవంతమైన నవ్వు, ఆయన మోహంనిండా పరుచుకుంది!!! నిద్రలోకి...మానవమాత్రులెవ్వరూ లేపశక్యంకానంత గాఢమైన సుషుప్తిలోనికి.. నెమ్మదిగా నెమ్మదిగా జారిపోయారు సుందర్రావుగారు!!!

# సంభవామి — అన్నపూర్ణ దేవరకొండ

ఈరోజే వచ్చానేమో చాలా బడలికగా ఉంది. కోరి కోరి ఎంచుకున్న ఇల్లు. వెచ్చగా, హాయిగా ఉంది. ఏవో గొంతులు వినపడుతున్నాయి, విందామని చెవులు రిక్కించా.

"తోయంపు కురులతోడ తూగేటి శిరసు, చింతకాయల వంటి జడలఘుముల తోడ"

అబ్బ ఎంత బాగుంది తన గొంతు. వంట చేసుకుంటూ పాడుకుంటోంది అమ్మ. దగ్గరగా వెళ్లి ముద్దు పెట్టా. ఎడమచేతితో ప్రేమగా నిమిరింది అమ్మ.

తన గొంతు వినిపించిన ప్రతీ సారీ నా మనసు నవ్వుతోంది. పైకి చూసి నల్లనయ్యకోసారి థాంక్స్ చెప్పా. 'అప్పుడే సంబరం? పూలదారిలో ఉండే ముళ్ళు... నువ్వెరగనివా?' అన్నట్లు నర్మగర్భంగా నవ్వాడాయన.

"నేను వచ్చాక తినేసి మనం జాక్సన్ విల్లీ వెళ్లాలి. బయో మెట్రిక్స్ కదా"

ఖంగుమందా గొంతు... నాన్న వస్తే ముందో అనౌన్స్మెంట్ ఉంటుందన్నమాట. అదీ విషయం.

"అలాగే..."

అమ్మ మళ్లీ పాడితే బాగుణ్ణు, నాన్న గొంతు వినపడగానే అమ్మ పాట ఆగిపోయింది. అమ్మ గుండె వేగం తెలుస్తోంది. అప్పటిదాకా హాయిగా ఉన్న అమ్మ దిగులుగా మారిపోయింది. అమ్మ మీద తలవాల్చాను. అమ్మ చెయ్యి ప్రేమగా తగిలింది, 'పర్లేదు కన్నా!' అన్నట్లు.

కాస్సేపు కన్నయ్యతో దెబ్బలాడి, అలిసి నిద్ర పోయాను.

---------------

చాలా రోజులకి నాకు అర్థమైందేమిటంటే – నాన్న ఆఫీస్ కి వెళ్లిపోయాక అమ్మ హాయిగా నాతో మాట్లాడుతుంది, పాటలు పాడుతుంది. చాగంటి వారి రామాయణం పెడుతుంది, సుందరకాండ వింటూ, 'అల్లరి నేర్చుకోకూడదమ్మా బంగారూ!' అంటుంది...

ఇంట్లో నాకు ముగ్గురి మాటలు చాలా ఇష్టం. అమ్మ, పెద్దమ్మ, అన్నయ్య. పెద్దమ్మ ఇక్కడుండదు కానీ రోజూ తన మాటలు వింటున్నాగా. పెద్దమ్మ కూడా "చిన్నతల్లి కోసం అన్నం తిను!" అని అమ్మకి చెబుతుంది రోజూ. అమ్మ దిగులుగా ఉంది అని నాకు కరాఖండిగా తెలిసింది అప్పుడే.

ఓ రోజు రాత్రి అనుకుంటా, నిద్ర మధ్యలో లేచా. నాన్న అరుపులతో ఉలిక్కిపడి. అమ్మ ఏడుస్తోంది. పిల్లాడు లేస్తాడు నెమ్మదిగా మాట్లాడమని, ఆ వీడియోలు ఆపెయ్యమని నాన్నని అడుగుతోంది.. నాన్న అరుపులు ఎక్కువయ్యాయి. అమ్మ లేచి వెళ్ళి లాప్ టాప్ బయట పడేసి వచ్చింది. అమ్మ జుట్టు పట్టుకుని బయటికి ఈడ్చుకు వెళ్ళాడు నాన్న. నాకు ఏడుపు వచ్చింది. నా ఏడుపు ఎవరూ పట్టించుకోవట్లేదని ఇంకా చాలా ఏడుపు వచ్చింది.

అమ్మని గట్టిగా కరుచుకుని అలా ఉండిపోయా చాలాసేపు. గుండెచప్పుడు వినిపించేంత దగ్గర ఉండటం వరమో శాపమో తెలియలేదు. ఎన్ని సార్లు లవ్యూ చెప్పానో ముద్దులు పెట్టానో లెక్కే లేదు. అమ్మ మాత్రం ఎడం చేత్తో నన్ను ప్రేమగా నిమురుతూ అలా ఉండిపోయింది రాత్రంతా.

మరునాడు ఉదయమే నాన్న ఆఫీస్ కి వెళుతూ అమ్మ అంతు చూస్తానని హుకుం జారీ చేసాడు.

తర్వాత అమ్మ పెద్దమ్మ తో మాట్లాడుతుంటే తెలిసింది – డబ్బుల కోసం వేధిస్తున్నాడని, అమ్మ జీతం అతగాడి ఎకౌంట్ లో పడాల్సిందే అని పట్టు పడుతున్నాడనీనూ.

బెంగగా అమ్మని పట్టుకున్నాను, వెనక నుంచి పాట వినిపిస్తోంది

"జాలిగా జాబిలమ్మ రేయి రేయంతా రెప్ప వేయనే లేదు ఎందుచేత?"

అమ్మ గొంతు లాగే కమ్మగా ఉందా గొంతు.

నాకు చాలా కోపం వచ్చేసింది, అమ్మ నా పాదాలని సుతారంగా పట్టుకుని – 'నా జాబిలమ్మ నాతోనే ఉందిగా నాకేం బెంగ చిన్నతల్లీ, బోలెడంత వెన్నెల కదా.. హాయిగా బజ్జో' అంది.

బెంగగానే అమ్మని కరుచుకుని కళ్లు మూసుకున్నాను.

నాన్న అమ్మని తిట్టిన ప్రతిసారీ నాకు కోపం రావడం, అమ్మ ఊరుకోబెట్టడం, అన్నయ్య కూడా భయపడటం, అమ్మ రెండు చేతులతోనూ మమ్మల్నిద్దరినీ దగ్గరికి తీసుకోవడం, నేను ఆ నల్లనయ్యతో గొడవేసుకోవడం అలవాటయిపోయింది.

ఓ రోజు పొద్దున్నే అమ్మ చెప్పింది అన్నయ్యని స్కూల్ పంపిస్తూ, "ఇవాళ ఇంటర్వ్యూ కి వెళ్తున్నాను నాన్నా, తొందర్లోనే జాబ్ లో జాయిన్ అవుతాను, అప్పుడు అంతా బాగుంటుందిరా..."

వినగానే ఎగిరి గంతేసాను...

"అమ్మా.. నేనూ వస్తాను. నన్ను తీసుకెళ్ళవా...." అంటూ అమ్మ ఎడమ చేత్తో ప్రేమగా నిమిరి

"అల్లరి చేయకూడదు బంగారు, జాబ్ వస్తే అమ్మకి బాగుంటుంది " అంది.

"అలాగే అమ్మా, అస్సలుఅల్లరి చెయ్యను"

నా మాట అమ్మ విందో లేదో తెలియదు. త్వర త్వరగా రెడీ అయ్యి, 'ఆపదామప హర్తారం ...." చదువుకుంటుంటే నేను నల్లనయ్య వైపు చూసి, 'వింటున్నావా?' అన్నాను. నవ్వాడాయన.

ఆ రోజంతా అమ్మని అల్లరి పెట్టకుండా ఉండాలని బుద్ధిగా ఉన్నాను. సాయంత్రం ఇంటికి వచ్చాక నాన్న ఎదురు వచ్చాడు.

"ఎలా అయ్యిందేం ఇంటర్వ్యూ?" గద్దించాడు.

"బాగా జరిగింది. ఆఫర్ ఇచ్చారు, రెండు వారాల్లో చేరమన్నారు"

"ఎవరేం దేశీయా... తెల్లవాడా?"

"అమెరికన్..."

"బాగున్నాడా?"

"ఆహా!"

"కిలకిలమంటూ నవ్వుతూ వగలొలకబోసి ఉంటావ్, అందుకే ఆఫర్ ఇచ్చాడు..."

అమ్మ గుండె వేగం పెరగడం తెలుస్తూనే ఉంది.

నాన్న మాటలు అర్థం కావట్లేదు కానీ అమ్మని బాధ పెడుతున్నాడని మాత్రం అర్థం అయింది.

"పెద్దవాడు, ఆఫ్రికన్ అమెరికన్. చాలా చక్కగా మాట్లాడాడు. సంస్కారవంతంగా..." అమ్మ త్వరత్వరగా అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

రెండు వారాల్లో అమ్మ ఉద్యోగంలో చేరడం, అమ్మ మొదటి జీతం రాగానే నాన్న తన ఉద్యోగం పోయిందని చెప్పడం, నాన్నకి పారాథైరాయిడ్ అనీ, కాల్షియం రక్తంలో చాలా ఎక్కువైందనీ, ఆరోగ్యం చూసుకోకపోతే ప్రాణానికే ప్రమాదమని డాక్టర్లన్నారనీ ఇక బయటికి వెళ్ళేది లేదని నాన్న పూర్తిగా ఇంట్లోనే ఉండటం – ఇవన్నీ త్వరత్వరగా జరిగిపోయాయి.

ఆపై నాన్న దాష్టీకానికి అంతూ పొంతూ లేకుండా పోయింది. అమ్మని రోజూ ఏదో కారణంతో తిట్టడం, కొట్టడం తెలుస్తూనే ఉంది. నేను ఏడ్చిన ప్రతీసారీ నల్లనయ్య మాత్రం నవ్వుతూ నాకు ధైర్యం చెబుతూనే ఉన్నాడు.

ఒక రోజు గట్టిగా అన్నాను

"నేను అమ్మని రక్షించాలి"

"సరే, అలాగే"

"నువ్వు నాన్నని శిక్షించాలి"

"అలాగేనమ్మా" సన్నటి నవ్వు ..

నేను నల్లనయ్య తో మాట్లాడుతూ ఉండగా అమ్మ గొంతు వినిపించింది

"అమ్మా, నొప్పి!"

నాన్న చేతి దెబ్బతో ముందుకి తూలి పడ్డ అమ్మ ఇక లేవలేకపోయింది. గట్టిగా అమ్మని కరుచుకున్నాను నేను.

అమ్మని హాస్పిటల్ కి తీసుకెళ్ళటం, ఆపరేషన్ థియేటర్ లోకి తీసుకెళ్లటం వరకూ నాన్న ప్రక్కనే ఉన్నాడు, డాక్టర్ తో చెప్పాను, "నాన్న అమ్మని కొట్టాడు, అమ్మ పడిపోయింది!"

ఆ హడావిడిలో డాక్టర్ నా మాట విన్నాడో లేదో, అమ్మ మాత్రం ఎడం చేత్తో నన్ను పట్టుకుని

"నా పాప!" అని పలవరిస్తోంది.

"నీ పాపకేం కాదమ్మా, మీకు ఎలా ఉంది?"

"పెద్దాడు ఎక్కడ, పాపాయి పాపాయి..."

పలవరింతల్లో ఉండగానే అమ్మకి మత్తు ఆవరించింది.

—————————————

చల్లటి గాలి, ఒక్క సారిగా చలి వేసింది. చుట్టూ చూసాను. అమ్మ కనిపించలేదు. చీకటి గది మధ్యలో నీలి రంగు కాంతి. వీపుమీద ఎవరిదో చెయ్యి గట్టిగా తగిలింది. కెవ్వుమని అరిచాను. అమ్మ వచ్చి హత్తుకుంటుంది అని ఆశ.

"నాకివ్వండి!"

నాన్న గొంతు. భయమేసింది. ఇంకా గట్టిగా ఏడ్చాను. అమ్మేదీ? ఇందాకటి దాకా విన్న ఆ గొంతెక్కడా వినపడదే?

నాన్న నన్ను పట్టుకుని ఉండగా నల్లనయ్య గొంతు వినిపించింది.

"మామ్ ఈజ్ అవేక్" అని.

అంతలో నాన్న చేతిలోనుంచి నేను జారిపోతున్నాను. నల్లనయ్య పరుగున వచ్చి నన్ను పట్టుకున్నాడు. "స్ట్రెచర్.. అప్పియర్స్ లైక్ స్ట్రోక్"

ఇంకో నలుగురు వచ్చి నాన్నని తీసుకుని వెళ్ళిపోయారు.

నన్ను అమ్మ గుండెలమీదకి అందించిందా గొంతు. నల్లనయ్య గొంతు తెలుసును కనుక గుర్తు పట్టాను కానీ రూపు మాత్రం గుర్తు పట్టేలా లేదు. వేణువు నెమలిపింఛం లేవు. నీలి రంగు దుస్తులు వేసుకుని కళ్ళజోడు పెట్టుకుని ఉన్నాడాయన.

అమ్మ స్పర్శతో ఒక్కసారి తన వైపు చూసాను.

"అబ్బ అమ్మ ఎంత బాగుందో..."

అమ్మ దగ్గరికి వచ్చి నుదుటిపై ముద్దు పెట్టి అందంగా నవ్వింది.

ఎప్పటినుంచో ఎదురుచూసిన ఆ క్షణం, అమ్మ చేతుల్లో వెచ్చగా ఒదిగిన ఆ క్షణం సుందరంగా అనిపించింది.

"థాంక్యూ డాక్టర్, ఫౌండ్ మై జాయ్ ఎగైన్" అంది అమ్మ, అప్పుడే పుట్టిన నన్ను మురిపెంగా చూస్తూ..

"గాడ్ బ్లెస్ యూ!" అంటూ కదిలాడు నల్లనయ్య.

# అన్ ప్రొఫెషనల్ బ్రోకర్

శ్రీధర్ బొల్లేపల్లి

"ఈ పని నీ వల్ల అయ్యి తీరుతుందని అనుకోవట్లేదు. నువ్వు చెపితే తను వింటుందనీ కాదు. కానీ, నాకు వేరే ఆప్షన్ లేదు. కొత్తవాళ్లకెవరికీ చెప్పుకోలేను. మా యిద్దరికీ కామన్ ఫ్రెండ్స్ అయినవాళ్లతో మాట్లాడ్డానికి కూడా తను యిష్టపడడం లేదు. ఒక ప్రయత్నం చేసి చూస్తే నష్టమేముంది" అన్నాడు సుధీర్.

అతని బాధ నాకు అర్థం అవుతోంది. కానీ, యిది నా వల్ల అయ్యే పని కాదని నాకు తెలుసు. ప్రవాహంలో కొట్టుకు పోయేవాడు గడ్డిపోచని చూసి ఆశ పడినట్టు సుధీర్ కి నేనేదో చేయగలనన్న ఆశ వున్నట్టుంది. ఇంతకి మించి పోయేదేముందిలే అన్న నిర్లిప్తత అయినా కావొచ్చు.

"సరే నా ప్రయత్నం నేను చేస్తాను. కానీ, యిది వర్కవుట్ అవుధ్దని ఆశలేం పెట్టుకోబాకు" అన్నాను. తెలుసన్నట్టు తలాడించాడు.

*****

సుధీర్, నవ్యల పెళ్లయ్యి పన్నెండేళ్లవుతోంది. ఇద్దరిదీ వొకటే కులం. ఫార్మసీ కాలేజీలో చదివే రోజుల్లో తన క్లాస్ మేట్ అయిన నవ్యని ప్రేమించి, కట్నం లేకుండా పెళ్లి చేసుకున్నాడు సుధీర్. పేరెంట్స్ ని వదిలిపెట్టి రాననీ, అంత యిష్టమైతే అతనే యిల్లరికం రావాలనీ కండిషన్ పెట్టింది ఆమె. దానికి కూడా సిద్ధపడ్డాడు అతను. సొంతూళ్లో ఆస్తులన్నీ అమ్మేసుకొని ఆమె దగ్గరకి వెళ్లిపోయాడు. సొంతం యిల్లరికం అనడానికి కూడా లేదు. అదే వీధిలో వేరే యింట్లో వుంటారు నవ్య పేరెంట్స్. ప్రతి రోజూ హాస్పిటల్లో పని అవగానే అమ్మానాననలతో కాసేపు స్పెండ్ చేసి, యింటికొస్తుంది నవ్య. సుధీర్ రావడానికి ఎలాగూ లేటవుతుంది కాబట్టీ యీ అరేంజ్‌మెంట్ అందరికీ సౌకర్యంగానే వుంది. ఇదీ నాకు వాళ్ల గురించి తెలిసింది.

నిన్న సాయంత్రం హాస్పిటల్ కాంటీన్లో టీ తాగుతూ వుండగా సడెన్ గా వోపెన్ అయిపోయాడు సుధీర్. ఈ మధ్య నవ్య ఎవరితోనో చనువుగా వుంటోంది. మాటిమాటికీ కాల్స్ వస్తున్నాయి. లేట్ నైట్ కూడా చాటింగ్ చేస్తూ కనబడుతోంది. గతంలో ఏదైనా అవసరపడి ఫోన్ కావాలని సుధీర్ అడిగితే రెండో ఆలోచన లేకుండా అతని చేతికిచ్చి, దాని గురించి మర్చిపోయేది. ఇప్పుడు అలా కాదు. 'నీ ఫోన్ వుందిగా, నా ఫోన్ లో చార్జింగ్ లేదు, ఆఫీస్ కాల్ ఎక్స్ పెక్ట్ చేస్తున్నాను కాసేపాగు' ఇలా ఏదో వొకటి చెప్పి దాటేస్తుంది. కొత్తగా ఫోన్ కి లాక్ పెట్టుకుంది కూడా. అంత సీక్రెట్స్ ఏముంటాయి? ఉండబట్టలేక వొక నెల క్రితం డైరెక్టుగా అడిగేశాడు సుధీర్. 'ఎప్పుడూ ఎవరితోనో మాట్లాడుతూనే వుంటావ్, ఎవరితో' అని. నవ్య సమాధానం చెప్పలేదు. ఆమె మౌనం అతనిలో కొత్త అనుమానాలు పుట్టించింది. రెండు రోజులాగి మళ్లీ అడిగాడు. "అవును, అతను నా కొలీగ్. జస్ట్ ఫ్రెండ్ అంతే. సరదాగా కబుర్లు చెప్పుకుంటే తప్పేముంది" ఎదురు తిరిగింది నవ్య. ఆమెలో భయం కానీ, గిల్ట్ కానీ లేవు. ఇద్దరికీ వాదన జరిగింది. పది రోజుల బట్టీ మాటల్లేవు. వంట చేసి, యిద్దరికీ బాక్సులు సర్దేసి, తన దారిన తను వెళ్లిపోతోంది. రాత్రి ఎనిమిది, తొమ్మిది అయ్యేవరకూ యింటికి రావడం లేదు.

మూడు రోజుల క్రితం యిద్దరికీ పెద్ద గొడవ జరిగింది. "అవును, అతనంటే నాకిష్టం. అతను లేకుండా నేను వుండలేను. నీకు సంజాయిషీ చెప్పాల్సిన అవసరం నాకు లేదు. భరించలేకపోతే నీ దారి నువ్వు చూసుకో" కుండ బద్దలు కొట్టేసింది నవ్య. ఆమె అలా అడ్డం తిరుగుతుందని వూహించని సుధీర్ ముందు షాకయ్యాడు. తీరిగ్గా ఆలోచించిన మీదట తెగేదాకా లాక్కపోవడమే మంచిదనే నిర్ణయానికి వచ్చాడు. ఇదీ సంగతి. ఇప్పుడు నేను నవ్యతో మాట్లాడాలి. పెళ్లయిన ఏడాదికే విడాకులు తీసుకున్న నేను.. పదేళ్లు అన్యోన్యంగా కాపురం చేసిన మొగుడూ పెళ్లాల గొడవకి మధ్యవర్తిని. ఇంగ్లిష్ సినిమాల్లో అయితే కౌన్సిలర్ అనో, నెగోషియేటర్ అనో అంటారేమో. సింపుల్ గా చెప్పాలంటే నేను బ్రోకర్ ని.

*****

నవ్యకి నేను తెలిసి వుండొచ్చు. ఒకసారి ఏదో పని మీద వాళ్లింటికి  వెళ్లాను కూడా. అప్పుడు బయటకి వెళ్లే హడావుడిలో వుంది. కర్టెసీ కోసం రెండు నిముషాలు ఆగి, సారీ చెప్పి వెళ్లిపోయింది. ఇప్పుడు గుర్తు పడుతుందా? ఎలా పరిచయం చేసుకోవాలి?   మా పర్సనల్ విషయాలు నీకెందుకు అని దులిపేస్తే ఏం చేయాలి? రకరకాల భయాలు, సందేహాలతో వెళ్లాను.

“హాయ్ రండి. బాగున్నారా” అని నవ్య నవ్వుతూ పలకరించడంతో సగం బరువు దిగినట్లయ్యింది. ఎందుకు వచ్చానని చెప్పాలి. సుధీర్ వున్నాడా అని అడగాలా వద్దా?

“నాతో మాట్లాడమని సుధీర్ పంపాడా?” మళ్లీ నవ్వుతూ అడిగింది. ఇందాక దిగిపోయిన బరువంతా తిరిగొచ్చి నా గుండెల మీద వాలింది. ఏం చెప్పాలి యిప్పుడు?

“కంగారు పడకండి. ఇప్పటికి ముగ్గురొచ్చారు. మీ టోకెన్ నంబరు నాలుగు” ప్రతి మాటా నవ్వుతూనే చెపుతుందీ అమ్మాయి. దానికన్నా కోప్పడితేనే సుఖంగా వుంటుందేమో. నాకేదో అవమానం జరిగినట్టు ఫీలౌతూ అక్కణ్నించీ పారిపోడానికి ఛాన్సుండేది. ఎటూ కాకుండా యిరుక్కుపోయాను యిప్పుడు.

“పిల్లలు అమ్మవాళ్లింటి దగ్గర వున్నారు. ఒక గంటలో వెళ్లి తెచ్చుకోవాలి.” గంటకన్నా ఎక్కువ సేపు వుండడానికి వీల్లేదని  చెపుతోందా?

“లాస్ట్ మంత్ మీ స్టాఫ్ ‘గెట్ టు గెదర్’ లో మీరు పాడిన పాట విన్నాను. సుధీర్ చూపించాడు. మంచి సింగర్ మీరు. చూడ్డానికి సీరియస్ గా వుండే మీరు లలితగీతాలు పాడతారంటే ఎవరూ నమ్మరు. నాన్నా వాళ్లకి కూడా చూపించాను. మా యింట్లో మీ పేరు మిస్టర్ లలిత్” కిలకిలా నవ్వేసింది.

“మీరేమీ మాట్లాడ్డం లేదు?  టీ తెస్తానాగండి. జస్ట్ ఫైవ్ మినిట్స్” లోపలికెళ్లింది. నేను గౌరవంగా అక్కణ్నించీ బయట పడడానికి మిగిలిన చివరి అవకాశం అది. సుధీర్ కి ఏదో వొకటి చెప్పొచ్చు. కానీ, అలా చెప్పాపెట్టకుండా వెళ్లిపోతే నవ్య ఏమైనా అనుకుంటుందేమో? నేను ఏ నిర్ణయం తీసుకోకముందే టీ కప్పు నా చేతుల్లో కొచ్చింది.

రెండు సిప్పులయ్యాక, “చెప్పండి” అంది. నవ్వకుండా ఆ అమ్మాయి మాట్లాడిన మొదటి మాట అది. ఏం చెప్పను?

“మీ యిద్దరికీ ఏవో డిఫరెన్సెస్ వుండుండొచ్చు. కానీ, డివోర్స్ దాకా తీసుకుపోవడం మంచిది కాదేమో” అన్నాను. నా మాటలు నాకే ఎబ్బెట్టుగా అనిపించాయి. కిచెన్ లోకి వెళ్లి టీ కప్పుతో వచ్చినంత తేలిగ్గా.. ఆమె మొహం మీదకి మళ్లీ నవ్వు తిరిగొచ్చింది. ఈ సారి ఎందుకు నవ్వుతోంది? నా విడాకుల వ్యవహారం కూడా తనకి తెలిసే వుంటుందిగా. అందుకేనా?

“సారీ యిలా అంటున్నందుకు. మీరు డివోర్స్ అని సుధీర్ చెప్పాడు. అదంత తేలికైన డెసిషన్ కాదని మీకు తెలిసే వుంటుంది.” ఆ మాట వింటూనే నా పై ప్రాణాలు పైనే పోయినయ్. ఇక వొక్క క్ష□ ం యిక్కడున్నా నా మర్యాద దక్కదు.

“మీరేదో మంచి వుద్దేశంతో యింటికొస్తే, మీ పర్సనల్ విషయాల గురించి ప్రస్తావించడం మర్యాద కాదని నాకు తెలుసు.” ఇంకెక్కడి మర్యాద. నేను వాళ్ల పర్సనల్ విషయాల్లో తల దూర్చడానికేగా వచ్చింది.

“మాది లవ్ మారేజ్. అమ్మావాళ్లకి నేనొక్కదాన్నే. సుధీరంటే ఎంత యిష్టం వున్నా, యీ వూరొదిలి పోవడం నాకిష్టం లేదు. సుధీరే నాకోసం యిక్కడికి వచ్చేశాడు. ఇరవయ్యెకరాల మామిడితోట. యాభై లక్షలకి అమ్మేశాడు. అదంతా రియల్ ఎస్టేట్ లో పెడతానన్నాడు. ఆ నిర్ణయం మా నాన్నకి నచ్చలేదు. అంత పెద్ద మొత్తం వొకే చోట యిన్వెస్ట్ చేయడం కరెక్ట్ కాదని మొత్తుకున్నాడు. సుధీర్ వినలేదు. ఆరు నెలలు తిరిగేసరికి ఫ్రెండ్స్ మోసం చేశారనీ, డబ్బులు మొత్తం పోయాయనీ చెప్పాడు. ఆ ఫ్రెండ్స్ ఎవరు, భూములు ఎక్కడ కొన్నారు, ఎవరి దగ్గర కొన్నారు అనేది యీ రోజుకీ తెలియదు నాకు. పోయిన డబ్బులన్నీ రాబడతానని కొన్నాళ్లు, సెటిల్‌మెంట్ జరుగుతుందని కొన్నాళ్లు తిరిగాడు. సంపాదన లేదు. అప్పటికే పెద్దది పుట్టింది. ఇల్లు జరుపుకు రావడం కన్నా, సుధీర్ ఖర్చులకి కావాల్సిన డబ్బులు సమకూర్చడం పెద్ద హెడేక్ అయిపోయింది నాకు. ఒక్క పైసా

కూడా వెనక్కి రాలేదు. తను జాబ్ చూసుకునేసరికి నా వొంటి మీద గ్రాము బంగారం కూడా మిగల్లేదు." ఇందాకటి వరకూ నేను చూసిన నవ్య, యిప్పుడు మాట్లాడుతున్న నవ్య వొకరేనా?

"ఈ పదేళ్లలో పది వుద్యోగాలు మారాడు. కాసేపు బిజినెస్ అంటాడు. కాసేపు మార్కెటింగ్ అంటాడు. పోనీ తనకి నచ్చిన పనైనా చేస్తాడా అంటే అదీ లేదు. జాబ్ కి సెలవు పెట్టి మరీ రాత్రీపగలూ ఆలోచించి, వందమందితో డిస్కస్ చేసి, రెండు నెలలయ్యాక అది పనికిరాదని తేల్చేస్తాడు. ఇంట్లో యిద్దరు ఆడపిల్లలు. వాళ్ల చదువు, ఆరోగ్యం, బట్టలు, తిండి, ఆటలు ఎందులోనూ సీరియస్ గా యిన్‌వాల్వ్ అవ్వడు. ఎప్పటికప్పుడు ఏదో వొకటి తగిలించుకొని అందులో మునిగిపోతాడు. ఇంటి పని, ఆఫీస్ పని వొక్కదాన్నే చూసుకోవాల్సి రావడం గురించి కూడా నేనెప్పుడూ కంప్లెయిన్ చేయలేదు. కానీ, అయిందానికీ కానిదానికీ మా అమ్మావాళ్లతో గొడవ పెట్టుకుంటాడు. వాళ్లు అపశకునం పలకబట్టే రియల్ ఎస్టేట్ లో డబ్బులు పోయాయంటాడు. తను బాగుండడం చూసి వోర్వలేని వాళ్లు ఎవరో తనమీద ఏదో ప్రయోగం చేశారంటాడు. వాటికి విరుగుడు చేస్తే కానీ పైకి రాలేం అంటాడు. అసలు వొకళ్లు చూసి ఏడవాల్సినంత బాగా మేము వుండి ఏడ్చిందెప్పుడు? నేను పడే కష్టం మా వాళ్లకి తెలియకుండా వుండాలని వేరే వూరు వెళ్లిపోదామని చాలాసార్లు అడిగాను సుధీర్ ని. కానీ, అతను వొప్పుకోలేదు. నా పేరెంట్స్ అందుబాటులో వుండడం వల్ల ఎంత లాభమో అతనికి బాగా తెలుసు. దాన్ని వదులుకోడానికి అతను సిద్ధంగా లేడు. నా గురించి అమ్మానాన్నా మనాది పడాల్సిరావడమే యిప్పుడు నాకున్న పెద్ద సమస్య."

ఇవే విషయాలు సుధీర్ ద్వారా విని వుంటే నామీద ఎలాంటి యింపాక్ట్ వుండి వుండేది? ఇప్పుడు నవ్య పడుతున్న బాధ ఎంత రీజనబుల్ గా అనిపిస్తోందో అతని మాటలూ అలాగే అనిపించి వుండేవా?

"సుధీర్ మంచివాడు కాదని నేను అనడం లేదు. తాగుడు, పేకాట లాంటి అలవాట్లు లేవు. నాకు తెలిసి వేరే ఏ అమ్మాయినీ కన్నెత్తి చూడడు. నేను వొప్పుకుంటాను. కానీ హ్యాపీగా వున్నాం అని మనల్ని మనం నమ్మించుకోడానికి అది సరిపోతుందా? ఏ

చుట్టాలింట్లో ఫంకషన్ జరిగినా వెళలడానికి యిషటపడడు. 'మన పరిస్థితి బాగోలేదని అందరూ మనల్ని చూసి నవ్వుకుంటారు, వెళ్లొద్దు' అంటాడు. పోనీ నలుగురం కలిసి, ఫంక్షన్లకి కాకుండా యింకెక్కడైనా వెళదామంటే దానికీ వొప్పుకోడు. త్వరలో తాను చేయబోయే పనికి యీ విందులూ, వినోదాలూ, తిరుగుళ్లు అడ్డం వస్తాయంటాడు. ఆ 'త్వరలో' అనే టైమ్ ఎప్పటికి వస్తుందో దేవుడికే తెలియాలి. అసలిదంతా కూడా కాదు.." ఏం చెప్పివుండేదో కానీ గేటు చప్పుడవడంతో సడెన్‌గా ఆపేసింది.

నవ్య వాళ్ల నాన్న అనుకుంటా. పిల్లల్ని తీసుకోని వచ్చాడు. "అయ్యో, నేనే వచ్చేదాన్నిగా నాన్నా" అంటూ లేచి నిలబడింది. పిల్లలిద్దరూ పరిగెత్తుకుంటూ వచ్చి చెరో చంకా ఎక్కారు. ఇద్దరికీ చెరో ముద్దు పెట్టి, కిందకి దింపి లోపల్నించీ యింకో కుర్చీ తెచ్చింది.

"ఈయన సుధీర్ వాళ్ల ఫ్రెండు. మా నాన్నగారు" పరిచయం చేసింది. "మిమ్మల్ని ఎక్కడో చూశాను బాబూ" అన్నాడాయన ఆలోచనలో పడుతూ.

"మిస్టర్ లలిత్ గారు నాన్నా" అంది నవ్య.

"ఓ అవునవును. మా అల్లుడిగారి ఆఫీసు ఫంక్షన్లో పాట పాడింది మీరే కదా. భలే పాడారు. నాకు చాలా యిష్టమైన పాట అది" అన్నాడు నవ్య వాళ్ల నాన్న. చెప్పానా అన్నట్టు నా వైపు చూసి కళ్లెగరేసింది.

"మమ్మీ నాకు డాడీ కావాలి. డాడీ కావాలి" పాటలాగా అరుస్తోంది పెద్ద పిల్ల. చిన్నది కూడా శృతి కలిపింది.

"డాడీ బిజినెస్ పని మీద వూరెళ్లారని చెప్పానా? నీకు పెద్ద పెద్ద బొమ్మలు తేవాలా వొద్దా?" బుజ్జగిస్తూ చెప్పింది శృతి.

"అబద్ధం. డాడీ ఎప్పుడూ బొమ్మలు తేడు" కోపంగా చెప్పింది పెద్దది.

"ఏం కాదు. బోలెడు బొమ్మలు తెచ్చి, నీకివ్వమని నాకిచ్చాడు. నీ బర్త్ డేకి సర్‌ప్రైజ్ చేద్దామని నేనే నా ఆఫీసులో దాచిపెట్టాను. రేపు తీసుకొస్తాలే. బర్త్ డే కి మళ్లీ

తెమ్మని చెబుదాం డాడీతో." చిన్నది మురిసిపోయిందిలే కానీ, పెద్దది అంతగా కన్విన్స్ అయినట్టు కనిపించలేదు.

"మీరు మాట్లాడుతూ వుండండి. నేను పిల్లలతో హోమ్ వర్క్ చేయిస్తా వుంటా" లోపలికెళుతూ చెప్పాడు పెద్దాయన. ఆ తర్వాత రెండు నిముషాలు మౌనంగా వుండిపోయింది నవ్య. బహుశా అప్పటికే ఎక్కువ మాట్లాడేశానని రిగ్రెట్ అవుతూ వుందేమో.

"ఇప్పటివరకూ యీ డిస్టర్బెన్స్ పిల్లల దృష్టికి రాకుండా మేనేజ్ చేయగలిగాను. మీరే చూశారుగా. పెద్దదానికి యిప్పుడిప్పుడే విషయాలు అర్థం అవుతున్నాయి. అది వాళ్ల డాడీని శత్రువు లాగా చూసే పరిస్థితి వస్తే నేను తట్టుకోలేను. తను పిల్లల దగ్గర బాడ్ అవకూడదని నేనింత ఆరాటపడుతున్నాను కదా. తన వల్ల నాకు యిబ్బంది కలుగుతూ వుండడానికి అవకాశం వుంది అని యిన్నేళ్లలో వొక్కసారంటే వొక్కసారి కూడా ఎక్నాలెడ్జ్ చేయలేదు సుధీర్." నవ్యకి ఏడుపు తన్నుకొస్తోందని తెలిసిపోతోంది.

ఇలా ఎవరికైనా చెప్పుకునే అవకాశం వస్తే మా ఆవిడ నా గురించి ఏం చెపుతుంది? మా పెళ్లి పెటాకులవడం వెనక నా పాత్ర గురించి తను చెప్పే మాటలు కూడా యింతే కన్విన్సింగ్ గా వుంటాయా?

"సుధీర్ మీకు ఏం చెప్పాడో, మీరు నాతో ఏం చెప్పాలనుకున్నారో నాకు తెలీదు. నేను జనరల్ గా ఎవరి దగ్గరా పర్సనల్ విషయాలు మాట్లాడనని సుధీర్ కి ఐడియా వుంది. మీరు నాకేదో నచ్చజెపుతారని అతను అనుకోని వుండడు. తను నాకు దగ్గరవ్వాలని చూస్తుంటే, నేను తెంచుకోని పోతున్నాఅని మిమ్మల్ని నమ్మించాలని అనుకోని వుండొచ్చు. నాకు వేరే ఎవరితోనో సంబంధం వుందని..." ఆమె మాట పూర్తి చేయకముందే నేను లేచి నిలబడ్డాను.

"సారీ నాక్కొంచెం పనుంది. వీలు చూసుకొని యింకోసారి వస్తాను. ఏమీ అనుకోవద్దు." ఆమె రెస్పాన్స్ కోసం వెయిట్ చేయకుండా, వెనక్కి తిరిగి నడవడం మొదలెట్టాను నేను. నవ్యకి వేరే అతనితో సంబంధం వుందా లేదా అన్నది తెలుసుకోవాలని

నాకు అనిపించలేదు. ఒకవేళ వున్నమాటే నిజం అయితే.. అది ఎంతవరకూ జస్టిఫైడ్ అన్నది తేల్చే అర్హత నాకు లేదని మాత్రం తెలుస్తోంది. అసలు ఆ అమ్మాయి తన భర్త గురించి మాట్లాడుతుంటే నాకెందుకు వూపిరి సలపనంత యిబ్బందిగా వుంది? సుధీర్ నా ఫ్రెండు కాబట్టేనా? ఆ అమ్మాయి చెపుతోంది అసలు సుధీర్ గురించేనా? నా మీద నవ్యకి కాస్త పాజిటివ్ యింప్రెషన్ వుందని తెలియగానే నేను పార్టీ మార్చేశానా? ఏ ప్రశ్నకీ సమాధానం దొరకడం లేదు.

"థేంక్యూ మిస్టర్ లలిత్" వెనకనుంచీ నవ్య చిన్నగా అనడం వినిపించింది. దేనికి థేంక్స్ చెప్పింది? నేను వచ్చినందుకా? మళ్లీ వచ్చే వుద్దేశం నాకు లేదని తెలిసినందుకా? ఇంకో ప్రశ్న వచ్చిచేరింది నా ప్రాణానికి. ఇంకోసారి ఎప్పుడూ, ఏ విషయంలోనూ మధ్యవర్తిగా వుండకూడదు. అయామ్ ఏన్ అన్‌ప్రొఫెషనల్ బ్రోకర్.

## కూత్తరసన్ డా.రాయపెద్ది వివేకానంద్

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో బహుమతి పొందిన కథ

జలప్రళయం అంటే ఇదే అన్నట్టు ఉంది వాతావరణం. వర్షం ఎడతెరిపిలేకుండా కురుస్తోంది.

వంట మనిషి తెచ్చి ఇచ్చిన వేడి వేడి టీ త్రాగుతూ కిటికీ అద్దాలలోంచి చూస్తూ ఉంది నీహారిక. ఇలాంటి వర్షాన్ని ఎప్పుడు చూసినా అసంకల్పితంగా ఆమెకి వళ్ళు జలదరిస్తుంది. అప్రయత్నంగానే కూత్తరసన్ గుర్తు వస్తాడు. సమయానికి

దేవుడి లాగా వచ్చి అతను కాపాడకుంటే తను ఈ పాటికి ఇలా ప్రాణాలతో ఉండగలిగేదా? ఆ ఊహకే ఆమె భయకంపితురాలైంది.

తెల్లవారి ఆరు అయినా ఇంకా చీకటి తెరలు వీడలేదు.

మాదాపూర్ లో వెలసిన అయిదు నక్షత్రాల లగ్జరీ అపార్ట్మెంట్ పంతొమ్మిదో అంతస్తులో తన బెడ్ రూంలో వెచ్చగా కూర్చొని, కిటికి అద్దాలలోంచి బయట సాగుతున్న ప్రకృతి విలయాన్ని చూస్తోంది ఆమె.

కిటికి అద్దాలు భళ్ళున విరిగి పోతాయేమో అన్నంత వేగంగా ఉండుండి వర్షం జల్లు వచ్చి అద్దాలని తాకుతోంది. తుఫాను గాలి హోరున వీస్తోంది. దూరంగా కనిపిస్తున్న కొబ్బరి చెట్లు విరిగిపడిపోయాయేమో అన్నంతగా ఊగిపోతున్నాయి.

టీవి లో రాత్రే అత్యవసర ప్రకటన జారి చేసి అన్ని ప్రభుత్వ ప్రయివేటు కార్యాలయాలకి సెలవు ప్రకటించింది ప్రభుత్వం. అత్యవసరమైతే తప్ప ఎవ్వరూ బయటికి వెళ్ళకపోతెనే మంచిది అని కూడా జోడించారు ప్రకటనలో. రహదారులన్నీ జలమయమయ్యాయని, పెద్ద పెద్ద చెట్లు కూకటి వేళ్ళతో సహా కూలిపోయాయని టీవి లో వార్తలు నిరంతరం వస్తూ ఉన్నాయి.

రాజీవ్ ఇంకా నిద్రలేయలేదు. బద్దకంగా దుప్పట్లో వెచ్చగా పడుకుని ఉన్నాడు.

"ఈ వేళ జరగాల్సిన ఇంటర్వ్యూలు రద్దు చేయమని హెచ్ ఆర్ మేనేజర్ గారికి ఫోన్ చేసి చెప్పు" దుప్పట్లోంచే బద్దకంగా చెప్పాడు రాజీవ్.

టీ త్రాగటం ముగించి లాప్ టాప్ ముందర కూర్చుంది నీహారిక.

ఆమె ఆలోచనలు గతంలోకి దారి తీశాయి.

★★★★

"రాజీవ్! అతి కష్టం మీద సిగ్నల్స్ దొరుకుతున్నయి, వినిపిస్తోందా నా వాయిస్? ప్రాణాలతో హైదరాబాద్ కి తిరిగి వస్తానని నాకైతే అనిపించడం లేదురా. ఇక్కడ ఘోరమైన వర్షం. ....... హలో రాజీవ్ .... వినిపిస్తోందా..... హలో హలో..." మళ్ళీ సిగ్నల్స్ అందటం లేదు నీహారిక కి.

విమానాశ్రయానికి బయల్దేరే ముందు ఆమెకి చూచాయగా కూడా తెలియదు,కొన్ని నిమిషాల తర్వాత తాను ఎదుర్కోబోయే విపత్కర పరిస్థితుల గూర్చి. ఆమె ఏ మాత్రం ఊహించినా ఇలా బయల్దేరి ఉండేది కాదేమో.

నీహారిక, ఆమె భర్త హైదరాబాద్ కేంద్రంగా ఒక అంకుర సంస్థని స్థాపించి ఇప్పుడు విజయవంతంగా లాభాల బాట పట్టించారు. నిర్వాహణా సౌలభ్యం కోసం చెన్నయి, ముంబాయి, న్యూఢిల్లీ, కలకత్తా లో తమ బ్రాంచీలు ఏర్పాటు చేశారు. తమ సంస్థ తాలూకు అయిదవ వార్షికోత్సవం సందర్భంగా తాము ప్రారంభించబోయే కొత్త ఉత్పత్తుల గూర్చి

వాటి తాలూకూ లాంచ్ ప్లాన్స్ గూర్చి పశ్చిమ భారతదేశానికి చెందిన ఉన్నత స్థాయి మేనేజర్లతో చర్చించటానికి ముంబాయి లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఆమె వచ్చింది.

అక్కడ ఖరీదైన హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశం ముగించి అప్పుడే బయటకు వచ్చింది. ఆమె బస కూడా అదే హోటల్లో ఏర్పాటయింది.

ఇక మిగిలింది దక్షిణ భారతదేశనికి చెందిన మేనేజర్ల సమావేశం చెన్నయ్ లో.

హైదరాబాద్ లో ఓ రెండు రోజుల బస తర్వాత చెన్నయి ప్రయాణం ఉంది ఆమెకి.

కలకత్తా, న్యూఢిల్లీ సమావేశాలు రాజీవ్ చూసుకునేలాగా ప్లాన్ చేసుకున్నారు ఆ దంపతులు. అలా కంపెనీ పనులని మొదటి నుంచి కూడా ఇద్దరూ ఆడుతూ పాడుతూ చేసుకుంటు వస్తున్నారు.

ఆమె గది ఖాళీ చేద్దామని బిల్ సెటిల్ చేయమని చెప్పినపుడు హోటల్ మేనేజర్ వినయంగా చెప్పాడు "మేడం మీ ప్రయాణం రద్దు చేసుకుంటే మంచిది. అనుకోకుండా దిశను మార్చుకుని ముంబాయి తీరాన్ని తాకబోతోంది తుఫాను. ఇది ఒక రకంగా ఫ్లాష్ సైక్లోన్. ఎక్కడో కర్ణాటకలోనో, గోవా లోనో తీరం తాకుతుంది అని పేర్కొన్నారు మేటిరియాలాజికల్ డిపార్ట్మెంట్ వారు ఇవ్వాళ్టి మధ్యాహ్నం వరకు.

కానీ వాయుగుండం తీవ్రం నుంచి అతి తీవ్రంగా మారటం ఒక ఎత్తైతే, అది దిశను మార్చుకుని ఊహించని వేగంతో ముంబాయి తీరాన్ని తాకే విధంగా దూసుకువస్తోంది. అసలే అరేబియా సముద్రంలో తుఫాన్లు అరుదు. అందులో ఇది ఊహించని విధంగా దిశను మార్చుకుంది."

నీహారిక అతని మాటలు విని ఉంటే బాగుండేది. కానీ ఒక్కోసారి మన ప్రమేయం లేకుండనే కొన్నినిర్ణయాలు తీసేసుకుంటాము.

ఆ సాయంత్రం అదే జరిగింది. నీహారిక స్థిరంగా చెప్పింది.

"లేదు నేను గది ఖాళీ చేస్తాను. ఇంకెంత ఒక అరగంటలో కాబ్ రానే వస్తుంది. అన్నీ ముందుగానే నిర్ణయం అయిపోయాయి. నా ఫ్లైట్ రాత్రి పదకొండు గంటలకు ముంబాయి వదుల్తుంది. నేను నా నిర్ణయాన్ని మార్చుకోదలచుకోలేదు" ఆమె కంఠంలోని స్థిరత్వానికి వెరచి ఇక అతను అడ్డు చెప్పదలచుకోలేదు.

అతను మెల్లిగా ఇలా చెప్పాడు "అయాం సారి మేడం. కాబ్ సర్వీసులు అన్నీ రద్దయ్యాయి. రోడ్లమీద వరద నీరు మోకాలి పైగా పారుతున్నాయి, కొన్ని కొన్ని ప్రాంతాలలో ఎవ్వరూ ఊహించని ఎత్తులో వరద నీరు పారుతోంది"

విస్మయంగా చూస్తూ అతని మాటల్ని వింటొంది నీహారిక. తను ప్రయాణం వాయిదా వేసుకుంటే మంచిదేమో అన్న ఊహ కలిగింది ఆమెకి ఒక క్షణం.

అతను కూడా తన మాటల్ని అక్కడితో ఆపేసి ఉంటే ఏమయ్యేదో, కానీ తిరిగి చెప్పటం ప్రారంభించాడు "ఎయిర్ పోర్టు కు వెళ్ళే ఏసీ వోల్వో బస్సులు నడుస్తున్నాయట మేడం. ఇంకా విమాన సర్వీసులు రద్దు కాలేదు. నేను అన్నీ చెక్ చేసుకున్నాక మీతో మాట్లాడుతున్నాను. మీరు ఎలా నిర్ణయం తీసుకున్నా సరే"

కంపెనీ డైరెక్టర్ హోదాలో ఆమె చకచకా నిర్ణయాలు తీసేసుకుంది. "అయితే నేను బయలుదేరుతాను. మీ హోటల్ కార్లో నన్ను నియరెస్ట్ బస్టాప్ వద్దకు వదిలిపెట్టండి. నేను వొల్వో బస్ పట్టుకుని ఎయిర్ పోర్టుకు వెళ్ళిపోతాను"

అతను మౌనంగా తల పంకించి ఆమె ఆజ్ఞలని శిరసావహించాడు.

ఆమె సీఈఓ అయినా, డైరెక్టర్ అయినా కంపెనీ వరకే అది పరిమితం కానీ ప్రకృతి ముందు అందరూ సమానమే కద.

ఇంకాసేపట్లో తాను ఎదుర్కోబోయే నరకం గూర్చి ఆమెకి ఏమాత్రం తెల్సినా హోటల్ దాటి బయటకు వెళ్ళేది కాదేమో.

★★★★

అమెని దిగబెట్టి హోటల్ తాలూకు కారు వెళ్ళిపోయింది.

గాలి హోరున వీస్తోంది. కుండ పోతగా కురుస్తున్న వర్షం నుంచి సాధారణమైన ఆ బస్ షెల్టర్ ఏ మాత్రం కాపాడలేకపోతోంది. హోరున వీస్తున్న చలి గాలికి, ఏటవాలుగా వచ్చి గుచ్చుకుంటున్నాయి వాన చినుకులు. చలి వణికిస్తోంది.

డబ డబ మని రేకులు కొట్టుకుంటున్న శబ్దం కర్ణ కఠోరంగా వినిపించి భయపెడుతోంది.

గూ......గూ మని హోరు గాలి ఊహించనంతటి వేగంతో ఆ బస్ షెల్టర్ని లేపేస్తుందా అన్నట్టు వీస్తూ ఉంది.

అప్పటికే చీకటి తెరలు అలుముకుంటున్నాయి . బస్ షెల్టర్ లో కూడా ఎవ్వరూ లేరు. ఎయిర్ పోర్టుకు వెళ్ళే బస్సుల తాలూకు షెల్టర్ లో విధిగా ఉండాల్సిన కంట్రోలర్ కూడా కనపడటం లేదు. ఏదో కంపెని తాలుకు నియాన్ లైట్ల హోర్డింగ్ నిస్తేజంగా వెలిగి ఆరుతోంది.

సాధారణంగా రద్దీగా ఉండే ముంబాయి రహదార్లు దాదాపు నిర్మానుష్యంగా ఉన్నాయి. ఉందుండి ఒకటో అరో వాహనాలు వేగంగా దూసుకుపోతున్నాయి రోడ్డుపై.

ఆమె ఇందాక గమనించలేదు కానీ, మెయిన్ రోడ్డుపై నీరు నిలబడిపోయి క్రమంగా నీటి మట్టం పెరుగుతున్నట్టుగా తోచింది.

తన కంపెనీ సీనియర్ మేనేజర్ ఎయిర్ పోర్టు దాకా వస్తాను మేడం అని ప్రతిపాదించినా సున్నితంగా తిరస్కరించింది ఆ సాయంత్రం.

మేనేజర్లు కంపెనీ పని సక్రమంగా చేస్తే చాలని యాజమాన్యానికి ఇలా సేవలు చేయనక్కరలేదని ఆ దంపతుల అభిప్రాయం. ఆయనని తిరస్కరంచకుండా ఉండాల్సిందేమో అనిపించి, ఆయనకు ఫోన్ చేద్దామని ఫోన్ తీస్తే, సిగ్నల్స్ అస్సలు అందటం లేదు.

ఆమెకి మొదటి సారిగా భయం వేసింది. వెన్నులో ఏదో పాకినట్టయింది.

క్రమంగా రోడ్డు మీద వాహనాల రాకపోకలు పూర్తిగా ఆగిపోయినట్టు అనిపించింది ఆమెకి. విశాలమైన ఆ రోడ్డు మొత్తం నిర్మానుష్యంగా మారిపోయింది. కాలేజీలు, కార్యాలయాలు ఉన్న ఏరియా లాగా ఉంది, షాపింగ్ కాంప్లెక్స్ లు కూడా ఏమీ లేక పోవటం వల్ల నిర్మానుష్యంగా ఉన్న ఆ రోడ్డు భయపెడుతోంది.

హోరున వీస్తున్న తుఫాను గాలీ, బలంగా తాకుతున్న చినుకులు, చలి ఇవే మిగిలాయి ఆమెకి తోడుగా.

చీకటి తెరలు బలంగా ముసురుకున్నాయి.

కొత్తగా నిర్మించిన స్టార్ హోటల్స్ పెద్ద కంపెనీ సమావేశాలకు ఎక్కువ డిస్కౌంట్ ఇవ్వటం మామూలే. ఎయిర్ పోర్టుకి దూరం అయినా సరసమైన ధరలకే వారు ఆఫర్ ఇవ్వటం వల్ల అక్కడ ఏర్పాటు చేసుకోవటం అయింది.

బస్సులు కూడా నడుస్తున్నాయో లేదో అన్న అనుమానం మొదటి సారిగా వచ్చింది ఆమెకి. తిరిగి హోటల్ కెళదాం అంటే కనీసం అంటే పది కిలోమీటర్ల దూరం వచ్చేసింది హోటల్ నుండి. నడిచి వెళ్ళటం కుదిరే పని కాదు. కనుచూపు మేరలో ఏ వాహనం కనిపించటం లేదు. ట్రాలీబాగు, చేతిలో హేండ్ బేగు, లాప్ టాప్ బ్యాగు. ఇది ఆమె మోయాల్సిన లగేజి. నడచి పోవటం ఇంచుమించు అసాధ్యం, పైగా ఆమెకి దారి కూడా తెలియదు.

వాన నీటికి ఆమె చీర, బట్టలు మొత్తం తడిసి వంటికి అంటుకుపోయాయి. ఆమె చాలా అందగత్తె. గులాబీ రంగు శరీర వర్ణం, చక్కటి అవయవ సౌష్టవం, చక్కటి శరీరాకృతితో చూడగానే తలతిప్పుకోలేనంత ఆకర్షణీయంగా ఉంటుంది. ఆమె పరిస్థితి చాలా ఇబ్బంది కరంగా ఉంది. అనుకోని తుఫాను, ఊరికాని ఊరు, రక్షణ ఏ మాత్రం లేని ప్రదేశం. తాను ఒంటరి స్త్రీ కావటం ఇవన్నీ ఆమెని భయపెడుతున్నాయి. ఆమె సహజంగా చాలా ధైర్యవంతురాలు.

నిరాశ తనలో చోటు చేసుకోకుండా ఆమె తనకి తాను ధైర్యంచెప్పుకొంటోంది.

ఇంతలో ఆకాశంలో పెద్ద మెరుపు, ఆ తర్వాత కాసేపటికి చెవులు బద్దలయ్యేలా ఉరుము శబ్దం. ఈ పరిణామం జరిగిన కాసేపటికి ఎక్కడో ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయిన ధ్వని వినిపించింది.

అంతే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

చుట్టు కన్ను పొడుచుకున్నా కానరాని చిమ్మ చీకటి. తుఫాను గాలి హోరు ఎక్కువ అయింది. వాన తీవ్రత కూడా పెరిగింది. తుఫాను గాలికి ఏవేవో వస్తువులు, భవంతుల తాలూకు అద్దాలు, ప్రకటనల హోర్డింగులు ఎగిరి కింద పడ్డ

ధ్వనులు వినిపిస్తున్నాయి.అప్పటి దాకా రోడ్డు మీద పారుతున్న నీటి మట్టం పెరగటం వల్ల, బస్ షెల్టర్ లో ఆమె పాదాల్ని తాకేలాగా వచ్చేశాయి.

రోడ్డు మీద వేగంగా నానా చెత్త కొట్టుకు వస్తోంది. కవర్లు, కాగితాలు, ఎండు కొమ్మలు ఏవేవో గుర్తు తెలియని చెత్త వస్తువులు విపరీతమైన వేగంతో రోడ్డుపై వేగంగా ప్రవహించుకుంటు వెళ్తు, బస్ షెల్టర్ లోకి కూడా దూసుకు వస్తున్నయి.

ఆమె చిగురుటాకులా గజ గజ వణుకుతోంది. చలికి వణుకుతోందా , భయానికి వణుకుతోందా అన్నది నేను స్పష్టంగా చెప్పలేను.

ఇంతలో దూరంగా రోడ్డుపై ఏదో వాహనం తాలూకు దీపాలు కనపడ్డాయి.

బస్సు వస్తోందా అన్న ఆశ కలిగింది ఆమెకి.

లగేజి బస్ షెల్టర్ అల్యూమినియం బెంచ్ మీద అలాగే ఉంచేసి, ఒక్క అంగలో రోడ్డు మీదకి ఉరికింది. అది బస్సే అయితే మొదట దాన్ని ఆపేసి, ఆ తరువాత లగేజీ తీసుకోవచ్చన్నది ఆమె ఆలోచన. ఆమె ఊహించిన దానికన్నా ఎక్కువ వేగంగా పారుతున్నాయి రోడ్డు మీద నీరు. ఆఅ నీటి వేగానికి ఆమెకి బాలెన్స్ తప్పినంత పనయింది.

ఆమెకి ఒక్క సారిగా గుండె ఝుల్లుమంది.

తీరా చూస్తే అది బస్సు కాదు. ఏదో కారు. అయినా ఆమె చేతులు సాచి 'స్టాప్ స్టాప్' అని అడ్డుపడి అరిచింది. ఆమె అలా అరుస్తున్నా వినిపించుకోకుండ వెళ్ళిపోయింది ఆ కారు.

ఆమెకి నిశ్చయంగా అర్థం అయిపోయింది. తాను పెద్ద ప్రమాదంలో పడ్డానని. ఆ రాత్రి క్షేమంగా గడిచిపోతే అది ఒక అద్భుతమే అని అనిపించసాగింది ఆమెకి.

ఆమె ఊహించని విధంగా అప్పుడు జరిగింది ఆ సంఘటన. ఇందాక తాను ఆపమన్నా ఆపకుండా వెళ్ళిపోయిన కారు ఆ నీటి మడుగులాంటి రోడ్డులో నెమ్మదిగా రివర్స్ గేర్ వేసుకుని నీటిని చీల్చుకుంటు ఆమె ఉన్న దిశగా రాసాగింది. రివర్స్ గేర్ తాలుకు సిగ్నల్ మ్యూజిక్ 'సారే జహాన్ సే అచ్చా....' అనే పాట ఆ చీకటి రాత్రి తుపాను హోరులో కలిసి వింతగా వినిపించసాగింది.

కారు వెనుక ఉన్న ఎర్రరంగు దీపాలు, రివర్స్ గేర్ తాలుకు చిన్ని తెల్ల దీపాల కాంతి నీటి మీద పడి చిత్రంగా ప్రతిఫలిస్తున్నాయి.

ఎల్లో నెంబర్ ప్లేట్ చూడంగానే అది టాక్సీ అని అర్థం అయింది ఆమెకి. అందులో డ్రైవర్ ఒక్కడే ఉన్నాడు.

ఆ కారు తన వద్దకు వచ్చి నిలబడి నెమ్మదిగా అద్దందించగానే, ఆమె వంగి ఆ కిటికీలోంచి లోనికి చూస్తూ, తానెక్కడ ఉన్నానో కూడా మరచి పొయి తెలుగులోనే గట్టిగా అరిచేసింది ఆందోళనగా "ఏమండి ఏర్ పోర్ట్ కి వస్తారా?"

"అడ్డడ్డా తెలుంగు వారా... ఇక్కడ ఇంత వానలో ఏట్లా ఉంటిరి" అని ఆ కాబ్ డ్రైవర్ పరామర్శించాడు

ఆమె తన పరిస్థితిని అంతా వివరించింది. తనను ఏర్ పోర్ట్ కి తీస్కువెళ్ళినా సరే, లేదా ఇందాకటి హోటల్ కి తీస్కు వెళ్ళినా ఒకె అని చెప్పింది.

కార్ కాబిన్ల్ వెలుగుతున్న దీపం కాంతిలో ఆ డ్రయివర్ ని స్పష్టంగా చూసింది నీహారిక. అతని వయసు యాభై పైనే ఉంటాయి. నల్లటి శరీర చాయ. ముడుతలు పడ్డ మొహం. తెల్ల జుత్తు. అతని కళ్ళలో దయ కనిపిస్తోంది.

అతను తమిళ యాసతో కూడిన తెలుగులో ఇలా చెప్పసాగాడు.

"అమ్మా, నేను ఇప్పుడు ఎక్కడికీ రాను . నిజానికి నేను ఇంటికి వెళుతున్నాను. మా ఇల్లు ఇక్కడికి దగ్గరే. నీళ్ళతో నిండి పొంగి పొర్లుతున్న రోడ్లపై అష్ట కష్టాలు పడి, అనేక దగ్గర ట్రాఫిక్ జాం లు దాటుకుని బ్రతుకు జీవుడా అని వస్తున్నాను. ఈ రోడ్డు మీద ట్రాఫిక్ లేకపోవటానికి కారణం ఈ రోడ్డుకి కిలోమీటర్ అటు వైపు, కిలోమీటరు ఇటు వైపు వాగుల్లాంటివి పొంగి పొర్లుతుండటం వల్ల ఈ రోడ్డుపైకి ఏ వాహనాలు రాలేక ఆగిపోయాయి. నాకు అనేక షార్ట్ కట్స్ తెలిసినా కూడా ఇంచుమించు నరకం అనుభవించి ఇక్కడి దాకా రాగలిగాను. నిజానికి ఇప్పుడు ఎక్కడకి మిమ్మల్ని తీస్కువెళ్ళాలన్నా కూడా ప్రమాదమే. ఈ మెయిన్ రోడ్డు చూస్తు ఉన్నారుగా ఎలా ఒక నదిలాగా ఉందో, ఇంకా ఈ రోడ్డు నయం. మీరు చెబుతున్న హోటల్ కి రాకపోకలు కట్ అయిపోయాయి. బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి ఆ హోటల్ కి.

ఏర్ పోర్టు కి వెళ్ళటమే మీకున్న ఏకైక మార్గం. కానీ నేను రాలేను. నన్ను వెళ్ళనివ్వండి. నేను బ్రతుకు జీవుడా అని ఇల్లు చేరుకోబోతున్నాను"

అతను కిటికీ అద్దం మూసేసి, తిరిగి కార్ ముందుకు కదిలించబోయాడు.

ఆమె రెండు చేతులూ జోడించి, శరీరం యావత్తు కంపిస్తూ ఉండగా వణుకుతున్న పెదాలతో తనను కాపాడమని అర్థిస్తూ అతని వంక చూస్తుండి పోయింది. ఆమె కంటి నుంచి కారుతున్న నీరు వర్షంనీటిలో కల్సి పోతున్నాయి.

వేలాది మంది ఉద్యోగులని కంటిసైగతో శాసించగల ఆమె అలా దైన్యంతో నిలబడటం విధిలీల.

ఆమె స్థాయి, హోదా అతనికి తెలియదు.

ఆ చీకటి రాత్రి కారు దీపాల కాంతి రోడ్డుపైనున్న వర్షం నీటిపై పడి పరావర్తనం చెంది ఆమె మొహం మీదపడి ఆమె దైన్యాన్ని అతనికి చూపుతోంది.

అతను మళ్ళీ అద్దం దించాడు.

"అమ్మా! ఇప్పటి దాకా ఏర్ పోర్టుకు రాకపోకలకు ఇబ్బంది లేదు. నాకు తెల్సి ఇంకో గంటలో మిమ్మల్ని క్షేమంగా చేర్చగలను. కానీ క్షణక్షణం పరిస్థితులు మారిపోతున్నాయి. ఎప్పుడు ఎక్కడ రోడ్డు మునిగిపోతుందో, ఎక్కడ చెట్లు, పాత

భవంతులు కూలి కార్ మీద పడతాయో తెలియదు. మిమ్మల్ని వదిలి పెట్టడంలో నేను నా ప్రాణాలను పణంగా పెట్టాల్సొస్తుంది తల్లి. నన్ను అర్థం చేసుకో" అతను చెప్పలేక చెప్పలేక ఈ మాటలు చెప్పాడు.

"బాబాయ్! మంచి వాళ్ళకు దేవుడు మంచే చేస్తాడు. నీకేమి కాదు. దయచేసి నన్ను ఏర్ పోర్టులో వదిలిపెట్టు . నీకు నేను మాములు చార్జ్ కంటే పది రెట్లు ఎక్కువ ఇస్తాను."

"అయ్యో పిచ్చితల్లీ. డబ్బు కోసం కాదమ్మా. నువ్వు ఇలా ఒంటరిగా ఉన్నావని చూసే నేను మళ్ళీ వెనక్కు వచ్చాను. ముంబాయి నగరం చీకట్లో అంత మంచిది కాదు తల్లీ. సరే దా. కారెక్కు. నిన్ను ఏర్ పోర్ట్ లో వదిలి పెడతాను"

చిన్నప్పుడు స్కూలు ముందు వర్షంలో తడుస్తు నిలబడ్డ తనని తండ్రి వచ్చి కారులో ఎక్కించుకున్నప్పుడు కలిగిన అనుభూతి కలిగింది ఆమెకి. అంత స్థాయి రక్షణ, భద్రత ఆమె మనసుకు కలిగింది

★★★★

"ఎన్నప్ప పళనీ, నల్ల ఇరుక్క? అమ్మా ఫోన్ క్కు చిగ్నల్ కడిక్కల, అమ్మక్కు చొల్లు. నాన్ కోంజెం లేట్టా వీట్టుక్కు వరువేన్. కొంచెం వేలై ఇరుక్కు"

కారులొ కూర్చుని మొదటి సారి నింపాదిగా ఊపిరి పీల్చుకుంది నీహారిక

డ్రైవర్ మాటల్ని విని నవ్వుకుంది., అతను సెల్ ఫోన్లో వాళ్ళ ఇంటికి ఫోన్ చేసి మాట్లాడుతున్నాడు. తాను లేటుగా ఇంటికి వస్తానని కొడుకుతో ఫోన్లో చెపుతున్నాడు.

అప్పుడు గుర్తు వచ్చింది నీహారిక కి అతని ఫోన్లో సిగ్నల్స్ వస్తున్నాయని. తాను కూడా బాగ్ లోంచి సెల్ ఫోన్ తీసి రాజివ్ నెంబర్ రింగ్ చేసింది.

"హలో హలో రాజీవ్... నా వాయిస్ వినిపిస్తోందా? ఇక్కడ భయంకరమైన వాన. నేనసలు ఇందాక ఒక భయంకరమైన సిచ్యుయేషన్లో చిక్కుకుపోయానురా. నేనసలు బయటపడతాను అనుకోలేదు.

ఈ పెద్దాయన కి నేను థాంక్స్ చెప్పుకోవాలి. నన్ను ఇప్పుడు ఎయిర్ పోర్టుకు తీస్కువెళుతున్నాడు. నా గూర్చి ఏమి కంగారు పడకు. అయాం ఫుల్లీ ఆల్ రైట్.....

హలో హలో రాజీవ్ .. వినిపిస్తోందా?"

ఈ సారి ఆమె ఫోన్లో చార్జ్ అయిపోయింది.

ఆమె ఊహిస్తున్నంత సులభంగా ఏమీ లేదు పరిస్థితి. ఆమె మరింత చిక్కుల్లో పడబోతోంది అన్న విషయం ఆమెకి కానీ డ్రైవర్ కి కానీ తెలియదు.

కారు రోడ్డు మీదే వెళుతోందా, లేక ఏదయినా నదిప్రవాహంలో వెళుతోందా అన్నట్టు ఉంది పరిస్థితి. రోడ్డు మొత్తం మోకాలి లోతు నీరు వేగంగా ప్రవహిస్తోంది.

చాలా ఏకాగ్రతగా నడుపుతున్నాడు కారు ఆయన.

ఆయనలో కొట్టవచ్చినట్టు కనపడుతున్న సుగుణం – దయ. ఆయన మాటల వల్ల, ఆయన నడవడి వల్ల అది తెలుస్తూనే ఉంది. కాసేపటి క్రితం, నీహారిక కారెక్కే ముందు లగేజి కోసం తిరిగి బస్ షెల్టర్ వైపు వెళ్ళబోతే "నువ్వు కూర్చోమ్మ, నేను తెస్తాను" అని ఆ వర్షంలో తాను తడుస్తూ వెళ్ళి లగేజి తెచ్చి, కారు డిక్కీలో పెట్టాడు.

మనసున్న మనిషికి దగ్గరగా ఉంటే మన మనసుకు తెలియకుండానే ఒక భరోసా భావన కలుగుతుందిట. ఆ వ్యక్తి బలాఢ్యుడో, కోటీశ్వరుడో కూడా కానక్కరలేదట. 'నేనున్నాను' అనే భావన ఒక సారి ఎదుటి వ్యక్తి మనకు కలిగిస్తే మనలోని అంతశ్చేతన తిరిగి పుంజుకుని టెన్షన్ నుంచి బయట పడి మనకు మేలుచేసే కార్యాచరణ దిశగా అడుగులు వేస్తుంది, అని తాను అటెండయిన లీడర్ షిప్ ట్రెయినింగ్ ప్రోగ్రాంలలో అంతర్జాతీయస్థాయి వక్తలు చెప్పిన మాటలు గుర్తు వచ్చాయి ఆమెకి ఆ క్షణంలో.

ఈ డ్రైవర్ పెద్ద చదువుకున్న వ్యక్తిగా కూడా తోచటం లేదు. ఆయన అలాంటి వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు గూర్చివిని ఉండడు కూడా బహుశా.

మంచి తనం అతని గుణం అంతే.

"నీ పేరేంటి బాబాయ్" చనువుగా అడిగింది నీహారిక

"కూత్తరసన్" ఒకే మాటలో చెప్పాడు ఆయన, ఏకాగ్రతతో కారు నడపడం మీద దృష్టి పెడుతూ

"అంటే ఏమిటి? అది ఏదైనా దేవుడి పేరా?" కాస్త వింతగా తోచటంతో అడిగింది నీహారిక. అలాంటి పేరెప్పుడు వినలేదు ఆమె.

"నాకూ సరిగ్గ తెలియదమ్మా. పెద్దలు పెట్టారు. తమిళ్ లో దీనికి అర్థం పాటలు పాడే రాజు అని అర్థం అట. మా పెద్దలు చెప్పారు. నాకు చూస్తే మాటలే సరిగ్గా రావు, ఇక పాటలు ఎక్కడివి?" ఒక్క సారిగా నవ్వేశాడు కూత్తరసన్. అతని నవ్వుతో శృతి కలిపింది నీహారిక

ఇంతలో ఎవ్వరూ ఊహించని విధంగా "ధడ్" మన్న పెద్ద శబ్దంతో కారు ఆగిపోయింది. డ్రైవర్ కి అటువేపున్న చక్రం వైపు కారు ఒరిగి పోయి కదలని మొరాయిస్తోంది.

అక్కడక్కడా షాపుల ముందు ఆగిన కొందరు జనాలు గొడుగులు వేసుకుని పరిగెత్తుకుంటూ వచ్చి చెప్పారు. అక్కడ కార్పొరేషన్ వాళ్ళు ఏదో గుంత తవ్వి పెట్టారట. ఇంకొక్క అడుగు ముందుకు వెళ్ళి ఉండినా మొత్తం కారు ఆ గుంతలో పడిపోయేదని.

వారందరూ మొదట డ్రైవర్ ని తిట్టబోయారు, కానీ లోపలఉన్న నీహారికని చూసి తమాయించుకుని తలా ఒక చేయి వేసి కారుని లాఘవంగా బయటికి లాగారు.

"త్వరగా వెళ్ళు. వెళ్ళబోయే దారిలో ఉన్న నాలా పొంగి రోడ్డు మీదకు వచ్చే లోగా ఏర్ పోర్ట్ లో ఆమెని వదిలేసి వెనక్కు వచ్చేయమని కొందరు ఆటో డ్రైవర్లు చెప్పారు.

’గూ ...గూ..మని ఊళల లాంటి ధ్వనిలో తుఫాను గాలులు తీవ్రతరం అయ్యాయి. రోడ్డు కి అటు ఇటు ఉన్న పెద్ద వృక్షాలు పిచ్చి పట్టినట్టు ఊగుతున్నాయి.

’స్పిరిట్ ఆఫ్ ముంబైకర్స్’ అని వినటమే కానీ వారి మానసిక ధార్ఢ్యాన్ని, మంచి తనాన్ని ఆ మనుషుల్లో చూసింది నీహారిక దగ్గరనుంచి.

రోడ్డుపై నీళ్ళుంటే ఉన్నాయి, వేగంగా వెళదామన్నా లేకుండా విపరీతమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడి ఇబ్బంది పెడుతోంది అక్కడక్కడ. కొన్ని కొన్ని దగ్గరల రైల్వే అండర్ పాస్ లకింద బస్సులు నిలువెత్తు నీటిలో మునిగిపోయి ఉన్నాయి. ఆ బస్సుల్ని తొలగించినా కారు అంతలోతైన నీటిలో వెళ్ళటం అసాధ్యం. అలాంటి దగ్గర్ల చాలా వాహనాలు ఒక దాని వెనుక ఆగిపోయి ఉంటున్నాయి.

అలాటి చోట్ల కూత్తరసన్ క్షణం కూడా ఆలశ్యం చేయకుండా,  యూ టర్న్ తీసుకుని, తనకు తెలిసిన షార్ట్ కట్స్ ద్వారా, ఆ అడ్డంకిని అధిగమించి, మళ్ళీ మెయిన్ రోడ్డు మీదకు క్షేమంగా కార్ ని తీస్కుని వచ్చి తిరిగి విమానాశ్రయం దిశగా నడుపుతున్నాడు.

ట్రాఫిక్ జాం అవడం తో ఒక దగ్గర షార్ట్ కట్ తీస్కున్నాడు.

"అమ్మా ఇంకెంత ఒక పదిహేను నిమిషాల్లో విమానాశ్రయంలొ ఉంటాం. ధైర్యంగా ఉండండి" అని ప్రకటించాడు ఒక దశలో,  ఆ మాట చెబుతు "ఇటు చూడండి" అని సుడులు తిరుగుతూ ప్రవహిస్తున్న ఒక నదిలాంటి దాన్ని చూపించాడు బ్రిడ్జి పై నుంచి.

"ఇది చాలా డేంజరస్ తల్లీ , ఇందాక ఆటో డ్రైవర్లు హెచ్చరించింది దీని గూర్చే. చిన్నపాటి వర్షానికే ఇది పొంగి ఈ బ్రిడ్జి మీదకు వచ్చేస్తుంది. ఇది షార్ట్ కట్ అని ఇలా వచ్చాం. ఇది గనక పొంగి ఉంటే మనం ఎయిర్పోర్టు చేరుకోలేకపోయె వారం. మెయిన్ రోడ్డు చూస్తే  అండర్ పాస్ మునిగి పోయింది. ఇక ఇది కూడా పొంగి ఉంటే మన పరిస్థితి కష్టమయ్యేది , నువ్వు నిజంగా అదృష్టవంతురాలివి తల్లీ" అని సంతోషం వ్యక్తం చేశాడు.

నిజంగా ఆమె అదృష్టవంతురాలే.  సరిగ్గా మరో అయిదు నిమిషాల్లో ఆ బ్రిడ్జి మీదకి నీళ్ళు పొంగి వచ్చాయి.

తిరుగుప్రయాణంలో అవే నీళ్ళు అతన్ని మృత్యు రూపంలో కబళించబోతున్నయని అతనికి తెలియదు.

★★★

కార్ ఏర్ పోర్ట్ చేరింది.

ఇంచుమించు ఏర్ పోర్ట్ ఆవరణలోకి కూడా నీరొచ్చేసింది.

మైకులో ప్రకటన గట్టిగా వినిపిస్తోంది. 'నీహారిక అన్న పేరు గల ప్రయాణీకురాలు తక్షణమే సెక్యూరిటి చెక్ పూర్తి చేసుకోవాలని , వీలయినంత త్వరగా విమానం బయలుదేరుతుంద'ని ఆ ప్రకటన సారాంశం.

అక్కడే ఆమెకి తెలిసింది. చాలా విమానాలు రద్దయ్యాయని, తమ విమానం కూడా దాదాపు రద్దయ్యేదే కానీ, సౌత్ ఈస్ట్ దిశగా ప్రయాణం కావటాన, ఆ వైపు వాతావరణం అనుకూలంగానే ఉండటాన హైదరాబాద్, చెన్నయి విమానాలు రద్దు అవలేదని తెలిసింది.

ఆమె ఆ హడావుడిలో, 'ఎంతయింది' అని కూడా అడగలేదు కూత్తరసన్ ని . పర్సులో చేయి పెట్టి చేతికి దొరికిన రెండు వేల నోట్లు కొన్ని, అయిదు వందల నోట్లు కొన్ని, ఎన్ని దొరికితే అన్ని ఆయన చేతిలో పెట్టి, రెండు చేతులు జోడించి సజలనేత్రురాలై వణికే పెదాలతో "దైవం మానుష రూపేణా అని వినటమే కానీ ఈ రోజు ప్రత్యక్షంగా అనుభవించాను బాబాయ్. నీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేను" అని చెప్పేసి లగేజి తీసుకుని సెక్యూరిటి చెక్ వైపు పరిగెత్తింది.

ఆమె అదృష్టవంతురాలని ఎందుకనాల్సి వచ్చింది అంటే, ఆ విమానాశ్రయం నుంచి బయలుదేరిన చివరి ఫ్లైట్ అదే.

ఆ తరువాత ఊహించని స్థాయిలో రన్ వే మొత్తం నడుముల లోతు నీరు చేరుకోవటం వల్ల విమానాలన్నీ రద్దు కావటం జరిగింది. మరుసటి రోజు టీవి చూసి విస్మయం చెందింది నీహారిక.

నీహారిక కి ఎన్నటికి తెలియని ఒక భయంకరమైన విషయం, తిరుగు ప్రయాణంలో కూత్తరసన్ ప్రయాణిస్తున్న కార్ నాలా నీటి ప్రవాహంలో కొట్టుకు పోయి ఆయన చనిపోయాడని. అనేక మంది ప్రత్యక్షంగా చూస్తూ ఉన్నా కాపాడలేకపోయారు ఆయన్ని.

కూత్తరసన్ ఫోన్ నెంబర్ గానీ, ఇతర వివరాలు కానీ ఆ హడావుడిలో తీసుకోలేదే అని ఆ తరువాత చాలా సార్లు ఆమె నొచ్చుకుంది. ఆయన ఎక్కడ ఉన్నాడొ, ఎలా ఉన్నాడొ అని అప్పుడప్పుడు అనుకుంటూ ఉంటుంది నీహారిక.

ప్రాతః స్మరణీయులు అని ఒక పదం ఉంది మనకు, ఆమె ఎన్నో సార్లు ఉదయాన్నె పూజ చేసుకునేటప్పుడు అతన్ని తలచుకుని కృతజ్ఞతలు చెప్పుకునేది మనసులో.

★★★

వర్షం హోరు కొనసాగుతోంది..

ఉదయం అల్పాహారం ఏమి చేయాలో వంట మనిషికి చెప్పి లాప్ టాప్ లో పని చూసుకోసాగింది నీహారిక.

రాజీవ్ లేచి కూర్చుని టీ త్రాగుతూ ,పేపర్ చదువుతున్నాడు.

వాళ్ల కంపెనీలో లగ్జరీ కారు నడపటానికి డ్రైవర్ పోస్టు కు ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి.

ప్రతి పనికి మేనేజర్ల మీద ఆధారపడుతునే వారి పనిలోని నాణ్యతని ఎప్పటికప్పుడు నిఘాగా చూస్తూ ఉంటుంది నీహారిక.

లాప్ టాప్ ముందు కూర్చుని వచ్చిన అప్లికేషన్స్ తాలూకు సమ్మరీ గూగుల్ షీట్లో చూస్తోంది. రిజెక్ట్ అయిన అప్లికేషన్స్ వివరాలు కూడా హెచ్చార్ మేనేజర్లు తనకి అందజేయాలి అన్న నియమాన్ని పెట్టి దాన్ని తూచా తప్పకుండా అమలు చేస్తోంది ఆమె.

రిజెక్ట్ అయిన అప్లికేషన్స్ లో ఒక పేరు ఆమె దృష్టిని ఆకట్టుకుంది.

"రాజీవ్" గట్టిగా కేకేసింది నీహారిక

"ఏమిటి నేహా! ఏమయ్యింది"

"ఇక్కడ చూడండి, కూత్తరసన్ పళనివేలు అట ఈ కుర్రాడి పేరు. ఇతన్ని మన హెచ్చార్ మేనేజర్లు లోకల్ కాండిడేట్ కాదని రిమార్క్ వ్రాసి రిజెక్ట్ లిస్ట్ లో పెట్టారు. నాకెందుకో ఇతను ఆ కూత్తరసన్ తాలూకు అనిపిస్తోందిరా,. అసలా పేరే అరుదుగా వింటుంటాం. ఇతనికి ఫోన్ చేయమని చెబుతాం" చాలా ఉద్వేగంగా చెప్పుకుపోతోంది నీహారిక

ఫోన్ కాల్ రిసీవ్ చేసుకుని మాట్లాడి పెట్టేసిన నీహారిక కి కొన్ని నిమిషాలు గుండె కొట్టుకోవటం ఆగిపోయింది. ఆ పళనివేలు, కూత్తరసన్ కొడుకే అట. తమిళ సాంప్రదాయం ప్రకారం తండ్రిపేరును తన పేరుకు ముందు పెట్టుకోవటం వల్ల నీహారిక గుర్తు పట్టగలిగింది. ఆ కుర్రాడు తండ్రి మరణం వల్ల ఇంజినీరింగ్ చదువు మధ్యలోనే ఆపేసి, టాక్సీ తోలుకుంటున్నాడట. తమ కంపెనీ ఆఫర్ చేస్తున్న జీతం ఆకర్షణీయంగా ఉండటం వల్ల ఈ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకున్నానని చెప్పాడు.

అతను చెప్పిన మాటల్లో కూత్తరసన్ మృతి తాలూకు వివరాలు తెలిసి మామూలు మనిషి కాలేక పోయింది నీహారికా చాలా సేపు.

"ఓ మై గాడ్, నా వల్లనే అతను చనిపోయాడు. నేనే ఆయన చావుకు కారణం". పదే పదే పలవరించ సాగింది

★★★★

రెండు రౌండ్ల ఫార్మల్ ఇంటర్వ్యూ, డ్రైవింగ్ టెస్టు తదితర ఫార్మాలిటిస్ అయ్యాక, అతని అపాయింట్మెంట్ లెటర్ డ్రాఫ్ట్ చేయటం మొదలెట్టింది నీహారిక.

"మిష్టర్ పళని వేల్, మీరు సెలక్ట్ అయ్యారు. మేము ప్రకటనలో పేర్కొన్న దానికి రెండింతలు శాలరీ మీకు ఆఫర్ చేస్తున్నాము. మీకు ఇక్కడ అన్ని సదుపాయాలతో కూడిన కంపెనీ క్వార్టర్స్, మెడికల్ అలోవెన్స్ , బోనస్, ఎల్ టీ ఏ మరియు ఇతర అన్నీ అలవెన్సులు లభిస్తాయి. మీరు మీ అమ్మ గారిని, చెల్లిని తీస్కుని హైదరాబాద్ కి షిఫ్ట్ అయిపోవచ్చు.

ఈ ఉత్తరం తో బాటు మీకు ఏసీ ట్రెయిన్ టికెట్స్, సాలరీ అడ్వాన్స్ డీడీ కూడా పంపిస్తున్నాము" లెటర్ డ్రాఫ్ట్ చేస్తున్న నీహారిక వంక కాస్త ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు హెచ్ ఆర్ మేనేజర్.

'మీ నాన్న చేసిన త్యాగానికి ఇలాంటివి ఎన్ని ఇచ్చినా అవన్నీ చంద్రునికి ఓ నూలు పోగే' మనసులో అనుకుంది నీహారిక.

# మరణ వాఙ్మూలం

## జి వి రమణ

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో బహుమతి పొందిన కథ

అపార్ట్మెంట్ కి ఉండే ప్రధాన ద్వారాన్ని వీధి వాకిలి అనవచ్చునో లేదో నాకు తెలియదు కానీ మా వీధి వాకిలి బాల్కనీలో నుంచుంటే చుట్టు పక్కల పది కిలోమీటర్ల మేర పట్టణమంతా కనిపిస్తుంటుంది. రోడ్ల మీద వెళ్తున్న వాహనాలు ఏదో వీడియో గేమ్ లో రేసింగ్ చేస్తున్న చిన్న చిన్న డబ్బాల్లాగా అనిపిస్తాయి. మనుషులైతే చీమల్లా కనిపిస్తారు. ఎందుకంటే మేముండేది ముప్పై అంతస్తుల భవనంలో ఇరవై ఐదవ అంతస్తులో ఉన్న ఫ్లాట్లో, రాత్రయితే వాహనాల హెడ్ లైట్ల కాంతి, మిణుగురు పురుగులు రోడ్ల మీద అటూ ఇటూ పరిగెడుతూ ఉన్నట్లు కనిపిస్తూ ఉంటుంది. క్రింద రోడ్ల మీద ఎంత పెద్ద శబ్దాలతో వాహనాలు తిరిగినా ఆ శబ్దాలు మమ్మల్ని ఎప్పుడూ డిస్టర్బ్ చేయవు, ముఖ్యంగా నాలాంటి కథలు వ్రాసుకునే వాళ్ళకి ఈ వాతావరణం ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుంది. బోర్ అనిపించినప్పుడు ఒక బైనాక్యులర్ తో బాల్కనీలో కూర్చుంటే ఫ్రీగా నగర సంచారం చేస్తున్నట్లే ఉంటుంది దూరంగా వీధిలో పాన్ షాప్ దగ్గర జరిగే బేరాలూ, క్రింద ఎవరెవరో పడే గొడవలూ దగ్గరగా కనపడుతూ మూకీ సినిమాలా అనిపిస్తాయి. వాళ్ళ చేష్టలకి మనకు కావలసిన మాటలు అల్లుకుని నచ్చినట్టు ఆనందించవచ్చు. టెలిస్కోపుతో స్టార్ గేజింగ్ చేస్తూ నక్షత్ర గమనాలను పరీక్షించినట్లు ఇక్కడ కూర్చుని కొన్ని ప్రత్యేకమైన స్థలాలలో జరిగే విషయాలు డైలీ సీరియల్లా ఉత్కంఠగా చూడొచ్చు. రిటైరయ్యాక కథలు వ్రాయడంలాగే నాకు

ఇదీ ఓ హాబీగా మారింది. ఇక్కడికి వచ్చిన దగ్గర్నుంచీ మా ఫ్లోర్ లో ఉన్న ఫ్లాట్లలోకి ఎవరు కొత్తగా వచ్చినా వారిని పరిచయం చేసుకుని, వాళ్ళని మాటల్లో పెట్టి, వాళ్ళ మాటల్లో నా కథలకు కావలసిన 'స్టఫ్' ఏదైనా దొరుకుతుందేమో వెతుక్కోవడం బాగా అలవాటయిపోయింది. నేను రచయితనని తెలిసి వాళ్లు కూడా విషయాలన్నీ నాతో కాస్త లోతుగా చర్చించే వాళ్ళు.

అప్పటికి ఆరు నెలల క్రితం మా పక్క ఫ్లాట్ లోకి వచ్చిన రామనాథం గారు నాకు ఈ కథ రాసే అవకాశం ఇస్తారని ఆ రోజు అనుకోలేదు. రామనాథం గారి వయస్సు డెబ్బై అయిదు సంవత్సరాలు. పిల్లలు విదేశాల్లో ఉన్నారు. ఆయన, ఆయన భార్యా సౌకర్యంగా ఉండాలని ఒక వంట మనిషినీ, ఈ ఫ్లాటునీ అమర్చారు పిల్లలు.

ఆది శంకరాచార్యుల వారి అద్వైత సిద్ధాంతంలా, గౌతముడి బౌద్ధంలా మహావీరుడి జైన సిద్ధాంతంలా, సంసారిక జీవనంలో రామనాథం గారికి కొన్ని సొంత సిద్ధాంతాలు ఉన్నాయని ఆయనతో మాట్లాడుతుంటే తెలిసింది, అయితే అవి తను ఆకళింపు చేసుకున్న ప్రకృతి సిద్ధాంతాలే కానీ తను సొంతంగా చెప్పిన సిద్ధాంతాలు కావు అంటారాయన ---

కథలోకి వస్తే.....

"ఉగాది కథల పోటీలో నేను వ్రాసిన కథకి ప్రధమ బహుమతి వచ్చింది రామనాధంగారూ, చదివి మీ అభిప్రాయం చెప్పండి" అంటూ కథ పడిన పత్రికను పొద్దున్నే ఆయనకి ఇచ్చాను. సాయంత్రం ఇద్దరం బాల్కనీలో కూర్చుని మాట్లాడుకుంటున్నప్పుడు దాని మీద చర్చ ప్రారంభమయింది, "ఇంకా ఎంతకాలం వయసైపోయిన తల్లిదండ్రులను చూడని పిల్లల గురించి కథలు వ్రాస్తారు మీ రచయితలు, ఇంకా ఎంత కాలం అలాంటి కథలకే పత్రికలవాళ్ళు బహుమతులు ఇస్తారు" అన్నారు రామనాథం గారు.

నేను వ్రాసిన కథలో పిల్లలు, వయసయిన తల్లిదండ్రుల బాధ్యత తీసుకోరు. ఆయన ఆస్తిపాస్తులన్నీ పిల్లల అవసరాలకి ఖర్చయిపోతాయి. అప్పుల్లో పడితే, సంపాదన పరులైన పిల్లలు ఎవరూ దాన్ని గురించి పట్టించుకోరు. చివరికి తల్లి చనిపోయినా తండ్రిని తమతో తీసుకు వెళ్లాలని అనుకోరు. ఇంత జరిగినా ఆ తండ్రి వాళ్ళని ద్వేషించడు. సమాజ స్వరూపమే అలా ఉందనీ, వాళ్ల డబ్బు వాళ్ళ అవసరాలకే సరిపోతోందో లేదో అని సరిపెట్టుకుంటాడు. కావాలంటే తన బాధ్యత పిల్లలు తీసుకునేలా కోర్టులో దావా వేయచ్చు అని స్నేహితులు చెప్తే, వాళ్ళంతట వాళ్ళు ఇస్తానంటే తప్ప అలా తీసుకోనంటాడు. 'దేహి' అని అడుగవలసినంత పరిస్థితి వచ్చినప్పుడు, అది పిల్లల దగ్గరయితేనేం మరి ఎవరి దగ్గర అయితేనేం, ఈ ప్రపంచం చాలా పెద్దది అనుకుంటూ, ఉన్న ఊరు విడిచి ఎక్కడో దూరంగా వేరే ఊరిలో ఓ పెద్ద దేవాలయం దగ్గర తిరిపమెత్తుకుంటూ.. చివరికి ఆ జీవితం నచ్చక ఆత్మహత్య చేసుకుంటాడు.

'చావు తో ముగిసే పుట్టుకకి జీవితం అనే ఇంత భవబంధాల నాటకం అవసరమా? అడుక్కు తింటూ నింపుకున్నా అదే కడుపు కదా' అంటూ కథ ముగుస్తుంది.

రామనాథం గారికి ఆ కథ నచ్చలేదు.

"పిల్లలు తల్లిదండ్రుల బాధ్యత తీర్చాలని ఎందుకనుకోవాలి?" అడిగారు రామనాథం గారు.

"ఎందుకంటే తల్లిదండ్రులు వాళ్ళకి జన్మనిచ్చారు కనుక" అన్నాన్నేను.

"తమని కనమని వాళ్ళు ఏమైనా అడిగారా?"

"ఇది యుగాలుగా సాగుతున్న ప్రకృతి ధర్మం, తన అవసరాల కోసం మనిషి దాన్ని ప్రణాళికాబద్ధంగా ఒక ఒడంబడిక చేసుకున్నాడు"

"అదే, ఇంకా పుట్టని జీవిని తన ఇష్టానిష్టాలతో పనిలేకుండా ఈ భూమి మీదకి తీసుకొచ్చి వాడికి బాధ్యతలని నిర్ణయించే హక్కు వీళ్ల కెక్కడిది?"

"అంటే పుట్టే వాళ్లకి ఇష్టం ఉందో లేదో ఎవరికీ తెలియదు కాబట్టి మనుషులెవరూ పిల్లల్ని కనకూడదంటారా?"

"అది కాదు ప్రశ్న, వాడి ఇష్టంతో ప్రమేయం లేకుండా తమ ఇష్టానికి ఓ జీవిని భూమి మీదకి తీసుకొచ్చి వాళ్ల బాధ్యత వాడు తీర్చాలనడం సబబు కాదంటున్నాను"

"మీరు ఎందుకో వితండవాదం చేస్తున్నారని పిస్తోంది, అయినా బిడ్డకు జన్మనిచ్చి, కొంతకాలం వాడి బాధ్యత తల్లిదండ్రులు నెరవేరుస్తున్నప్పుడు, ఆ బిడ్డ మీద వారికి ఆ మాత్రం హక్కు ఉండటంలో తప్పేం ఉంటుంది?"

"ఏమిటీ, తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తున్నారా?"

"కాదా?"

" 'జాతస్యహి ధృవో మృత్యుః', జన్మించిన వానికి మృత్యువు తప్పదు కదా, మరి అప్పుడు నువ్వు జన్మనిచ్చిన వాడికి మృత్యువుని ఎవరు ఇచ్చినట్లు?"

"............."

"జన్మనిచ్చింది వాళ్లే కాబట్టి మృత్యువుని కూడా వాళ్లే ఇచ్చారంటే తల్లిదండ్రులు ఒప్పుకుంటారా?"

"........"

"పోనీ మృత్యువు నిచ్చిన వాడు దేవుడు అనుకుంటే అప్పుడు జన్మనిచ్చింది కూడా వాడే అయి ఉండాలని ఒప్పుకోవాలిగా!"

"........."

"కనక బిడ్డలకి సంబంధమూ బాధ్యతా అన్నీ ఆ దేవుడి తోటే గానీ మనతో కాదుగా"

ఒక క్లిష్టమైన లెక్కని మాస్టారు స్టెప్ బై స్టెప్ వేసి సాధించి చూపిస్తున్నట్లు అనిపించింది రామనాథం గారి విశ్లేషణ.

"ఒక జీవికి మృత్యువు తో కూడిన జన్మనిచ్చినప్పుడు అది జన్మనివ్వడం ఎలా అవుతుంది, అలాంటి వాడితో నీకు జన్మనిచ్చాను కాబట్టి నా బాధ్యత కూడా నువ్వే తీసుకోవాలి అనడం సరికాదు కదా! అందుచేత తల్లిదండ్రులు బిడ్డల్ని చెడ్డ వారిగా చిత్రించడం తప్పు"

నాకెందుకో ఒక్క క్షణం భయం వేసింది, ఈ వైరాగ్య భావనా ప్రపంచం కన్నా భావోద్వేగాల మాయాలోకమే బాగుందేమో అనిపించింది. 'బహుశా రామనాథం గారి పిల్లలు చెడ్డవాళ్ళు అయి ఉండొచ్చు, అందుకే ఆయన ఆ దుఃఖం నుంచీ, కుంగుబాటు నుంచీ తప్పించుకోవడానికి ఈ సిద్ధాంతం ప్రతిపాదించుకున్నారేమో' అని మనసులో అనుకుని, "ఇంతకీ మీ పిల్లల పట్ల మీకు మంచి అభిప్రాయమే ఉందా?" అని పైకే అడిగేసాను ధైర్యంగా.

"అది చెప్పడానికి ముందు నేను మీకు కొంత ఉపోద్ఘాతం ఇవ్వాలి, పెళ్లి కాక ముందు నన్ను శారీరక బాధలు గానీ ఆర్థిక బాధలు గానీ బాధించేవి కావు. కానీ పెళ్లి అయ్యాక నా భార్య కడుపు నొప్పితో మెలి తిరుగుతుంటే ఆ నొప్పిలో నాకేదో భాగస్వామ్యం ఉన్నట్లూ , కొండొకచో ఆవిడ పొట్ట కూడా నాదే అయినట్లూ అందులోని బాధ నా బాధే అన్నట్లూ బాధించేది. ఆ విధంగా రెండు శరీరాలూ ఒకే శరీరంలా అనిపిస్తూ, ఆరోగ్యం నుంచీ ఆర్థికావసరాల వరకూ రెండింటి పైనా నా దృష్టి పోయేది. ఇక ఆ తర్వాత పిల్లలు పుడుతున్న కొద్దీ వాళ్ళ బాధలూ, వాళ్ళ అవసరాలూ కూడా నావిలాగే ఉండేవి. భార్యా, ఇద్దరు పిల్లలూ కలిపి, వెరసి నాకు ఆకలి తీరడానికి నాలుగు కడుపులూ, బట్టలు తొడగడానికి నాలుగు శరీరాలూ, నాలుగు బుర్రల్లో రగిలే నానా విధమైన అన్ని కోరికలూ నావి లాగే అనిపించి, డబ్బు చాలక, అవి తీరక, అందరినీ బాధిస్తున్నానని బాధపడేవాడిని. వాళ్ల ఆకలినీ, కోర్కెలనీ తీర్చలేనప్పుడు వాళ్ళని ఈ లోకంలోకి ఎందుకు తేవాలి, అని మధన పడే వాడిని. ఒక శిశువు జన్మిస్తోంది అంటే వాడితో ఒక మహా ఆకలినీ, తీర్చుకోవడానికి సహస్రాధిక కోర్కెలనీ వెంట తెస్తున్నట్లనిపించేది. వాడేదో బాధ్యత మోయడానికి భూమి మీద పడ్డట్టు ఆలోచించడం అన్యాయం అనిపిస్తుండేది.... " రామనాథం గారి వాక్ ప్రవాహానికి అడ్డువస్తూ,"మరి మనం కూడా ఈ లోకంలో జన్మించాముగా, దాని అర్థం ఏమిటి?" అడిగాను,"మన పెద్దవాళ్ళు మీలా ఆలోచిస్తే మనం ఈ లోకాన్ని చూసే వాళ్ళం కాదుగా?"

"మన ప్రమేయం లేకుండా జరిగిన దానికి మనం ఎలా బాధ్యులం, అయినా మృత్యువు తో కూడిన జన్మ, కష్టంతో కూడిన సుఖం, బాధతో కూడిన సంతోషం ఉండే ఈ లోకంలో పుట్టి మనం మార్చగలిగింది ఏమిటి?, పుట్టకపోతే ఈ లోకానికి వచ్చిన లోటేమిటి?, పుట్టేశాము గనక 'సంతృప్తిగా ఉండు', 'ఆనందంగా ఉండటం నేర్చుకో' లాంటి మాటలన్నీ ఎప్పుడూ చెప్పుకుంటూ భయాన్ని జయించే ప్రయత్నం చేస్తూ ఉంటాం. ఇప్పటికి ఎందరో తాత్వికులు

పుట్టినా, ఇంకా ఈ జగన్నాటకం ఎవరికీ అంతుపట్టలేదు, పెద్దవాళ్ళం అన్న ఒకే ఒక్క భ్రమతో పిల్లల్ని చెడ్డ వారిగా చిత్రిస్తూ పెద్ద వాళ్ళ పట్ల బాధ్యత విస్మరించి బ్రతుకుతున్నారు అంటూ వ్రాసే కథలు నాకు నచ్చవు"

"సరే, ఇంతకీ మీ పిల్లల్లో మీకు చెడ్డ లక్షణాలు ఎప్పుడూ కనపడవా?"

"కనపడినప్పుడు అవి నా పెంపకంలో లోపమో, లేక నాకు పుట్టడం వల్ల వచ్చినవో అయ్యుండొచ్చు అనిపిస్తుంది"

"మరణాన్ని ఇచ్చే వాడు దేవుడు కనక జన్మనిస్తోంది కూడా ఆయనే అని ప్రతిపాదించి, అందరి సంబంధం 'పై' వాడి తోటే అంటూ ఈ బాధ్యత మాత్రం మీ మీద వేసుకోవడం ఎందుకు? " అన్నాను కాస్త వెటకారంగా నా కథ బాగోలేదన్నారన్న ఉక్రోషంతో.

"వాళ్లు భూమి మీద పడడానికి నా స్వార్థం, నా బలహీనతా కారణం అయ్యాయి కదా! అందుకు"

ఆలోచిస్తే రామనాథం గారిలో ఒక పండిపోయిన తత్వవేత్త ఉన్నాడా లేక ఇంకా ఎదగని పిల్లవాడు ఉన్నాడా అర్థం కాలేదు. పాపం నా మాటలకి ఆయన నొచ్చుకున్నట్లున్నారు, అయినా అది కనపడనివ్వకుండా కొనసాగించారు..."చిన్నప్పుడు మా పిల్లలు అడిగిన కోర్కెలు తీర్చ లేకపోయినప్పుడు బాధపడే వాడిని, 'కోర్కెల కంటే అవసరాలు ముందు తీరాలి ముందు వాటికి సరిపోయినంత కూడా మన దగ్గర లేదు' అనే వాడిని, పాపం వాళ్ళు నా లాజికల్ సెన్స్ కి ముగ్ధులయి, జరిగినంత వరకే తృప్తిపడిపోయేవాళ్ళు... అలా... అలా పెరిగి పెద్దయిన వాళ్ళు, సంపాదనలో పడ్డాక ఏం చేశారో తెలుసా?" ఆగారు రామనాథం గారు.

'ఏదో చెడ్డ పనే చేసుకుంటారు' అనుకున్నాను నేను మనసులో.

రామనాథం గారు దీర్ఘంగా నిట్టూర్చి, "వాళ్ళని పెంచేటప్పుడు అవసరార్థం నేను తీర్చుకో కుండా ఆపుకున్న నా కోర్కెలు తీర్చడం మొదలుపెట్టారు, అందులో భాగంగానే ఖరీదైన ఈ ఫ్లాట్ కూడా ఉంది. ఇప్పుడు నా కళ్ళకి వాళ్ళు నా కోర్కెలు తీర్చే నా తండ్రుల్లా కనిపిస్తున్నారు. వాళ్లకి నేను రుణపడి పోతున్నాను, ఇది ఎలా తీర్చుకో గలనో" అంటూ నయనాలు అశ్రు పూరితాలవుతుంటే గాద్గదికంగా అన్నారు.

"మీరు చాలా అదృష్టవంతులు, మంచి పిల్లల్ని కన్నారు"

"కనలేదు – పుట్టారు, నేను చెప్పేది అదే... కనడం 'మిష' పుట్టడం 'విధి' "

"ఏదేమైనా మీరు చాలా సంతృప్త జీవి!"

అప్పటికే చాలా సమయం గడవడంతో చర్చను ఆపి ఇద్దరం మా ఫ్లాట్లలోకి వెళ్ళిపోయాం.

రామనాథం గారు చెప్పిన సిద్ధాంతం బాగానే ఉన్నా, ఆయన వ్యక్తపరిచిన సంతృప్తి మాత్రం ఎందుకో పూర్తిగా నిజమైనది కాకపోవచ్చని నాకు లోలోపల ఏదో శంక అలాగే ఉంది.

నా శంక తీరడానికా అన్నట్లు ఆ తర్వాత రెండు రోజులకి రామనాథం గారికి రాత్రిపూట స్ట్రోక్ వచ్చింది. కుడిచెయ్యి, మాటా పడిపోయాయి. అప్పటికప్పుడు నేనే ఆయన్ని దగ్గరలోని ఆసుపత్రికి తీసుకు వెళ్ళాను, తరువాత వాళ్ళ పిల్లలకి ఫోన్ చేసి చెప్పాను, 'ఈయన పిల్లలు ఎలాంటి వాళ్లో ఇప్పుడు తెలుస్తుంది' అని మనసులో అనుకున్నాను.

ఆయనకు కావలసిన వైద్య పరీక్షలు అన్నీ మొదలుపెట్టారు ఆసుపత్రి వాళ్ళు, మర్నాడు ఉదయం దగ్గరలో ఉన్న వారి బంధువులు వచ్చారు, ఆ మర్నాడు విదేశాలనుంచి వాళ్ల పిల్లలు కూడా వచ్చేశారు, వైద్య పరీక్షల ఫలితాలు కూడా వచ్చాయి. ఆయనకి వచ్చింది చాలా తీవ్రమయిన స్ట్రోక్ అనీ, మందులతో మామూలు కావడం సాధ్యం కాకపోవచ్చనీ తేల్చేశారు డాక్టర్లు.

"మరిప్పుడు ఆయన్ని ఎలా చూసుకుంటారు బాబూ?" అడిగాను ఆయన పిల్లల్ని, ఆ ప్రశ్న వాళ్ళని చికాకు పరుస్తుందేమోనని వాళ్ళ మొహంలోకి సూటిగా చూస్తూ.

అలాంటిదేం కనిపించలా, నాకు ఎక్కడో కొంచెం అసంతృప్తి కలిగింది.

పెద్దవాడు జవాబు చెప్పాడు, "తమ్ముడు ఇప్పుడిప్పుడే ఉద్యోగంలో నిలదొక్కుకుంటున్నాడు కనుక, నేనే ఓ నిర్ణయం తీసుకుని శాశ్వతంగా ఇండియా వచ్చేసి, ఆయన ఉన్నంత వరకూ ఆయనను చూసుకుని, తర్వాత ఇక్కడే ఇంకో ఉద్యోగం వెతుక్కుంటాను"

'సమాధానం సింపుల్ గా బాగుంది, ఎవరైనా అంత త్యాగం చేస్తారా? అయినా అందుకు ఈయన పెళ్ళాం ఒప్పుకోవద్దూ?' మనసు లోపల అర్థంకాని ప్రశ్నల పరంపర.

ఒక వారంలో ఆయన్ను డిశ్చార్జి చేసి ఇంటికి పంపారు.

రెండు రోజులు గడిచాక వాళ్ళ ఫ్లాట్ లోకి వెళ్ళాను రామనాథం గారిని పలకరిద్దామని,

వాళ్ల పెద్ద కోడలు నా కోసం కాఫీ కలుపుకుని వచ్చింది.

ఎందుకో రామనాథం గారి నయనాలు అశ్రు పూరితాలు అవుతున్నాయి. అది గమనించి వాళ్ల కోడలు నాతో అంది, "ఆయన్ని బాధపడవద్దు అని చెప్పండంకుల్, ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి రావడానికి ఈయన రేపే బయలుదేరుతున్నారు, అందుచేత భయపడాల్సిందీ, బాధపడవలసిందీ ఏమీ లేదని చెప్పండి"

ఆ అమ్మాయి మాటల్లోని నిజాయితీకి నా మనసు ఎందుకో మూలిగింది, నా కళ్ళు కూడా వర్షిస్తాయేమో అన్నట్లు ఆలోచనల మేఘాలు కమ్మేశాయి.

ఆయనకు అనునయ వచనాలు చెప్పి, కాఫీ ముగించి బయటపడ్డాను.

సరిగ్గా ఆ మర్నాడు ఉదయం నాలుగు గంటలకు నాకు మెలకువ వచ్చింది. అంతా నిశ్శబ్దంగా ఉండటంతో, ఎక్కడో దూరంగా ఎవరో మాట్లాడుకుంటున్నట్లు వినిపిస్తోంది. లేచి బాల్కనీ లోకి వస్తే ఇంకాస్త పెద్దగా వినిపిస్తున్నాయి

మాటలు, స్పష్టత లేకపోయినా శబ్దం మాత్రం తెలుస్తోంది. బాల్కనీలో నుంచి వంగి చూశాను, ఏమిటో అందరూ గుంపుగా నిలబడి దేన్నో చూస్తున్నారు. స్పష్టంగా కనపడకపోయేసరికి లోపల్నుంచి బైనాక్యులర్ తెచ్చి చూశాను, అప్పుడు స్పష్టంగా కనబడింది తల పగిలి నెత్తురు కారుతోంది నేల మీద పడి ఉన్న వ్యక్తికి. బహుశా ఎవరో బిల్డింగ్ మీద నుంచి దూకి చనిపోయినట్లున్నారు, ఆ శబ్దానికి ఫస్ట్ ఫ్లోర్ ఫ్లాట్లలో వాళ్ళు లేచి గుమిగూడి చూస్తున్నట్లున్నారు. జాగ్రత్తగా బైనాక్యులర్ ఫోకస్ చేసి ఆ పడిన వ్యక్తి వైపు చూశాను అనుమానం లేదు రామనాథం గారే! వెంటనే పక్క ఫ్లాట్ వైపు పరుగు తీశాను. వీధి వాకిలి తలుపు తెరిచి ఉంది. లోపల అందరూ నిద్రావస్థలోనే ఉన్నట్లుంది.

“యావండీ” అంటూ తలుపు మీద కొడుతూ గట్టిగా పిలిచాను. ఆ శబ్దానికి ముందుగా రామనాథం గారి పెద్దకొడుకు లైట్ వేసి కళ్ళు నులుముకుంటూ బయటికి వచ్చాడు. వీధితలుపు ఆ సమయంలో తెరిచి ఉండటం అతనికి ఆశ్చర్యం కలిగించింది. "ఏం జరిగింది అంకుల్" అని అడిగాడు గోడగడియారం వైపు చూపు సారిస్తూ.

"మీ నాన్నగారు ఇంట్లోనే ఉన్నారా?" అడిగాను. ఆయన పడుకున్న మంచం వైపు ఓసారి చూసి, "మంచం మీద లేరేమిటి!...." అని ఆశ్చర్య పడుతుంటే అతన్ని చెయ్యి పట్టుకుని గబగబా బాల్కనీలోకి లాక్కొచ్చి బైనాక్యులర్ ఇచ్చి కిందికి చూడమన్నాను, అప్పటికి ఇంట్లో అందరూ లేచి బయటకు వచ్చారు.

"ఓ మై గాడ్!" అంటూ అతను లిఫ్ట్ వైపు పరుగు తీశాడు. ఆ వెనుకే నేనూ, అతని తమ్ముడూ కూడా పరుగుపరుగున లిఫ్ట్లో కిందికి వెళ్ళాం.

"ఎవరైనా ఈయన్ని చంపేసి, కింద పడేసి ఉండాలి, లేదా సరిగా చూడని పిల్లల నిర్లక్ష్యానికి గురై ఆ బాధ సహించలేక ఆయనే దూకి ఉండాలి" అంటున్నాడు శంకరం శవాన్ని నిశితంగా చూస్తూ.

శంకరం ఫస్ట్ ఫ్లోర్లో ఉంటున్నాడు, అతడు దగ్గరి పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్స్పెక్టర్ గా చేస్తున్నాడు, “కేస్ బుక్ చేస్తే ఐపిసి 306 కింద విచారించి కారణం పట్టుకుని బాధ్యులను శిక్షించవచ్చు"

"కారణాలు తెలుసుకోవాలంటే కేసులు బుక్ చేయనవసరం లేదు శంకరం గారూ, మీరు అనుకున్నట్లు ఆయన్ని ఎవ్వరూ చంపి క్రింద పడెయ్య లేదు. ఆయన ఆత్మహత్యకు కారణం ఆయన పిల్లల బాధ్యతారాహిత్యమో, రాక్షసత్వమో కూడా కాదు."

శంకరం నాకూ, నేను శంకరానికీ ఇంతకు ముందు నుంచే బాగా తెలుసు.

"కావాలంటే మన బిల్డింగ్ కి ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్ చూసి తెలుసుకోవచ్చు, ఆయన పేరు రామనాథంగారు, నాకూ ఆయనకూ మంచి సాన్నిహిత్యం ఉంది. ఇదిగో వీళ్ళిద్దరూ ఆయన పిల్లలు. తండ్రికి బాగోకపోతే వారం క్రితమే విదేశాల నుంచీ వచ్చారు" అంటూ రామనాథం గారి వివరాలు చెప్పి, శవాన్ని క్లియర్ చేయనివ్వమని అడిగాను.

శంకరం చూపుల్లో నా మాటల పట్ల నమ్మకం కనపడలేదు, ఎంతైనా పోలీసు వాడు కదా! తన సెల్ ఫోన్ తో ఫొటోలు తీసుకుని, స్టేషన్ నుంచి ఇద్దరు కానిస్టేబుల్స్ ని రప్పించి, పడినచోట మార్కింగ్ చేయించి అప్పుడు అనుమతి ఇచ్చాడు. తెల్లవారుతూనే డిపార్ట్మెంటల్ పంచనామా పూర్తి చేయించాడు. సీసీ కెమెరా ఫుటేజ్ లో రామనాథంగారు ఒంటరిగా ఇంట్లో నుంచి బయటికి బాల్కనీలోకి వచ్చి, పై నుంచి దూకినట్లు అందరూ చూశారు.

'బహుశా పిల్లల నిరాదరణ వల్లే రామనాథం గారు ఇటువంటి నిర్ణయం తీసుకొని ఉంటారు లేకపోతే ఆయనకి ప్రాణాలు తీసుకునేంత అవసరం ఏముంది?' అని ఫ్లాట్లో జనాలు సందర్భం వచ్చినప్పుడల్లా అనుకోవడం మొదలుపెట్టారు. శంకరం కూడా అదే అనుమానంతో ఉన్నాడు, కాకపోతే నా మాట మీద గౌరవంతో రామనాథంగారు మానసిక పరిస్థితి బాగోని కారణంగానే ఆత్మహత్య చేసుకున్నారని వ్రాసుకొని ఫైల్ క్లోజ్ చేసేశాడు.

రామనాథం గారి పిల్లలు ఆయన దశదిన కర్మలన్నీ పూర్తి చేశాక, మొన్ననే వాళ్ళ అమ్మని తీసుకుని వెళ్ళిపోయారు.

'ఇంతకీ రామనాథం గారు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారు?' అనే బేతాళ ప్రశ్న మాత్రం ఫ్లాట్లో ఉన్న వాళ్ళందరి మొహాల్లోనూ నాకు రోజూ కనిపిస్తూ ఉండటంతో ఈ కథ వ్రాశాను.

తనను సంతృప్తిగా ఉంచిన పిల్లల అభివృద్ధికి తన అనారోగ్యం ఆటంకం కాకూడదనీ, తెల్లవారితే ఎక్కడ పెద్దవాడు వెళ్లి తన ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చేస్తాడోననీ, అతను ఇక్కడ ఇంట్లో ఉండగానే తన ప్రాణం పోతే కర్మకాండతో సహా కార్యక్రమం పూర్తి చేసుకుని, తన దారికి అడ్డం లేకుండా పయనం సాగించుకుంటాడనే ఏకైక ఆలోచనతోటే ఆయన ఈ పని చేశారు, ఎంతైనా నాన్న కదా!

ఆయన కోడలు నాతో మాట్లాడినప్పుడు ఆయన కళ్ళల్లో సుడులు తిరిగిన కన్నీళ్లు నాకు చెప్పిన మాటలు ఇవి.

అందుకే ఈ కథ – ఆయన మరణ వాఙ్మూలం.

## రక్షక భటుడు — జయంతి ప్రకాశ శర్మ

విశ్వానికి తెలివొచ్చిందనే వార్త ఊరంతా దావాగ్నిలా వ్యాపించింది. ఆ వార్తని విశ్వమంతా అందించాలనే పనిమీద ఆ ఆసుపత్రి ముందు టివి చానల్ల కెమెరాలు వచ్చి వాలిపోయాయి. యాంకరమ్మలు మొహాల్ని సున్నితంగా రూములుతో అద్దుకుంటూ, ప్రత్యక్ష ప్రసారంలో మాట్లాడానికి నేపథ్యాలని గూగుల్లో వెతుక్కుంటున్నారు. మరి కొంతమంది విశ్వం గత

చరిత్రలు వెతుకుతూ బిజీగా ఉన్నారు. వారం రోజులుగా విశ్వం ఆరోగ్య పరిస్థితి గురించి అడపాదడపా వార్తలు ప్రసారం చేస్తున్నా, ఇవాళ విశ్వానికి తెలివొచ్చిందనే విషయాన్ని సంచలనం చేయడానికి వాళ్లందరూ కంకణం కట్టుకున్నారు. ఆ హడావిడి చూసి జనం కూడా ఏం జరిగిందో అని.. ఆ హాస్పిటల్ ముందు చేరిపోయారు. ఆ జనాన్ని అదుపు చేయడానికి పోలీసులు రంగంలోకి దిగారు.

అంతలో డాక్టర్లు బయటకు రావడంతో కెమెరాలు, మైక్ లు వాళ్ల ముందుకు చేరిపోయాయి.

టివి కెమేరాల ముందు ఓ డాక్టరుగారొచ్చి "విశ్వంబరరావుగారికి నాలుగు తూటాలు తగిలి, ఆపస్మారక స్థితిలో వారం రోజుల క్రితం ఆసుపత్రిలో జాయిన్ అయ్యారు. ఇప్పుడు ఆయన పరిస్థితి కొంచెం మెరుగయింది! అయితే ఇంకా ప్రాణాపాయం ఉంది. మరో రెండు రోజుల గడుస్తే గాని, ఏ విషయమూ చెప్పలేం! హీ ఈజ్ స్టిల్ ఆన్ లైఫ్ సపోర్ట్!" అంటూ ఇంకేం చెప్పడానికి లేదనట్టు చూశారు.

"సార్.. జరిగిన ఉదాంతం మీద విశ్వంగారు ఏమైనా చెప్పారా సార్!" ఓ విలేఖరి అడిగాడు.

"అవకాశం లేదు.. వెంటిలేటర్స్ తీసినా, ఆయనింకా మాట్లాడే పరిస్థితులలోకి రావడానికి టైము పడుతుంది. ఆయన్ని ఓ నాలుగు రోజుల వరకు డిస్టర్బ్ చేయకూడదు!" అంటూ ఆయన కెమెరాల ముందు నుండి కదలాడు.

"సార్.. ఈ విషయమే పోలీసులు ఏం అన్నారు?" ఓ విలేఖరి అత్రుతగా అడిగి, డాక్టరు దగ్గరగా మైకు పెట్టాడు.

"ఈ ప్రశ్న వారిని అడగాలి!" అంటూ నవ్వుతూ అక్కడ నుండి వెళ్ళిపోయాడు.

ఇక.. రకరకలా కథనాలతో ఆ ప్రాంతమంతా టివి స్టూడియోలను మరిపించింది!

కనబడ్డ వాళ్ళనందర్ని ఏవేవో ప్రశ్నలు వేస్తూ, రెండ్రోజులకు సరిపడా కథనాలను రికార్డు చేసి, వాళ్లందరు అక్కడనుండి నిష్క్రమించారు.

నాలుగు రోజులు గడిచాయి. విశ్వం బాగానే కోలుకున్నాడు. భూజం మీద, కాళ్ళ మీద తూటాలు తగిలాయి.. వాటిని తీసేసి, అక్కడే కట్లు కట్టారు. నొప్పి, నీరసం బాగా ఉన్నా, కొంత శక్తి వచ్చిందతనికి. కాపలాగా ఉన్న పోలీసుల్ని చూసి విశ్వం నవ్వుకున్నాడు. వాళ్ళు తన మిత్రులే.. తనతో క్లోజుగా ఉండే వాళ్లే!

వాళ్ళని చూసి పలకరింపుగా నవ్వితే, వాళ్ళ నుంచి స్పందన లేదు.

'తప్పదు.. ఉద్యోగ బాధ్యతల్లో ఉన్నప్పుడు బంధుత్వాలు, స్నేహాలకి తావుండదు!' తనలో తాను సమాధాన పరుచుకున్నాడు విశ్వం.

ఆ రోజు కమీషనర్ వస్తూ "ఏలా వున్నావు విశ్వం.. నువ్విలా చేస్తావని నేను ఊహించలేదు. ఐ కాంట్ బిలీవ్.. ఎనీ హౌ.. విష్ యు స్పీడీ రికవరీ!" అంటూ విశ్వం చేతిని సున్నితంగా తాకాడు.

విశ్వం ఆయన దగ్గర పనిచేసాడు. ఆ చనువుతో ఆయన అలా మాట్లాడాడు.

"థాంక్యూ సార్, కాని నన్ను ఎందుకు సార్ బ్రతికించారు?" విశ్వం నిస్సత్తువగా అడిగాడు.

"నో.. నో.. మనం చట్టం పరిధిలో పనిచేసే వాళ్ళం! ఇవన్నీ తప్పదు!" అంటూ డాక్టర్లతో ఏదో మాట్లాడి వెళ్ళిపోయాడు.

రెండు రోజుల తర్వాత విడుదలైన విశ్వాన్ని పోలీసులు నేరుగా జైలుకి తరలించారు!

హత్యానేరం మీద అప్పటికే అతను అరెస్టై ఉన్నాడు.

"రక్షక భటుడే భక్షక భటుడైతే..."

"నాయకులకే రక్షణ లేకుంటే... సామాన్యుడికి రక్షణ ఎక్కడా?"

"కేసుని పక్కదారి పట్టించడానికి పోలీసులు ప్రయత్నం..!"

"అన్నలతో విశ్వానికి చెలిమి!"

"కాశ్మీర్ టెర్రరిస్టులతో సంబంధం ఉందనే కథనాల కోణంలో పోలీసుల దర్యాప్తు?"... వంటి వార్తలతో వార్తాపత్రికల్లో కథనాల హోరు రెండ్రోజులు సాగాయి.

తర్వాత ఆ వార్త కనుమరుగై పోయింది!

★★

రెండేళ్లు గడిచాయి.

అధికార పార్టీ నగర అధ్యక్షుడు నరహరి హత్య కేసు మీద కోర్టులో విచారణ ప్రారంభమయింది.

విశ్వాన్ని కోర్టులో ప్రవేశ పెట్టారు.

కోర్టు ఫార్మాలిటిలు ముగిసిన తర్వాత, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వచ్చి విశ్వాన్ని ఓ బోనులో నిలబడ్డాడు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన సాక్షుల్ని ప్రవేశపెట్టడానికి కోర్టువారిని అనుమతి కోరాడు

"మీ పేరు..?"

"కాంత్ .. శ్రీకాంత్!"

"కాంత్ శ్రీకాంతా?" నవ్వుతూ అడిగాడు పి.పి.

"కాదండి... శ్రీకాంత్ నండి!"

"మీ తండ్రిగారి పేరు?"

"నరహరి గారు!"

"మీకు పెళ్ళి అయిందా?"

"అయింది!"

"మీరు, మీ నాన్నగారు ఒకే ఇంట్లో ఉంటారా?"

"అవును సార్!"

"మీరు ఏ ఉద్యోగం చేస్తున్నారు?"

"ఉద్యోగం ఏం చేయడం లేదు!"

"మరి.."

"పార్టీ కార్యకలాపాలకు మా నాన్నగారికి తోడుగా ఉండేవాడ్ని!"

"అంటే రాజకీయ వారసులా?"

"అదేం లేదు సార్.. ఏదో ప్రజలకి సేవ చేయడం.. అంతే!"

"సరే.. ముద్దాయి విశ్వం మీకు తెలుసా?"

"తెలుసండి!"

"ఎప్పట్నుంచి తెలుసు? ఎలా తెలుసు?"

"అంటే... ఎడాది కిందట నుంచి తెలుసండి. మా నాన్నగారికి గన్మాన్ గా వచ్చినప్పుడు పరిచయం అయ్యాడు సార్!"

"ఆయనకి మీ నాన్నగారికి ఘర్షణలు జరిగేవా?"

"అదేం లేదండి! అతడ్ని మా నాన్నగారు బాగా చూసుకునేవారు సార్! మా ఇంట్లో మనిషిలాగే ఉండేవారు!"

"మీ నాన్నగారికి శత్రువులు ఉండేవారా!"

"రాజకీయాల్లో శత్రువులు ఉంటడం సహజం కదా సార్!"

"ఆ శత్రువులు కాదు, బద్ధశత్రువులు...?"

"లేరు సార్!"

"పోనీ... ఆ రాజకీయ శత్రువులతో విశ్వానికి పరిచాయాలు ఉన్నాయా?"

"ఉన్నాయి సార్!"

"ఎలా చెప్పగలరు?"

"అతని ప్రవర్తన బట్టి... "

"వాళ్ళు ఈ హత్య చేయడానికి ముద్దాయిని ప్రేరేపించారా!"

"ఉండొచ్చు సార్!"

"సరే... ఆ రోజు అంటే మీరు ఇంట్లో ఉన్నారా!"

"ఉన్నాను సార్!"

"హత్య జరిగిన స్పాట్లో ఉన్నారా?"

"లేను సార్... శబ్ధాలు విని నా గదిలో నుంచి పరిగెత్తుకు వచ్చాను సార్!"

"తర్వాతా...?

"అప్పటికే మా నాన్నగారు రక్తం మడుగులో పడిపోయున్నారు. ఎదురుగా విశ్వం చాలా కోపంగా తూపాకి పట్టుకుని ఉన్నాడు. నేను రావడం అతను గమనించలేదు. ఆ క్షణంలో నేను కనబడితే అతను నన్నూ కాల్చిసేవాడే! ఇంకో ఆలోచన చేయకుండా మెల్లగా గదిలోకి వెళ్లిపోయాను. ఆ అలికిడికి విశ్వం వెనక్కి చూసే లోపుగా, గది తలుపులు మూసేసాను. ఒక్క క్షణం ఆలోచించి, నా దగ్గరున్న తుపాకి తీసుకుని, మరో గదిలో నుంచి బయటకి వచ్చి అతడ్ని కాల్చిసాను! నన్ను నేను కాపాడుకోవటానికి మరో గత్యంతరం లేదు సార్!"

"మీకు తుపాకి ఉందా.. ?"

"ఉంది సార్.. లైసెన్సు కూడా ఉంది!"

"దట్స్ ఆల్ మై ప్రెజెంటేషన్ యువర్ ఆనర్! ప్రముఖ రాజకీయ నాయకుడు నరహరిగారికి గన్ మాన్ గా ఉన్న ఈ ముద్దాయి విశ్వంబరరావు, తనకి ప్రభుత్వం ఇచ్చిన తుపాకితో అతి దారుణంగా ఆయన్నే కాల్చి చంపాడు. ఇందుకు సంబంధించిన ఇతర డాక్యుమెంటరీ ఎవిడెన్స్ ని కోర్టువారికి ఇదివరలో సబ్మిట్ చేయడం జరిగింది. రక్షణ కల్పించవలసిన విశ్వంబరరావు ఉద్యోగ బాధ్యతలను విస్మరించి, పోలీసు వ్యవస్థకే చెడ్డపేరు తీసుకొచ్చాడు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా, రక్షణ కల్పించే వ్యవస్థలలో పనిచేసే వారికి ఇలాంటి చెడు ఆలోచనలు రానీయకుండా ఉండాలంటే, ముద్దాయికి చట్టపరమైన కఠిన శిక్ష వేయవలసినదిగా కోర్డువారిని సవినయంగా కోరుతున్నాను! అంతే కాకుండా ముద్దాయి గతచరిత్ర చూస్తే... ఇతని పుట్టింది, పెరిగింది రంపచోదవరం! అంటే.. అక్కడ ఉండే నక్సలైట్లతో ముద్దాయికి సంబంధాలు ఉండటానికి అవకాశాలు ఉన్నాయి. ఆ కోణంలో డిపార్ట్మెంటు వారు దర్యాప్తు చేయటం అవసరమని భావిస్తున్నాను యవర్ ఆనర్!" అంటూ పి.పి.గారు తన వాదనను ముగించారు.

డిఫెన్స్ లాయరు శ్రీకాంత్ ని క్రాస్ ఎగ్జామినేషన్ చేయడానికి కోర్టువారి అనుమతి పొంది, తన వాదనను మొదలెట్టారు.

"హత్య జరిగిన రోజు మీరు తప్ప, ఇంకా ఇంట్లో మరెవరైనా ఉన్నారా!"

"ఉన్నారు సార్! ఇద్దరు పనివాళ్లు వేరే పనుల్లో ఇంటి వెనుక భాగంలో ఉన్నారు. ఉదయం కదా.. మా అమ్మగారు, మా ఆవిడ పూజా గదిలో ఉన్నారు! సంఘటన జరిగిన డ్రాయింగ్ రూములో ఎవరు లేరు సార్!"

"మీరూ లేరా?"

"నేనూ--- లేను.. లేను.. లేను సార్!" మాటలు తడబడ్డాయి.

"మరి విశ్వంగారే మీ నాన్నగారి మీద కాల్పులు చేసారని ఎలా చెప్పగలరు?"

"అదేమిటి సార్.. తూపాకి కాల్పులు వినబడిన మరుక్షణమే నేను నా గదిలో నుంచి వచ్చి చూసాను కదా! విశ్వం ఆవేశంతో తూపాకీ గురి చూసి పట్టుకుని, మా నాన్నగారి ఎదురుగా నాలుగు అడుగుల దూరంలో ఉన్నాడు. అక్కడ మరెవరు లేరు!"

"సరే.. మీ నాన్నగారితో మీరు తరుచు గొడవ పడుతూ ఉండేవారుట కదా! నిజమేనా?"

"నిజమే!"

"ఏ విషయంలో గొడవ పడేవారు?"

"తండ్రి కొడుకులు, భార్య భర్తలు.. వీరి మధ్య గొడవలు, అభిప్రాయ భేదాలు చాలా సహజం సార్! ఆ మాత్రం గొడవలు అందరిళ్లల్లో ఉంటాయి!"

"ఈసారి ఎన్నికల్లో మీరు పోటి చేస్తానని మీరు మీ నాన్నగారికి చెపితే, ఆయన ఒప్పుకోలేదుట?"

"అవును!"

"ఆ విషయంలో మీరు ఆయనతో రోజూ ఘర్షణ పడేవారుట కదా! నిజమేనా?"

"ఘర్షణ కాదు... వాదించేవాడ్ని! అంతమాత్రం చేత మా నాన్నగారినే హత్య చేస్తానా!"

"చేస్తారని నేను అనడం లేదు! చేయించడానికి ఆస్కారం ఉంది కదా?"

"ఐ యమ్ సారీ సార్! నేనంతా మూర్ఖుడ్ని కాను.. నా తండ్రిని నేనే హత్య చేయించడమా! నెవ్వర్!" ఆవేశంగా అన్నాడు.

"మీ లార్డ్! శ్రీకాంత్ గారు రాజకీయాలలోకి రావడానికి చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అందుకు వారి తండ్రి నరహరిగారు సహకరించడం లేదనే విషయం వార్తల్లో చూస్తూనే ఉన్నాం. ఆ వార్తలను కోర్టువారికి సమర్పించాను. రాజకీయలలో నైతిక విలువలు, సిద్ధాంతాలు, బంధుత్వాలు, బంధాలకు తావు ఉండదనే సత్యాన్ని మనం నిత్యం చూస్తూనే ఉన్నాం! ఈ నేపధ్యంలో శ్రీకాంత్ గారు నరహరిగారిని తప్పించడానికి విశ్వాన్ని పావుగా వాడుకుని, అతను బతికుంటే నిజం చెప్పేస్తాడని, అతడ్ని కూడా పథకం ప్రకారం హతమర్చడానికి శ్రీకాంత్ ప్రయత్నం చేసారు. సో.. మీ లార్డ్, తన రాజకీయ రంగప్రవేశానికి అడ్డుగా ఉన్న తన తండ్రి నరహరిగారిని తొలగించడానికి, కుట్ర పన్ని, ఈ హత్య చేయించడానికి మూలకారణమైన ఈ శ్రీకాంత్ ని చట్టప్రకారం తగిన శిక్ష వేయవలసిందిగా కోర్టువారిని కోరుతున్నాను!" అంటూ డిఫెన్స్ లాయర్ తన వాదనను ముగించారు.

ఇక ఎవరి వాదనలు లేకపోవడంతో  ముద్దాయిని ఉద్దేశిస్తూ.. "మీరు చెప్పుకోవలసినది ఏమైనా ఉంటే చెప్పండి!" అంటూ జడ్జిగారు అతని వైపు చూసారు.

"అయ్యా.. నా గోడు  వినడానికి అవకాశం ఇచ్చినందులకు మీకు ధన్యవాదాలు సార్!  ఐతే ఈ హత్య నేనే చేసానని ఋజువు చేయటానికి ఇంత ప్రయాసలు అక్కర్లేదు సార్.. మరోసారి చెప్తున్నాను.. ఈ హత్య నేనే చేసాను!...."

విశ్వం మాటలకు ఒక్కసారిగా కోర్టు హాల్లో నవ్వులు వినబడ్డాయి. జడ్జిగారు 'సైలెన్స్" అంటూ అందరి వైపు తీక్షణంగా చూడటంతో తిరిగి నిశ్శబ్దం అవహించింది.

"సార్... లాయరుగారు అనుకున్నట్టు, నా వెనుక నక్సలైట్లు, లేదా నరహరిగారి శత్రువులు, వారబ్బాయి శ్రీకాంత్.. ఎవరూ లేరు సార్! కేవలం నా ఆలోచనలే నన్నీ పని చేయించింది! అవును సార్.. దేశాన్ని దేశ ప్రజల్ని కాపాడవలసిన మేము, ఈ రోజు ఇలా ప్రజానాయకుడని అపించుకుంటున్న ప్రతి లోఫర్ కీ  కాపాల కాస్తున్నందులకు బాధగా ఉంది సార్! అసలు నాయకుడు అన్నవాడికి శత్రువులు ఉండకూడదు సార్.. ఉన్నా,  వారిని మిత్రులుగా మలుచుకునే నాయకత్వ లక్షణం వారిలో ఉండాలి! ప్రజల్లో  మమేకమై, స్వేచ్ఛగా తిరిగే పరిస్థితులను కల్పించుకోవాలి. దూషణ భుషణలకు అతీతంగా ఉండాలి.  కుతంత్రలు, క్షుద్ర రాజకీయాలు లేకుండా,  న్యాయంగా, నీతి నిజాయితీలతో అందరికి సేవ చేస్తే, అసలు వీళ్లకి శత్రువులు ఎవరుంటారు.. ప్రాణభయం ఎందుకుంటుంది సార్! దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన గాంధీగారికి సెక్యూరిటీ గార్డ్స్ ఉండేవారా సార్! బాలగంగాధర్ తిలక్ గారి నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి వరకు ఎవరికైనా రక్షక బటులు ఉండేవారా సార్!  మరి ఈ రోజు ప్రతీ వీధినాయకుడుకి సెక్యూరిటీ అవసరం వచ్చిందంటే..  వీరికి వీళ్ల ఇంట్లోనో, వీళ్ల చుట్టూ ఉన్నవాళ్లల్లోనో, వీళ్లకు శత్రువులు ఉన్నట్టే కదా సార్.. మరి వీళ్లు నాయకులు ఎలా అవుతారు సార్! నేటి ప్రభుత్వాలు  కొన్ని వేల కోట్ల రూపాయల ప్రజల సొమ్మును ఇలాంటి వారి రక్షణకు ఖర్చు చేస్తున్నాది సార్! నేను నరహరిగారిని కాల్చి చంపాననీ హంతకుడుగా గుర్తించారు. కాని నన్ను చంపడానికి ప్రయత్నం చేసిన వారాబ్బాయిని దేశభక్తుడుగా కోనియాడతారు. చచ్చిపోతున్న నన్ను బ్రతికించి ఇప్పుడు చట్టపరంగా చంపుతారు! కాని ఒక్క విషయం చెప్పాలి సార్! ఈ రోజు నాలా ఆవేదన చెందుతున్న ఎన్నో వేల ఈ దేశ ప్రజల అవేదనని చెప్పడానికి నాకు అవకాశం వచ్చింది. ఇదే ఓ సభ పెట్టి, ఈ విషయం చెపితే ఎవరికి పట్టదు సార్! ఓ సాహసం చేసి, అందరికి తెలియచేస్తేనే అది ప్రజల్లోకి వెళ్తుంది. ఆ సాహసమే నేను చేశాను సార్!  ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పబడుతున్న మన దేశంలో ఈ పరిస్థితులు  ఉండకూడదు సార్! నన్ను బ్రతికించి, ఈ మాటలు మీలాంటి న్యాయమూర్తుల ముందు చెప్పుకునే అవకాశం వచ్చినందులకు ధన్యవాదాలు చేపుతున్నాను సార్!  సెక్యూరిటీ గార్డులు లేకుండా సేవలందించే నాయకులు మన దేశంలో రావాలని కోరుకుంటూ, ఈ నేరాన్ని ఒప్పుకుంటూ, చట్టప్రకారం శిక్ష వేయవలసిందిగా నేనే కోరుకుంటున్నాను సార్!" అంటూ విశ్వం రెండు చేతులు జోడించాడు.

"విశ్వంగారు చెప్పిన విషయాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని, తగిన చర్యలు తీసుకోమని కోరుతూ, కేసుని తుది తీర్పు కోసం వాయిదా వేస్తున్నాను!" అంటూ జడ్జిగారు లేచి వడివడిగా తన చాంబర్ వైపు దారితీసారు.

కోర్టు కరతాళ ధ్వనులతో మారుమ్రోగింది.

## పుస్తక సామ్రాట్ — రాచపూటి రమేశ్

సుబ్బయ్య మా వూరొచ్చే సరికి అతనికొక ఇరవై ఏళ్లుంటాయేమో! డెబ్బైయవ దశకం అది. ఆంధ్రదేశంలో విస్తారంగా పంపిణీ ఔతున్న మూడు దినపత్రికల్లో ఒకటైన ఆంధ్రపత్రిక ఏజెన్సీ తీసుకొని, సుబ్బయ్య ఆ పత్రిక సర్కులేషన్ను బాగా పెంచాడు. తెలిసినవాళ్లతో బాటూ తెలియని వాళ్లనూ ఇట్టే పరిచయం చేసుకొని, నవ్వుతూ, నవ్విస్తూ చందాదారులను చేర్పించేసేవాడు. బస్టాండ్ వద్ద ఒక చిన్న కొట్టు అద్దెకు తీసుకొని అన్ని దినపత్రికలతో బాటూ రకరకాల వారపత్రికలు తెప్పించేవాడు. అవి షాపు బయట పూలగుత్తుల్లా వేలాడుతూ పాఠకులను వూరిస్తూ వుండేవి. ఆ రోజుల్లో చదువరులు చాలా ఎక్కువగా వుండేవారు. ఆంధ్రప్రభ, పత్రిక, యువ, చందమామ వంటి పేరెన్నిక గల పత్రికలే కాక అపరాధ పరిశోధన, జ్యోతి, భారతి వంటి మేగజైన్స్ దొరుకుతూ రావడంతో అనతి కాలంలోనే పుస్తక ప్రియులకు సుబ్బయ్య కొట్టు ఒక 'ఫేవరెట్ హాంట్'గా మారింది. నేను సాయంత్రాలు సుబ్బయ్య కొట్టులో కూర్చుని అతనితో పిచ్చాపాటీ మాట్లాడుతూ కాలక్షేపం చేసేవాడిని, చోటు చాలక క్రమంగా సుబ్బయ్య కొట్టు పట్టణ కూడలిలో ఇంకో పెద్ద దుకాణానికి మారింది. నేను తిరుపతిలో ఎమ్మే చదువుతూ శెలవుల్లో మా వూరొచ్చినప్పుడల్లా సుబ్బయ్య కొట్టుకు వెళ్లి అతనితో మాట్లాడుతూ కాలం గడిపేవాడిని. ఆ క్రమంలోనే సుబ్బయ్య గత చరిత్ర తెలుసుకో గలిగాను.

★★★

సుబ్బయ్య ఒక సామాన్య రైతు కూలీ ఇంటిలో జన్మించాడు. వాళ్ల తెలుగు మాస్టారి కారణంగా అతనికి కథలు చదవాలని, వినాలని కోరిక పుట్టుకొచ్చింది. సుబ్బయ్య వున్న పల్లెలో ఒక గ్రంథాలయం వుంది. తీరిక సమయాల్లో అతనక్కడ కూర్చుని కథల పుస్తకాలు విపరీతంగా చదివేవాడు. క్రమంగా పత్రికలు చదవడం, అందులోని కథలను వర్ణనలతో తోటి మిత్రులకు చెప్పడం అతని ఆసక్తిగా మారింది. సుబ్బయ్య పదవ తరగతి పాసవగానే అతని తండ్రి సుబ్బయ్యనిక చదివించలేనని పనిలో పెట్టాడు.

వూర్లోని ఒక మోతుబరి ఆవుల మందను రోజూ సమీపంలోని చిట్టడివిలోకి తోలుకొనిపోవడం, పగలల్లా ఆవులు కాచి, మధ్యాహ్నం తల్లి కట్టించిన ఏ మజ్జిగన్నమో తిని, సాయంత్రానికి మందను వూర్లోకి తోలుకొని రావడం అతని పని. సుబ్బయ్యకు తోడుగా కొద్ది రోజులు ఒక మనిషిని పంపారు. ఐతే రానురానూ ఆ మనిషి రావడం తగ్గించి, సుబ్బయ్య ఒక్కడే పశువుల మందను మేపుకొని వచ్చేవాడు. ఒకరోజు ఆవులు పచ్చిక మేస్తుండగా, సుబ్బయ్య చెట్టుకింద కూర్చుని ఏదో పుస్తకం చదువుతూ వుండగా ఒక ఆవు తప్పిపోయింది. ఆవులను ఇంటికి తోలుకుని వెళ్లాక, ఆవు తప్పిపోయిన విషయం తెలుసుకొని తండ్రి అతడిని చితకబాదాడు. భయంతో సుబ్బయ్య ఇంట్లో చేతికందిన డబ్బు తీసుకొని రాత్రికి రాత్రి ఆ వూరినుండి వెళ్లే రైలెక్కి విజయవాడ చేరుకున్నాడు.

విజయవాడలో ఎవరూ తెలియక దిక్కులు చూస్తున్న సుబ్బయ్యను ఒక టీకొట్టు యజమాని గమనించి, ఆదరించి, తన టీ కొట్టులో పనికి పెట్టుకున్నాడు. కానీ ఆ పని నచ్చక సుబ్బయ్య నెలరోజులకే ఆంధ్రపత్రిక ఆఫీసు ఎక్కడుందో తెలుసుకొని అక్కడికి వెళ్లాడు. అక్కడి మేనేజరును బతిమాలి ఆ ప్రెస్సులోనే పనికి కుదిరాడు. బైండింగు, పత్రికల కట్టలు మోయడం, సిబ్బందికి టీలు, టిఫెన్లు అందించడం ఇలా అన్ని పనులు చేస్తూ క్రమంగా మేనేజరు దృష్టిని ఆకర్షించాడు. సుబ్బయ్య చదువరితనం గమనించి మేనేజరు ఏడాదికే సుబ్బయ్యకు ప్రూఫులు దిద్దే పని అప్పగించాడు. ఆ పనిని చక్కగా చేయడంతో బాటూ చిన్న వార్తలు రాయడం, పిల్లల కథలు రాయడం వంటి బాధ్యతలు కూడా సుబ్బయ్యకప్పగించేవారు. ఉదయం పూట సుబ్బయ్య పేపర్ బాయ్ గా కూడా పనిచేస్తూ, మనుషులతో ఎలా మెలగాలో నేర్చుకున్నాడు. మూడు, నాలుగేళ్లలో కొంత సొమ్ము అతను కూడబెట్టడంతో పత్రికవాళ్లు ఏజెన్సీలేని చోట సుబ్బయ్యకు పత్రిక ఏజెన్సీ ఇచ్చి వ్యాపారాన్ని అభివృద్ధి చేయమన్నారు. ఆ ప్రాంతం తాను పుట్టి పెరిగిన ఇలాకాలోనే వుండడంతో సుబ్బయ మా వూరొచ్చి అలా పత్రికలమ్మే దుకాణం తెరవడం జరిగింది.

సుబ్బయ్య తన కొట్టులోని పత్రికల్లోని కథలు, నవలలు, సీరియళ్లు ఏవీ వదలకుండా చదివేవాడు. తన కొట్టుకు రెగులర్ గా వచ్చే పాఠకులకు ఫలాన పత్రికలో ఫలానా కథ బాగుందనో, ఫలానా నవల బాగుందనో, ఫలాన రచయిత కథలు బాగా రాస్తున్నాడనో చెప్పేవాడు. పుస్తకావిష్కరణలకన్నింటిలో మంచి నవలలు, కథా సంకలనాలతో పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేసేవాడు. మంచి వక్తలు సాహిత్యం గురించి మాట్లాడుతూ వుంటే ఆనందంతో మైమరచి వినేవాడు. అప్పుడు నవలా ప్రభంజనం నడుస్తూ వుండేది. మంచి రచయిత(త్రు)ల నవలలన్నీ తెప్పించి అమ్మేవాడు సుబ్బయ్య.

సాహిత్య తృష్ణతో సుబ్బయ్య పత్రికలలో వస్తున్న సీరియళ్లను బైండింగ్ చేయించి పెట్టేవాడు. కొన్నాళ్లకు షాపు పక్కనే ఒక చిన్న లైబ్రరీ ఏర్పాటు చేసి పాత నవలలు, పాత మేగజైన్స్ తో బాటూ ఆ బైండింగ్ పుస్తకాలు కూడా వుంచాడు. ఆ గదిలో బుచ్చిబాబు, శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, కరుణశ్రీ వంటి మహా రచయితల ఫోటోలు గోడలకు వేలాడుతూ దర్శనమిచ్చేవి. పాఠకులు విరివిగా ఆ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదువుతూ వుండేవారు. ఆ గది బయట కొంత ఖాళీ స్థలం

వుండడంతో సాయంత్రం కొందరు రచయితలు అక్కడ కుర్చీలలో కూర్చుని సాహిత్య చర్చలు జరుపుతూ కనిపించేవారు. పుస్తకాలు అమ్ముతూనే సుబ్బయ్య ఆ చర్చలను శ్రద్ధతో వినేవాడు.

కొట్టుకు వచ్చిన పాఠకులకు 'రావిశాస్త్రి అల్పజీవి చదివారా, గొప్ప నవల అండీ' అనో 'మధురాంతకం గారి కొత్త కథా సంకలనం చదువుతూ వుంటే మీకు టైమే తెలీదు' అనో సలహాలు ఇస్తుండేవాడు.

తొంభైలు రావడంతో టీవీలు, సీరియళ్ల ప్రభంజనంతో పఠనాసక్తి కొంత తగ్గింది. పాఠకులు క్రమంగా తగ్గుతూ వస్తున్నారని సుబ్బయ్య బాధపడేవాడు.

"ఏముందండీ! ఆ సీరియళ్లలో, ఒక మంచి పుస్తకం చదివితే వచ్చే ఆనందం వస్తుందా?" అని వాపోయేవాడు.

సుబ్బయ్య ఎలాగో కష్టపడి కూడబెట్టి వూరి శివార్లలో ఒక చిన్న ఇల్లు కట్టుకోగలిగాడు. అక్కడే సుబ్బయ్య భార్య, ఇద్దరు కొడుకులు, కోడళ్లు వుండేవారు. కొడుకులకు అతని సాహిత్యాభిలాష అబ్బలేదు. వారి పెళ్లిళ్లయ్యాక సుబ్బయ్య ఎలాగో పిల్లలిద్దరికీ కొంత డబ్బు సమకూర్చడంతో ఒకడు టాక్సీ డ్రైవరుగా, ఒకడు కిరాణా కొట్టు నడుపుతూ జీవించేవారు. సుబ్బయ్యకు ఏ దురలవాట్లు లేకపోవడంతో అతని ఆరోగ్యం బాగానే వుంది. కొన్నాళ్లకు నవలలు అద్దెకిచ్చే షాపు కూడా తెరిచాడు సుబ్బయ్య.

సుబ్బయ్యతో నేను తరచు భరాగోగారి కథలలో ఛలోక్తులు, రాజారాం గారి నిత్యనూతన శైలి, మునిపల్లె రాజు గారి కథలలో తత్త్వ విశ్లేషణ వంటి విషయాలు చర్చించేవాడిని. ఆ సంభాషణల వలన పదవ తరగతి వరకే చదివిన సుబ్బయ్య ఎంత బాగా ఆ కథలలోని జీవాన్ని పట్టుకున్నాడో నాకర్థమై ఆశ్చర్యం కలిగేది.

ఆంధ్రపత్రిక వజ్రోత్సవ సంచిక అందుకొని సుబ్బయ్య మురిసిపోయాడు.

"ఒక పత్రిక డెబ్భైఐదేళ్లు నడిచిందంటే ఎంత గొప్ప విషయమండి. ఎన్ని ఆణిముత్యాల్లాంటి కథలు ఇన్నాళ్లలో వెలికి తెచ్చిందో" అనేవాడు.

రెండు వేల సంవత్సరం తరువాత పత్రికలు తగ్గినా పాఠకులు తగ్గలేదు. చాలామందికి నవలలు అద్దెకు తీసుకుని చదివే పద్ధతి వుండడం వలన సుబ్బయ్యకు ఆదాయం బాగా వచ్చేది.

ఇంటికోసం, పిల్లల ఎదుగుదల కోసం సుబ్బయ్య కొన్ని అప్పులు చేశాడు. ఆదాయంలో అధిక భాగం ఆ కంతులకూ, వడ్డీలకు వెళ్లిపోయేది.

సుబ్బయ్య కోడళ్లు మాత్రం "ఇంటి నిండా, అటకలపైనా పుస్తకాలు తప్ప ఏం మిగిల్చాడు ఈ ముసలాయన, ఆ పుస్తకాలకు పెట్టే డబ్బుతో ఎప్పుడో రెండు ప్లాట్లు వచ్చి వుండేవి. చాదస్తపు పీనుగ" అని మామగారిని పరోక్షంగా దెప్పి పొడుస్తూ వుండేవారు.

ఎప్పుడూ చదువుతూ వుండడంతో సుబ్బయ్యకు కంటిచూపు మందగించింది. పైపెచ్చు ఆస్తమాతో బాధపడుతున్న భార్య వైద్యానికి ఎక్కువ శాతం డబ్బు ఖర్చైపోయేది.

రోడ్డు విస్తరణలో భాగంగా సుబ్బయ్య కొట్టును బజారు నుండి దూరప్రాంతానికి తరలించాల్సి వచ్చింది. ఆ పుస్తకాల షాపులో ఇంతకు ముందులా పాఠకులు కనబడడం లేదు.

ఇంటర్ నెట్ ప్రపంచంలో యువతకు బొత్తిగా సాహిత్యం పట్ల అనురక్తి లేకుండా పోయింది. పైపెచ్చు 2019 నుండీ మొదలైన కోవిడ్ మహమ్మారి అనేక పత్రికలు మూత పడేలా చేసింది.

సుబ్బయ్య నేను వుద్యోగం చేసే బ్యాంకు ముగిసే వేళకు వచ్చి, నన్ను ఏ పార్కుకో తీసుకెళ్లి 'విపుల ఆగిపోయిందండి, ప్రపంచ భాషల సాహిత్యాన్నంతా మనం ఇళ్లలో కూర్చుని చదివేలా చేసిన మహానుభావుడు రామోజీరావు గారు ఎంత గొప్పవాడండి' అని బాధతో వాపోయేవాడు. గతంలో 'రచన' 'హాసం' వంటి ఉత్తమ పత్రికలు ఆగిపోయినప్పుడు కూడా అతను ఇలాగే దిగులు పడ్డట్టు గుర్తు. కారా మాస్టారు లక్షల పుస్తకాలు పోగుచేసి కథానిలయం పెట్టారు. ఎంత గొప్పవ్యక్తి కన్నుమూశారండి" అని బాధపడేవాడు.

ఒక రోజు నేను ఇంట్లో వుండగా వచ్చి 'వచ్చే నెల నుండి తెలుగు వెలుగు ఆగిపోతూ వుందండి, తెలుగు నుడికారాన్ని, యాసలనూ, అచ్చ తెలుగు మాండలిక కథలను వేసి ఎంతగానో బాష ఎదగడానికి వాళ్లు కృషిచేశారు. రచయితలకు పారితోషికమూ బాగానే ఇచ్చేవారు. నవ్య వీక్లీ ఎలాగూ ఆగిపోయింది. తెలుగు సాహిత్యానికి ఇది దుర్దినం' అని కళ్ల నీళ్లు పెట్టుకున్నాడు. నాకూ బాధ కలిగింది.

"ఇంటర్ నెట్ గురించి తెలుసుకోవయ్య, ఎన్నో పత్రికలు ఆన్ లైన్లో వస్తున్నాయి. మంచి మంచి పుస్తకాలు ఖర్చు లేకుండా చదవచ్చు" అని నేనంటే 'ఈ వయసులో నాకు ఆ సాంకేతికత ఎలా పట్టుబడుతుందండీ, పైగా కంటి చూపు సమస్య' అనేవాడు నవ్వుతూ.

నాకు ఆయాచితం నటేశ్వర శర్మగారు రాసిన 'పాఠకులు కావలెను' కవితలో పంక్తులు గుర్తుకొచ్చాయి.

"మూలుగుతున్నాయి పుస్తకాలు, మూలనున్న అరలలో

గూట్లో పడుకొన్న పుస్తకాలు గోడును వినమంటున్నాయి" అన్నట్లు అనిపించింది సుబ్బయ్య పడుతున్న వ్యధను గురించి.

సుబ్బయ్య భార్య అనారోగ్యంతో పోరాడి ఏడాది క్రితం కన్నుమూసింది. ఇంటి నిండా పుస్తకాలతో, డబ్బు ధ్యాస తప్ప తనను, తన పుస్తకాలను పట్టించుకోని కొడుకులు, కోడళ్లతో సుబ్బయ్య ఒంటరిగా మిగిలాడు.

సుబ్బయ్య కొట్టును మూసేశాడు. మంచి మంచి పుస్తకాలన్నీ గ్రంథాలయాలకు, స్నేహితులకు కానుకగా ఇచ్చి వేశాడు. మిగిలిన పత్రికల కట్టలు, బైండింగ్ లో వున్న మంచి కథల పేపర్ కటింగ్స్, మిగిలిన పుస్తకాలు తూకానికి అమ్మి సొమ్ము చేసుకోవాలని అతని కోడళ్లు చూస్తున్నారు.

సుబ్బయ్య మంచం పట్టాడు. అది అనారోగ్యం వల్లని డాక్టర్లు చెబుతూ వున్నా, పత్రికలన్నీ ఆగిపోయి, సాహిత్యానికి వూపిరి లేకుండా పోయిందన్న దిగులు వల్లేనని నా అనుమానం.

ఒకరోజు సుబ్బయ్య నన్ను పిలిచి, "బాబూ, ఈ అలమారా నిండా నేను నాకిష్టమైన రచయితల కథా సంపుటులు ఎన్నో ఏళ్ల నుండీ పోగుచేశాను. అవి ఎప్పుడూ అమ్మాలనుకోలేదు. ఇప్పుడవి ఎవ్వరికీ అక్కరలేదు నేను పోయాక నా చితిలో కట్టెలతో పాటూ ఆ పుస్తకాలు కూడా వేసి కాలిస్తే, ఆత్మీయ నేస్తాల మధ్య కనుమరుగయ్యాననే తృప్తి నాకుంటుంది" అన్నాడు.

"నువ్వెక్కడికి పోవు. ఇంకో ఐదేళ్లు నీకు ఢోకా లేదు" అని నేనతనికి భరోసా ఇచ్చాను.

కానీ రెండు రోజుల్లోనే సుబ్బయ్య మరణ వార్త వినాల్సి వచ్చింది. అతని పిల్లలకు సుబ్బయ్య ఆఖరి కోరిక గురించి చెప్పి, ఆ పుస్తకాలను కూడా చితిలో పేర్పించాను. సుబ్బయ్య పార్థివ దేహంతో బాటూ అతని ప్రియ సాహిత్య నేస్తాలు చితిమంటలలో కాలిపోయాయి.

నా గుండె బరువెక్కింది. కను కొలుకుల నుండీ కన్నీరు ధారాపాతంగా కారింది. ఖిన్న హృదయంతో ఆ 'పుస్తక సామ్రాట్' ఆత్మశాంతి కోసం భగవంతుడిని ప్రార్థించాను.

# కల్తీ లేని దుఃఖం

దమ్మవళం శ్రీనివాస్

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
బహుమతి పొందిన కథ

"హలో?"

"బాబూ కిరీటి, నేనూ బాబాయ్ ని. ఊరినుంచి.." గొంతులో బాధ ధ్వనించింది.

"చెప్పు బాబాయ్. ఏం జరిగింది?" కంగారుగా అడిగాను. పొద్దున్నే ఏడింటికి ఊహించని మనిషి దగ్గర్నుంచి ఫోన్ వస్తే కంగారుగానే ఉంటుంది. నా గొంతు విని పక్కనే పడుకొని ఉన్న మా ఆవిడ సరిత కూడా నిద్రలేచి గాబరాగా చూస్తోంది.

చెప్పాల్సింది చెప్పి బాబాయ్ ఫోన్ పెట్టేసాడు. నా మొహం పాలిపోయిందేమో, సరిత గాబరా ఎక్కువైంది.

"ఏంటండీ? ఎవర్నుంచి ఫోన్? ఏం జరిగింది??" సరిత అడగటం తెలుస్తోంది కానీ నా మెదడుతో నాకు సంబంధం తెగిపోయినట్టుగా, ఏం చేయాలో తెలీనట్టుగా అనిపించింది. అచేతనంగా ఉండిపోయాను. ఏ ఆలోచనలూ రాలేదు కాసేపు. అసలు ఇది నిజంగానే జరుగుతుందా లేక కలా? ఉలిక్కిపడి కళ్ళు తెరుస్తానా ఇప్పుడు? పీడకల అని అర్థమయ్యాక హాయిగా అనిపిస్తుందా? అప్రయత్నంగా కళ్ళు మూసుకొని తెరిచాను. అలా మరోసారి, మరో..

సరిత గట్టిగా నా భుజాన్ని తోస్తూ మళ్ళీ ఏం జరిగిందని అడిగేటప్పటికి నిజంగానే ఉలిక్కిపడి ఈ లోకానికి వచ్చాను.

"మా నాన్న చనిపోయారుట. ఇవాళ ఉదయం. ఇంతకు ముందే తెలిసిందిట.." బాధగా ఇంకా ఏదో చెబుతూండగా సరిత వినిపించుకోలేదు. "అయ్యో" అని హడావిడిగా పక్కమీదనుంచి లేచి తన ఫోన్ అందుకొని పక్క గదిలోకి వెళ్ళిపోయింది. వాళ్ళింట్లో వారికి చెప్పడానికనుకుంటా.

మైండ్ బ్లేంక్ అయింది అని పుస్తకాల్లో ఎప్పుడైనా చదివితే నవ్వుకునేవాడ్ని అలా నిజంగా చస్తే జరగదు అని. కానీ ఆ స్థితి అనుభవించాక అర్థమైంది అనవసరంగా నవ్వుకునేవాడ్నని. ఉబికివస్తున్న కన్నీళ్ళు కర్చీఫ్ తో తుడుచుకుంటూ మంచం మీద కూలబడిపోయాను. ఏంటిది ఇలా జరిగింది? రెండ్రోజుల క్రితం నాన్న అదేపనిగా ఫోన్ చేయటం గుర్తొచ్చింది. ఆఫీసు పని ఒత్తిడిలో పట్టించుకోలేదు. ఛ. ఆయనతో మాట్లాడి ఉంటే ఎంత బావుండేది. ఇంట్లో అందరినీ తీసుకువెళ్లి ఆయన దగ్గర ఓ పదిరోజులు ప్రశాంతంగా గడుపుదామని ఎప్పటినుంచో అనుకుంటున్నాను కానీ కుదర్లేదు. ఇంతపని జరుగుతుందని ఏమాత్రం ఊహించినా పనులన్నీ పక్కకు తోసి రెక్కలు కట్టుకొని ఆయన దగ్గర వాలేవాడ్ని. జీవితం సాఫీగా జరిగిపోతుందని అనుకొంటూండగా హఠాత్తుగా పొద్దున్నే ఈ దుర్వార్త. ఎంత పని జరిగింది నాన్నా!! తెరలు తెరలుగా వస్తున్న దు:ఖాన్ని దిగమింగుకోటానికి ప్రయత్నించలేదు. కాసేపు తనివితీరా ఏడుస్తేనే మనసులో ఉన్న బరువు కొంతైనా తగ్గుతుందనిపించింది.

★★★

తల బద్దలైపోతూంటే టేబ్లెట్ వేసుకున్నాను. జరగాల్సింది చూడాలిప్పుడు. పక్కనే ఉన్న మొబైల్ ఫోన్ మీద పడింది నా దృష్టి. వార్త సక్రమంగా తెలియబరిచానన్న సంతృప్తి కాబోలు, మౌనంగా ఉందది. దాని ఖరీదు మనసులో

మెదిలింది. లక్ష రూపాయలు! విరక్తిగా నవ్వుకున్నాను. చిన్నప్పటి పేదరికం గుర్తుకొచ్చింది. కిందటి సంవత్సరం మా నాన్న పుట్టినరోజుకు సరిగ్గా అందేలా ఓ కొత్త మొబైల్ ఫోన్ గిఫ్ట్ పేక్ చేసి పంపాను. ఆయన నాతో అదే ఫోన్లోంచి సంతోషంగా గద్గద స్వరంతో మాట్లాడిన మాటలు నాకెప్పటికీ గుర్తుండిపోతాయి. అప్రయత్నంగా ఫోన్ అందుకొని ఆయన నెంబర్ వెదికి కాల్ చేసాను. ఆఫ్ చేసుందన్న వాయిస్ వినిపించింది. మరిక ఎప్పటికీ ఆయనతో మాట్లాడలేను అన్న ఆలోచన నన్ను దు:ఖంలో ముంచెత్తింది. ఆయన్ను గురించిన ఆలోచనలు మనసును తొలిచేయసాగినయ్.

రైతు కూలీగా జీవితం గడుపుతూ అష్టకష్టాలు పడి నన్ను ఇంతవాడ్ని చేసాడు మా నాన్న రుద్రయ్య. చదువు లేకపోయినా మంచి చెడు చాలా చక్కగా తెలిసిన మనిషి. తనలా నా జీవితం రెక్కల కష్టానికే పరిమితం కావొద్దని అప్పుచేసి మరీ నన్ను ఊళ్ళోకెల్లా మంచి ఇంగ్లీషు మీడియం స్కూల్లో చేర్చాడు. కటిక పేదరికమంతా తనకీ అమ్మకి మాత్రమే పరిమితం చేసుకొని నన్ను మాత్రం ఏ లోటూ లేకుండా పెంచాడు. పరీక్షలెగ్గొట్టి జులాయిగా తిరిగినా కోప్పడకుండా ఓపిగ్గా నచ్చజెప్పేవాడు. అమ్మను కూడా నా మీద చేయి వేయనిచ్చేవాడు కాదు ఎంత వెధవ పని చేసినా. ఒక్కడ్నే సంతానమైన నేనంటే ఆయనకు అంత పిచ్చి ప్రేమ.

నాకు పదిహేనేళ్ళప్పుడు ఓసారి స్కూలు ఎగ్గొట్టి సిగరెట్ తాగుతూ రింగు రింగులుగా పొగ వదలటం ఆయన కళ్లబడ్డది. భయంతో వణికిపోయాను. అప్పుడు కూడా ఆయన నన్ను కోప్పడలేదు. తను ఎలా చమటోడ్చి నన్ను చదివిస్తున్నదీ చెప్పలేదు. పక్కకు తీసుకువెళ్లి చెడు అలవాట్ల వల్ల 'నా' జీవితం ఎలా నాశనమవుతుందో రెండు గంటలకు పైగా వివరించాడు. ఎక్కడా ఆయన ప్రసక్తి లేదందులో. ఆ తర్వాత ఎంతో మార్పు వచ్చింది. నాలో కాదు ఆయనలో! ఎందుకంటే ఆ మరుసటి రోజే నేను స్నేహితులతో మందు కొడుతూ ఆయన కళ్లబడ్డాను. అప్పుడు అర్ధమైంది ఆయనకు నేను చిన్న పిల్లాడ్ని కాను బాగా ఎదిగిపోయానని. ఆ తర్వాత నుంచీ నాకు మంచి చెడ్డలు చెప్పటం పూర్తిగా మానేసాడు. అమ్మకు కూడా విషయం చెప్పలేదు. నిర్లిప్తంగా ఉండిపోయాడు. ఆ సంఘటన నాలో విపరీతమైన అపరాధ భావం కలిగించి నన్ను కదిలించేసింది. క్రమంగా నాలో ఆయన ఆశించిన మార్పు వచ్చింది. చదువు మీద బాగా శ్రద్ధ పెట్టసాగాను. పట్నం వచ్చి పై చదువులు కూడా మంచి మార్కులతో పూర్తిచేసుకొని ఓ పెద్ద కంపెనీలో చేరి మంచి స్థాయికి చేరుకున్నాను.

మా నాన్నకు నా విషయంలో ఉన్న ఓపిక తలచుకుంటే ఎప్పుడూ ఆశ్చర్యమే నాకు. మా అబ్బాయి అనురాగ్ పుట్టాక కానీ అర్ధం కాలేదు పిల్లల వెధవ చేష్టలు భరించడం ఎంత కష్టమో అని. అయితే నేను మా నాన్నలా కాదు. మా వాడ్ని ఎన్నో సార్లు తనివితీరా కొట్టాను. ఈ మధ్యే ఇంటర్ చదివే వాడి దగ్గర సిగరెట్ వాసన వస్తే ఒళ్ళు చీరేసాను..

"త్వరగా లేవండి. ఇంకో గంటలో బయలుదేరితే మంచిది. ట్రాఫిక్ ఎక్కువవుతుంది లేకపోతే" సరిత మాటలకి ఈ లోకంలోకి వచ్చిపడి, తలూపాను అంగీకారంగా.

అటాచ్డ్ బాత్ రూంలోకి వెళ్తూండగా బయట అనురాగ్ ఫోన్లో ఎవరో ఫ్రెండ్ తో మాట్లాడటం వినిపించింది. క్రికెట్ టోర్నమెంట్ కి రాలేనని చెబుతున్నాడు బాధగా. వాడికి క్రికెట్ అంటే యమ పిచ్చి. వేరే ఊళ్ళో ఎక్కడో ఆడాలని నన్ను ఐదువేలు అడిగాడు ఖర్చులకు. ఇంకా ఇవ్వలేదు. అదిప్పుడు మిగిలినందుకు సంతోషమేసింది. దండగ ఖర్చు. డబ్బు విలువ డబ్బులో పుట్టిన వీడికేం తెలుసు?

ముగ్గురం ముప్పావు గంటలో హడావిడిగా తయారయి, బట్టలు సర్దుకొని కారులో మా నాన్నను చివరిసారిగా చూడ్డానికి బయలుదేరాం. ఇదే పని ఆయన బతికుండగా చేసుంటే ఎంత బావుండేది అనుకున్నాను బాధగా. ఊరు చేరటానికి కనీసం మూడు గంటలు పడుతుంది. ఆఫీసులో విషయం చెప్పేసాను. వరసబెట్టి కండోలెన్స్ మెసేజెస్ రావటం మొదలైనయ్. ఏవీ ఓపెన్ చేయలేదు. వాటికి స్పందించే మూడ్ ఏమాత్రం లేదు. కాల్స్ కూడా మొదలవడంతో ఫోన్ పక్కన పడేసి జాగ్రత్తగా డ్రైవ్ చేయసాగాను. ఖరీదైన కారు మెత్తగా సాగిపోతుంది. అంతా మౌనంగా ఉన్నారు. కారెక్కగానే పాటలు పెట్టమనే అనురాగ్ కూడా వెనక సీట్లో చప్పుడు చేయకుండా కూర్చున్నాడు. తల వెనక్కి తిప్పి వాడి వైపు చూసానోసారి. మొహం బాధగా పెట్టి బయటకు చూస్తున్నాడు. అది ఖచ్చితంగా క్రికెట్ టోర్నమెంట్ మిస్ అయినందుకే అనిపించింది. మా నాన్నతో వాడికి పెద్ద అనుబంధం లేదు. అసలు కలిసింది కూడా చాలా తక్కువసార్లు.

చిన్నప్పటినుంచీ ప్రతీ రూపాయికీ నాన్న పడ్డ అవస్థ చూసాక డబ్బు ఎంత విలువైందో, పొదుపుగా ఉండటం ఎంత అవసరమో నాకు బాగా అర్ధమైంది. తేలిగ్గా డబ్బు ఖర్చు చేసేవాళ్ళు (నా సతీమణి సరితతో సహా) నన్నో పీనాసి అనుకున్నా నేనెప్పుడూ పట్టించుకోలేదు. డబ్బు లేనప్పుడు కానీ దాని విలువ అర్థం కాదు.

ఉద్యోగంలో చేరిన కొత్తల్లో మొట్టమొదటి లక్ష రూపాయలు త్వరగా సంపాదించాలని నాకు చాలా కోరికగా ఉండేది. పొదుపుగా ఉంటూ కూడబెట్టసాగాను. అప్పుడే నాకో సమస్య ఎదురైంది. నాన్న దగ్గర్నుంచి. ఆయనకు అత్యవసరంగా పాతికవేలు కావాల్సి వచ్చింది. మూడెకరాల భూమి చవకగా సొంతం చేసుకునే అవకాశం ఆయన యజమాని కల్పించాడు ఏళ్ళ తరబడి ఆయన చేసిన సేవకు గుర్తింపుగా. కొద్దికొద్దిగా ఆయన కూడబెట్టిన డబ్బు, ఇంట్లో, ఒంటి మీదున్న బంగారం, స్నేహితుల దగ్గర అప్పు అంతా కలిపినా పాతికవేలు తక్కువైంది. వేరే దారేదీ కనబడక నన్ను అడిగాడు. అప్పటికే నా దగ్గర నలభై వేల పైనే పోగైంది. నా చదువు కోసం చేసిన అప్పు కూడా ఆయనే తీరుస్తున్నాడు. మాటవరసకు కూడా ఆ భారం నామీద వేయలేదు. అయినా నాకెందుకో డబ్బు సర్దాలనిపించలేదు. 'ఇప్పుడా పొలం కొనకపోతే ఏం?' అనిపించింది. ఆయన యజమాని మీద కోపం ముంచుకొచ్చింది. ఏ ఆస్తీ లేని నాన్న చిన్న భూమికి యజమానిగా మారాలని ఆశపడటంలో తప్పులేదు. కానీ మొదటి లక్ష త్వరగా సంపాదించాలన్న నా న్యాయమైన కోరిక

ముందు ఆయన కోరిక చిన్నదిగా తోచింది. నేను సంపాదించే లక్ష కూడా కుటుంబానికే కదా అనిపించింది. ఒకటిరెండు సార్లు అడిగాక నా దగ్గర సరైన స్పందన లేక అడగటం మానేసాడు నాన్న.

ఆయనకు కోపం వచ్చిందేమో అనుకున్నాను కానీ అలా జరగలేదు. ముందే చెప్పినట్టు నాన్నకు నేనంటే పిచ్చి ప్రేమ. డబ్బు సర్దలేదని ఏమాత్రం నొచ్చుకోలేదు. భూమిని వదులుకోటానికే సిద్ధపడ్డాడు. అయితే ఆయన యజమానికి విషయం తెలిసి పాతికవేలు వద్దని ఉన్న డబ్బుకే భూమిని అమ్మేసాడు. ఆయన మంచితనానికి మనసులోనే జోహార్లు అర్పించాను. నాకు తర్వాతెప్పుడో తెలిసింది. నాన్న కొద్ది కొద్దిగా ఆ పాతికవేలు వడ్డీతో సహా ఆయనకి కట్టేసాడని. నేనైతే ఆపని చేసుండేవాడ్ని కాదు అనుకున్నాను నిజాయితీగా. ఏదైనా, నాన్న చాలా నిక్కచ్చి మనిషి. ఎవరి ఋణం ఉంచుకోడు. ఇదంతా జరిగి ఇరవై ఏళ్ళ పైనే అయింది.

★★★

ఆలోచనలో ఉండగా ఫోన్ మోగింది. బాబాయ్ నుంచి. కారు నడుపుతూనే స్టీరింగ్ మీద ఉన్న ఏక్సెప్ట్ బటన్ నొక్కాను. ఆయన మాట్లాడేది కారు బ్లూటూత్ స్పీకర్లో గట్టిగా వినిపించింది "బాబూ కిరీటి, ఎంతదాకా వచ్చారు? ఊరు ఊరంతా తరలి వచ్చింది మీ నాన్నను చూడ్డానికి.."

నా కన్నీళ్ళు ఆగలేదు. "వస్తున్నాం బాబాయ్. ఇంకో గంట.." దు:ఖంతో గొంతు పూడుకుపోయింది. "ఊరుకోండి.." సరిత ఓదార్చడానికి ప్రయత్నించింది. అనురాగ్ కూడా బాబాయ్ చెప్పేది బాధగా వినటం గమనించి కొద్దిగా ఆశ్చర్యపోయాను.

★★★

పొలం కొన్నాక మా నాన్న మరింత కష్టపడసాగాడు. నేను కూడా మొదటి లక్ష లక్షణంగా సంపాదించేసి ఈసారి నా లక్ష్యాన్ని పది లక్షలకి పెంచుకొని అందుకు తగ్గ కృషి చేయసాగాను. నా దగ్గర నాన్న కనీసం పది రూపాయలు కూడా ఎప్పుడూ తీసుకోలేదు. అదే ఆయనకు తృప్తినిస్తుందని నేనూ 'డబ్బు' అనే విషయం మా మధ్య ఎప్పుడూ తీసుకురాలేదు. తన కష్టంతోనే ఆయన అప్పులన్నీ తీర్చసాగాడు. హాయిగా ఉండొచ్చు ఇకమీదట అనుకున్నాడో ఏమో 'అది కుదిరేపని కాదు' అన్నట్టుగా చెప్పాను నేను ఓ అమ్మాయిని ఇష్టపడ్డానని! ఇంట్లో చిన్నపాటి న్యూక్లియర్ విస్ఫోటనం. అమ్మా, నాన్నా ఇద్దరూ కూడా మా బంధువుల అమ్మాయిని కోడలుగా తెచ్చుకొని పట్నం వచ్చి నాతో ఉండిపోదామని అనుకునేవారు. అందులో నాకూ ఏ అభ్యంతరమూ కనబడలేదు సరిత కనబడే వరకూ.

మా అమ్మ సరితను కోడలుగా చస్తే ఒప్పుకోనని తీవ్ర స్వరంతో గట్టిగా తేల్చి చెప్పింది. ఎంత సర్దిచెప్పినా వినలేదు. సరితది కులం మాత్రమే కాదు భాష కూడా వేరే. నాన్న మటుకు తన చేతులమీదుగా ఎదిగిన చెట్టంత నన్ను

చూసి మనసులో ఏమనుకున్నాడో ఏమో కానీ మౌనంగా ఉండిపోయాడు. ఆయన కళ్ళల్లో కదలాడిన తడి నన్ను చాలారోజులు వేధించింది.

ఇంట్లో నా పెళ్ళికి ససేమిరా అనడంతో చేసేదేమీ లేక పట్నం తిరిగి వచ్చి అమ్మా, నాన్నా లేకుండానే సరితను పెళ్లి చేసుకున్నాను. విషయం తెలిసి నాన్న ఒంటరిగా మా ఇంటికి వచ్చి మమ్మల్ని ఆశీర్వదించాడు. కలతచెందిన ఆయన మొహం చూస్తే ఎంతో బాధేసింది. అయితే, ఆయన కలతపడ్డది ఎవరికీ చెప్పకుండా నేను చేసుకున్న పెళ్లి గురించి కాదనీ, అమ్మ ఆరోగ్యం గురించని తర్వాత అర్థమైంది.

నేను చేసిన పనికి మా అమ్మ గుండె పగిలేలా ఏడ్చింది(ట). ఎప్పటికీ నా మొహం చూడనని గట్టిగా చెప్పి తన మాట నిలబెట్టుకుంది. నా పెళ్ళైన రెండేళ్లకే దిగులుతో అనారోగ్యం కొనితెచ్చుకొని, మంచం పట్టి చివరిదశలో కూడా నన్ను చూడాలన్న కోరిక లేకుండా చనిపోయింది. అప్పుడు అర్థమైంది నాకు దు:ఖం అంటే ఏమిటో. అమ్మ శవం దగ్గర పిచ్చిపట్టిన వాడిలా ఏడ్చాను. జీవితంలో దు:ఖించడం మొదటిసారి కాకపోయినా, ఆ పూట కలిగిన దు:ఖం మాత్రం నేనెప్పటికీ మర్చిపోలేను. ఎందుకంటే అది కల్తీ లేనిది! ఏ స్వార్థపూరిత కారణం వల్ల కాకుండా ఓ ఆత్మీయ బంధం శాశ్వతంగా తెగిపోవటం వల్ల కలిగిన దు:ఖం అది. మొట్టమొదటిసారి అనుభవంలోకి వచ్చింది. నాన్నకూ అలాంటి దు:ఖమే కలిగింది. అయితే నేను త్వరగా అందులోంచి బయటపడితే, ఆయన మాత్రం జీవితాంతం అమ్మని తల్చుకుంటూనే బతికాడు.

అమ్మ పోయాక ఇంట్లో ఒంటరివాడయ్యాడు నాన్న. మాతో పట్నం తీసుకువెళ్దామని అనుకున్నా, ఊరు వదిలి రావటానికి ఆయన అంతగా ఇష్టపడలేదు. నేనూ ఆయన్ని బలవంతం చేయలేకపోయాను. ఎందుకంటే, పట్నంలో మా ఇల్లు ఇద్దరికి బాగా సరిపోయేలా ఉంది. మూడో మనిషి వస్తే ఇబ్బందే. తర్వాత అనిపించింది, నాన్నకు మాతో వచ్చేయాలని ఉన్నా కొత్తగా పెళ్ళైన మా మధ్య అడ్డుగా ఎందుకని అక్కడే ఉండిపోయుంటాడు అని. త్వరలోనే పెద్ద ఇల్లు కట్టుకొని ఆయన్ను మా దగ్గరే ఉంచుకోవాలని గట్టిగా అనుకున్నాను.

అమ్మ పోయిన రెండేళ్ళకే ఇంకో పెద్దింట్లోకి మారినా, సొంతిల్లు కాదది. నాన్నను సొంతింట్లోకి తీసుకురావాలని నాకు కోరికగా ఉండేది. ఊళ్ళో మా ఇంటి పక్కనే ఉండే దూరపు బంధువులైన బాబాయ్ కుటుంబం నాన్న మంచి చెడ్డలు చూసేవారు. నేనూ ఆయన్ను చూడ్డానికి మొదట్లో ప్రతీ ఏడాదీ వెళ్ళేవాడ్ని సరితను తీసుకొని. పట్నవాసం బాగా అలవాటైన మాకు ఏ వసతీ లేని అక్కడ ఉండటం కష్టంగా ఉండేది. పని ఒత్తిడి వల్ల క్రమంగా అక్కడకు వెళ్ళటం బాగా తగ్గిపోయింది. నాన్న మటుకు మాకు తరచూ ఉత్తరాలు రాయించి క్షేమ సమాచారాలు కనుక్కునేవాడు. అనురాగ్ పుట్టిన నాలుగేళ్ళకు మొదటిసారి మా ఇంటికి వచ్చాడు. మనవడ్ని చూసిన ఆయన మొహంలో కనబడిన సంతోషం నా మనసులో అలా ముద్రించుకుపోయింది. నాలుగు రోజులు ఉండి వెళ్ళిపోయాడు ఊళ్ళో ఏదో పనుందని.

మేము సెలవలకి సింగపూర్ వెళ్ళే ఆలోచనలో ఉన్నట్టు అనురాగ్ ఆయనకు చెప్పాడని తర్వాత తెలిసింది. అందుకే వెంటనే వెళ్ళిపోయుంటాడు అనుకున్నాను.

పదేళ్ళ క్రితం మొత్తానికి నా సొంతింటి కల కూడా తీరింది. ఎక్కడా రాజీ పడకుండా బాగా ఖర్చుచేసి పెద్దిల్లే కట్టుకున్నాం. భారీగా హోం లోన్ కూడా తీసుకోవాల్సి వచ్చింది. లోనంటే నాకు చాలా భయం. నాన్న చిన్నప్పుడు అప్పులపాలై ఇబ్బంది పడటం కళ్ళారా చూడ్డం వల్ల కావొచ్చు. అయితే అప్పటికే నాన్న కొన్న భూమి విలువ ఎన్నో రెట్లు పెరిగింది. ఆయన్ని పట్నం తీసుకొచ్చాక దాన్ని అమ్మేస్తే వచ్చే డబ్బుతో అప్పు తీర్చొచ్చు అనుకొని తృప్తిపడ్డాను. ఆర్థిక విషయాల్లో నియంత్రణ కలిగి ఉండటం మొదట్నుంచీ నాకు అలవాటు.

ఇంటి గృహప్రవేశానికి వచ్చాడు నాన్న. ఇంటిమీద ఆసక్తి కన్నా మనవడితో గడపాలన్న కోరికే ఆయనలో ఎక్కువగా కనబడింది. ఉన్నంత సేపూ అనురాగ్ తో గడిపాడు సంతోషంగా. వాడు మా నాన్నకు ఇల్లంతా తిప్పి చూపిస్తూ తన గది, మా గది తర్వాత ఓ గది చూపించి అది 'గెస్ట్' రూం అని చెప్పాడు. ఆయనకు అర్థం కాదేమోనని 'అతిథి గది' అని తెలుగులో కూడా చెప్పాడు నవ్వుతూ. అక్కడే ఉన్న నేను చప్పున నాన్న వైపు చూసాను. ఆయన మొహంలో కదలాడిన బాధ స్పష్టంగా కనబడింది. క్రితం రోజే అది ఆయన గది అని నేను చెప్పటం గుర్తొచ్చుంటుంది. మా ఇంట్లో నాన్న ఓ గెస్ట్ లా ఉండాల్సి వస్తుందనో లేక ఆయనుంటే మాకు గెస్ట్ రూం లేకుండా పోతుందనో తెలీదు, ఇక్కడే ఉండిపొమ్మంటే తనకు ఏమీ తోచదని పది రోజులు ఉండి వెళ్ళిపోయాడు. ఆయన మాతో అన్నాళ్ళు గడిపింది ఆ ఒక్కసారే.

ఆ తర్వాత, కాలం చాలా వేగంగా దౌడుతీసింది. ఆఫీసు పని ఒత్తిడి వల్ల నాన్నకు కనీసం ఫోన్ చేయటం కూడా సరిగ్గా కుదిరేది కాదు. ఒకటిరెండు సార్లు ఆయన్ని చూడ్డానికి వెళ్ళి రెండంటే రెండే రోజుల్లో తిరిగి వచ్చేసాం. ప్రతీసారీ వేసవి సెలవలకి ఆయన దగ్గరకి వెళ్దామని అనుకోవటం, అది కుదరక సరిత పోరువల్ల ఏ ఊటీనో, మనాలీనో వెళ్ళటం జరిగేది. ఈ ఏడాది ఖచ్చితంగా ఆయన దగ్గరే గడుపుదామని అనుకున్నాను. అంతలోనే ఈ ఘోరం జరిగిపోయింది..

"వచ్చేసాం" అని సరిత అనటంతో ఈ లోకంలోకి వచ్చాను. యాంత్రికంగా కారు నడుపుతున్న నేను కళ్ళు తుడుచుకుంటూ చుట్టూ చూసాను. ఊరు మొదట్లో ఉన్నాం. నేను పుట్టి పెరిగిన ఊరది! గొంతులో ఏదో అడ్డుపడిన భావన. కొద్దిదూరం వెళ్ళాక మా నాన్న కష్టపడి కొని సాగుచేసుకున్న భూమి దూరంగా కనిపించసాగింది. దు:ఖం ఎక్కువై కారు నడపలేక ఓ పక్కగా ఆపాను. "నాన్నా!.." అని బయటికే అనుకున్నాను ఏడుస్తూ. సరిత, అనురాగ్ ఆందోళనగా చూసారు నా వైపు. చిన్న విరామం తర్వాత కొద్దిగా తేరుకొని కారు ఊళ్ళోకి పోనిచ్చాను.

★★★

ఇంటి దగ్గర చాలా హడావిడిగా ఉంది. చాలా మంది నాన్నను చివరిచూపు చూడ్డానికి వచ్చారు. సరిత, అనురాగ్ కూడా ఆశ్చర్యపోయారు అంతమంది జనాన్ని చూసి. కారు ఆపగానే బాబాయ్ వచ్చి తలుపు తీసాడు. అంతా దిగాక, ఎవరో వచ్చి మా సామాన్లు లోపలకి తీసుకువెళ్లారు. బాబాయ్ ని చూడగానే కన్నీళ్ళు ఆగలేదు. "ఊరుకో బాబూ.." అన్నాడు భుజం మీద చిన్నగా తడుతూ. అనురాగ్ తల నిమురుతూ అన్నాడు "మీ నాన్నకు వీడంటే ఎంతిష్టమో. వారం క్రితమే వీడికి ప్రత్యేకంగా ఫోన్ ఉందా అని అడిగి, నెంబర్ తీసుకొని చాలాసేపు మాట్లాడాడు". ఆశ్చర్యంగా చూసాను అనురాగ్ వైపు. వాడు కనీసం వారం క్రితం నాన్నతో మాట్లాడాడు. నేను చివరిసారిగా ఎప్పుడు మాట్లాడానో గుర్తు తెచ్చుకోవాలన్నా భయమేసింది.

వచ్చినవారంతా మమ్మల్ని చాలా ఆప్యాయంగా పలకరించారు. నా చిన్ననాటి స్నేహితులు కూడా ఉన్నారు అందులో. ఆ తర్వాత కార్యక్రమాలన్నీ వరుసగా జరిగిపోయినయ్. బాబాయ్ దగ్గరుండి అన్నీ చూసుకున్నాడు. కన్నీళ్లతో అంత్యక్రియలు పూర్తిచేసి నాన్నను పరలోకానికి సాగనంపాను. ఊరి జనం కూడా ఆయన గురించి గొప్పగా మాట్లాడుకుంటూ ఘనంగా వీడ్కోలు పలికారు. చితిమంటల్లో కట్టెలా కాలిపోతున్న నాన్నను చూసి అనురాగ్ దు:ఖం ఆగలేదు. నన్ను గట్టిగా పట్టుకొని ఏడవసాగాడు. అప్పుడు అర్థమైంది నాకు వాడు పొద్దున బాధపడింది క్రికెట్ టోర్నమెంట్ కోసం ఎంతమాత్రం కాదు అని.

ఎక్కిళ్ళు పెడుతూ అన్నాడు వాడు "పోయిన వారం తాతయ్య నాతో చాలాసేపు మాట్లాడాడు నాన్న. నీ గురించి గొప్పగా చెప్పాడు. పెద్దయ్యాక నిన్ను, అమ్మని జాగ్రత్తగా చూసుకోమన్నాడు. చెడు అలవాట్ల జోలికి వెళ్లొద్దని మరీ మరీ చెప్పాడు.." ఎవరో మంచినీళ్ళు అందిస్తే కొద్దిగా తాగి చెప్పటం  కొనసాగించాడు. శ్రద్ధగా వింటున్నాను.

"..తాతయ్యకు ఎవరో చెప్పారట ఫోన్లో అవతలి మనిషిని చూస్తూ మాట్లాడొచ్చని. దాన్ని 'వీడియో కాల్' అంటారని నేనంటే, 'మీ నాన్నతో ఓసారి వీడియో కాల్ చేయించరా. ఇక ఎక్కువ కాలం బతకను' అన్నాడు. చాలా బాధగా అనిపించింది నాన్నా. తాతయ్యది స్మార్ట్ ఫోన్ కాదసలు. అందులో కనీసం వాట్సప్ కూడా ఉండదు..." ఏడుస్తూ ఇంకా ఏదో చెబుతున్నాడు వాడు. నాకేమీ అర్థం కావటంలేదు. మనసుకు ఎవరో మేకులు కొడుతున్నట్టుగా బాధ! ఆయనకు నేను పంపిన వెయ్యి రూపాయల నోకియా ఫోన్ గుర్తుకొచ్చింది. ఛ. మంచిది కొనాల్సిందేమో. ఆయనకు వాడటం రాదని ఏదో ఆఫర్లో కనీసం కేమరా కూడా లేని పాత మోడల్ ఫోన్ పంపాను. దానికే ఆయన మురిసిపోయాడు పాపం..

★★★

పోతూపోతూ నాన్న నాకు కలిగించిన దు:ఖం ఎన్నటికీ తగ్గేది కాదు. ఉదయం ఏడింటికి బాబాయ్ ఫోన్ చేసి నాన్న పోయారన్న వార్తతో పాటు మరో దారుణమైన విషయం కూడా చెప్పాడు. తన మూడెకరాల భూమిని ఊళ్ళో

కొత్తగా పెట్టిన పేదల ఆశ్రమానికి అమ్మ పేరుమీద విరాళంగా ఇచ్చి రెజిస్టర్ కూడా చేసాడు నాన్న!! ఆయన నాకు రెండ్రోజుల క్రితం అదేపనిగా ఫోన్ చేసింది రెజిస్టర్ చేసేముందు నాకో మాట చెప్పటానికే! బాబాయ్ కి కూడా నాన్న పోయాకే ఆశ్రమం ద్వారా విషయం తెలిసింది. అమ్మ పేరు శాశ్వతంగా నిలిచిపోవాలన్న కోరికతో, కనీసం యాభై లక్షల విలువ చేసే ఆస్తిని అంత తేలిగ్గా ధారాదత్తం చేసాడాయన. ఆయన చేసిన గొప్పపని బాబాయ్ ద్వారా ఊరంతా పాకిపోయింది. అందుకే అంతమంది జనం తరలి వచ్చింది.

నేను ఎన్నో ఆశలు పెట్టుకున్న యాభై లక్షల ఆస్తి అది! నాన్నతో తరచూ మాట్లాడుతూ ఉండి ఉంటే ఆయన ఆలోచన నాకు తెలిసిపోయేదేమో. కనీసం రెండ్రోజుల క్రితం అదేపనిగా ఆయన ఫోన్ చేసినప్పుడు ఒక్కసారి ఎత్తి మాట్లాడుంటే ఖచ్చితంగా ఆ విరాళాన్ని ఆపేవాడ్ని. ఆస్తి మిగిలిపోయేది. అదేమీ తాతలు సంపాదించింది కూడా కాదు ఆయన చేసింది చెల్లదు అని గొడవ చేయటానికి. ఆయన చేసింది ఓ మహోన్నతమైన కార్యమే అయినా, నాకు మటుకు తీరని నష్టం, దు:ఖం కలిగించిన విషయం అది. మళ్ళీ ఏడుపు తన్నుకు వచ్చింది. పక్కనున్న వారు ఓదారుస్తున్నారు. కొద్దిదూరంలో ఉన్న అనురాగ్ కూడా ఏడవటం కనిపించింది. తాతయ్యతో తన బంధం శాశ్వతంగా తెగిపోయిందన్న దు:ఖంతో ఏడుస్తున్న వాడ్ని చూస్తే ఈర్ష్యగా అనిపించింది... ఎందుకంటే వాడి దు:ఖంలో ఏమాత్రం కల్తీ లేదు! నా దు:ఖం లాంటిది కాదది!!

# కల్తీ లేని దుఃఖం

దమ్మవళం శ్రీనివాస్

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
బహుమతి పొందిన కథ

"హలో?"

"బాబూ కిరీటి, నేనూ బాబాయ్ ని. ఊరినుంచి.." గొంతులో బాధ ధ్వనించింది.

"చెప్పు బాబాయ్. ఏం జరిగింది?" కంగారుగా అడిగాను. పొద్దున్నే ఏడింటికి ఊహించని మనిషి దగ్గర్నుంచి ఫోన్ వస్తే కంగారుగానే ఉంటుంది. నా గొంతు విని పక్కనే పడుకొని ఉన్న మా ఆవిడ సరిత కూడా నిద్రలేచి గాబరాగా చూస్తోంది.

చెప్పాల్సింది చెప్పి బాబాయ్ ఫోన్ పెట్టేసాడు. నా మొహం పాలిపోయిందేమో, సరిత గాబరా ఎక్కువైంది.

"ఏంటండీ? ఎవర్నుంచి ఫోన్? ఏం జరిగింది??" సరిత అడగటం తెలుస్తోంది కానీ నా మెదడుతో నాకు సంబంధం తెగిపోయినట్టుగా, ఏం చేయాలో తెలీనట్టుగా అనిపించింది. అచేతనంగా ఉండిపోయాను. ఏ ఆలోచనలూ రాలేదు కాసేపు. అసలు ఇది నిజంగానే జరుగుతుందా లేక కలా? ఉలిక్కిపడి కళ్ళు తెరుస్తానా ఇప్పుడు? పీడకల అని అర్ధమయ్యాక హాయిగా అనిపిస్తుందా? అప్రయత్నంగా కళ్ళు మూసుకొని తెరిచాను. అలా మరోసారి, మరో..

సరిత గట్టిగా నా భుజాన్ని తోస్తూ మళ్ళీ ఏం జరిగిందని అడిగేటప్పటికి నిజంగానే ఉలిక్కిపడి ఈ లోకానికి వచ్చాను.

"మా నాన్న చనిపోయారుట. ఇవాళ ఉదయం. ఇంతకు ముందే తెలిసిందిట.." బాధగా ఇంకా ఏదో చెబుతూండగా సరిత వినిపించుకోలేదు. "అయ్యో" అని హడావిడిగా పక్కమీదనుంచి లేచి తన ఫోన్ అందుకొని పక్క గదిలోకి వెళ్ళిపోయింది. వాళ్ళింట్లో వారికి చెప్పడానికనుకుంటా.

మైండ్ బ్లేంక్ అయింది అని పుస్తకాల్లో ఎప్పుడైనా చదివితే నవ్వుకునేవాడ్ని అలా నిజంగా చస్తే జరగదు అని. కానీ ఆ స్థితి అనుభవించాక అర్ధమైంది అనవసరంగా నవ్వుకునేవాడ్నని. ఉబికివస్తున్న కన్నీళ్ళు కర్చీఫ్ తో తుడుచుకుంటూ మంచం మీద కూలబడిపోయాను. ఏంటిది ఇలా జరిగింది? రెండ్రోజుల క్రితం నాన్న అదేపనిగా ఫోన్ చేయటం గుర్తొచ్చింది. ఆఫీసు పని ఒత్తిడిలో పట్టించుకోలేదు. ఛ. ఆయనతో మాట్లాడి ఉంటే ఎంత బావుండేది. ఇంట్లో అందరినీ తీసుకువెళ్ళి ఆయన దగ్గర ఓ పదిరోజులు ప్రశాంతంగా గడుపుదామని ఎప్పటినుంచో అనుకుంటున్నాను కానీ కుదర్లేదు. ఇంతపని జరుగుతుందని ఏమాత్రం ఊహించినా పనులన్నీ పక్కకు తోసి రెక్కలు కట్టుకొని ఆయన దగ్గర వాలేవాడ్ని. జీవితం సాఫీగా జరిగిపోతుందని అనుకొంటూండగా హఠాత్తుగా పొద్దున్నే ఈ దుర్వార్త. ఎంత పని జరిగింది నాన్నా!! తెరలు తెరలుగా వస్తున్న దు:ఖాన్ని దిగమింగుకోటానికి ప్రయత్నించలేదు. కాసేపు తనివితీరా ఏడుస్తేనే మనసులో ఉన్న బరువు కొంతైనా తగ్గుతుందనిపించింది.

★★★

తల బద్దలైపోతూంటే టేబ్లెట్ వేసుకున్నాను. జరగాల్సింది చూడాలిప్పుడు. పక్కనే ఉన్న మొబైల్ ఫోన్ మీద పడింది నా దృష్టి. వార్త సక్రమంగా తెలియబరిచానన్న సంతృప్తి కాబోలు, మౌనంగా ఉందది. దాని ఖరీదు మనసులో మెదిలింది. లక్ష రూపాయలు! విరక్తిగా నవ్వుకున్నాను. చిన్నప్పటి పేదరికం గుర్తుకొచ్చింది. కిందటి సంవత్సరం మా

నాన్న పుట్టినరోజుకు సరిగ్గా అందేలా ఓ కొత్త మొబైల్ ఫోన్ గిఫ్ట్ పేక్ చేసి పంపాను. ఆయన నాతో అదే ఫోన్లోంచి సంతోషంగా గద్గద స్వరంతో మాట్లాడిన మాటలు నాకెప్పటికీ గుర్తుండిపోతాయి. అప్రయత్నంగా ఫోన్ అందుకొని ఆయన నెంబర్ వెదికి కాల్ చేసాను. ఆఫ్ చేసుందన్న వాయిస్ వినిపించింది. మరిక ఎప్పటికీ ఆయనతో మాట్లాడలేను అన్న ఆలోచన నన్ను దు:ఖంలో ముంచెత్తింది. ఆయన్ను గురించిన ఆలోచనలు మనసును తొలిచేయసాగినయ్.

రైతు కూలీగా జీవితం గడుపుతూ అష్టకష్టాలు పడి నన్ను ఇంతవాడ్ని చేసాడు మా నాన్న రుద్రయ్య. చదువు లేకపోయినా మంచి చెడు చాలా చక్కగా తెలిసిన మనిషి. తనలా నా జీవితం రెక్కల కష్టానికే పరిమితం కావొద్దని అప్పుచేసి మరీ నన్ను ఊళ్ళోకెల్లా మంచి ఇంగ్లీషు మీడియం స్కూల్లో చేర్చాడు. కటిక పేదరికమంతా తనకీ అమ్మకి మాత్రమే పరిమితం చేసుకొని నన్ను మాత్రం ఏ లోటూ లేకుండా పెంచాడు. పరీక్షలెగ్గొట్టి జులాయిగా తిరిగినా కోప్పడకుండా ఓపిగ్గా నచ్చజెప్పేవాడు. అమ్మను కూడా నా మీద చేయి వేయనిచ్చేవాడు కాదు ఎంత వెధవ పని చేసినా. ఒక్కడ్నే సంతానమైన నేనంటే ఆయనకు అంత పిచ్చి ప్రేమ.

నాకు పదిహేనేళ్ళప్పుడు ఓసారి స్కూలు ఎగ్గొట్టి సిగరెట్ తాగుతూ రింగు రింగులుగా పొగ వదలటం ఆయన కళ్లబడ్డది. భయంతో వణికిపోయాను. అప్పుడు కూడా ఆయన నన్ను కోప్పడలేదు. తను ఎలా చమటోడ్చి నన్ను చదివిస్తున్నదీ చెప్పలేదు. పక్కకు తీసుకువెళ్లి చెడు అలవాట్ల వల్ల 'నా' జీవితం ఎలా నాశనమవుతుందో రెండు గంటలకు పైగా వివరించాడు. ఎక్కడా ఆయన ప్రసక్తి లేదందులో. ఆ తర్వాత ఎంతో మార్పు వచ్చింది. నాలో కాదు ఆయనలో! ఎందుకంటే ఆ మరుసటి రోజే నేను స్నేహితులతో మందు కొడుతూ ఆయన కళ్లబడ్డాను. అప్పుడు అర్ధమైంది ఆయనకు నేను చిన్న పిల్లాడ్ని కాను బాగా ఎదిగిపోయానని. ఆ తర్వాత నుంచీ నాకు మంచి చెడ్డలు చెప్పటం పూర్తిగా మానేసాడు. అమ్మకు కూడా విషయం చెప్పలేదు. నిర్లిప్తంగా ఉండిపోయాడు. ఆ సంఘటన నాలో విపరీతమైన అపరాధ భావం కలిగించి నన్ను కదిలించేసింది. క్రమంగా నాలో ఆయన ఆశించిన మార్పు వచ్చింది. చదువు మీద బాగా శ్రద్ధ పెట్టసాగాను. పట్నం వచ్చి పై చదువులు కూడా మంచి మార్కులతో పూర్తిచేసుకొని ఓ పెద్ద కంపెనీలో చేరి మంచి స్థాయికి చేరుకున్నాను.

మా నాన్నకు నా విషయంలో ఉన్న ఓపిక తలచుకుంటే ఎప్పుడూ ఆశ్చర్యమే నాకు. మా అబ్బాయి అనురాగ్ పుట్టాక కానీ అర్ధం కాలేదు పిల్లల వెధవ చేష్టలు భరించడం ఎంత కష్టమో అని. అయితే నేను మా నాన్నలా కాదు. మా వాడ్ని ఎన్నో సార్లు తనివితీరా కొట్టాను. ఈ మధ్యే ఇంటర్ చదివే వాడి దగ్గర సిగరెట్ వాసన వస్తే ఒళ్ళు చీరేసాను..

"త్వరగా లేవండి. ఇంకో గంటలో బయలుదేరితే మంచిది. ట్రాఫిక్ ఎక్కువవుతుంది లేకపోతే" సరిత మాటలకి ఈ లోకంలోకి వచ్చిపడి, తలూపాను అంగీకారంగా.

అటాచ్డ్ బాత్ రూంలోకి వెళ్తూండగా బయట అనురాగ్ ఫోన్లో ఎవరో ఫ్రెండ్ తో మాట్లాడటం వినిపించింది. క్రికెట్ టోర్నమెంట్ కి రాలేనని చెబుతున్నాడు బాధగా. వాడికి క్రికెట్ అంటే యమ పిచ్చి. వేరే ఊళ్ళో ఎక్కడో ఆడాలని నన్ను ఐదువేలు అడిగాడు ఖర్చులకు. ఇంకా ఇవ్వలేదు. అదిప్పుడు మిగిలినందుకు సంతోషమేసింది. దండగ ఖర్చు. డబ్బు విలువ డబ్బులో పుట్టిన వీడికేం తెలుసు?

ముగ్గురం ముప్పావు గంటలో హడావిడిగా తయారయి, బట్టలు సర్దుకొని కారులో మా నాన్నను చివరిసారిగా చూడ్డానికి బయలుదేరాం. ఇదే పని ఆయన బతికుండగా చేసుంటే ఎంత బావుండేది అనుకున్నాను బాధగా. ఊరు చేరటానికి కనీసం మూడు గంటలు పడుతుంది. ఆఫీసులో విషయం చెప్పేసాను. వరసబెట్టి కండోలెన్స్ మెసేజెస్ రావటం మొదలైనయ్. ఏవీ ఓపెన్ చేయలేదు. వాటికి స్పందించే మూడ్ ఏమాత్రం లేదు. కాల్స్ కూడా మొదలవడంతో ఫోన్ పక్కన పడేసి జాగ్రత్తగా డ్రైవ్ చేయసాగాను. ఖరీదైన కారు మెత్తగా సాగిపోతుంది. అంతా మౌనంగా ఉన్నారు. కారెక్కగానే పాటలు పెట్టమనే అనురాగ్ కూడా వెనక సీట్లో చప్పుడు చేయకుండా కూర్చున్నాడు. తల వెనక్కి తిప్పి వాడి వైపు చూసానోసారి. మొహం బాధగా పెట్టి బయటకు చూస్తున్నాడు. అది ఖచ్చితంగా క్రికెట్ టోర్నమెంట్ మిస్ అయినందుకే అనిపించింది. మా నాన్నతో వాడికి పెద్ద అనుబంధం లేదు. అసలు కలిసింది కూడా చాలా తక్కువసార్లు.

చిన్నప్పటినుంచీ ప్రతీ రూపాయికీ నాన్న పడ్డ అవస్థ చూసాక డబ్బు ఎంత విలువైందో, పొదుపుగా ఉండటం ఎంత అవసరమో నాకు బాగా అర్థమైంది. తేలిగ్గా డబ్బు ఖర్చు చేసేవాళ్ళు (నా సతీమణి సరితతో సహా) నన్నో పీనాసి అనుకున్నా నేనెప్పుడూ పట్టించుకోలేదు. డబ్బు లేనప్పుడు కానీ దాని విలువ అర్థం కాదు.

ఉద్యోగంలో చేరిన కొత్తల్లో మొట్టమొదటి లక్ష రూపాయలు త్వరగా సంపాదించాలని నాకు చాలా కోరికగా ఉండేది. పొదుపుగా ఉంటూ కూడబెట్టసాగాను. అప్పుడే నాకో సమస్య ఎదురైంది. నాన్న దగ్గర్నుంచి. ఆయనకు అత్యవసరంగా పాతికవేలు కావాల్సి వచ్చింది. మూడెకరాల భూమి చవకగా సొంతం చేసుకునే అవకాశం ఆయన యజమాని కల్పించాడు ఏళ్ళ తరబడి ఆయన చేసిన సేవకు గుర్తింపుగా. కొద్దికొద్దిగా ఆయన కూడబెట్టిన డబ్బు, ఇంట్లో, ఒంటి మీదున్న బంగారం, స్నేహితుల దగ్గర అప్పు అంతా కలిపినా పాతికవేలు తక్కువైంది. వేరే దారేదీ కనబడక నన్ను అడిగాడు. అప్పటికే నా దగ్గర నలభై వేల పైనే పోగైంది. నా చదువు కోసం చేసిన అప్పు కూడా ఆయనే తీరుస్తున్నాడు. మాటవరసకు కూడా ఆ భారం నామీద వేయలేదు. అయినా నాకెందుకో డబ్బు సర్దాలనిపించలేదు. 'ఇప్పుడా పొలం కొనకపోతే ఏం?' అనిపించింది. ఆయన యజమాని మీద కోపం ముంచుకొచ్చింది. ఏ ఆస్తీ లేని నాన్న చిన్న భూమికి యజమానిగా మారాలని ఆశపడటంలో తప్పులేదు. కానీ మొదటి లక్ష త్వరగా సంపాదించాలన్న నా న్యాయమైన కోరిక ముందు ఆయన కోరిక చిన్నదిగా తోచింది. నేను సంపాదించే లక్ష కూడా కుటుంబానికే కదా అనిపించింది. ఒకటిరెండు సార్లు అడిగాక నా దగ్గర సరైన స్పందన లేక అడగటం మానేసాడు నాన్న.

ఆయనకు కోపం వచ్చిందేమో అనుకున్నాను కానీ అలా జరగలేదు. ముందే చెప్పినట్టు నాన్నకు నేనంటే పిచ్చి ప్రేమ. డబ్బు సర్దలేదని ఏమాత్రం నొచ్చుకోలేదు. భూమిని వదులుకోటానికే సిద్ధపడ్డాడు. అయితే ఆయన యజమానికి విషయం తెలిసి పాతికవేలు వద్దని ఉన్న డబ్బుకే భూమిని అమ్మేసాడు. ఆయన మంచితనానికి మనసులోనే జోహార్లు అర్పించాను. నాకు తర్వాతెప్పుడో తెలిసింది. నాన్న కొద్ది కొద్దిగా ఆ పాతికవేలు వడ్డీతో సహా ఆయనకి కట్టేసాడని. నేనైతే ఆపని చేసుండేవాడ్ని కాదు అనుకున్నాను నిజాయితీగా. ఏదైనా, నాన్న చాలా నిక్కచ్చి మనిషి. ఎవరి ఋణం ఉంచుకోడు. ఇదంతా జరిగి ఇరవై ఏళ్ళ పైనే అయింది.

★★★

ఆలోచనలో ఉండగా ఫోన్ మోగింది. బాబాయ్ నుంచి. కారు నడుపుతూనే స్టీరింగ్ మీద ఉన్న ఏక్సెప్ట్ బటన్ నొక్కాను. ఆయన మాట్లాడేది కారు బ్లూటూత్ స్పీకర్లో గట్టిగా వినిపించింది "బాబూ కిరీటి, ఎంతదాకా వచ్చారు? ఊరు ఊరంతా తరలి వచ్చింది మీ నాన్నను చూడ్డానికి.."

నా కన్నీళ్ళు ఆగలేదు. "వస్తున్నాం బాబాయ్. ఇంకో గంట.." దు:ఖంతో గొంతు పూడుకుపోయింది. "ఊరుకోండి.." సరిత ఓదార్చడానికి ప్రయత్నించింది. అనురాగ్ కూడా బాబాయ్ చెప్పేది బాధగా వినటం గమనించి కొద్దిగా ఆశ్చర్యపోయాను.

★★★

పొలం కొన్నాక మా నాన్న మరింత కష్టపడసాగాడు. నేను కూడా మొదటి లక్ష లక్షణంగా సంపాదించేసి ఈసారి నా లక్ష్యాన్ని పది లక్షలకి పెంచుకొని అందుకు తగ్గ కృషి చేయసాగాను. నా దగ్గర నాన్న కనీసం పది రూపాయలు కూడా ఎప్పుడూ తీసుకోలేదు. అదే ఆయనకు తృప్తినిస్తుందని నేనూ 'డబ్బు' అనే విషయం మా మధ్య ఎప్పుడూ తీసుకురాలేదు. తన కష్టంతోనే  ఆయన అప్పులన్నీ తీర్చసాగాడు. హాయిగా ఉండొచ్చు ఇకమీదట అనుకున్నాడో ఏమో 'అది కుదిరేపని కాదు' అన్నట్టుగా చెప్పాను నేను ఓ అమ్మాయిని ఇష్టపడ్డానని! ఇంట్లో చిన్నపాటి న్యూక్లియర్ విస్ఫోటనం. అమ్మా, నాన్నా ఇద్దరూ కూడా మా బంధువుల అమ్మాయిని కోడలుగా తెచ్చుకొని పట్నం వచ్చి నాతో ఉండిపోదామని అనుకునేవారు. అందులో నాకూ ఏ అభ్యంతరమూ కనబడలేదు సరిత కనబడే వరకూ.

మా అమ్మ సరితను కోడలుగా చస్తే ఒప్పుకోనని తీవ్ర స్వరంతో గట్టిగా తేల్చి చెప్పింది. ఎంత సర్దిచెప్పినా వినలేదు. సరితది కులం మాత్రమే కాదు భాష కూడా వేరే. నాన్న మటుకు తన చేతులమీదుగా ఎదిగిన చెట్టంత నన్ను చూసి మనసులో ఏమనుకున్నాడో ఏమో కానీ మౌనంగా ఉండిపోయాడు. ఆయన కళ్ళల్లో కదలాడిన తడి నన్ను చాలారోజులు వేధించింది.

ఇంట్లో నా పెళ్ళికి ససేమిరా అనడంతో చేసేదేమీ లేక పట్నం తిరిగి వచ్చి అమ్మా, నాన్నా లేకుండానే సరితను పెళ్లి చేసుకున్నాను. విషయం తెలిసి నాన్న ఒంటరిగా మా ఇంటికి వచ్చి మమ్మల్ని ఆశీర్వదించాడు. కలతచెందిన ఆయన మొహం చూస్తే ఎంతో బాధేసింది. అయితే, ఆయన కలతపడ్డది ఎవరికీ చెప్పకుండా నేను చేసుకున్న పెళ్లి గురించి కాదనీ, అమ్మ ఆరోగ్యం గురించని తర్వాత అర్థమైంది.

నేను చేసిన పనికి మా అమ్మ గుండె పగిలేలా ఏడ్చింది(ట). ఎప్పటికీ నా మొహం చూడనని గట్టిగా చెప్పి తన మాట నిలబెట్టుకుంది. నా పెళ్ళైన రెండేళ్లకే దిగులుతో అనారోగ్యం కొనితెచ్చుకొని, మంచం పట్టి చివరిదశలో కూడా నన్ను చూడాలన్న కోరిక లేకుండా చనిపోయింది. అప్పుడు అర్థమైంది నాకు దు:ఖం అంటే ఏమిటో. అమ్మ శవం దగ్గర పిచ్చిపట్టిన వాడిలా ఏడ్చాను. జీవితంలో దు:ఖించడం మొదటిసారి కాకపోయినా, ఆ పూట కలిగిన దు:ఖం మాత్రం నేనెప్పటికీ మర్చిపోలేను. ఎందుకంటే అది కల్తీ లేనిది! ఏ స్వార్థపూరిత కారణం వల్ల కాకుండా ఓ ఆత్మీయ బంధం శాశ్వతంగా తెగిపోవటం వల్ల కలిగిన దు:ఖం అది. మొట్టమొదటిసారి అనుభవంలోకి వచ్చింది. నాన్నకూ అలాంటి దు:ఖమే కలిగింది. అయితే నేను త్వరగా అందులోంచి బయటపడితే, ఆయన మాత్రం జీవితాంతం అమ్మని తల్చుకుంటూనే బతికాడు.

అమ్మ పోయాక ఇంట్లో ఒంటరివాడయ్యాడు నాన్న. మాతో పట్నం తీసుకువెళ్దామని అనుకున్నా, ఊరు వదిలి రావటానికి ఆయన అంతగా ఇష్టపడలేదు. నేనూ ఆయన్ని బలవంతం చేయలేకపోయాను. ఎందుకంటే, పట్నంలో మా ఇల్లు ఇద్దరికి బాగా సరిపోయేలా ఉంది. మూడో మనిషి వస్తే ఇబ్బందే. తర్వాత అనిపించింది, నాన్నకు మాతో వచ్చేయాలని ఉన్నా కొత్తగా పెళ్ళైన మా మధ్య అడ్డుగా ఎందుకని అక్కడే ఉండిపోయుంటాడు అని. త్వరలోనే పెద్ద ఇల్లు కట్టుకొని ఆయన్ను మా దగ్గరే ఉంచుకోవాలని గట్టిగా అనుకున్నాను.

అమ్మ పోయిన రెండేళ్ళకే ఇంకో పెద్దింట్లోకి మారినా, సొంతిల్లు కాదది. నాన్నను సొంతింట్లోకి తీసుకురావాలని నాకు కోరికగా ఉండేది. ఊళ్ళో మా ఇంటి పక్కనే ఉండే దూరపు బంధువులైన బాబాయ్ కుటుంబం నాన్న మంచి చెడ్డలు చూసేవారు. నేనూ ఆయన్ను చూడ్డానికి మొదట్లో ప్రతీ ఏడాదీ వెళ్ళేవాడ్ని సరితను తీసుకొని. పట్నవాసం బాగా అలవాటైన మాకు ఏ వసతీ లేని అక్కడ ఉండటం కష్టంగా ఉండేది. పని ఒత్తిడి వల్ల క్రమంగా అక్కడకు వెళ్ళటం బాగా తగ్గిపోయింది. నాన్న మటుకు మాకు తరచూ ఉత్తరాలు రాయించి క్షేమ సమాచారాలు కనుక్కునేవాడు. అనురాగ్ పుట్టిన నాలుగేళ్ళకు మొదటిసారి మా ఇంటికి వచ్చాడు. మనవడ్ని చూసిన ఆయన మొహంలో కనబడిన సంతోషం నా మనసులో అలా ముద్రించుకుపోయింది. నాలుగు రోజులు ఉండి వెళ్ళిపోయాడు ఊళ్ళో ఏదో పనుందని. మేము సెలవలకి సింగపూర్ వెళ్ళే ఆలోచనలో ఉన్నట్టు అనురాగ్ ఆయనకు చెప్పాడని తర్వాత తెలిసింది. అందుకే వెంటనే వెళ్లిపోయుంటాడు అనుకున్నాను.

పదేళ్ళ క్రితం మొత్తానికి నా సొంతింటి కల కూడా తీరింది. ఎక్కడా రాజీ పడకుండా బాగా ఖర్చుచేసి పెద్దిల్లే కట్టుకున్నాం. భారీగా హోం లోన్ కూడా తీసుకోవాల్సి వచ్చింది. లోనంటే నాకు చాలా భయం. నాన్న చిన్నప్పుడు అప్పులపాలై ఇబ్బంది పడటం కళ్ళారా చూడ్డం వల్ల కావొచ్చు. అయితే అప్పటికే నాన్న కొన్న భూమి విలువ ఎన్నో రెట్లు పెరిగింది. ఆయన్ని పట్నం తీసుకొచ్చాక దాన్ని అమ్మేస్తే వచ్చే డబ్బుతో అప్పు తీర్చొచ్చు అనుకొని తృప్తిపడ్డాను. ఆర్థిక విషయాల్లో నియంత్రణ కలిగి ఉండటం మొదట్నుంచీ నాకు అలవాటు.

ఇంటి గృహప్రవేశానికి వచ్చాడు నాన్న. ఇంటిమీద ఆసక్తి కన్నా మనవడితో గడపాలన్న కోరికే ఆయనలో ఎక్కువగా కనబడింది. ఉన్నంత సేపూ అనురాగ్ తో గడిపాడు సంతోషంగా. వాడు మా నాన్నకు ఇల్లంతా తిప్పి చూపిస్తూ తన గది, మా గది తర్వాత ఓ గది చూపించి అది 'గెస్ట్' రూం అని చెప్పాడు. ఆయనకు అర్థం కాదేమోనని 'అతిథి గది' అని తెలుగులో కూడా చెప్పాడు నవ్వుతూ. అక్కడే ఉన్న నేను చప్పున నాన్న వైపు చూసాను. ఆయన మొహంలో కదలాడిన బాధ స్పష్టంగా కనబడింది. క్రితం రోజే అది ఆయన గది అని నేను చెప్పటం గుర్తొచ్చుంటుంది. మా ఇంట్లో నాన్న ఓ గెస్ట్ లా ఉండాల్సి వస్తుందనో లేక ఆయనుంటే మాకు గెస్ట్ రూం లేకుండా పోతుందనో తెలీదు, ఇక్కడే ఉండిపొమ్మంటే తనకు ఏమీ తోచదని పది రోజులు ఉండి వెళ్ళిపోయాడు. ఆయన మాతో అన్నాళ్ళు గడిపింది ఆ ఒక్కసారే.

ఆ తర్వాత, కాలం చాలా వేగంగా దౌడుతీసింది. ఆఫీసు పని ఒత్తిడి వల్ల నాన్నకు కనీసం ఫోన్ చేయటం కూడా సరిగ్గా కుదిరేది కాదు. ఒకటిరెండు సార్లు ఆయన్ని చూడ్డానికి వెళ్ళి రెండంటే రెండే రోజుల్లో తిరిగి వచ్చేసాం. ప్రతీసారీ వేసవి సెలవలకి ఆయన దగ్గరకి వెళ్దామని అనుకోవటం, అది కుదరక సరిత పోరువల్ల ఏ ఊటీనో, మనాలీనో వెళ్ళటం జరిగేది. ఈ ఏడాది ఖచ్చితంగా ఆయన దగ్గరే గడుపుదామని అనుకున్నాను. అంతలోనే ఈ ఘోరం జరిగిపోయింది..

"వచ్చేసాం" అని సరిత అనటంతో ఈ లోకంలోకి వచ్చాను. యాంత్రికంగా కారు నడుపుతున్న నేను కళ్ళు తుడుచుకుంటూ చుట్టూ చూసాను. ఊరు మొదట్లో ఉన్నాం. నేను పుట్టి పెరిగిన ఊరది! గొంతులో ఏదో అడ్డుపడిన భావన. కొద్దిదూరం వెళ్ళాక మా నాన్న కష్టపడి కొని సాగుచేసుకున్న భూమి దూరంగా కనిపించసాగింది. దు:ఖం ఎక్కువై కారు నడపలేక ఓ పక్కగా ఆపాను. "నాన్నా!.." అని బయటికే అనుకున్నాను ఏడుస్తూ. సరిత, అనురాగ్ ఆందోళనగా చూసారు నా వైపు. చిన్న విరామం తర్వాత కొద్దిగా తేరుకొని కారు ఊళ్ళోకి పోనిచ్చాను.

★★★

ఇంటి దగ్గర చాలా హడావిడిగా ఉంది. చాలా మంది నాన్నను చివరిచూపు చూడ్డానికి వచ్చారు. సరిత, అనురాగ్ కూడా ఆశ్చర్యపోయారు అంతమంది జనాన్ని చూసి. కారు ఆపగానే బాబాయ్ వచ్చి తలుపు తీసాడు. అంతా దిగాక, ఎవరో వచ్చి మా సామాన్లు లోపలకి తీసుకువెళ్లారు. బాబాయ్ ని చూడగానే కన్నీళ్ళు ఆగలేదు. "ఊరుకో

బాబూ..” అన్నాడు భుజం మీద చిన్నగా తడుతూ. అనురాగ్ తల నిమురుతూ అన్నాడు “మీ నాన్నకు వీడంటే ఎంతిష్టమో. వారం క్రితమే వీడికి ప్రత్యేకంగా ఫోన్ ఉందా అని అడిగి, నెంబర్ తీసుకొని చాలాసేపు మాట్లాడాడు”. ఆశ్చర్యంగా చూసాను అనురాగ్ వైపు. వాడు కనీసం వారం క్రితం నాన్నతో మాట్లాడాడు. నేను చివరిసారిగా ఎప్పుడు మాట్లాడానో గుర్తు తెచ్చుకోవాలన్నా భయమేసింది.

వచ్చినవారంతా మమ్మల్ని చాలా ఆప్యాయంగా పలకరించారు. నా చిన్ననాటి స్నేహితులు కూడా ఉన్నారు అందులో. ఆ తర్వాత కార్యక్రమాలన్నీ వరుసగా జరిగిపోయినయ్. బాబాయ్ దగ్గరుండి అన్నీ చూసుకున్నాడు. కన్నీళ్లతో అంత్యక్రియలు పూర్తిచేసి నాన్నను పరలోకానికి సాగనంపాను. ఊరి జనం కూడా ఆయన గురించి గొప్పగా మాట్లాడుకుంటూ ఘనంగా వీడ్కోలు పలికారు. చితిమంటల్లో కట్టెలా కాలిపోతున్న నాన్నను చూసి అనురాగ్ దు:ఖం ఆగలేదు. నన్ను గట్టిగా పట్టుకొని ఏడవసాగాడు. అప్పుడు అర్థమైంది నాకు వాడు పొద్దున బాధపడింది క్రికెట్ టోర్నమెంట్ కోసం ఎంతమాత్రం కాదు అని.

ఎక్కిళ్ళు పెడుతూ అన్నాడు వాడు “పోయిన వారం తాతయ్య నాతో చాలాసేపు మాట్లాడాడు నాన్న. నీ గురించి గొప్పగా చెప్పాడు. పెద్దయ్యాక నిన్ను, అమ్మని జాగ్రత్తగా చూసుకోమన్నాడు. చెడు అలవాట్ల జోలికి వెళ్లొద్దని మరీ మరీ చెప్పాడు..” ఎవరో మంచినీళ్ళు అందిస్తే కొద్దిగా తాగి చెప్పటం కొనసాగించాడు. శ్రద్ధగా వింటున్నాను.

“..తాతయ్యకు ఎవరో చెప్పారట ఫోన్లో అవతలి మనిషిని చూస్తూ మాట్లాడొచ్చని. దాన్ని ‘వీడియో కాల్’ అంటారని నేనంటే, ‘మీ నాన్నతో ఓసారి వీడియో కాల్ చేయించరా. ఇక ఎక్కువ కాలం బతకను’ అన్నాడు. చాలా బాధగా అనిపించింది నాన్నా. తాతయ్యది స్మార్ట్ ఫోన్ కాదసలు. అందులో కనీసం వాట్సఅప్ కూడా ఉండదు...” ఏడుస్తూ ఇంకా ఏదో చెబుతున్నాడు వాడు. నాకేమీ అర్థం కావటంలేదు. మనసుకు ఎవరో మేకులు కొడుతున్నట్టుగా బాధ! ఆయనకు నేను పంపిన వెయ్యి రూపాయల నోకియా ఫోన్ గుర్తుకొచ్చింది. ఛ. మంచిది కొనాల్సిందేమో. ఆయనకు వాడటం రాదని ఏదో ఆఫర్లో కనీసం కేమరా కూడా లేని పాత మోడల్ ఫోన్ పంపాను. దానికే ఆయన మురిసిపోయాడు పాపం..

★★★

పోతూపోతూ నాన్న నాకు కలిగించిన దు:ఖం ఎన్నటికీ తగ్గేది కాదు. ఉదయం ఏడింటికి బాబాయ్ ఫోన్ చేసి నాన్న పోయారన్న వార్తతో పాటు మరో దారుణమైన విషయం కూడా చెప్పాడు. తన మూడెకరాల భూమిని ఊళ్ళో కొత్తగా పెట్టిన పేదల ఆశ్రమానికి అమ్మ పేరుమీద విరాళంగా ఇచ్చి రెజిస్టర్ కూడా చేసాడు నాన్న!! ఆయన నాకు రెండ్రోజుల క్రితం అదేపనిగా ఫోన్ చేసింది రెజిస్టర్ చేసేముందు నాకో మాట చెప్పటానికే! బాబాయ్ కి కూడా నాన్న పోయాకే ఆశ్రమం ద్వారా విషయం తెలిసింది. అమ్మ పేరు శాశ్వతంగా నిలిచిపోవాలన్న కోరికతో, కనీసం యాభై లక్షల

విలువ చేసే ఆస్తిని అంత తేలిగ్గా ధారాదత్తం చేసాడాయన. ఆయన చేసిన గొప్పపని బాబాయ్ ద్వారా ఊరంతా పాకిపోయింది. అందుకే అంతమంది జనం తరలి వచ్చింది.

నేను ఎన్నో ఆశలు పెట్టుకున్న యాభై లక్షల ఆస్తి అది! నాన్నతో తరచూ మాట్లాడుతూ ఉండి ఉంటే ఆయన ఆలోచన నాకు తెలిసిపోయేదేమో. కనీసం రెండ్రోజుల క్రితం అదేపనిగా ఆయన ఫోన్ చేసినప్పుడు ఒక్కసారి ఎత్తి మాట్లాడుంటే ఖచ్చితంగా ఆ విరాళాన్ని ఆపేవాడ్ని. ఆస్తి మిగిలిపోయేది. అదేమీ తాతలు సంపాదించింది కూడా కాదు ఆయన చేసింది చెల్లదు అని గొడవ చేయటానికి. ఆయన చేసింది ఓ మహోన్నతమైన కార్యమే అయినా, నాకు మటుకు తీరని నష్టం, దు:ఖం కలిగించిన విషయం అది. మళ్ళీ ఏడుపు తన్నుకు వచ్చింది. పక్కనున్న వారు ఓదారుస్తున్నారు. కొద్దిదూరంలో ఉన్న అనురాగ్ కూడా ఏడవటం కనిపించింది. తాతయ్యతో తన బంధం శాశ్వతంగా తెగిపోయిందన్న దు:ఖంతో ఏడుస్తున్న వాడ్ని చూస్తే ఈర్ష్యగా అనిపించింది... ఎందుకంటే వాడి దు:ఖంలో ఏమాత్రం కల్తీ లేదు! నా దు:ఖం లాంటిది కాదది!!

# ఓం నమఃశివాయ

**ఎలక్ట్రాన్**

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
బహుమతి పొందిన కథ

నా పేరెందుకు చెప్పడం కానీ, చెప్పకపోతే శివాలయం పూజారి సోమరాజుగారబ్బాయి భీమరాజు స్నాతకోత్తరపట్టా సాధించి కూడా ఉద్యోగం దొరక్క, గుడిలో తండ్రి పక్కన నిల్చుని, భక్తుల చేతిలో తీర్థం పోసి, నెత్తిమీద శఠగోపం పెడ్తున్నాడని జనాలు ఎలా చెప్పుకొంటారు? అందుకని నా పేరు భీమరాజు అని విన్నవించుకొంటున్నాను.

సరే, సాధారణంగా నామకరణం చేసినప్పటి పేరు, పిలిచే పేరు వేర్వేరుగా ఉంటాయి కాబట్టి ఇంట్లో నన్ను భీమా అని, బయటివాళ్లు రాజూ అని పిలిచేవారు. బబ్లూ, చింటూ, బంటీ లాంటి నేటికాలపు ముద్దుపేర్లు నాకు చాలా చికాకు కలిగిస్తాయి. మా నాయన గుళ్ళో పూజారి అని తెలియనివాళ్లు నన్ను రాజులబ్బాయనుకొనే వారు.

వంశ పారంపర్యంగా వస్తున్న పూజారి పదవి చేజారిపోతుందేమోనన్న భయం నాన్నది. ఎందుకంటే నేను మా అమ్మా నాన్నలకు ఒకడినే సంతానం. అందుకనే నేను పై చదువులకు వెళ్ళడం నాన్నకి ఇష్టం లేకపోయింది. చాలా అభ్యంతరాలు చెప్పి, ఆర్థికపరమైన ఇబ్బందులు వివరించి అపుచెయ్యడానికి ప్రయత్నించినా, అమ్మా, నాయనమ్మలు అడ్డుకొని, తమ మెడల్లోఉన్న కాస్త బంగారాన్నీ అమ్మి పైచదువులకి పంపించారు. గుళ్ళో ఉన్న దేవుడికి నిత్యాభిషేకం చేసి, వచ్చిన భక్తుల నెత్తిమీద శఠగోపం పెట్టి, చేతిలో తీర్థంపోసి, ఒక మారేడుదళాన్ని చేతనుంచే పూజారి బతుకులో ఏముందని నాకనిపించేది. ఎవరో కొందరు భక్తులు అప్పుడప్పుడూ దైవదర్శనం చేసుకొన్నతర్వాత, నాన్నగారికి ప్రత్యేకంగా నమస్కారాలు పెట్టి, దీవెనలందుకొని వెళ్లినప్పుడు నాన్నముఖంలో సంతోషరేఖలు వెలిగేవి. అంతకు మించి, గుర్తింపు పూజ్యం.

ఆ గుడిని వంద సంవత్సరాల క్రితం భూపతినాయుడుగారనే ఓ పిల్ల జమీందారు, కట్టించి, గుడిపేరన ఓ అయిదెకరాల భూమినిచ్చి, ఓ ధర్మకర్తల సంఘ నియామకం చేశాడు. ఇటు గుడి అర్చకత్వం, అటు ధర్మకర్తల సంఘం కూడా వారసత్వంగానే వస్తూ వచ్చాయి. ఓ ఎకరం మీద వచ్చే వార్షిక ఫలసాయం గుడి పూజారికి ఇవ్వాలని, దక్షిణ పళ్ళెంలో వేసిన డబ్బులు పూజారికే దక్కాలనీ, మిగిలిన నాలుగెకరాల ఫలసాయం, హుండీ సమర్పణలూ వెచ్చించి దేవాలయ నిర్వహణకీ, మాస,మహా శివరాత్రుల సంబరాలకీ, సంతర్పణలకీ ఖర్చుపెట్టాలని ఆయన నమోదు పత్రాలలో స్పష్టంగా రాయించాడు.

కలియుగారంభంనుంచీ గతించిన వేల సంవత్సరాలలో యుగలక్షణాలు నెమ్మదిగా వర్థిల్లుతూ వస్తున్నా, ఇటీవలి వందసంవత్సరాలలో ఒక్కసారిగా ఊపందుకోవడంతో, శివుడి భూమి అయిదునుంచి మూడుకి పడిపోయింది. కౌలతస్వాములకు రూకలందించి, సరిహద్దు రాళ్ళు తిరిగి పాతించి, రెండెకరాలు పక్కభూములవాళ్లు స్వాహా చేసేశారు. అలా స్వాహా చేసిన వాళ్ళలో ధర్మకర్త సంఘసభ్యుల జోక్యం కూడా ఉంది. మిగిలిన మూడింటినీ ప్రభుత్వ దేవాదాయసంస్థ పేదల వసతిగృహ సముదాయాలకి సమర్పించుకోవలసి వచ్చింది. మేడమీది గదిలోని కుర్చీలు తీసి కింది సావిట్లో వేసినట్టుగా, ఆ మూడెకరాల భూమీ కేవలం ఒక మంత్రిత్వశాఖ లోంచి మరో మంత్రిత్వశాఖలోకి మారిందంతే! వసతిగృహ నివాసులలో కాస్త ధర్మచింతన కలవారు ఏనాడో కీర్తిశేషులైన భూపతినాయుడుగారికి కృతజ్ఞతలు తెలపాలో, లేక తనకిచ్చిన ఆస్తులు హరించుకుపోయినా ఏదో విధంగా నిత్యహారతులందుకొనే శివుడుకి తెలపాలో అన్న మీ మాంసలో పడినప్పుడు, పాలనలోఉన్న ప్రభుత్వానికి చెప్పండి అని విజ్ఞులు వారికి హితబోధ చేశారు.

ధర్మకర్తల సంఘం నామమాత్రంగా ఉండి కొత్త సభ్యులు చేరడం జరిగింది. వారి పనల్లా ప్రభుత్వం నియమించిన పర్యవేక్షణాధికారికి తిథి వార నక్షత్రాలు చెప్పి పూజలూ, హోమాలు జరిపించడమే. విష్ణాలయాల్లోలాగా లడ్డూ ప్రసాదాలు శివాలయాల్లో అమ్మకాలు జరగవు కాబట్టి, అమృతపాణి అరటిపళ్ల గెలలూ, కొబ్బరికాయలూ, పులిహోరా ధర్మకర్తల యిళ్లకీ, ప్రభుత్వాధికారి ఇంటికీ తరలేవి. నెలకోసారి ప్రభుత్వపు ఉద్యోగి వచ్చి, సీలు వేసిన హుండీ తాళం తీసి, సొమ్ముని లెక్కబెట్టించి, నలుగురి సాక్షిసంతకాలు తీసుకొని వెళ్లిపోవడం జరిగేది. ఆ వివరాలు గుడితాలూకు నమోదు పుస్తకంలో రాయడం కూడా జరిగేది. నగా, నట్రా ఉంటే స్వర్ణకారుడు వచ్చి గీటుపెట్టి, రాగి శాతం చెప్పి పొయ్యేవాడు. ఆ నగల్ని బ్యాంక్ లో అద్దె ఇనపసొరుగుల్లో ఉంచడం జరిగేది. అయినా నాగాభరణుడికి రజత, స్వర్ణాభరణాలిచ్చే భక్తులెక్కడుంటారు కనుక?

దేవాదాయసంఘం నాన్నకి నెలసరి జీతం ఎనిమిది వందలు నిశ్చయించింది. ప్రభుత్వపు మనిషి దక్షిణల పళ్లెంలో వాటాలడగ ప్రారంభించాడు. రైతుబజారులో కూరలమ్మేవాళ్లనుంచి పురపాలకసంఘ ఉద్యోగి కావల్సిన కూరల్ని తీసుకొని, డబ్బులివ్వకుండా దర్జాగా వెళ్ళిపోయినట్టు. వచ్చేది మహా అయితే రోజుకో ఇరవై రూపాయలు. 'ఎలా బతికేది,' అని నాన్న తన గోడు లిఖిత పూర్వకంగా వినిపించుకొన్నాడు. రెండో రోజుకి భక్తులకు కనబడేటట్లుగా మీ దక్షిణలన్నీ హుండిలోనే వేయండి అని బోర్డులు పెట్టించేశాడు దక్షుడైన ఆ అధికారి! దక్షిణలువేసే భక్తుల చేతులు హుండీల దగ్గరే తెరుచుకొనేవి. దక్షిణలపళ్లెంలో మారేడుదళాల, పారిజాతాల బరువు తప్ప, భక్తులు వేసే నాణేల బరువు తగ్గిపోయింది. దాంతో నాన్న గతి ఒడ్డున పడ్డ చేపలా అయింది. నాన్న గతేమిటి, మొత్తం మా కుటుంబ పరిస్థితి వర్షాకాలంలో ఆదివారం సంతల దొడ్డి బురదలాగా తయారైంది.

మొదటినుంచి గుడిప్రాంగణపు వెనకభాగంలో మూడు గదులు, వసారాలతో ఉన్న రేకులకొంప ప్రస్తుతం మా నివాసం. అందులో శివపూజలకు కావల్సిన సామగ్రిని ఉంచేటందుకు ఒక గది కేటాయించబడింది. అసలు అది పెంకుటిల్లట. పూర్వం ఎప్పుడో ఓ సారి బాగులు చేయించాల్సివస్తే, ఆనాటి ధర్మకర్తల సంఘం పెంకులు తీయించేసి, పుచ్చులు పట్టిన పైకప్పు కమ్మీలను మార్పించి, ఆస్బెస్టాస్ రేకులు వేయించిందట.

నేను చదువు ముగించుకొని వచ్చాను. అసలు పైన చెప్పిన వివరాల్లో నాకు అన్నీ తెలియవు. నాయనమ్మ చాలా సంగతులు నాన్నకి తెలియకుండా వివరించింది. వెంటనే ఉద్యోగం సంపాదించి అమ్మనీ, నాన్ననీ, నాయనమ్మనీ శివుడి గుడినుంచి బయటకు తీసుకుపోవాలని ప్రయత్నాలు ప్రారంభించాను. ఏ ఉద్యోగమూ దొరకలేదు. విద్యార్హతలుంటే వెంటనే ఉద్యోగం దొరుకుతుందన్న రోజులు ఏ నాడో సమసిపోయాయన్న జ్ఞానోదయం కలిగింది. నాన్న చేసిన పూజలు, పవిత్రమైన దేవాలయప్రాంగణంలో నివాసమూ ఏ విధమైన మేలూ కలిగించ లేదు. నాకు శివుడి మీద

చాలా కోపమొచ్చింది. చిన్ననాటనుండే భక్తి సన్నగిల్లింది. నాన్నచూసే ప్రతి చూపులోనూ నీ చదువెందుకు అనే ప్రశ్న కనబడేది.

సరే ఏదో ఒకటి చేయాలని, గుడి ఆవరణలోనే కొందరు పిల్లలకి ప్రైవేటు పాఠాలు చెప్పడం ప్రారంభించాను. అయిదుగురితో మొదలై ఇరవైమంది దాకా విద్యార్థుల సంఖ్య పెరిగింది. అయిదో తరగతినుంచి పదోతరగతి వరకు ఇద్దరేసి లేక ముగ్గురేసి విద్యార్థులు. వారిలో నలుగురు బాలికలు. మనసు చంపుకొని ఆ పేద విద్యార్థులనుంచి నెలజీతం 30 రూపాయలు తీసుకొన్నాను. అంటే విద్యార్థికి రోజుకో రూపాయన్నమాట! మొత్తం నా సంపాదన నెలకి ఆరువందలు.

'దేవాలయంలో విద్యార్థులకు బలవంతంగా వేదపాఠాలు రుద్దేస్తున్నారట!' అన్న ఓ వదంతి పుట్టుకొచ్చింది. ఆలయపర్యవేక్షణ ఉద్యోగితోబాటు, ఓ నలుగురు విద్యావిభాగపు అధికారులు, జిల్లా పాలనాధికారి కార్యాలయంనుంచి ఓ యిద్దరు అధికారులూ దండెత్తారు. విద్యార్థులూ, వారి తల్లిదండ్రులూ వచ్చారు. కుర్రవాళ్లని ప్రశ్నించారు. అటువంటిదేమీ జరగలేదనీ, మాస్టారు బాగా పాఠాలు అర్థమయ్యేటట్టు చెబుతున్నారనీ విద్యార్థులూ, వారి తల్లిదండ్రులు కూడా నాకు కితాబునిచ్చారు. విద్యార్థుల్లో ఇద్దరు ఇతర మతాల వారున్నారు. ఓ నలుగురు కులవృత్తులు చేసుకొనేవారి పిల్లలు. వాళ్ళ పేర్లు తెలుగులోనూ, ఆంగ్లంలోనూ తప్పులు లేకుండా రాసి చూపించారు. ఎక్కాలు అప్పజెప్పారు. కుర్రవాళ్ళకి వాళ్ళ స్థాయిని బట్టి ఏవో వాక్యాలు చెబితే చాలా మంది తప్పులు లేకుండా, ఒకరిద్దరు ఒకటి రెండు తప్పులతోనూ రాశారు. చిన్నప్పుడు మా తెలుగు మాస్టారు విష్వక్సేనుడు, ధృతరాష్ట్రుడు, ఏకాక్షి, సవ్యసాచి లాంటి పదాలు చెప్పి రాయమనేవారు. బెత్తం కూడా చేతిలో సిద్ధంగా ఉండేది. ఇప్పుడు బెత్తమనేది లేదు. చేత్తో చిన్న దెబ్బవేసినా, కాస్త చెవి మెలిపెట్టినా అది రాజకీయమైపోతోంది. వేదపఠనం చేయిస్తున్నానన్న అపవాదుకి వాళ్లకేవిధమైన ఆధారమూ లభించలేదు. నన్ను శిక్షించడానికి అవకాశమూ కలగలేదు.

"భీమాకి చిన్నతనంనుంచి వారసత్వంగా వస్తోన్న అర్చకత్వం చేయమని దిశానిర్దేశం చేసినా నా మాటని కాదని చదువువైపే దృష్టి సారించాడు. ఏదో సంప్రదాయ బద్ధంగా నాలుగైదు స్తోత్రాలు వల్లించడం తప్ప ఒక్కమంత్రమూ రాదు. శివుడి మీద భక్తీ లేదు. ఇప్పుడు ఉద్యోగం లేక, పాఠశాలల్లో ఇప్పటికే చదువుతోన్న ఈ విద్యార్థుల స్థాయి పెంచడానికి కృషి చేస్తున్నాడు," అని నాన్న శాంతస్వరంతో అన్నాడు. నా మనసులోని మాటల్ని తానే అన్నాడు. నేనే కనక అనుంటే మండుతూన్న మనసుతో ఎలా అనేవాణ్ణో నాకు తెలియదు.

వాళ్ళందరూ దేవాలయంలో అడుగుపెట్టారు కనుక దర్శనం చేసుకోకపోతే బావుండదేమోనని గుడికి ఓ ప్రదక్షిణ చేసి, దేవుడికి ఓ నమస్కారం పెట్టి వెళ్ళిపోయారు.

వెళ్లబోయే ముందు ఒకాయన నన్ను ఓ పక్కగా తీసుకుపోయి, "మీ అవసరంకొద్దీ ప్రయాస పడడం అవసరమే అయినా, విద్యార్థులకు మేలు కలుగుతోన్నా ఇలా శివమందిరంలో పాఠాలు చెప్పడంతో చాలమందికి వేదబోధన చేస్తున్నారన్న అపోహ కలుగుతుంది. అందుకొని మీరు ఏదో వేరే జాగా చూసుకొని పాఠాలు చెప్పండి. మీకు ఏ సహాయం కావాలన్నా వచ్చి నన్ను కలుసుకోండి," అని ఆప్యాయంగా అన్నాడు. ఆయన పడ్డ జాలి నిజమే కావొచ్చు, ఎగతాళి కావొచ్చు. అయినా ఆ క్షణంలో నాకు ఆయన మాటలు ఏమీ ఊరడింపుగా అనిపించలేదు.

"మీ పేరు సర్? ఎక్కడ పనిచేస్తున్నారు? అవసరమొస్తే కలుసుకోడానికి చిరునామా తెలియాలి కదా?" అన్నాను.

"నాపేరు చంద్రశేఖర్. జిల్లా పాలనాధికారికి, జిల్లా విద్యాశాఖాధికారికీ మధ్య అనుసంధానకర్తగా పనిచేస్తున్నాను. అయితే నా ఉద్యోగస్థావరం జిల్లాపాలన భవనం లోనే," అని చెప్పి వెళ్లిపోయాడు.

నాన్న మా కుటుంబానికి జరిగిన అన్యాయంకన్నా శివుడికి అన్యాయం జరిగిపోయిందని వాపోయినప్పుడల్లా నా కోపం నషాళం అంటుకోసాగింది. అయినా నా కోపం అణచుకోడానికి విశ్వప్రయత్నమే చేయాల్సివచ్చింది. ఎందుచేతనంటే అమ్మా, నాన్నలు నన్ను ఉన్నంతలో బాగానే పెంచారు. నేను నాన్న మీద ఎగిరితే అది అమ్మకు, నాయనమ్మకూ బాధగానే ఉంటుంది. వారి మనసుల్ని నొప్పించే ప్రయత్నం నేనేనాడూ చేయలేదు. చేయకూడదు కూడా!

ఆ సాయంత్రం వెళ్ళి భూపతినాయుడుగారి ముని మనవడు శ్రీపతినాయుడిని కలుసుకొన్నాను. అతనితో పరిమితమైన పరిచయం ఉంది. ఆదరంగా నన్నో కుర్చీలో కూర్చోబెట్టి, తనో చెయ్యివిరిగిన కుర్చీలో కూర్చుని కుశల ప్రశ్నలు వేశాడు. జరిగినదంతా వివరించాను. నాకు తెలిసిన సంగతులు చెప్పాను. "మీ ముత్తాతగారు శివాలయానికి ధారపోసిన భూమంతా అన్యాక్రాంతమైపోయింది. చేయగలిగింది ఏదైనా ఉందా?" అని ప్రశ్నించాను.

"నేను కూర్చున్న కుర్చీ నా పరిస్థితిని చెప్పకనే మీకు తెలియజేస్తుంది. మా ముత్తాత 150 ఎకరాల భూమి ఒక్కొక్క తరంలోనూ తరిగిపోయిందే కానీ, ఎవరూ పెంచిన వారు లేరు. మా కుటుంబంలోనూ కుటుంబ రాజకీయాలకు కొదవలేదు. ఆస్తుల పంపకంలో కోర్టు గుమ్మాలు తొక్కారు. కొందరు ఆస్తులమ్ముకొని వెళ్ళిపోయారు. నేను మా ముత్తాతకి పన్నెండో ముని మనవణ్ణి. శిథిలావస్థలో, నాలుగు లక్షలు అప్పుతో ఈ కొంప నాకు ఈ తరంలో దక్కింది. సెంటు భూమి లేదు. ఇంటనే గెలవలేని వాణ్ణి, బయటి వారితో కోర్టుతగాదాలకు దిగే శక్తి లేదు. నేను పెళ్లిచేసుకోకుండా బ్రహ్మచారి బతుకు బతుకుతున్నాను. అమ్మా నాన్నలు పోయి నాలుగు సంవత్సరాలైంది. ఇల్లు అమ్మి అప్పు తీరుద్దామనుకొంటే భవననిర్మాణాలు చేసే బడాబాబుల దళారులు బేరాలు రాకుండా చేస్తున్నారు. ఏ దుకాణం వారికైనా, ఆఫీసు వారికైనా అద్దె కిద్దామంటే బజారుకి దూరంగా ఉన్నందుమూలాన ఎవరూ రావటల్లేదు ఏం చేసేది?"

'మీరు బి.ఏ ప్యాసైయ్యారని విన్నాను. ఉద్యోగం,.... భృతి ......?" సందేహిస్తోనే చనువు తీసుకొని అడిగాను.

" ప్రస్తుతానికి నా మేనమామలు కొంత ఆర్థిక సహాయం చేస్తున్నారు. మీరు నాకన్నా ఎక్కువ చదివారు, మరి ..... "

"సర్లెండి, రోలు వెళ్ళి మద్దెలతో మొరపెట్టుకున్నట్లుంది. ఒక పని చేయండి. మీ ఇల్లు పెద్దది. ఆ పిల్లలకి విద్యాబోధన మీయింట్లో చేసేటందుకు నాకు వెంటనే అనుమతి యివ్వండి. వాళ్ళమూలాన నాకు ఆరు వందలు లభిస్తోంది. అందులో రెండువందలు మీకు అద్దెగా యిస్తాను."

శ్రీపతినాయుడు ఒక్క నిముషం ఆలోచనలో పడ్డాడు. తర్వాత అన్నాడు. "అలాగే! ఆ రెండువందలూ నాకు ప్రియమే. అవసరమే. కానీ ఒక షరతు! నేనుకూడా పాఠాలు చెప్తాను మరి. నాకూ ఉబుసుపోతుంది."

కారణాలేమైతేనే కానీ, ఆర్థికంగా చితికిన బతుకులు అనేకరూపాల్లో దర్శనమిస్తోనే ఉంటాయి. జమీందారుల బిడ్డ అనగానే ఏర్పడే అభిప్రాయం తప్పని శ్రీపతినాయుణ్ణి కలుసుకొన్న తర్వాత తెలిసింది. అయినా నీటమునిగేవాడికి ఓ చేయి దొరికికినంత సంతోషం వేసింది. చేయందించిన వ్యక్తిని మనతోబాటు నీట ముంచడం భావ్యం కాదు. ఇద్దరమూ ఎలాగో తీరం చేరగలమన్న ఆశాభావం కలిగింది.

మర్నాటి నుంచీ పిల్లలకి చదువు మెరుగుపరిచే చోటు శ్రీపతినాయుడు ఇంటికి మార్చాను. శ్రీపతినాయుడు నన్ను గమనించి, కొన్ని పద్ధతులు గ్రహించిన మూడో రోజునుంచి పాఠాలు చెప్పడం ప్రారంభించాడు. నోటి కబురుతో– విద్యార్థుల సంఖ్య నెల తిరిగే సరికి ఏభైకి పెరిగింది. వచ్చిన సంపాదనలో సగం శ్రీపతినాయుడు చేతిలో ఉంచి, 'మనిద్దరం ఇప్పుడు భాగస్వాములం,' అన్నాను. అధిక భాగం పై తరగతులు చదువుతున్న వాళ్ళే. వారి చదువు స్థాయి చూసి ఆందోళన కలిగినా, మరో నెలరోజుల్లో వారి సమర్థత గణనీయంగా పెరిగింది. ఓ ఆశాజ్యోతి మనసులో వెలిగింది. నా ఆలోచనలను శ్రీపతినాయుడు ముందు ఉంచాను.

ఇద్దరం పోయి చంద్రశేఖర్నికలిశాం. ఆయన కలివిడిగానే ప్రవర్తించాడు. "మీ శివాలయం శిక్షణలో విద్యార్థుల ప్రగతిని గురించి సర్ తో చెప్పాను. 'అలాగా,' అన్నారు. నేను ఈ సాయంత్రం మీ యింటికి వస్తాను. మరో సారి విద్యార్థులతో మాట్లాడాలని ఉంది," అన్నాడు.

"విద్యార్థులు సాయంకాలం వాళ్ళ స్కూళ్ళు అయిన తర్వాత అయిదు ప్రాంతంలో వస్తారు. అప్పటికి రాగలరా?" అడిగాను.

"తప్పక వస్తాను." అని మాట యిచ్చాడు.

ఆ సాయంత్రం ఆగిన ఓ కారు ముందు సీట్లోంచి చంద్రశేఖర్ దిగి, కారు వెనకవైపు తలుపు తీశాడు. అందులోంచి దిగిన వ్యక్తిని చూసి మా ఇద్దరికీ నోటమాట రాలేదు. జిల్లా పాలనాధికారి రమేశ్ గుప్తా స్వయంగా దిగాడు. ఏ విధమైన భేషజం లేకుండా మాతో కరచాలనం చేసి లోపలికి వచ్చాడు. లోపలి మండువాలో కూర్చున్న విద్యార్థులందరూ లేచి నిల్చున్నారు.

'కూర్చోండి,' అని ఆయన తెలుగులోనే అన్నారు. ఆయన విద్యార్థుల పేర్లు, ఏ తరగతులు చదువు తున్నదీ, ఏ బడిలో చదువుతున్నది తెలుసుకొన్నాడు. కుర్రవాళ్ళందరూ జంకు లేకుండా, ఉచ్చారణా దోషాలు లేకుండా సమాధానాలు చెప్పారు. "ఇలాగ ప్రత్యేక శిక్షణలు చెందుతున్నారంటే ఏదో ప్రయోజనం ఉండాలి కదా? చెప్పగలరా?" అన్నాడు జనాంతికంగా.

అందరూ చేతులెత్తారు. గుప్తాగారు చేతులెత్తిన వారిలో ఓ నలుగుర్ని చెప్పమన్నాడు. సారాంశం ఒక్కటే. 'బడిలో పంతుళ్ళు సరిగా పాఠాలు చెప్పటల్లేదు. అర్థమవక ఏదైనా మరోసారి అడిగితే, 'మట్టి బుర్రా! బట్టీ పట్ట' మంటున్నారు. ఇక్కడైతే మాకు అర్థమవని సంగతుల్ని చక్కగా బోధిస్తున్నారు. మా రాతల్లో దొర్లే అక్షరాల తప్పుల్ని సరిదిద్దుతున్నారు.మా మాటల్ని సరిచేస్తున్నారు. బోర్డు దగ్గరకు వెళ్ళి అందరిముందూ జంకు లేకుండా లెక్కలు చేసే ధైర్యమిస్తున్నారు. మాకిప్పుడు ఏడాది పరీక్షలంటే ఏమాత్రం భయం లేదు!"

చంద్రశేఖర్ కొందరు విద్యార్థులను ఇదివరకే శివాలయంలో గమనించారు. ఇప్పుడు అనుకోకుండా జిల్లా అధికారి కూడా వచ్చాడు. ఆయన వస్తాడని మాకు తెలియదు. ఆయనెవరో తెలిసిన మాకు జంకు కలిగిందికాని, పిల్లలు జంకు లేకుండా సమాధానాలు చెప్పడంతో మనసు స్థిమిత పడింది.

"అర్థం తెలుసుకొంటే బట్టీ పట్టవలసిన అవసరం ఉండదు. అర్థంతో పాటు పద్ధతి తెలుసుకొంటే లెక్కలంటే భయపడనవసరం లేదు. ఈ రోజు మీకు సెలవు!" అన్నాడు.

పిల్లలందరూ నా కేసి చూశారు. "మీకు ఈ సాయంత్రం సెలవు! రేపట్నించీ మళ్ళీ మామూలే!" అన్నాను.

శ్యామల అనే ఓ తొమ్మిదో తరగతి అమ్మాయి, "మా లెక్కల మాస్టారు రెండు లెక్కల్ని ఇంటిదగ్గర చేసుకు రమ్మని ఇచ్చారు. అవి అర్థం కావటల్లేదు. చేయకుండా స్కూలుకి వెడ్తే రేపాయన తిడ్తారు."

రమేశ్ గుప్తా "ఆ లెక్కలేమిటో ఇలా వచ్చి బోర్డు మీద రాయి,"అన్నాడు. శ్యామల ముందుకొచ్చి ఆ లెక్కల్ని తన వద్దనున్న పుస్తకాన్ని చూస్తూ బోర్డుమీద రాసింది. గుప్తాగారు నాకేసి చూశాడు. ఆ లెక్కలకు ఆధారితమైన పైథాగరస్ సిద్ధాంతన్ని వివరించి, లెక్కల్ని ఏ విధంగా చెయ్యాలో చెప్పాను. అవి చెప్పిన తర్వాత శ్యామలే ఒకటి రెండు

మధ్యసలహాలతో లెక్కలు చేసింది. గుప్తాగారు శ్యామల్ని అభినందించాడు. నా కేసి చూస్తూ కళ్ళతోటే అభినందించాడు. అంటే ఆయన నాకూ పరోక్షంగా పరీక్ష పెట్టాడన్నమాట.

ఒక చిన్నతరగతి విద్యార్థిని పిలిచి, తెలిసిన పద్యమేదైనా చదవమన్నారు. అ విద్యార్థి సుమతీ శతకంలోని రెండు పద్యాలు చదివాడు. గుప్తాగారు అర్థం చెప్పమన్నాడు. చెప్పిన అర్థం విని 'శభాష్!' అని మెచ్చుకొన్నాడు. అటు తర్వాత పిల్లలందరూ వెళ్ళిపోయారు.

"నాది హిమాచల ప్రదేశ్. కానీ మమ్మల్ని ఏ రాష్ట్రానికి కేటాయిస్తే ఆ రాష్ట్రపు భాష నేర్చుకోవాలన్న నియమం ఉంది. అందునా హిమాచలప్రదేశ్ రాష్ట్రంలో అమలులో ఉన్న విద్యానియమాల ప్రకారం పాఠశాలల్లో మూడోభాష ఒకటి నేర్వాలి. నేను తెలుగు తీసుకొన్నాను," అన్నారాయన గర్వంగా. ఆయన స్వచ్ఛమైన తెలుగులో మాట్లాడడం మాకు ఆశ్చర్యం కలిగించింది. ఆయన్ని అభినందించాం.

నాయుడు గ్లాసుల్లో పోసి కొబ్బరి నీళ్లందించాడు. రమేశ్ ఇల్లంతా కలయజూసి శ్రీపతిరాజు నుంచి వివరాలు తెలుసుకొన్నాడు. "స్వయం ఉపాధి పథకం కింద మీరు చేబట్టిన ప్రయత్నం మంచిదే, కాదనను. అయితే ఈ ప్రత్యేక శిక్షణనేది కూడా ఒక వ్యాపారంగా మారిపోయింది. అది విద్యారంగానికి దీర్ఘకాలికమైన హాని చేస్తుందే తప్ప మేలు చేయదు. ఓ పని చేయండి. దీన్ని ఓ మాధ్యమిక పాఠశాలగా మార్చండి. ప్రభుత్వంనుంచి అనుమతులు వచ్చేటట్టు నేను చూస్తాను. ఈ స్కూలికి భూపతినాయుడిగారి పేరు పెట్టండి. స్థిరపడిన తర్వాత ఉన్నతపాఠశాల అనుమతులు తీసుకురావొచ్చు. చంద్రశేఖర్! కావల్సిన దరఖాస్తులూ అవీ శ్రీపతినాయుడుగారి చేతా, భీమరాజుగారి చేతా నింపించి దస్త్రం తెరవండి. నెల రోజుల్లోగా ఈ భవనం ముందు స్కూలు పేరు రాయబడాలి. శ్రీపతినాయుడు గారూ! ఇంటిని మీరు ధారాదత్తం చేయనవసరం లేదు. స్కూలుకు బాడుగతో నెలవుగా యిస్తే చాలు!" అన్నాడు.

శ్రీపతిరాజు తక్షణం స్పందించాడు. "సర్! నేను బ్రహ్మచారిని. ఇలాగే ఉండిపోతాను. అందుచేత మా యింటిని స్కూలుకి ధారాదత్తం చేసేస్తాను. అలాగంటే అనుమతులు త్వరగా వస్తాయేమో?"

"ఆ మాటా నిజమే కానీ, మీరు కూడా జాగ్రత్త వహించాలి. ప్రభుత్వ వ్యవహారాల్లో కూడా లుకలుకలు అనేకం ఉంటాయి. మీరు ఆవేశంలో కాకుండా, ఆలోచించే ఈ మాటంటే అలాగే కానివ్వండి. మీ ఇంటివిలువ ఇప్పుడు పదిహేను లక్షలకు పైగానే ఉంటుంది. అప్పులు ప్రభుత్వం తీర్చి, ఇంటిని విద్యాసంస్థకు మీరు ధారదత్తం చేసినట్టు నమోదు చేయిస్తుంది. సరేనా?"

"సర్! నా ముత్తాత శివాలయం కట్టించి, కొంతభూమి రాసి, ఒక కుటుంబానికి ఆశ్రయం కల్పించి కనుమూశాడు. ఆ వ్యవస్థ అంతా కుప్పకూలి శివుడికి గుడి మాత్రమే మిగిలింది. ఆశ్రయం పొందిన కుటుంబం ఈ తరం వచ్చేసరికి నడిరోడ్డున పడేటట్టు ఉంది. కానీ ఈ ఇల్లు ఓ సరస్వతీ నిలయంగా మారితే నిరంతరమూ నూతన విద్యార్థుల

ప్రవాహంతో కొనసాగుతుందే కానీ శివాలయం లాగేనే మొక్కుబడుల ఆలయంగా మారిపోదు. నా ప్రేమభగ్నమై నేను బ్రహ్మచర్యం వహించాను. నేను బతికున్నంతవరకూ, ఇదే ఇంట్లో ఓ గదిలో ఉండడానికి అనుమతినిస్తే చాలు.”

“మిమ్మల్ని స్కూలులో ఉపాధ్యాయులుగా ఉంచేటందుకు కొన్ని అభ్యంతరాలు రావొచ్చు. ప్రస్తుతం విద్యార్థుల బోధన కొనసాగిస్తోనే ఉండండి. భవనం ధారాదత్తం చేయడానికి మీ కిద్దరికీ ఉద్యోగమివ్వడం ఒక నిబంధనగా పెట్టి దస్త్రం కదిలిస్తాను. నేననకూడని మాటైనా, ఒక సంగతి చెప్పాలి.  ప్రస్తుతం ప్రభుత్వాధీన విద్యానిలయాల్లో విద్యాప్రమాణాలు పడిపోయాయి. ఫలితంగా తల్లిదండ్రులు కూడా సంస్థాగతమైన విద్యానిలయాల్లో తమ పిల్లల్ని చేర్పించడంతో మునిసిపల్, గ్రామపంచాయితీల అధ్వర్యంలో ఉన్న పాఠశాలల్లో కొన్ని తరగతుల్లో అసలు విద్యార్థులే లేకుండా పోయారు. మధ్యతరగతి, దిగువమధ్య తరగతి, పేదల విద్యాభ్యాసానికి ఇది తీరని నష్టం కలిగిస్తోంది. అనుమతి రాగానే జిల్లా విద్యాధికారితో సంప్రదించి కొంతమంది ఉపాధ్యాయులను వెంటనే బదిలీ చేయిస్తాను. నేను వ్యక్తిగతమైన మీ సహాయం చేయడంకోసం రాలేదు. ప్రభుత్వ పాఠశాలల పూర్వవైభవాన్ని తిరిగి తీసుకువచ్చే ప్రయత్నంగా మీ సహాయం అర్థించడంకోసం వచ్చాను.”

ఆయన మాటలువిని మాకు వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లయింది. నేనూ, శ్రీపతి నాయుడు చంద్రశేఖర్ అధ్వర్యంలో ధరఖాస్తులన్నీ సంతకాలు చేసి ఇచ్చాం. సరిగా నెలన్నర రోజుల్లో శ్రీ భూపతినాయుడు మాధ్యమిక పాఠశాల అన్న బోర్డు ప్రజల దృష్టిలో పడింది.

రమేశ్ గుప్తాగారి చొరవతో బెంచీలు, కుర్చీలు, బల్లలూ, ఏర్పాటు త్వరితంగా జరిగిపోయింది. అంతవరకు ప్రత్యేక శిక్షణ పొందిన విద్యార్థులు నిత్యవిద్యార్థులుగా నమోదైపోయారు. తొమ్మిది పది తరగతుల వారికి ప్రత్యేకంగా క్లాసులు తీసుకొంటామని భరోసా ఇచ్చాము.

నేనూ, శ్రీపతినాయుడు వెళ్ళి స్వయంగా రమేశ్ గుప్తాగారికి కృతజ్ఞతలు చెప్పుకొని, వచ్చి ప్రారంభోత్సవం చేయమని అర్థించాం. ఆయన చిరునవ్వు నవ్వుతూ, “నన్నుకాదు జిల్లా విద్యాధికారి రంగనాథంగారిని ప్రారంభోత్సవం చేయమని అడగండి. అయితే నేనూ తప్పక ప్రారంభోత్సవానికి హాజరవుతాను!” అన్నారు.

చంద్రశేఖర్ని కూడా తీసుకొని వెళ్ళి  రంగనాథం గార్నికలుసుకొన్నాం. “మంచి ముహూర్తం పెట్టించారా?” అని అడిగాడు.

“మీకే రోజు వీలుగా ఉంటుందో చెప్తే ఆరోజు పెట్టిస్తాం,” అన్నాను.

“నేనుకొంచెం చాదస్తం మనిషిని. నా పుట్టినరోజు 1-1-1970. సాయంత్రం అయిదింటికి  అశ్వనీ నక్షత్రంలో పుట్టాను. ముహూర్తం పెట్టించి వెంటనే తెలపండి,” అన్నాడు.

సరే సంగతి చెప్పి, నాన్నని ముహూర్తం పెట్టమని అడిగాను. దేవుడిమీద నమ్మకం లేని వాడివి, ముహూర్తాలమీద నమ్మకం ఏమిటన్నట్లుగా చూసి, చిన్నగా నవ్వుతూ వేళ్లమీద ఏవో లెక్కలు కడ్తూ, "వచ్చే శనివారం ఉదయం పదింటికి దివ్యంగా ఉంది," అన్నాడు.

ఆ రోజు రానే వచ్చింది. రమేశ్ గుప్తాగారు తొమ్మిదిన్నరకే చంద్రశేఖర్ తో కలిసి వచ్చేశాడు. కొంతమంది పత్రికా విలేకరులు కెమెరాలతో చేరుకొన్నారు. రంగనాధం గారు కనీసం ఒక అరగంట ముందుగానే వస్తారనుకొన్నాం. తొమ్మిది నలభై అయిదుకి ఏకంగా అరడజను కార్ల దండు వచ్చి ఆగింది. మధ్య కారు ముందు సీటులోంచి రంగనాధంగారు దిగి, వెనక తలుపు తీశాడు. అందులోంచి విద్యాశాఖామంత్రి శేషసాయి గారు దిగాడు! కలెక్టరుగారు ఆయనకి అభివాదం చేసి మమ్మల్ని పరిచయం చేశాడు. నాన్న కుదిర్చిన ఓ పండితుడు ఏవో వేదమంత్రాలు చదివి, భూపతినాయుడిగారి ప్రస్తావన, మంత్రిగారి ప్రస్తావన ఆ మంత్రాలలో ఇమిడ్చి, మంత్రిగారిచేత కొబ్బరికాయ కొట్టించేశాడు.

రంగనాథంగారు ఆ హడావుడిలో నా చెవిలో రహస్యంగా అన్నాడు. "ముహూర్త నిర్ణయానికి నేను మీకు చెప్పిన వివరాలు మంత్రి శేషసాయిగారివయ్యా! ఆయన కుర్చీలో ఉండగా నేను ప్రారంభోత్సవం చెయ్యడానికి దమ్ములుండొద్దూ?"

నాకు వచ్చే నవ్వును ఆపుకొన్నాను. కార్యక్రమం అంతా రంగనాధంగారే దగ్గరుండి, అన్నిటికీ తానే అయి చేయించేశాడు. రమేశ్ గుప్తాగారు గుంభనగా నాకేసి చూసి చిన్నగా నవ్వాడు.

ఆ విధంగా భూపతినాయుడిగారి పాఠశాల ఏభైమంది విద్యార్థులతో ప్రారంభమైంది. విద్యాసంవత్సరం మొదలైయ్యేసరికి విద్యార్థుల సంఖ్య రెండు వందలకి చేరింది.

బదిలీ మీద వచ్చిన ఉపాధ్యాయులు మొదట్లో కొంత తలతిక్కగా వ్యవహరించినా అధికారవర్గంతో శ్రీపతినాయుడి పరిచయం చాలా లోతైనదని ఊహించి, అలవాటైన తమ ముందు పంథాలను మార్చుకొని సహకరించడంతో, మేము తిరుగు మొహం పట్టనవసరం లేకపోయింది. మూడేళ్లలో ఉన్నత పాఠశాలగా రూపొంది పోయింది. ఆలోపుగా శ్రీపతినాయుడు, నేనూ దూర విద్యా విధానంలో విద్యాబోధనార్హతకు కావల్సిన బి.యిడి. పట్టాలు సంపాదించి, మా ఉద్యోగాలకి ఢోకా లేకుండా ఓ రక్షక కవచం ఏర్పాటు చేసుకొన్నాం.

నాయనమ్మ వృద్ధాప్యత కారణంగా ఓ సారి బాగా అస్వస్థతకి లోనైంది. ఓ రోజు పక్కలో కూర్చోబెట్టుకొని నా చెయ్యి పాముతూ, "భీమా! సరస్వతీ కటాక్షం మూలాన ఓ ప్రయోజకుడవైయ్యావు. నీ భావాల్ని నాన్నమీద రుద్దక, తన దారిన తన్ను వెళ్లనీ1 జీవితమంతా శివుడు తప్ప తనకి వేరు దేవుడు లేడు. నీ మేలు తప్ప వేరు

ధ్యాస లేదు. నీకు తెలియని ఓ సంగతి చెబ్తున్నా విను. ఆ నాడు నీ నాన్న మీ పాఠశాల ప్రారంభోత్సవానికి ముహూర్తం పెట్టింది నీ, శ్రీపతినాయుళ్ల తారాబాలాలు చూసి పెట్టినదే తప్ప వేరెవరిదో కాదు!"

నాన్నపట్ల నాకున్న అభిప్రాయం నాయనమ్మ మాటలతో ఒక్కసారిగా మారిపోయింది.

ఆ మరుచటి రోజునుంచీ ఉదయ, సంధ్యల్లో పాఠశాలకు వెళ్లబోయేముందూ, తిరిగి వచ్చిన తర్వాతా గుడిలో నాన్నకు సహాయం చేస్తూ అర్చకత్వ విధినిర్వహణలు మంత్రయుక్తంగా నేర్చుకొన్నా. ఓ ఉపాధ్యాయుడిగా నిలదొక్కుకొన్నందుకు నేను సంతోష పడుతోంటే, శివార్చన చేయి జారిపోనందుకు నాన్న మరెంతగానో సంతోషించాడని వేరే చెప్పాల్సిన అవసరం లేదు కదా?

## అంతర్మథనం అర్చన కోవూరు

పరిచయమైన వాతావరణం. సుపరిచిత ధ్వనులు. స్వరాలు. ఎవరి పని వారు దీక్షగా చేసుకు పోతున్నారు. నా పేరు భార్గవ. నేనొక డాక్టర్ని. ఈ ఆసుపత్రి నాదే. ఏర్పాట్లన్నీ ఆపరేషన్ థియేటర్లో జరుగుతున్నాయి. మొదటిసారి నేను డాక్టర్ని అయినందుకు బాధ పడుతున్నాను. కొడుకు చుట్టే తన జీవితాన్ని పెనవేసుకుని బతుకుతున్న ఒక సాధారణ తల్లికి మంచి కొడుకుగా ఉండలేకపోతున్నానే అని గుండె పిండేస్తోంది. నా చేతులు వణుకుతున్నాయి. చెమటలు పడ్తున్నాయి. నా వైపు ప్రశ్నార్థకంగా చూస్తున్న నా తోటి వైద్యుల చూపులకి ఏం సమాధానం చెప్పాలో తెలియక సతమతమవుతున్నాను. పైగా నాకున్న ఇరవై ఏళ్ళ అనుభవంలో ఇది పెద్ద కష్టమయిందేమీ కాదు. అందులో నాకు చాలా ప్రత్యేకమయింది మరియు ముఖ్యమయింది. ఎన్నో సర్జరీలు చేసిన చేతులు ఈ రోజు కత్తెర పట్టుకోడానికి నిరాకరిస్తున్నాయి. "మా పాలిట దేవుడు మీరు" అని చేతులు పట్టుకున్న వారికి ధైర్యం చెప్పే నా పెదవులు మొద్దుబారిపోయి విడిపడనంటున్నాయి. అంతా నయమయి ఇంటికి వెళ్తున్న వారిని చూసి ఆనందపడే హృదయం థియేటర్ లో నా చుట్టూ ఉన్న వారి చూపులకి స్పందించటం మానేసింది. నా ముఖ కవళికలు బిగుసుకుపోయాయని నాకే అనిపిస్తోంది. కళ్ళు మసకబారటం తెలుస్తోంది. వైద్యుడిగా ఇన్నేళ్ళ అనుభవంలో ఎన్నడూ ఇంత నిస్సహాయంగా నిలబడలేదు. ఈ వృత్తినే దైవంగా భావించి ,అడిగినవారికల్లా ఎలాంటి ధనం ఆశించకుండా వైద్య సాయం చేసాను. జబ్బునెప్పుడూ డబ్బుతో ముడిపెట్టలేదు. ఎంత మందికి ప్రాణదానం చేసానో ఎప్పుడూ లెక్కపెట్టలేదు. వీలయినంతమందికి నా చేతనయినంత సాయం చెయ్యాలి అంతే. అదే నా జీవితాశయమయిపోయింది. పెళ్ళి పిల్లలంటే బాధ్యతలని వాటికీ దూరంగా ఉన్నాను. ఒక్కగానొక్క కొడుకు పెళ్ళి

పెటాకులు లేకుండా ఉంటే ఏ తల్లి మనసొప్పుకుంటుంది, బ్రతిమిలాడీ, బెదిరించి చెప్పీచెప్పీ విసిగిపోయి నాకు సహకరించటం మొదలుపెట్టింది.

మా ఇల్లు ఆసుపత్రికి దగ్గరలోనే ఉంటుంది. వేరే ఊళ్ళ నుంచి వచ్చిన వారికి మా ఇంట్లోనే బస. అమ్మే అన్నీ చూసుకునేది. సంతోషంతో తిరిగి వెళ్ళినవారయినా, దుఃఖంతో వెనుతిరిగిన వారయినా మధ్య మధ్య అమ్మని పలకరించకుండా ఉన్న వాళ్ళు కానీ, తమ ఇంట్లో శుభకార్యాలకి ఆహ్వానించనివారు కానీ లేరంటే అతిశయోక్తి కాదు. అంతలా వారిని ఆదరించేది. బహుశా నేను ఇవ్వలేని కుటుంబాన్ని వారందరిలో చూసుకునేదేమో మరి. తన చుట్టాల ఇళ్ళకి వెళ్ళినా ఎంత రాత్రయినా వచ్చేసేది. అంత అర్ధరాత్రుళ్ళు రాకమ్మా అంటే " నేను లేకపోతే ఇల్లెవరు చూసుకుంటారు చెప్పు, కోడలుండుంటే కాస్త బాధ్యత పంచుకునేది " అని తిరిగి మరల నన్నే దెప్పిపొడిచేది. కానీ నన్ను విడిచిపెట్టి ఎక్కడా ఉండలేదని నాకు తెలుసని అమ్మకీ తెలుసు. చిన్నప్పుడే నాన్న మాకు దూరమయితే అన్నీ తనే అయి పెంచింది. నాన్న కూడా వైద్యుడే. వారసత్వ సంపద చాలా ఉండటంతో సంపాదించి పెళ్ళాం పిల్లల్ని పోషించాల్సిన అవసరం లేదనుకున్నారేమో కానీ మమ్మల్ని ఏనాడు పట్టించుకున్నది లేదు. ఆధునిక వైద్యంని పేదలకి కూడా అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యం తో ఊరూరా తిరిగి వైద్య సేవలు అందించేవారు. ఎప్పుడో ఒకసారి వచ్చి రెండు రోజులున్నా, అయ్యా ! అంటూ ఎవరో ఒకరు వస్తునే ఉండేవారు. నన్ను తన ఒడిలో కూర్చోపెట్టుకుని ప్రేమగా మాట్లాడిన సందర్భాలు వేళ్ళ మీద లెక్కపెట్టచ్చు. అమ్మ, నన్ను చూపించి కనీసం వీడి బాధ్యత అన్నా తీసుకోమని ఎంత కాళ్ళా వేళ్ళా పడ్డా మౌనంగా ఉండిపోయారే తప్ప ఏ మార్పు రాలేదు. ఆ అనుభవాలేనేమో నన్ను పెళ్ళి నుంచి దూరముంచాయి. ఇంత చూసి కూడా నేను మళ్ళీ డాక్టరే కావాలని ఎందుకనుకున్నానో తెలియదు కానీ వైద్య వృత్తి మొదలు పెట్టాక మాత్రం నాన్న మీద గౌరవం రెట్టింపయ్యింది. “నువ్వు కూడా మీ నాన్నలానే తయారయ్యావు. ఏంటో నా జీవితం!?” అని అమ్మ అసహనం ప్రకటించిన సందర్భాలు లేకపోలేదు.

నాన్న మీద ఎన్ని ఫిర్యాదులున్నా, మనసులో ఎంత బాధ ఉన్నా, ఇరుగు పొరుగు వారు భర్తని ఒక మాటన్నా ఊరుకునేది కాదు. "మా వారిది పెద్ద కుటుంబం . పెళ్ళాం పిల్లలు అని కూర్చుంటే వాళ్ళందరిని ఎవరు చూసుకుంటారు " అని వెనకేసుకొచ్చేది. అమ్మ, నేను ,ఒకరి లోకం ఒకరుగా బతికాము.ఎప్పటికన్నా మా ప్రేమని గుర్తించి, తిరిగొస్తారని ఆశతో ఎదురుచూసేవాళ్ళం. చివరికి ఒకసారి వచ్చారు కానీ నడుచుకుంటూ కాదు.అందరి బాగోగుల గురించి ఆలోచించే ఆయన తన ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేసి, మాకు ఎదురుచూపనేది లేకుండా మా ఆశలన్నీ మూట కట్టుకుని పంచభూతాల్లో కలిసిపోయారు. అప్పటి నుంచి నా చుట్టే తన ఆశలు, జీవితం ముడివేసుకుంది అమ్మ.

ఒకరోజు ఉన్నట్టుండి అమ్మని తీవ్రమయిన గుండెనొప్పితో ఆసుపత్రికి తీసుకువచ్చారు. అమ్మనలా చూడగానే కాళ్ళు చేతులాడలేదు. ఒక్క క్షణం కూడా అమ్మని వదిలి పెట్టలేదు. దగ్గరుండి అన్ని పరీక్షలు చేసాను. గుండె బాగా దెబ్బ

తిన్నది. ఇది మొదటిసారిలా అనిపించట్లేదు. డాక్టరయ్యుండీ కనిపెట్టలేకపోయినందుకు సిగ్గుతో చచ్చిపోయాను. అందరి శ్రేయస్సు గురించీ ఆలోచించిన నేను ఆ అందరిలో అమ్మని చూడనందుకు నా మీద నాకే అసహ్యం వేసింది. నేనూ, నాన్నలానే వ్యవహించాను ఛీ నన్ను ఏ తల్లీ క్షమించదు. తన చిన్న చిన్న ఆశలని కూడా తీర్చలేకపోయాను. నేను తనతో గుడికి రావాలని , చుట్టాలతో కలవాలనీ,. తాను వాటికేనాడు ప్రాముఖ్యత ఇవ్వలేదు.

ఒకసారి గుడిలో ఆయాసంతో నడవలేక కూర్చుంటే, తెలిసిన వారు "ఒక్కదానివి రాకపోతే కొడుకుని తీసుకురావచ్చు కదమ్మా" అంటే " ఏమనుకుంటున్నారు మా వాడి గురించి, తల్లి అని వాడు కూర్చుంటే పేషంట్ల బాగోగులు ఎవరు చూస్తారు,, అసలే మాది పెద్ద కుటుంబం " అన్నదని డ్రైవర్ చెప్తే , తనని నాన్నతో పోల్చిందని గర్వపడ్డానే కానీ, దాని వెనకాల అమ్మ పడిన వేదనని మర్చిపోయానని కుమిలిపోయాను.

అమ్మని బతికించుకోవాలంటే గుండె మార్పిడి తప్ప వేరే మార్గం లేదు. మందులతో యంత్రాలతో కొంతకాలం నడిపించగలిగినా ఎప్పుడేమవుతుందో చెప్పలేం. ఇప్పటికిప్పుడు దాతలెవరు దొరుకుతారు. ఇంతదాకా తీసుకువచ్చినందుకు మళ్ళీ నన్ను నేను తిట్టుకున్నాను. UNOS లో రిజిస్టర్ చేసాను. వరుసలో మూడో స్థానం అన్నారు. దేవుడిమీద భారమేసి ఆసుపత్రిలోనే ఒక ప్రత్యేకమయిన గదిని అమ్మ అభిరుచికి తగ్గట్టు మార్పులు చేసి అన్నీ నేనే దగ్గరుండి చూసుకోవడం మొదలు పెట్టాను.

"నేను ఉన్నాను కాబట్టి ఇప్పుడు నీ జీవితంలో ఇంకెవరూ అక్కర్లేదు అనుకుంటున్నావు కానీ ,నేను దూరమయిన రోజు ఒంటరితనం నిన్ను వేధిస్తుందిరా, నా మాట విని పెళ్ళి చేసుకో" అమ్మ మాటలు గుర్తుకొచ్చి కళ్ళు చెమర్చాయి.

ఉన్నప్పుడు విలువ తెలియదు. అలుసుగా తీసుకుంటాం.. నిట్టూర్చాను. UNOS లో వరుసలో ఉన్న మొదటి ఇద్దర్ని బ్రతికించలేకపోయారని తెలిసాక పిచ్చివాడినే అయ్యాను. అమ్మ ప్రార్థించే ప్రతి దేవుడిని వేడుకున్నాను.

అప్పుడే , దుర్ఘటనలో బాగా గాయపడిన ఒక అమ్మాయిని తీసుకువచ్చారు. వీళ్ళు ప్రయాణిస్తున్న కారుని ఒక లారీ ఢీ కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న వాళ్ళందరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కొన ఊపిరితో ఉన్న ఈ అమ్మాయిని నా ఆసుపత్రికి తీసుకొచ్చారు. " అమ్మాయి పేరు పవిత్ర. తల్లి తండ్రి డ్రైవర్ అక్కడికక్కడే పోయారు. వీళ్ళ బంధువులున్నారేమో విచారిస్తున్నాము. ఈ లోపల మీరు చెయ్యగలిగింది చెయ్యండి. మాకు తెలియగానే మీకు విషయం అందచేస్తాం" కరచాలనం చేసి ఇన్స్పెక్టర్ వెళ్ళిపోయాడు.

'పవిత్ర '! అందమైన పేరు ,కానీ పాపం 'విధి'!! జాలి పడ్డాను. మేము ఎన్ని ప్రయత్నాలు చేసినా కానీ తలకి బలమయిన గాయం తగలటంవల్లనో ఏమో తన శరీరం మా చికిత్సకి స్పందించలేదు. దాంతో బ్రెయిన్ డెడ్ గా తీర్మానించి పోలీసులకి సమాచారం అందించాము.తన తరఫు వారెవరన్నా వస్తే మిగతా లాంఛనాలు పూర్తి చేస్తామని చెప్పాము.

" ఇంతవరకు అయితే బాధ్యత తీసుకోడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఇంకా విచారించి చూస్తాము. థాంక్యూ " అని ఫోన్ పెట్టేసారు. అక్కడే ఉన్న నా సహాయకుడు, “డాక్టర్! అమ్మ కి దాతకోసం వెతుకుతున్నాము కదా.. ఈ అమ్మాయి ఎలాగు బ్రెయిన్ డెడ్ కదా___” అని ఆగిపోయాడు.

అర్థమయ్యింది కానీ, ఆ అమ్మాయి సంబంధీకుల అనుమతి లేకుండా మనము ఏమీ చెయ్యలేము అని చెప్పాను.పైకి అలా అన్నా మనసులో మాత్రం అది తొందరగా నిజమయితే బావుండు అనిపించింది. రెండు రోజుల తర్వాత ఇన్స్పెక్టర్ ఫోన్ చేసి " వీళ్ళ దగ్గర దొరికిన అడ్రెస్ తీసుకుని వెళ్ళి చుట్టుపక్కల విచారిస్తే తెలిసింది, కులాంతర వివాహం చేసుకున్నారని ఈ అమ్మాయి తల్లి తండ్రులని ఇరు వైపుల వారూ వెలేసారట. మాకు సంబంధం లేదు మీకిష్టమొచ్చినట్టు చేసుకోండి " అంటున్నారని వివరించాడు.

“ఇన్స్పెక్టర్ గారూ! ఇలాంటి బ్రెయిన్ డెడ్ కేసులలో ఆర్గాన్ డొనేషని ఉంటుంది. మీరు దీనికి మీ తరఫునుంచి కావాల్సిన అనుమతులిస్తే ముందుకు వెళ్తాము. వారి దహన సంస్కారాలు కూడా మేము చూసుకుంటాము" అన్నాను.

" మంచి కార్యాలకి మా పూర్తి సహకారం ఎప్పుడూ ఉంటుంది. తప్పకుండా చూస్తాం " అన్నారు.

థాంక్స్ చెప్పి పెట్టేసాను. అన్నట్లే తొందరగానే అనుమతులు వచ్చాయి. అన్నీ పరీక్షలు చేసి అమ్మ కి సరిపోతుందని నిర్ణయించుకుని UNOS కి సమాచారం అందించి మంచి రోజు చూసుకుని ఏర్పాట్లు చేసుకున్నాము. అమ్మని సిద్ధం చేసి ఉంచండి, నేను చెప్పగానే తీసుకు రండి అని సూచనలిచ్చి, అమ్మకి, ఇక నీకేం ఇబ్బంది ఉండదని ధైర్యం చెప్పి సర్జరీకి తయారవుతున్నాను. అమ్మాయిని ఆపరేషన్ థియేటర్ కి తీసుకు వచ్చారు..

"పవిత్ర"!! పేరే కాదు ముఖము కూడా ప్రశాంతంగా ,సుందరంగా ఉంది.మనసు చివుక్కుమంది.భవిష్యత్తు గురించి ఎన్ని కలలు కన్నదో , ఇప్పుడు ఎంత బాధ అనుభవిస్తోందో!!. మాట ఇస్తున్నా పవిత్రా, నిన్ను మా అమ్మ లో, ప్రేమతో జాగ్రత్తగా చూసుకుంటాను. ఏ మాత్రం నీ మనసుకి కష్టం కలగకుండా చూసుకుంటాను.

“డాక్టర్ ప్రారభిద్దామా?” అన్న మాటలకి తలాడిస్తూ పక్కకి తిరిగాను. ఏదో చూడరానిది చూసినట్టు ఒళ్ళు ఝుల్లుమంది. నేను చూసింది నిజమేనా? మళ్ళీ తిరిగి చూడాలంటే భయమేసింది. తొందరగా అమ్మకి గుండె మార్పిడి చేసి తనని బాగా చూసుకోవాలనే ఆత్రంలో ఉన్నందుకు తిరిగి పవిత్ర మొహం లోకి చూసే సాహసం చెయ్యలేదు.

“డా.భార్గవ్.. డా.భార్గవ మొదలుపెడదామా? ఏమాలోచిస్తున్నారు?” ఆ పిలుపుకి చెళ్ళుమని చెంప మీద ఎవరో కొట్టినట్టనిపించి నాలోని కొడుకు పక్కకు తప్పుకుని ఆ స్థానం లో డాక్టర్ వచ్చి నిలిచాడు. మెల్లిగా పక్కకి తిరిగి పవిత్ర మొహాన్ని పరిశీలనగా చూసాను. కనురెప్పల కింద ఏవో కదలికలు. నమ్మలేక తన కనురెప్పలు తెరిచి చూసాను. కనుపాపలు కదలాడాయి. ఇదెలా సాధ్యం? మా అంచనాలు తప్పా? లేక భగవంతుడి లీలనా? భగవంతుడి లీలనే అనుకుంటే నాకేం పరీక్ష పెట్టాలనుకుంటున్నాడు?. నా కర్తవ్యం ఏంటిప్పుడు? ఒక కొడుకులా ఏమీ ఎరగనట్లే ముందుకు

పోవాలా లేక ఒక డాక్టర్ లా వైద్యమందించి కాపాడాలా? అప్పుడే మొదటిసారి డాక్టర్ని ఎందుకయ్యానా అనిపించింది.అంతా శూన్యంగా ఉంది."డాక్టర్ డాక్టర్ ,వై ఆర్ యు స్టాండిగ్ స్టిల్? వి విల్ టేక్ కేర్ ఇఫ్ యు ఆర్ నాట్ ఫీలింగ్ వెల్." నా సహచరుల పిలుపుకి తేరుకుని "నో నో జస్ట్ చెక్ హర్ వైటల్స్ వన్స్ మోర్ , ఐ వాంట్ టు రికన్ఫర్మ్ దట్ షీ ఈస్ బ్రెయిన్ డెడ్ బిఫోర్ వి పర్ఫాం ద సర్జరీ," నేను గంభీరంగా మాట్లాడుతున్నాననే అనుకుంటున్నా కానీ, నా స్వరం నూతిలోంచి వచ్చినట్టే ఉందని తెలిసిపోతోంది.

ఇంకో మాట మాట్లాడకుండా, వారి ప్రశ్నలకి సమాధానం ఇవ్వకుండా అమ్మని తన రూంలోనే ఉంచమని చెప్పి ,వడి వడిగా నా గదిలోకి నడిచాను. చెమటతో నా శరీరమంతా తడిసిపోయింది. చల్లని ఏసీ కూడా వేడెక్కిన నా మెదడును చల్లార్చలేకపోతోంది. డామిట్, ఆవేశంతో బల్లపై గట్టిగా చరిచాను. టేబుల్ విరిగినంత పనయ్యింది కానీ చిత్రం! ,నొప్పి తెలియలేదు. మనసులో రేగుతున్న అలజడి ముందర ఈ నొప్పి అణువంత కూడా కాదు. ఎందుకిలా చేసాను, ఎందుకిలా చేసాను పెద్దగా అరవాలనుంది. మెదడుకి ముసుగేసి ముందుకి పోవాల్సింది. ఆమె తరఫున అడిగేవారు కూడా ఎవరూ లేరు. బతికి సాధించాల్సిందేముంది ఈ పిల్లకు? నా అనే వారు లేక ఎలాగూ అనాధ బ్రతుకే. ఎక్కడికెళ్ళేదేముంది ? ఏం చేసేదేముంది? పేపర్ వెయిట్ ని కసిగా విసిరేసాను. ఆ శబ్ధానికి నా అసిస్టెంట్ గాబరాగా లోపలికి వచ్చాడు.

'నేను బానే ఉన్నాను ' అని చేతితో సైగ చేసాను. ఏమనుకున్నాడో మౌనంగా వెళ్ళిపోయాడు. నేను ఇంత స్వార్ధంగా కూడా ఆలోచించగలనా? నా మీద నాకే అసహ్యం వేస్తోంది, కానీ మళ్ళీ ఇలాంటి అవకాశం దొరుకుతుందో లేదో? నోటిదాకా వచ్చిన కూడుని లాగేసానా? తప్పు చేసానా? అమ్మకి ఏదన్నా జరిగితే నన్ను నేను క్షమించుకోగలనా? ఎలా? ఎలా? పలురకాల ఆలోచనలతో తల తిరిగిపోతోంది. ఎంత సమయం గడిచిందో తెలియదు,

“డాక్టర్ భార్గవ!” అనే పిలుపుతో ఆలోచనలలోంచి బయటపడ్డాను.

ఎదురుగా డా.వాసు "డా.భార్గవ.. మీరు ఎందుకు అంత అసాధారణమైన వ్యక్తో మళ్ళీ నిరూపించారు. మీ హస్తవాసీ చాలా మంచిది. మీరు ఊహించింది నిజమే. పవిత్ర మెల్లిగా చికిత్సకి స్పందిస్తోంది. మిరకిల్ అనాలో ,మీరే జీవితాన్నిచ్చారని అనాలో తెలియట్లేదు "అన్నాడు.

ఆ అభినందనకి సంతోషించాలో బాధ పడాలో అర్ధం కాక వెర్రిగా చూసాను. ఉత్సాహంగా చెప్తున్న వాసు ,నా మొహంలో కనిపించిన భావాలకి ఒక క్షణం మౌనం వహించి , "సారీ డాక్టర్ , అమ్మకి తప్పకుండా ఇంకో దాత దొరుకుతారు" అన్నాడు ఏదో తప్పు మాట్లాడినవాడిలా తల కిందకేసి.

“లేదు లేదు యు డిడ్ ఎ ఫెంటాస్టిక్ జాబ్. వెల్ డన్. మీరు పదండి. నేనొస్తున్నా”నని చెప్పి ,మొహం కడుక్కుని, పెదవులపై నవ్వు పులుముకుని పవిత్ర రూంలోకి వెళ్ళాను. ఆ అమ్మాయిని చూడగానే మనసు తేలికపడి, అనిర్వచనీయమైన అనుభూతి కలిగింది. రిపోర్ట్స్ అన్నీ చూసి ఏమి చెయ్యాలో సూచనలిచ్చాను.

అందరినీ భుజం తట్టి అభినందించి అమ్మని చూద్దామని వెళ్ళాను. హాయిగా ఏదో పుస్తకం చదువుకుంటోంది. ఈ రోజు కావల్సిన సర్జరీ ఎందుకు కాలేదని, ఏ మాత్రం ఆదుర్ధా కానీ, ఏమవుతుందిప్పుడు అనే ఆత్రుత కానీ మొహంలో లేదు. అదే శాంతం మూర్తీభవించిన మోము, అదే నిర్మలమయిన చిరునవ్వు. దగ్గరికెళ్ళి తన చేతులలో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చాను. “నన్ను క్షమించమ్మా ! నేను నాన్న ,ఇద్దరం నిన్ను మోసం చేసాం.మా స్వార్ధం మేము చూసుకున్నాము కానీ ఏనాడు నీకివ్వాల్సిన స్థానం కానీ, ప్రేమ కానీ ,గౌరవం కానీ ఇవ్వలేకపోయాము.తప్పు సరిదిద్దుకోవడానికి ఒక్క అవకాశం ఇవ్వమని దేవుడిని వేడుకున్నా అమ్మా. ఇచ్చినట్టే ఇచ్చి లాగేసుకున్నాడు.”

కుమిలిపోతున్న నన్ను, అమ్మ, కళ్ళు తుడిచి ,ప్రేమగా దగ్గరికి తీసుకుని " నాది అనుభవించేసిన ప్రాణం, ఆ అమ్మాయిది ఇంకా అనుభవించాల్సిన జీవితం. నా కొడుకు ఎన్నడు తప్పు చెయ్యడు. నువ్వు తీసుకున్న నిర్ణయం నూటికి నూరుపాళ్ళు సరయినదే, ఇంకో ఆలోచన వద్దు, బాధ పడాల్సిన అవసరం కూడా లేదు. నాకు నీ మీద కానీ, మీ నాన్న మీద కానీ ఎటువంటి చెడు భావాలు లేవు, తీరని కోరికలూ లేవు. మీరు చేస్తున్న ఈ మంచి పనులలో పరోక్షంగానయినా నేనూ ఒక భాగమయినందుకు గర్వపడుతున్నాను. నువ్వు అనవసరమయిన ఆలోచనలు చెయ్యకు". అన్నది.

అమ్మకు ఎవరూ సాటి రారు, అమ్మ ఒడిలో తల పెట్టుకుని అనుకున్నాను. అనుకున్నదానికంటే తొందరగానే కోలుకుంది పవిత్ర. అందరితో కలివిడిగా ఉంటూ మంచి అనుబంధం ఏర్పరుచుకుంది. తన కుటుంబ విషయాల గురించి కానీ, తన గతం గురించి కానీ ఎవరూ అడగకూడదు, మాట్లాడకూడదు అని గట్టిగా ఆదేశాలిచ్చాను. వచ్చీ పోయే రోగులు, వారి బంధువులకి ఒక ఆప్తురాలిలాగా సూచనలు, సలహాలు ఇవ్వడం చూసి నాకు ముచ్చటేసేది. అందుకే ఎటువంటి ఆంక్షలు పెట్టకుండా స్వేచ్ఛగా తిరగనిచ్చాను. అమ్మ గురించి తెలిసి, ఒకసారి చూడడానికి వచ్చింది పవిత్ర.

“ అమ్మా ,!” పరిచయం చేసాను.

“ఆ ఆ రా అమ్మా రా. నీ గురించి చాలా మంచి మంచి విషయాలు విన్నాను. నన్ను కలవడానికి వచ్చావు ,చాలా సంతోషం..!” ఆప్యాయంగా పలకరించింది అమ్మ.

అమ్మ కాళ్ళకి నమస్కరించి పక్కనే కూర్చుంది. ఆమె కనులలో నీళ్ళు చూసి నేను అమ్మ అయోమయంగా చూసాము. “ఏమయ్యిందిరా..!?” దగ్గరికి తీసుకుని ఓదారుస్తూ అడిగింది అమ్మ.

అమ్మని గట్టిగా హత్తుకుని "మిమ్మల్ని చూడగానే మా అమ్మ గుర్తొచ్చింది! అమ్మా, నాన్న లేని లోటు తట్టుకోలేకపోతున్నాను, అసలు నేను కూడా వాళ్ళతోనే పోయుంటే పోయేది. కనీసం మీకోసం ఉపయోగపడినా బావుండేది. నేను బతికి సాధించేది ఏముంది? భవిష్యత్తు అంతా అంధకారంగా ఉంది".

ఆ మాటలకి నా చూపులు మరల్చుకున్నాను. ఎన్ని రోజుల దుఃఖమో, గుండెలో ఎంత బాధ దాచుకుందో, అంతా ఒకేసారి కట్టలు తెంచుకుని ప్రవాహంలా బయటకు వచ్చింది. ఆపే ప్రయత్నం చెయ్యకుండా ఏడవనిచ్చింది అమ్మ, తన

వీపు నిమురుతూ. బాధ అంతా బయటకు వచ్చేస్తే మనసు తేలికపడుతుందని అమ్మ విశ్వాసం. పవిత్ర కొంచెం కుదుట పడ్డాక , మంచి నీళ్ళు అందించాను.

"పవిత్రా, మనం ఎందుకు బ్రతుకుతాము, ఎంత కాలం ఉంటాము అనేది ,మన చేతుల్లో ఉండదమ్మా.అంతా పైవాడు రాసే పంపిస్తాడు. కానీ ప్రతి పుట్టుకకి ఏదో ఒక కారణం, ఏదో ఒక ఉద్దేశ్యం ఉండి తీరుతుంది. ఇది నీకు పునర్జన్మ లాంటిదే. ఈ కొత్త జీవితానికి నువ్వు బాధ పడితే, అటు ఆ భగవంతుడి నిర్ణయాన్ని, ఇటు నా కొడుకు కృషిని అవమానించినట్టే."

ఆ మందలింపుకి పవిత్ర " అయ్యో క్షమించండి . నా ఉద్దేశ్యం అది కాదు " అని చేతులు జోడించింది.

అమ్మ నవ్వేసి " వస్తూ ఉండమ్మా, నాకూ కాలక్షేపంగా ఉంటుంది " అంది పవిత్ర వెళ్తుంటే.

అప్పటినుంచి రోజూ అమ్మ దగ్గరే ,ఆ సాయం ఈ సాయం చేస్తూ ,అమ్మ,పవిత్ర ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూసే స్థాయికి వారి అనుబంధం పెనవేసుకుపోయింది.

ఒకసారి మాటల సందర్భంలో తన గురించి చెప్పుకొచ్చింది. " నేనూ ఒక డాక్టర్ ని. అందరూ దూరం పెట్టడంతో నేను అమ్మ నాన్న , మాకంటూ ఒక చిన్న ప్రపంచం నిర్మించుకుని ఆనందంగా ఉండేవాళ్ళం. మాకంటూ ఎవరూ లేరనే బాధ తప్ప మా జీవితాలు సాఫీగానే గడిచిపోయేవి. ఒక రోజు ఉన్నంటుండి అమ్మ ఆరోగ్యం పాడయ్యింది. దిక్కు తోచని పరిస్థితిలో మాకు డాక్టర్ విశ్వనాథం గారి గురించి తెలిసి కలవడానికి వెళ్ళాము. ఆయన ఒక్క పైసా కూడా తీసుకోకుండా సొంతమనిషిలా దగ్గరుండి అమ్మ బాగోగులు చూసి, మామూలు మనిషిని చేసారు. మాకు ఆయన దేవుడే. ఆయన గురించి అందరూ గొప్పగా మాట్లాడుకుంటుంటే అబ్బురపడ్డాను. మొదటిసారి డాక్టర్ ని అవ్వాలనే కోరిక ఆయన్ని చూసాకే మొదలయ్యింది. అమ్మ,నాన్న ప్రోత్సాహంతో బాగా చదువుకుని డాక్టర్ని కాగలిగాను. ఉన్నంతలో నలుగురికీ సాయం చేయగలిగాను. ఒకసారి అనుకోకుండా తాతగారి ఆస్తిలో కొంత భాగం నాన్న గారికి వచ్చింది. "నాన్న చివరి కోరిక మేరకు నీ భాగం నీకు పంపుతున్నాము. నీ పాత లేఖలో చిరునామా చూసి పంపుతున్నాము. ఇదే ఆఖరి లేఖ,మళ్ళీ మమ్మల్ని కలవడానికి రానవసరం లేదు "అని ఉత్తరం సారాంశం. తాత చివరి చూపుకి నోచుకోలేకపోయానని నాన్న బాధ పడ్డారు. అంత ప్రేమతో ఇచ్చిన ఆస్తికి విలువ కలగాలంటే ,ఆయన పేరు మీద ఒక ఆసుపత్రి కట్టి అన్ని వర్గాల వారికి వైద్యం అందజెయ్యాలి. అదే మా తాతకిచ్చే ఘన నివాళి అని అభిప్రాయపడ్డారు. ఆ బృహత్కార్యాన్ని మొదలు పెట్టే ముందర ,మాకు ఆదర్శమయిన డా.విశ్వనాథం గారిని కలిసి ఆశీర్వాదం తీసుకుందామనుకున్నాము. విచారించగా ఇక్కడే ఎక్కడో ఉంటారని తెలిసి వస్తుంటేనే ...గొంతు గద్గదమయ్యింది. నేను అమ్మ ఆశ్చర్యంతో ఒకరినొకరు చూసుకున్నాము." ప్రపంచము ఎంత చిన్నది అనిపిస్తుంటుంది ఒక్కోసారి కదా" నాన్న ఫొటో తన పుస్తకంలోనుంచి తీసి పవిత్రకి ఇస్తూ అంది అమ్మ.

ఈసారి ఆశ్చర్యపోవడం పవిత్ర వంతయ్యింది, ఎందుకంటే తనకి ఆదర్శం అని ఏ డాక్టర్నయితే అంటుందో ,అది మా నాన్నగారే!

కాసేపు ఎవరం ఏమీ మాట్లాడలేకపోయాము. అందరి మనసుల్లో రకరకాల భావనలు. ముందుగా పవిత్రనే " ఆ మహానుభావుడిని కలిసే అదృష్టం ఎలాగు కలగలేదు, కనీసం ఆయన ఆసుపత్రిలో పని చేసే అవకాశం వస్తే....అంటే మీకు అభ్యంతరం లేకపోతే ఇక్కడే నాకింత చోటివ్వండి" తటపటాయిస్తూ అభ్యర్థించింది.

"ఈ ఆసుపత్రిలోనే కాదు, మీకిష్టమయితే, మా ఇంట్లో కూడా చోటుంది " చిరునవ్వుతో తన కనులలోకి సూటిగా చూస్తూ అన్నాను. సిగ్గుతో కూడిన అంగీకారం కనిపించింది. అమ్మ  పవిత్రని ప్రేమగా దగ్గరకు తీసుకుని నన్ను కళ్ళతోనే అభినందించింది. తృప్తిగా అనిపించింది. "అమ్మ మొహంలో ఉల్లాసము, పవిత్ర మోములో ఉత్సాహము నా మనసులో ప్రశాంతత" భగవంతుడు గీసిన అపురూప చిత్రాలలో ఇదొక అందమయిన చిత్రం. అమ్మకి మళ్ళీ దాతలు దొరుకుతారో లేదో తెలియదు, మాతో ఎన్నాళ్ళు ఉంటుందో తెలియదు, కానీ, ఉన్నన్నాళ్ళు సంతోషంతో, సంతృప్తితో గడుపుతుందని మాత్రం తెలుసు. వారి ఆనందంలో , నేనూ భాగస్వామిని అవుదామని ముందుకు అడుగులేసాను.

## బాట లేని బాటసారి — నిర్మలాదిత్య(భాస్కర్ పులికల్)

చెప్పేయాలి.

నరకం లా ఉంది.

ఈ హింస భరించలేను.

అంతరంగాలు పసి కట్టడం కష్టమే. కానీ సిద్దు విషయంలో నా మనస్సులో ఉన్న మాటలను కావాలనే మాటున పెట్టడం మానేసాను. ఉన్నది ఉన్నట్టు, కుండలు బద్దలు కొట్టినట్లు చెప్పేయడం మొదలెట్టాను.

కానీ ఈ విషయం చెప్పడం కష్టం గానే ఉంది.

చుట్టుపక్కల ఎవ్వరూ ఉండని ప్రదేశాలలో సంచరించడం సిద్దుకి ఇష్టం. ప్రశాంతంగా ఉంటుంది అంటాడు. నన్ను రమ్మని పిలుస్తాడు. కొన్ని సార్లు సిద్ధుతో నేను పోతాను. చాలా సార్లు, తననే పొమ్మంటాను. ఈ సారి పిలిస్తే వెంటనే బయలు దేరాను. నే చెప్పాలనుకొన్నది, ఇంట్లో కంటే ఇలాంటి ఏకాంత ప్రదేశంలోనే చెప్తే బాగుంటుంది అనిపించింది.

బీచ్ కంటూ బ్రేడన్టన్ లో ఉన్న హెర్నాండో డి సోటో మెమోరియల్ పార్క్ కి తీసుకొచ్చాడు సిద్దు. 1539 లో ఓ 10 పది ఓడలు 700 మంది, మార్బలంతో తొలిసారి ఫ్లోరిడా లో స్వర్ణ సంపదలు వెదుకడానికి అడుగు పెట్టిన డి సోటో కు చివరకు మృత్యువు మాత్రమే దొరికింది.  ఈ దేశంకు ఎన్నో ఆశలతో వచ్చి, ఆశించినది దొరుకొక పోవడం నా విషయంలోనూ జరిగింది. కానీ నేను ఊరుకోదలచు కోలేదు. సిద్దుతో మాట్లాడి నా భవిష్యత్తు నేనే రాసుకోవాలి.

"గీతా, ఈ మడ అడవుల మధ్య, తెల్లటి, చల్లటి ఇసుక అరుగు తో, కొమ్మల గోడల తో, అలలు చేస్తున్న లయ బద్ధ సంగీతంతో, మనకంటూ ప్రకృతి కట్టిన కబాన లా ఎంత బాగుంది కదా",  అన్నాడు సిద్దు. అతని ముఖంలో ఏదో కలల గగనంలో విహరిస్తున్న  ఛాయ. నాకు కొత్తేమి కాదు. చిర్రెత్తుకొచ్చింది.

"బీచ్ చూడాలంటే డాన్ సెజార్ రిసార్ట్ హోటల్ లాంటి ప్రదేశంకి వెళ్లి చూడాలి. పోయిన నెల మా కార్డియాలజి కాన్ఫెరెన్సు అక్కడే జరిగింది. రూమ్ నుండే, లేకపోతే ఆ హోటల్ ప్రైవేట్ బీచ్ లో మోహితో నో, మార్గరిటా నో స్నేహితులతో, తాగుతూ సాయంత్రం, రాత్రి గడుపుతే ఎంత బాగుంటుంది. బార్ హాపింగ్ అంటూ సెయింట్ పీట్ నుండి క్లియర్ వాటర్ వరకు బీచ్ రోడ్ రాత్రంతా తిరుగేస్తే, ఆ కిక్కే వేరు", అన్నాను నేను.

ఇదేంటి టాపిక్ మారిపోతున్నది.

"కానీ నువ్వున్న చోట్లలో ఈ సీగల్ పక్షులు వేస్తున్న కేకలు, కొమ్మలు గాలికి ఒరుసుకొని చేస్తున్న చప్పుళ్ళు, లయబద్దంగా అలలు ఈ మడ చెట్లను, తాకి చేస్తున్న సంగీతం నీకు వినపడవు కదా. గాలితో పాటు వస్తున్న ఈ సముద్రపు సువాసనలు అందవు కదా. అడ్డంకులు ఏమి లేకుండా, ప్రకృతి వేదిక మీద  సూర్యాస్తమయం చూడలేవు కదా", అన్నాడు సిద్దు.

"ఓ సారి చూస్తే సరిపోతుంది సిద్దు. మాటి మాటికి సన్ సెట్ ఏమి చూస్తావు. థేర్ ఆర్ బెటర్ థింగ్స్ టు డు ఇన్ లైఫ్. నీ కంటూ ఓ నెట్వర్క్ ఏర్పరుచుకోవాలి. జీవితంలోనూ, సంఘంలోనూ విజయం చవిచూసిన వారి సర్కిల్స్ లో తిరగాలి. నీ నెట్వర్క్ లో ప్రకృతి కాక, కొంతమంది వియర్డ్ జనాలే కనిపిస్తారు. అందరూ నా దృష్టిలో ఫెయిల్యూర్ లే. టాపిక్ వచ్చింది కాబట్టి చెప్తున్నాను. నువ్వెందుకు మళ్లీ పరీక్షలు రాసి రెసిడెన్సీ కు అప్లై చేయటం లేదు. మామయ్య, నేను చాలా సార్లు చెప్పాము కూడా. ఇండియా నుంచి మా నాన్న, అమ్మ, బంధు జనాలు, స్నేహితులు నిన్ను గురించి అడుగుతుంటే నాకు తల ఎక్కడ పెట్టుకోవాలో తోచటం లేదు", అన్నాను నేను.

ఎలానో టాపిక్ ని నేను చెప్పదల్చుకున్న విషయానికి మరల్చగలిగాను.

"ఏమి చెప్ప దల్చుకున్నావు గీత. ప్రతీసారి మన మాటలు,  నన్ను రెసిడెన్సీ లో చేరమనే నీ పోరు తోనే అంతమౌతున్నాయి. నాకు నిజంగానే వైద్య వృత్తి ఇష్టం లేదని ఎందుకు అర్దం చేసుకోవు. యూ.ఎస్.ఎం.ఎల్.ఈ పరీక్ష లో

ఫెయిల్ అయ్యననీ నన్ను చులకనగా చూస్తావు. కానీ, నేను కావాలనే ఆ పరీక్ష కు ప్రిపేర్ అవ్వక ఫెయిల్ అయ్యానంటే నమ్మవేమి నువ్వు. హై వే లను ఇష్టపడే ప్రయాణికులు మీరు. ఓ జి పి ఎస్ పెట్టుకొని సుపరిచతమైన, సఫలగమ్యాలు చేరే జీవితాలు మీవి. నాకు అలాంటి మూస పోసిన జీవితం ఇష్టం లేదు ", అన్నాడు సిద్దు.

ఉన్నాటుండి నా ఫ్రస్ట్రేషన్ లన్నీ బయటికి వచ్చేసాయి.

"నేను ఉస్మానియా మెడికల్ కాలెజి లో మెరిట్ సీట్ వస్తే చేరాను. మెడిసిన్ లో యునివర్సిటీ టాప్ ర్యాంక్ గోల్డ్ మెడల్ వచ్చింది. తెలివి, అందం ఉన్న అమ్మాయిలు అరుదు అంటూ నన్ను చాలా మంది పొగిడారు. కాలేజీలో, బయట అబ్బాయిలు నాతో స్నేహానికి పడరాని అవస్థలు పడేవారు. అలాంటిది మీ సంబంధం యూ.ఎస్. నుండి వచ్చిందని, అబ్బాయి కూడా మెడిసిన్ చదివాడు అని, నాలానే ఓ డాక్టర్ కదా అని సంబర పడ్డాను. మామయ్య తన జెనరేషన్లోనే వందల మిల్లియన్ల డాలర్లు సంపాదించ గలిగారు అంటే నేను మా ఇంట్లో వాళ్ళు బాగా ఇంప్రెస్ అయ్యాము. పెళ్లి అయ్యిన వెంటనే గ్రీన్ కార్డ్ వస్తుంది, నేను వెంటనే యూ.ఎస్ లో రెసిడెన్సీ కీ అప్లై చేసుకోవచ్చు అని తెలిసి ఆనంద పడ్డాము. మాకు అభ్యంతరాలు ఏమి తోచలేదు. వెంటనే పెళ్లికి ఒప్పు కున్నాం. పెళ్లి అయ్యి ఐదు ఏళ్ళు అయ్యింది. నా రెసిడెన్సీ పూర్తి అయ్యింది, సిటిజన్ షిప్ కూడా వచ్చింది. నవ్వు ఈ ఐదేళ్లలో ఏమి చేసావు. పరీక్షలలో ఫెయిల్ అయ్యావు, ఒక్క జాబ్ నిలకడ గా చేయలేదు", అన్నాను నేను.

"నన్ను చూసి నచ్చి, నేను మాట్లాడిన తరువాతే నీవు పెళ్లికి అంగీకరించావు అనుకున్నాను.ఇప్పుడు నీ మాటలు వింటే గ్రీన్ కార్డ్, మా నాన్న సంపాదించిన ఆస్తి చూసి వచ్చావనిపిస్తోంది", అన్నాడు సిద్దు.

సిద్దు చెప్పిన నిజం కత్తి తో పొడిచినట్లు అనిపించింది. కానీ మనసులో ఎన్ని రోజులు పెట్టుకోగలను. నే చెప్పాలనుకొన్నది చెప్పడానికి ఇంతకు మించిన అవకాశం, సెగ్ వే దొరకదు.

"అవును అప్పుడు బాగుంటుంది అనిపించింది. ఒప్పుకున్నాను. ఇప్పుడు నీతో బతకడం నాకు కష్టాంగా ఉంది. నా భవిష్యత్తు ఏలా ఉండాలో నాకూ కొన్ని ఆశలు ఉన్నాయి. నేనో పెద్ద డాక్టర్ కావాలి. నా మొగుడు నాకు దీటుగా వైద్య వృత్తిలో పేరు పొంది ఉండాలి. మేము సొసైటీ లో పెద్ద పెద్ద సర్కిల్స్ లో తిరగాలి. సక్సెస్ కు మేము మారు పేరు కావాలి", అన్నాను నేను.

"సరే. నేనౌతే డాక్టర్ కాదలచు కోలేదు. ఏమి చెప్పాలనుకుంటున్నావు", అన్నాడు సిద్దు.

ఏంటీ ఈ మనిషి. భవిష్యత్తు మీద ఏమాత్రం అవగాహన లేదు. ఆ ముఖంలో ఏమి ఎక్స్ప్రెషన్ లేదు. అది ప్రశాంతతా?

నాకు అసహ్యం అనిపించింది. గత కొన్ని ఏళ్ళు గా అది మనస్సులోనే అణచు కున్నాను. ఇప్పుడు అవసరం లేదనిపించింది.

"నాకు విడాకులు కావాలి సిద్ధు. నీ లాంటి ఫెయిల్యూర్ తో నా జీవితం కొనసాగించ దల్చుకోలేదు", నా మాటలు సులభంగా దొర్లిపోయాయి. ఒక్క క్షణంలో ఏదో పెద్ద భారం దిగిపోయిన రిలీఫ్ కలిగింది.

సిద్దార్ధ్ ఒక్క నిమిషం ఆలోచనలో పడ్డాడు.

"సరే గీత రేపే లాయర్లను కలుద్దాం", అన్నాడు సిద్ధు.

సిద్ధు మాటలు, ఆ మాటలు చెప్తున్న సిద్ధు పెదవుల పై చిరునవ్వు నాకు ఆశ్చర్యం కలుగజేశాయి. కానీ సిద్ధు జవాబిచ్చిన సంతోషం, ఆ ఆశ్చర్యానికి ఎన్నో రెట్లు ఎక్కువై, అలలు, బీచ్ లోని ఇసుకను కప్పినట్లు కప్పేసింది.

★★★

"హ్యాపీ బర్త్ డే! ఎక్కడ, ఏమి పొడుస్తున్నావు సిద్ధు?", నా కంఠంలో వెటకారం దాచే ప్రయత్నం చేయలేదు. జీవితంలో ఇన్ని విజయాలు, సంపదలు సాధించిన తరువాత, అలా దాచే అవసరం లేదు. ఏమన్నా జనం సహిస్తుంది. గొప్ప సెన్స్ ఆఫ్ హ్యూమర్ అంటూ చప్పట్లు కొడుతుంది. పైగా సిద్ధు నా కొడుకు, ఏకైక వారసుడు. వాడి దగ్గర దాపరికం ఎందుకు.

నేను ఫోన్ చేస్తే తీసే వాడు కాదు. సీత అబ్బాయి పుట్టిన రోజు అంటూ ఓ వారం నుంచి చెప్తూనే ఉంది. సీత ఫోన్ చేసినా, ఎప్పుడో ఓ సారి తీస్తాడు. చాలా సార్లు బాగానే ఉన్నానని మాట్లాడ కుండా టెక్స్ట్ చేస్తాడు. ఈ రోజు పుట్టినరోజు కాబట్టి తీసి ఉండాలి. సీత నే ఫోన్ తను మాట్లాడి, నన్ను విష్ చేయమని నాచేతికిచ్చింది.

"థాంక్స్ నాన్న", అన్నాడు సిద్ధు, అతి సౌమ్యంగా.

నేను అడిగిన ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా దాటేస్తున్నాడు. కావాలని రేకెత్తించినా స్పందించడు. హి ఇర్రిటేట్స్ మి . నా కింద పనిచేసే ఉద్యోగి అయ్యితే, స్పాట్ లోనే ఫైర్ చేసి ఇంటికి పొమ్మనే వాడిని.

"బ్రేక్ తీసుకుంటున్నానని ఓ సంవత్సరం దాకా మాయమయ్యావు. ఎక్కడ తిరుగుతున్నావు, తిరిగి ఇక్కడికి ఎప్పుడు వస్తున్నావు. నీ కోసం చాలా పనులు పెండింగులో పెట్టాను", అన్నాను నేను.

"నా కోసం ఏమి పెండింగ్ పెట్టకండి నాన్న. నాకు ఇప్పట్లో తిరిగి వచ్చే ఆలోచనలు లేవు", అన్నాడు సిద్ధు.

"ఏమిటి నీ ప్లాన్స్ సిద్ధు. ఒక్క పనీ సక్రమంగా ముగించవు. నీకోసం ఇండియాకు పని కట్టుకొని పోయి మెడికల్ కాలేజీలో సీటు ఇప్పించాను . అది ఏదో అత్తెసురుగా చేసి, ఇక్కడ వచ్చిన తరువాత రెసిడెన్సీ కి కావలసిన లైసెన్స్ పరీక్షలు, మా బలవంతం మీద రాసి ఫెయిల్ అయ్యి కూర్చున్నావు. నువ్వు పరీక్షలు పాసు అయ్యితే రెసిడెన్సీ మ్యాచ్ అయ్యే

ఏర్పాట్లు కూడా చేసి ఉంచాను. మా కలలు అన్నీ కల్లలు చేసావు", జవాబు కోసం, నా కంఠంలో వెటకారం కొంచెం తగ్గించే అన్నాను. కానీ నాకోపం, ఇచ్చిన మంచి అవకాశాలు సద్వినియోగ పరచుకుండా తన్నేస్తున్నాడనే నిరాశ, నిస్పృహ లు దాచడం కష్టంగానే ఉంది.

"మెడిసిన్ చదవాలని నాకెప్పుడు ఆశాలేదు. మీతో అమ్మతో గొడవ పడలేక ఇండియాకి పోయాను. ఇష్టం లేదు కాబట్టే పరీక్షలో ఫెయిల్ అయ్యాను. అయినా, నాలాగా డొనేషన్ కట్టి, అడ్డ దారుల ద్వారా డాక్టర్ అవ్వడం, ఈ గొప్ప ప్రొఫెషన్ కి సరి కాదు. పేషెంట్ లకు అన్యాయం చేసినట్లే", అన్నాడు సిద్ధు.

"ఈ నీతులు నా దగ్గర చెప్పొద్దు. అడ్డు దారులు తొక్కకుండానే నేను ఈ కన్సల్టెన్సీ కంపెనీలు నడిపిస్తున్నానా? వచ్చిన లాభాలు రియల్ ఎస్టేట్ , ఫ్రాంచైసీ రెస్టారెంట్లు, గాస్ స్టేషన్ లలో పెట్టి ఈ రోజు ఇంత స్థాయి కి రాగలిగానా ? బ్రతకడానికి మెళుకువలు తెలియాలి. నీకు ఈ విషయం, నన్ను దగ్గరగా చూసినా తరువాత కూడా, అంతుబట్టినట్లు లేదు", అన్నాను నేను.

"అలా ఎలా అనుకుంటున్నారు? నాకు అర్థం అయ్యింది కాబట్టే, నాకు ఆ మార్గం నచ్చక మరో మార్గం వెదుక్కుంటున్నాను, అని మీరు ఎందుకు అనుకోవటం లేదు", అన్నాడు సిద్ధు.

"అంటే నీ ఉద్దేశ్యం ఏమిటి? సెటిల్ అవ్వాల్సిన ఈ దశలో, దేశాల వెంబడి దొమ్మరిలా తిరగడమే నీ మార్గమా? ఇలాంటిదేదో చేస్తావనే. నీ కు బంగారం లాంటి సంబంధం తెచ్చి పెళ్లి చేసాము. గోల్డ్ మెడలిస్ట్ గీత. ఈ సంవత్సరం తన రెసిడెన్సీ కూడా పూర్తి అయ్యిపోతుంది. తనకు విడాకులు ఇచ్చేసావు. వాట్ ఈజ్ రాంగ్ విత్ యు?", అన్నాను నేను.

"గీత విషయంలో పొరబాటు మీరు, నేను ఇద్దరం చేసాం. మీరు మమ్మల్ని ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడానికి ఏమాత్రం సమయం ఇవ్వకుండా, ఓ ఎన్ ఆర్ ఐ పెళ్లి లాగానే, ఓ నెలలో మా పెళ్లి ముగించేసారు. పెళ్లి అయ్యితే నన్ను వదిలి వేస్తారను కున్నాను. రెసిడెన్సీ అనీ, అది ఫెయిల్ అయ్యిన తరువాత బిజినెస్ చూసుకోమని నాకు నిద్ర పట్టనీయకుండా చేశారు. గీత కు విడాకులు ఇచ్చేసిన తరువాత నాకు నాదారి వేదుక్కోవ్వాలి అని అనిపించింది. ఇల్లు విడిచిపెట్టేసాను", అన్నాడు సిద్ధు.

ఎంతో గొప్పగా అమర్చి ఇచ్చిన జీవితం చేజేతులా నాశనం చేసుకున్నాననే రిగ్రెట్, కంఠంలో కొంచెం కూడా ధ్వనించదేమి. ఓ సన్యాసిలా, వాడిలో ఈ ఉదాసీనత ఎక్కడ నుంచి వచ్చింది. డిప్రెషన్లో పోవలసిన వాడు, తాపీగా జవాబులు చెప్తున్నాడు. నాకు తాడో పేడో తేల్చుకోవాలన్న కోపం నా నశాలనికి అంటుకుంది.

"నీతో వాదిస్తూ,  పనికి రాని నీ జవాబులు వినడానికి నాకు సమయం లేదు. ఎదో డాక్టర్ అయ్యి, మన అస్థితో ఓ పెద్ద హాస్పిటల్ కట్టి సమాజంలో నా కంటే పెద్ద ప్రతిపత్తి సంపాదిస్తావు అనుకున్నాను. యూ టర్న్డ్ ఔట్ టు  బి ఏ ఫెయిల్యూర్.

నీకు  తెలుసు. ప్రతీ సంవత్సరం నీ పేరు మీద దాదాపు రెండు లక్షల  డాలర్లు నా కంపెనీ డివిడెండ్లు నీ అకౌంట్లో జమ అవ్వుతున్నాయి.

మారో మూడు నెలలు గడువు ఇస్తున్నాను. నువ్వు తిరిగి వచ్చి నా కంపెనీలో చేరితే సరి. లేక పోతే ఆ డబ్బులు కట్టడం కూడా మానేస్తా", ఎన్నో రోజులుగా అనుకుంటున్న మాటలు సిద్దుకు చెప్పేసాను.

సిద్దు నుంచి ఓ నిమిషం నిశ్శబ్దం సమాధానం అయ్యింది. తరువాత సిద్దు గొంతు సవరించుకుని, "మెడిసిన్ లో చేరాలని నేనెప్పుడూ అనుకోలేదు. మీ స్నేహితుల పిల్లలు, తెలివైన వారందరు ఇక్కడ మెడికల్ కాలేజీలలో సీట్ సంపాదించి చేరగలిగితే, మీరు నాకు ఇక్కడ సీట్ రాదని తెలిసి, ఇండియాలో డొనేషన్ కని కోట్లు పోసి నన్ను చేర్పించారు. ఇక నా అకౌంట్లో డబ్బులు వేయడం, టాక్స్ ప్లానింగ్, ఎస్టేట్ ప్లానింగ్ అని మీ అకౌంటెంట్లు చెప్పడం వల్ల చేశారు".

సిద్దు చెప్పడంలో నిజం ఉంది. కానీ నేను సిద్ధుకని, ఎంతో ఊహించి వేసుకున్న ఉద్యానవనం, నా ముందే వాడు చిందర వందర చేస్తుంటే సహించలేకపోయాను. ఏమి మాట్లాడుతున్నానో నాకే అర్ధం కాలేదు. ఎదురుగా కిటికీలోనుంచి ప్రశాంతంగా కనిపిస్తున్న అన్నా మారియా బీచ్ కూడా వికారంగా కనిపించింది.  నామాటలు పూర్తిగా నా అదుపు తప్పిపోయాయి.

"అన్నీ నీ మంచికే చేసాను కదా. అర్థం చేసుకోవేమిరా వెదవా. ఇలానే చేసావంటే నా ఆస్తులన్నీ  ఎదో చారిటీ కీ దానం చేసేస్తాను. నా ఇంటి పేరు కలకాలం నిలిచిపోతుంది. నువ్వే అడుక్కొని తింటావు. నువ్వు ముసలి వాడు అయ్యిన తరువాత కుమిలి కుమిలి ఏడుస్తావు", అన్నాను.

సిద్దు నుంచి మరో నిమిషం నిశ్శబ్దం. ఫోన్ కట్ చేసాడా అనుకున్నప్పుడు "మీరంతగా కోపం తెచ్చుకోనవసరం లేదు.  నేను బ్రతకడానికి, నా కనీసవసరాలకు, మీరిచ్చే డబ్బు నా కవసరం లేదు. ఒక వేళ మీరు ఇచ్చినా, మీ రన్నట్టు నేను కూడా చారిటీస్ కి ఇచ్చేసే వాడినే. కాదంటే నేను మీరు అనుకున్నట్టు ఇంటిపేరు బయటకి తెచ్చేవాన్ని కాదు. ఆదో అనానిమస్, గుప్త దానం అయ్యేది. ఇక మీదట మీరు నాకు డబ్బు ఇవ్వనవసరం లేదు. నాకు మీ ఆస్తులు అవసరం లేదు. నా ప్రయాణం నన్ను చేయనివ్వండి. మీరు నేనో హై వే కట్టాను, నీ కోసం ఓ లక్జరీ కారు కొన్నాను అంటే నేను ఆ కారు ఎక్కబోను. గీతను పెళ్లి చేసుకుని ఆ పొరబాటు చేసాను. నా గమ్యం నాకిప్పుడు తెలుసు. అది మీరూ వేసిన హై వే మీద పోతే చేరను. ఈ విషయం పై మరో సారి నాకు ఫోన్ చేయకండి", అని చెప్పి ఫోన్ కట్ చేసాడు.

★★★

తహితి ద్వీపాలకు వెకేషన్ మీద వచ్చాను. సిద్దు ఇన్స్టాగ్రామ్ లో వేస్తున్న మోర్య ద్వీపం చిత్రాలు చూసి, దగ్గరే ఉన్నాడు కదా అని మెసేజి పంపాను, వచ్చి కలువమని. సిద్దు నేను ప్రీ కేజీ నుంచి కలిసి చదివాము. హై స్కూల్ లో అంబరీష్ కలిసాడు. ముగ్గురం ఆప్త మిత్రులు. టచ్ లో ఉంటాం, వీలున్నప్పుడు కలుస్తాం.

రిసార్ట్ లోనే ఉన్న రెస్టారెంట్ లో డిన్నర్ కని సిద్దు ను పిలిచాను. అవుట్ డోర్ లోనే, బీచ్ పక్కన ఇద్దరికీ అని సెట్ చేసిన టేబిల్ ని రిజర్వు చేశాను. చూసి సంవత్సరం పైన అయ్యింది. గీతతో డివోర్స్ అయ్యిన తరువాత డ్రాప్ ఔట్ అయ్యిపోయాడు. ఎదో డిప్రెషన్ లో ఉన్నాడేమో అనుకున్న నాకు, సిద్దు ను చూడ గానే ఆశ్చర్యం వేసింది. వ్యాయామం చేస్తున్న శరీరంతో, సంతోషం ప్రతిపలిస్తున్న ముఖం తో "హాయ్ మార్క్, హౌ ఆర్ యు?", అంటూ గట్టిగా వాటేసుకున్నాడు.

"హలో సిద్దు. గుడ్ టి సీ యు మాన్. బాగా మారిపోయావు. ఏమి చేస్తున్నావు. యు లుక్ గుడ్", అన్నాను.

"ఈ మధ్య నార్డిక్ ట్రాక్ కంపెనీ వారు కావాలంటే మోర్య ద్వీపం మీద కొన్ని ట్రెక్ లు ఫిల్మ్ చేసాను", అన్నాడు.

"ఆదా సంగతి. మీ నాన్నడబ్బులివ్వకుండా కట్ ఆఫ్ చేశాడన్నావు. ఎలా బ్రతుకుతున్నావు అనుకున్నాను", అన్నాను.

"నా ఇన్స్టాగ్రామ్ లో వేస్తున్న ఫోటోల ద్వారా నాకు ఫాలోయింగ్ బాగానే ఉంది. ఇదిగో ఇలా నార్డిక్ ట్రాక్ లాంటి పనులు దొరుకుతుంటాయి. బ్రతకడానికి సరిపడా ఆదాయం వస్తూనే ఉంది. అంతకంటే ఎక్కువ సంపాదించనవసరం నాకు కనపడలేదు", అన్నాడు సిద్దు.

సిద్దు, అంబరీష్, నేను హై స్కూల్ తరువాత, ముగ్గురం ప్రీ మెడ్ లో చేరాం. నాకు మెడిసిన్ లో చేరాలని చిన్నప్పటి నుంచే కోరిక. నాకు నిజంగానే అనారోగ్యం తో బాధ పడే వారికి సహాయ పడాలని ఆశ. అంబరీష్ బాగా తెలివైన వాడు. జూనియర్ హై స్కూల్ వరకు క్లాస్ టాప్ లో ఉన్న నేను, అంబరీష్ హై స్కూల్ లో చేరగానే, రెండో స్థానం కు దిగాల్సి వచ్చింది. హై స్కూల్ గ్రాద్యుయేషన్ లో అంబరీష్ వేలడిక్టేరియన్. అంబరీష్ వాళ్ళ నాన్న సాఫ్ట్ వేర్ ప్రాజెక్ట్ మీద, హై స్కూల్ చదివే అబ్బాయి తో పాటు ఈ దేశానికి ఇమ్మిగ్రేట కాకపోతే, నేను వేలడిక్టేరియన్ అయ్యే వాడిని కదా అని బాధ పడ్డాను.

ఇంజనీర్ అవ్వాలనుకున్న అంబరీష్ ను, వాళ్ళ నాన్నే మెడికల్ రంగంలో డబ్బు, జాబ్ సెక్యూరిటీ రెండూ ఉంటాయి అని ప్రీ మెడ్ లో చేర్పించాడు. అంబరీష్ కు ఎర్లీ అడ్మిషన్స్ లోనే మెడిసిన్ సీట్ రావడం, నేను వెయిట్ లిస్ట్ లో మిగిలి పోయి, నాకు తృటిలో మెడిసిన్ సీట్ రాకపోవడంతో, అంబరీష్ లాంటి కొత్తగా బోటు దిగిన ఇమ్మిగ్రెంట్స్, నాలాంటి వారి ఆశలను వమ్ము చేశారని బాధ పడక పోలేదు. కాని ఈ దేశం అవకాశాలకు పుట్టినిల్లు. అంబరీష్ విషయంలోనూ, నా విషయంలోనూ అది నిజమే అయ్యింది.

"అన్నట్టు అంబరీష్ ఎక్కడ పని చేస్తున్నాడు?", తిరిగి సిద్దు నే అడిగాడు.

నవ్వు వచ్చింది నాకు. ఎక్కడో ఓ కొంటె సంతృప్తి కూడా. "అంబరీష్ నేను మొన్ననే కొన్న ఫిజిషియన్ గ్రూప్ లో పని చేస్తున్నాడు", అన్నాను నేను.

సిద్దు కూడా నాతో బాటు నవ్వాడు. "మెడికల్ కాలేజీలో సీటు అంబరీష్ కు వచ్చి, నీకు రాలేదని నువ్వు, నన్ను మా వాళ్ళు ఇండియాకి పంపించేస్తున్నారని నేను, మన కాలేజి పక్కనున్న బార్ లో కూర్చుని బాధ పడడం నిన్న జరిగినట్లుంది. కాలం ఎన్ని మార్పులు తెస్తుంది", అన్నాడు సిద్దు.

"అవును సిద్దు. మెడికల్ రంగంలో నే ఉండాలని నాకు తెలిసిన డాక్టర్ ఆఫీసులో మేనేజర్ గా చేరడం, అతను రెండు ఏళ్లలోనే రిటైర్ అయ్యిపోతే, నేనే బ్యాంక్, స్నేహితుల సాయం తో ఆ క్లినిక్ కొని ఓ డాక్టర్ ని హైర్ చేసుకొని లాభాలు సంపాదించడం వెంట వెంటనే జరిగిపోయాయి. తరువాత మరిన్ని క్లినిక్ లు, ప్రేక్టీసులు కొనడం తో అతి త్వరలోనే ఓ హాస్పిటల్ సిస్టం సృష్టించ గలిగాను", ఒక్కింత గర్వంతోనే అన్నాను.

"యు డిసెర్వ్ ఇట్ మార్క్. నువ్వీ స్థితిలో ఉండడం నాకు సంతోషంగా ఉంది", అన్నాడు సిద్దు.

"అంబరీష్ అంటే గుర్తుకు వచ్చింది. నీ ఫ్యూచర్ ప్లాన్స్ ఏమిటి? ఎప్పటికి తిరుగుతూనే ఉంటావా?", అడిగాను నేను.

"ప్రస్తుతము తిరగడమే నా ఫ్యూచర్", అన్నాడు సిద్దు.

"రిలేషన్స్ లేకుండా ఒంటరిగా ఈ అడవులు, రిమోట్ ప్రదేశాలు వెదికి, తిరగడం బోర్ కొట్టదా? బండగా అడుగుతున్నానని అనుకోవద్దు. సెక్స్ కి ఏమి చేస్తున్నావు? ", అని అడిగాను నేను.

"ఈ టిన్ డర్ రోజులలో, వన్ నైట్ స్టాండ్ లకు కోదువేమి. అయినా నేను తిరిగే ప్రదేశాలు, కొండలు, అడవులు, నదులు, సముద్రాలు ఆ విషయం ఎప్పుడో గాని గుర్తుకు తేవు. అన్నట్టు నీ విషయం ఏమిటి? ఎవరైనా దొరికారా? ఎవరితో నైనా మూవ్ అయ్యావా? నీ పెళ్లి ఎప్పుడు?", అడిగాడు సిద్దు.

"నువ్వన్నదాంట్లోనే నా సమాధానం కూడా ఉంది. మన జనేరేషన్లో అమ్మాయిలు , అబ్బాయిలు సెటిల్ కావడానికి తొందరేమి పడటం లేదు. పెళ్లి ఇప్పుడే అనుకోవటం లేదు. సెక్స్ దొరకడం సమస్య కాదు. ప్రస్తుతం నాకు ఈ బిజినెస్ ఇంకా అభివృద్ధి చేయడం లోనే ఆనందం ఉంది. దానికే నా సమయం సరిపోతుంది", అన్నాను.

"అవును. నువ్వన్నది నిజమే. మన జెనరేషన్ కథ వదిలేయి. ఈలాన్ మస్క్ లాంటి వారే పెళ్లి అనే సాంప్రదాయానికి విడాకులు ఇచ్చేస్తున్నారు. పెళ్లి అవుట్ డేటెడ్ కాన్సెప్ట్ అయ్యిపోయింది. అసలు నేను ఇక పెళ్లి చేసుకోదలచుకోలేదు", అన్నాడు సిద్ధు.

"ఫ్రెండ్ కాబట్టి సాహసించి అడుగుతున్నాను. గీత డివోర్స్ ఇచ్చింది అని ఇంకా బాధ పడుతున్నావా? గీత మీద ఇంకా నీకు కోపం ఉందా", అన్నాను నేను.

"చా. గీతకు నా నిర్ణయానికి సంబంధం లేదు. నాకీ మధ్య ఏది చూసిన ప్రేమే కలుగుతుంది. నువ్వు, నేను, గీత, అంతెందుకు చెట్టు, గట్టు అన్ని అణు సముదాయాలే. కొన్ని అణువులు అటూ ఇటూ మారిస్తే మన రూపాలు, జీవాలు మారిపోతాయి. అలా ఉన్నప్పుడు మరొకరిని ద్వేషించడం కాని, వారి మీద కోపం తెచ్చుకోవడం, అసూయ పడడం అర్ధం లేని విషయాలు", అన్నాడు సిద్ధు.

సిద్ధు నిజంగానే మారిపోయాడు. ఇందాక ఫిజికల్ గా చూడడానికి బలంగా, బాగున్నాడనుకున్నాను కానీ, ఇప్పుడు సిద్ధు మాట్లాడు తున్న తీరు, అతని ముఖంలో ఉన్న ప్రశాంతత అతనో కొత్త మనిషిగా పరిచయం చేస్తున్నాయి.

నేను సిద్ధుతో చెప్పాలా, వద్దా అనుకుంటున్న ప్రశ్నకు సమాధానం దొరికింది.

"అంబరీష్ గురించి అడిగావు. నీకో గుడ్ న్యూస్ చెప్పాలి. అంబరీష్ పెళ్లి చేసుకోబోతున్నాడు. బెచిలర్స్ పార్టీ నేనే వేగాస్ లో వచ్చే నెల ఏర్పాటు చేస్తున్నాను. రెండు నెలల తరువాత బాలిలో డెస్టినేషన్ వెడ్డింగ్. రాగలవా?", అన్నాను నేను.

"వచ్చే నెల సీఎర్ర లియోన్ కు పోవాలి. రాలేను. వేగాస్ పార్టీ ఎంజాయ్ చేయండి", అన్నాడు సిద్ధు.

అంబరీష్, నేను సిద్ధును కలుస్తాను అంటే, నాతో పంపిన వెడ్డింగ్ ఇన్విటేషన్ సిద్ధుకు అంద జేశాను.

అంబరీష్ డిడ్ ఆ గ్రేట్ జాబ్ విత్ ఇన్విటేషన్. ఓ గిఫ్ట్ హాంపెర్ లో కొన్ని చిన్న వైన్ సీసాలు, వాటి మధ్య రకరకాల చీజ్, చాక్లెట్ ప్యాకెట్స్ ఉన్నాయి. బుట్ట మధ్యలో ఓ ఐ పోడ్ ఉంది.

"గో ఎహెడ్. ఇన్విటేషన్, పెళ్లి వివరాలకు ఆ ఐ పోడ్ లో ఉన్నాయి. ఆన్ చేసి చూడు", అన్నాను.

సిద్ధు ఐ పోడ్ ఆన్ చేయగనే ఇన్విటేషన్ వీడియో మొదలయ్యింది. కాబోయే వధూవరులు తమను పరిచయం చేసుకుంటూ,అతిధి పేరు పెట్టి మరీ ఆప్యాయంగా పిలిచిన వీడియో పత్రిక. సిద్ధు ముఖంలో ఓ క్షణం ఆశర్యం కనిపించి, చిరు నవ్వు వెనుక దాకున్నది. .

"వెరీ నైస్ అండ్ క్రియేటివ్. చాలా బాగా చేశారు. పెళ్లి కూతురు ముఖంలోని ఆనందం, భవిష్యత్తు గురించిన కలలు నేను ఇది వరకే చూసాను. ఇద్దరు మేడ్ ఫర్ ఈచ్ అథర్. అంబరీష్ అనుకున్నట్టే తనంతగా చదువులో ముందుండి, కెరీర్లో పైకెదగాలనుకొనే పార్టనర్ దొరికింది. ఇద్దరు మనకు బాగా తెలిసిన వారే. సంతోషంగా ఉంది నాకు. నా బెస్ట్ విషెస్ అంబరీష్ కు. గీత కు అంద జేయి" అన్నాడు సిద్దు.

# ఎంత చేరువో...అంత దూరమూ

## రమాదేవి నెల్లుట్ల

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
బహుమతి పొందిన కథ

**అతడు ఆగి వెనక్కు చూసాడు**. ఆమె నవ్వుతూ చేయి ఊపడం కనిపించింది. ఆ వీడ్కోలులో ఒక ఆహ్వానం వుంది. అతడూ చేయి ఊపాడు. ఆ ఊపడంలో ఒక వాగ్దానం వుంది.

అతడు వెళ్ళిపోతూ అనుకున్నాడు 'ప్రేమలో ఇంత మాధుర్యం వుందా' అని.

---

' మీరు వెళ్ళండమ్మా! ' అన్నాడు కాంపౌండర్. ఆమె డోర్ తెరుచుకుని బాబుతో సహా లోపలికి అడుగుపెట్టింది.

' చెప్పండి ... మీ ప్రాబ్లం ఏమిటో! 'అంటూనే తలెత్తి చూసిన అతడు ఆమెను అలా చూస్తూనే వుండిపోయాడు.

చిన్న చిన్న గులాబీలున్న తెల్లని చీర భుజాల నిండా కప్పుకుని వానలో తడిసిన మల్లెపూవులా వుంది. కళ్ళ నిండా ఆందోళన, ముఖంలో దిగులూ కనబడుతున్నాయి. కానీ, అవేవీ ఆమె సౌందర్యాన్ని దాచలేకపోతున్నాయి.

బాబు భుజం చుట్టూ చేయివేసి దగ్గరగా పొదివి పట్టుకోవడంలోనే ఆ పిల్లవాడి మీద ఆమెకెంత ప్రేమో తెలుస్తోంది.

అతడి నిస్సంకోచమైన చూపులకు అడ్డుకట్ట వేస్తూ' డాక్టర్ 'అందామె.

అతడు చప్పున తేరుకుని 'ఏమైంది? 'అనడిగాడు.

'బాబుకి రెండు సార్లు వాంతులయ్యాయి. కొంచెం టెంపరేచర్ కూడా వుంది'అంది. ఆమె గొంతు వణకడం తెలుస్తోంది.

' పడుకోబెట్టండి. టెస్ట్ చేస్తాను' అంటూనే స్టెత్ తీసుకుని కర్టెన్ వెనకాల ఉన్న టేబిల్ దగ్గరకు వెళ్ళాడు డాక్టర్.

బాబు ఏమీ పేచీ లేకుండానే బల్ల ఎక్కాడు.

'జాండిస్ లాగా వుంది. కంగారు పడాల్సిందేమీ లేదు. ఇంతకీ డైజెషన్ ఎలా వుంది?' అడిగాడు డాక్టర్ పొట్ట, నాలుక పరీక్ష చేసాక.

'అంతకు ముందు బాగానే వుండేది. ఈ వారం రోజులుగా ఆకలి అనడం లేదు. లంచ్ బాక్స్ కూడా సగం వెనక్కు తెస్తున్నాడు' అదే దిగులు ఆమె ముఖంలో.

'ఈ టెస్టులు చేయించండి. రెండు గంటల్లో రిపోర్ట్స్ వచ్చాక నాకు చూపించండి 'అన్నాడు డాక్టర్.

రెండు గంటల తర్వాత రిపోర్ట్స్ జాండిస్ నిర్ధారణ అయ్యింది.

' తేలిగ్గా అరిగే పదార్థాలే తినిపించండి. మందులు రాస్తున్నాను. రెగ్యులర్ గా వాడితే తగ్గిపోతుంది' అన్నాడు డాక్టర్ చకాచకా మందులు రాస్తూ.

'భయపడాల్సిందేమీ లేదు కదా డాక్టర్?' అందామె.

తలెత్తి ఆమెవైపు చూసాడు. ఆమె కళ్ళనిండా నీళ్ళు దూకడానికి సిద్ధంగా వున్నాయి.

'అరెరె! ఇందులో అంత వర్రీ అవాల్సిందేమీ లేదు. ఈ సీజన్లో చిన్న పిల్లలకు జాండీస్ వస్తూనే వుంటుంది. జాగ్రత్తగా వుంటే చాలు. తర్వాత చూపించండి ఏమైనా అవసరమొస్తే–ఇదిగో నా మొబైల్ నెంబర్ రాస్తున్నాను. మొహమాట పడకుండా ఫోన్ చేయండి' అంటూ రాసిచ్చాడతను.

నర్స్ కొంచెం చిత్రంగా చూసింది. సహజంగా డాక్టర్ అరవింద్ తన పర్సనల్ మొబైల్ నంబర్ ఎవరికీ ఇవ్వడు.

2

'థ్యాంక్యూ వెరీమచ్ డాక్టర్!' ఆమె చేతులు జోడించి నమస్కరించింది.

ఆమె వెళ్ళిన వైపు అలాగే చూస్తూ వుండిపోయాడు డాక్టర్.

' డాక్టర్! నెక్స్ట్ పేషంటిని పిలవమంటారా? 'అన్న నర్స్ పిలుపుతో

' ఓకే! ఓకే! 'అని సర్దుకున్నాడు.

ఆకాశం మబ్బుపట్టి వుంది. ఎక్కడి నుండో చల్లని గాలి వీస్తోంది. ఏడవుతున్నా సూర్యుడింకా వుదయించలేదు.

కూరగాయల మార్కెట్ అంతా తిరిగి, కావల్సిన కూరలు కొనుక్కుని మెల్లగా ఇంటికి నడవడం మొదలుపెట్టింది నీలిమ.

' హాయ్! ఎలా వున్నారు? 'వెనుక నుంచి పలకరింపు వినిపించి వెనక్కి తిరిగి చూసింది

వైట్ టీషర్ట్, గ్రే కలర్ ట్రాక్ పాంట్, స్పోర్ట్స్ షూ వేసుకుని వున్న యువకుడు! పెదవులపై చిరునవ్వు. కళ్ళల్లో ఆనందం.

వెంటనే గుర్తు పట్టలేకపోయింది.

'అంతేలెండి! సాయం చేసినవాళ్ళని కూడా గుర్తు పెట్టుకోవట్లేదు ఈ రోజుల్లో. చూసారా, ఎంత అన్యాయమో!' జేబుల్లోంచి చేతులు బయటికి తీసి తమాషాగా గాల్లో వూపుతూ అన్నాడు.

ఎవరు ... ఎవరు? ఇంత చనువుగా ... ఆఁ ... గుర్తొచ్చింది. 'నమస్తే డాక్టర్ గారూ!' అంది తల కొద్దిగా వంచి ... రెండు చేతుల్లోనూ కూరగాయల సంచులున్నాయి. ఇంత దగ్గరగా వచ్చేసి నిలబడ్డాడేం? అనుకుంది.

'హమ్మయ్య! గుర్తుపట్టారు. లేకపోతే మీకేదైనా జ్ఞాపకశక్తి పెరగడానికి మందివ్వాలన్నా నేను పిల్లల డాక్టర్ని కదా! ఏం చేద్దామా అనుకుంటున్నాను'అన్నాడు తమాషాగా.

ఆరోజు హాస్పిటల్లో కొంచెం గంభీరంగా వున్నాడు. ఇప్పుడు మరీ పాతికేళ్ళ యువకుడిలా. ఎలా గుర్తుంటుంది? అయినా అప్పుడు  ఆందోళనలో అతన్ని సరిగ్గా చూడలేదు.

' అచ్చు గులాబీ పువ్వులా వున్నారు! ' పింక్ కలర్ చుడీదార్లో వున్న ఆమెను చూస్తూ అన్నాడు.

ఇదేమిటీ! ఇంత చనువు నచ్చడం లేదు.

' మీరసలు ఏమీ మాట్లాడరా? 'మళ్ళీ ప్రశ్న ...

ఇక బావుండదు ... ఏదో మాట్లాడాలి.' మీరు ... ఇలా ... మార్కెట్ కా? 'తన ప్రశ్న తనకే బాలేదు.

' హఁహఁహఁ! నేను ... మార్కెట్టుకు అసలు జన్మలో ఒక్కసారి కూడా వెళ్ళలేదు. ఈ ప్రక్క గ్రౌండ్లో

వాకింగ్ కి వస్తుంటాను. రిటర్న్ వెళుతుంటే మీరు కనిపించారు. నా కాళ్ళు ఇటు వైపు లాక్కు వచ్చాయి.  నా తప్పేం లేదండీ ' కళ్ళు నవ్వుతున్నాయి అల్లరిగా.

మళ్ళీ ఏం మాట్లాడాలో తోచలేదు నీలిమకి

' చెట్టంత మొగవాడ్ని ఉండగా రెండు సంచులూ మీరే మొయ్యడం అన్యాయం. ఇలా ఒకటివ్వండి నేనూ మోసి మంచివాడ్నని నిరూపించుకుంటాను'అంటూ చేయి ముందుకు చాపాడు.

'వొద్దొద్దు' కంగారుగా వెనక్కు జరిగింది.

'మళ్ళీ ఇంటికెళ్ళాక మీ సంచీ మీకే ఇస్తాను. నేనేమీ నావంటూ క్లెయిమ్ చెయ్యను. సరేనా! "అంటూనే చేతిలోంచి కూరగాయల సంచీ అందుకున్నాడు.

రెండింట్లోనూ బరువైన సంచీ అతనే తీసుకున్నాడు. ఇంకో చెయ్యి తేలిగ్గా వుంది. గబగబా అడుగులు వేస్తోంది నీలిమ.

‘ ఇంతకీ మీ ఇల్లు దగ్గరేనా? లేకపోతే ఏ ఆటోనో ఎక్కి బైబై అనరుగా, ఇంటికొచ్చి కాస్త కాఫీ తాగి వెళ్ళండి అనొచ్చుగా' పక్కనే నడుస్తూ అన్నాడు అరవింద్.

'అయ్యయ్యో! అలా ఏం కాదు. మా ఇల్లు పక్క సందులోనే, రండి. కాఫీ తాగి వెళ్ళండి' గబగబా అంది.

'మీరు పిలవకపోయినా వస్తాను లెండి. ఎలాగూ డిసైడ్ అయ్యాను 'నవ్వుతూ అన్నాడు.

రెండు నిమిషాల్లో ఇల్లు వచ్చేసింది. అన్నీ డిజైనర్ ఇళ్ళున్న మంచి కాలనీయే.

చిన్న గేటు తీసుకుని లోపలికి వెళితే పొదరిల్లు లాంటి అందమైన ఇల్లు. చుట్టూ పూల మొక్కలు. చక్కటి పోషణలో విరగబూసి వున్నాయి. ఒక పక్కన స్కూటీ పార్క్ చేసి వుంది. లోపల ఇల్లు ఇంకా అందంగా, కళాత్మకంగా వుంది. ఎక్కడి సామాను అక్కడ నీట్ గా సర్దిపెట్టి వుంది.

రెండు బీరువాల నిండా బుక్స్ వున్నాయి. గోడలకు అందమైన పెయింటింగ్స్, కిటికీలకు తెల్లని కర్టెన్స్ వేలాడుతూ వున్నాయి. ఆ ఇంట్లోకి రాగానే ఎవరికైనా సేద తీరినట్టుగా అనిపిస్తుంది.

' కాఫీ తీసుకోండి ' నిలబడి పెయింటింగ్స్ చూస్తూ వున్న అరవింద్ వెనక్కు తిరిగాడు.

'చాలా బాగున్నాయి మీ కలెక్షన్స్. వండ్రఫుల్ ... ఎక్కడ కొన్నారు? 'అడిగాడు.

‘అవి నేను అప్పుడప్పుడూ వేసినవే' నెమ్మదిగా చెప్పింది నీలిమ.

'వావ్! మీరు ఇంత మంచి పెయింటరా? మీవేవైనా ఆర్ట్ ఎగ్జిబిషన్స్ అయ్యాయా? ఇన్ఫాక్ట్ నాకూ కొంచెం ప్రవేశం వుండేది. మెడిసిన్ చదవడం కోసం త్యాగం చేసాను! బట్ యు ఆర్ గ్రేట్. అసలు మీ ఇల్లు ... మొక్కలు ... పుస్తకాలూ మీ టేస్ట్ సూపర్' నిజాయితీగా అన్నాడు.

‘ఫైనల్లీ ... మీ కాఫీ ... ఇంకా సూపర్! ఇంత మంచి కాఫీ తాగి ఎన్నాళ్ళయిందో? 'అతని ముఖంలో ఒక్కసారి నీలినీడలు తొంగి చూసాయి.

‘అంత గొప్ప ఆర్ట్ ఏమీ కాదు! ఏదో హాబీగా నేర్చుకున్నాను' అంటూనే 'ప్రతీక్!' అంటూ పిలిచింది.

రూంలో చదువుకుంటోన్న ప్రతీక్ బయటికి వచ్చి ‘నమస్తే అంకుల్ 'అంటూ విష్ చేసాడు.

' నమస్తే! హౌ ఆర్యూ! 'అంటూనే' ఇప్పుడేమీ హెల్త్ ఇష్యూ లేదుగా బాబుకి? 'అనడిగాడు నీలిమని.

'పది రోజుల కిందట మళ్ళీ చెకప్ కి వచ్చాంగా మీ దగ్గరికి అప్పటికే మొత్తం తగ్గిపోయింది! '

‘ దట్స్ గుడ్! నేనసలు ఫస్ట్ టైమ్ చూసి మీ తమ్ముడనుకున్నా. మీకు పదేళ్ళ కొడుకున్నట్టు కన్పించరు' అన్నాడు డాక్టర్ అరవింద్.

'పది కాదు పన్నెండేళ్ళు' అందామె.

'అవునా! ఏం చదుతున్నావ్ నాన్నా?' అన్నాడు.

'సెవంత్ క్లాస్' అన్నాడు ప్రతీక్.

ఇంకా వెళ్ళడేం? బాబుకి బ్రేక్ ఫాస్ట్ పెట్టి స్కూల్ కి పంపించాలి. టైం అయిపోతుంది ఆమెలో ఎక్కడో అసహనం.

'టైం అయిపోతోంది. చాలా పనులున్నాయి ఇంకా వెళ్ళడేమిటి అనుకుంటున్నారా? వెళ్తాను మరి'

' అబ్బెబ్బే! ఆలా అనికాదు. మీ టైం చాలా విలువయింది కదా పేషెంట్లను చూడాలి ... ఇంకా' మధ్యలోనే ఆపేసింది ఆవులిస్తే పేగులెక్క పెట్టేట్టున్నాడు అనుకుంటూ.

'వెళ్తాను ... నేను అప్పుడప్పుడూ ఇలా వస్తుంటాను, మీ కాఫీ కోసం. ఏమనుకోరుగా? అంటూనే నీలిమ వైపో సారి చూసి' బై 'అంటూ వెళ్ళిపోయాడు.

3

' వచ్చెనోయి వసంతము ... విచ్చినది మల్లి లతాంతము ... వచ్చెనోయి వసంతము ... 'సన్నగా పాడుతూ పాటలోనే లీనమై మల్లెమొగ్గల్ని తెంపుతోంది నీలిమ. పరిమళాల్ని వెదజల్లుతూ, అప్పుడే విచ్చుకుంటున్న పూలు చెట్టు నిండా విరగబూసాయి. ఇంకా పైనున్న తీగలు చేతికి అందక వదిలేసింది. సాయం సంధ్య మెల్లగా చుట్టూ కమ్ముకుంటోంది.

' నేను కోసివ్వనా? 'వెనుకనుంచి వినిపించింది. ఎప్పుడొచ్చాడో, ఎప్పటి నుంచి అలా నిలబడ్డాడో డాక్టర్ అరవింద్.

' మీరా! ఈ టైమ్ లో. ఎంతసేపైంది వచ్చి?'పైకే అనేసింది.

'మీరు తన్మయత్వంలో పాడుతున్నప్పుడే వచ్చాను. ఆ లోకం నుంచి మిమ్మల్ని బయటకి తేలేక, నేనూ ఆ లోకంలోకే వెళ్ళిపోయి ధన్యుడ్నయ్యాను.

ఆ ముఖంలో ఒక్కక్షణం సిగ్గుతెర కనపించి మాయమైంది.

'లోపలికి రండి' ఆహ్వానించింది.

' ఇక్కడే కూర్చుందామా? ఈ అందమైన సాయంత్రం ... ఈ మొక్కలు ... సువాసన వెదజల్లే ఈ పూలు ... మీ పాట ... చాలా హాయిగా వుంది '

'లోపల కూర్చుందాం రండి. ఇక్కడ దోమలు వస్తాయేమో!'

ఆమె వెనకాలే లోపలికి నడిచాడు. మల్లెపూలన్నీ లివింగ్ రూములో మూలకు చిన్న స్టాండుపైనున్న కృష్ణుని విగ్రహం ముందు పోసింది నీలిమ.

మురళి వాయిస్తున్న కృష్ణుడు. చాలా అందమైన విగ్రహం.

'మీ ఆడవాళ్ళందరూ శ్రీకృష్ణున్ని ఆరాధిస్తారు. భర్త మాత్రం శ్రీరాముడిలా వుండాలనుకుంటారు. ఎందుకనీ?' అరవింద్ ప్రశ్న.

'స్త్రీ తనను ప్రేమించే వాడిని ఆరాధిస్తుంది. తనను తప్ప మరెవరినీ చూడని వాడిని వరిస్తుంది. అంతే' మెల్లగా అంది నీలిమ.

' బాప్! మీరు సంస్కృతంలో మాట్లాడితే నాకర్థం కాదులెండి. ఇంతకూ మీ దుష్యంతుడెక్కడా? '

' దుష్యంతుడా?' అశ్చర్యపోయింది.

'అదేనండీ, మీవారు! మీరేమో వనవాటికలో శకుంతలలా వున్నారు. మీ బాబేమో భరతుడు! మరి మీ దుష్యంతుడేడీ అని అడిగాను' మారుతోన్న ఆమె ముఖకవళికలు చూసి 'యామై రాంగ్?" అన్నాడు.

' నాలుగేళ్ళ క్రితం వరకూ నాతోనే వుండి నన్ను నడిపించాడు. ఇప్పుడు ... పైనుండి నన్ను నడిపిస్తున్నాడు' అంది నీలిమ. ఆమె గొంతులో దుఃఖం స్పష్టంగా తెలిసింది.

' ఓ ... అయాం సారీ. వెరీ వెరీ సారీ. మిమ్మల్ని బాధపెట్టాను. నా ఉద్దేశం అదికాదు. ఎందుకో మీరు చాలా సన్నిహితంగా అనిపించారు మొదటిసారి నుండే. అసలు నేను ఎవరితోనూ ఇంత చనువుగా వుండను. మీతో అనుకోకుండానే క్లోజ్ గా మాట్లాడాను తప్ప మీ పాత విషయాలు గుర్తుచేసి బాధపెట్టాలని కాదు'అన్నాడు. అపాలజిటిక్ గా.

' ఒక్కక్షణం' అని ఆమె లోపలికి వెళ్ళింది. ఆమె ఏడుస్తోందేమో అనిపించినా అతను చొరవచేసి లోపలికి వెళ్ళలేక పోయాడు.

కాసేపటికి నీలిమ కాఫీ కప్ వచ్చింది. ముఖం కడుక్కున్నట్లుంది. కనురెప్పలు ఇంకా తడిసేవున్నాయి. కనుకొలుకుల్లోని ఎరుపు. ముఖమంతా ప్రతిఫలిస్తోంది.

'సారీ!' అంది తలెత్తకుండానే.

' ఆ మాట నేననాలి. ఎలా జరిగింది? మీకు ఇబ్బందిగా లేకపోతేనే చెప్పండి.'

' ఆక్సిడెంట్ ... మేము డార్జిలింగ్ వెళ్ళినప్పుడు ... ఘాట్ రోడ్డులో ఎవరికో ఎమర్జెన్సీ వుండి బస్సు దిగితే తోడుగా తనూ దిగాడు. వేరే లారీ ... రాంగ్ సైడ్లో వచ్చి కొట్టింది' ఆ రోజుల నాటి విషాదం, దుఃఖంతో కలిసి ఆమె గొంతులో.

' అగైన్ సారీ. బట్ ... కొన్నిసార్లు కాలం వేసిన శిక్షలు అనుభవించక తప్పదు. వుయ్ ఆర్ సెయిలింగ్ ఇన్ ద సేమ్ బోట్! మీ సానుభూతి కోసం చెప్పట్లేదు. నా వైఫ్ పోయి మూడేళ్ళైంది. రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయి. డాక్టర్నయీ ఏం చేయలేక పోయాను. నాకోసం ... చిన్నారి పాపను తన గుర్తుగా వదిలి వెళ్ళిపోయింది.'

ఆమె తలెత్తి చూసింది.

'మీరు పైకి ఏడుస్తున్నారు. నేను లోపల ఏడుస్తున్నాను. అంతే' అన్నాడు గద్గద స్వరంతో.

నీలిమ మాట్లాడేలోగానే ' అమ్మా 'అంటూ క్రికెట్ ఆటనుండి వచ్చాడు ప్రతీక్. అరవింద్ ని చూడగానే ' నమస్తే అంకుల్ 'విష్ చేసాడు.

' హాయ్ ... మాస్టర్ క్రికెటర్! మనం అలా బయటికెళ్ళి ఐస్క్రీం కొనుక్కొద్దామా?' వాతావరణాన్ని తేలిక చేయడానికి అరవింద్ ప్రయత్నించాడు.

అనుమతి కోసం తల్లివైపు చూసాడు ప్రతీక్.

' ఫ్రెష్ అయి వెళ్ళు బాగా అలసిపోయావ్ చూడు.' అన్నది నీలిమ. లోపలికి పరిగెత్తాడు ప్రతీక్.

రోజులు వారాలుగా, నెలలుగా మారుతూనే వున్నాయి. చాలాసార్లు మార్నింగ్ వాక్ కి వచ్చినప్పుడు అరవింద్ రావడం ఎక్కువైంది. ఆదివారం మధ్యాహ్నం వరకే అతని క్లినిక్. సాయంత్రం వస్తే ప్రతీక్ వచ్చేదాకా వుండటం అలవాటైంది అతనికి. పెయింటింగ్స్ గురించో, పాటల గురించో, పుస్తకాల గురించో, లేటెస్ట్ టాపిక్స్ గురించో గంటలు గంటలు మాట్లాడుకోవడం వాళ్ళ స్నేహానికి దారి తీసింది.

' ఎన్ని అందమైన పెయింటింగ్సో. ఇవాళ కడుపు నిండిపోయింది' పెయింటింగ్ ఎగ్జిబిషన్ నుండి బయటికి వస్తూ అంది నీలిమ.

రెండ్రోజులుగా సిటీ ఆర్ట్ గ్యాలరీలో పెయింటింగ్ ఎగ్జిబిషన్ అవుతోందనీ ఇవాళ సండే కాబట్టి వెళదామనీ చెప్పి అరవింద్ అక్కడికి తీసుకువచ్చాడు.

' కడుపు నిండడం కరెక్టేనా? కళ్ళు నిండాయనో మనసు నిండిందనో అనాలేమో?'అన్నాడు అరవింద్.

' మీరు తీసుకురాకపోతే మిస్ అయ్యేదాన్ని 'మనస్ఫూర్తిగా అంది. కారు వైపు నడుస్తున్నారిద్దరూ.

'ఈ సందర్భంగా ఒక చిన్న కోరిక కోరాలనుంది!' అన్నాడు అభ్యర్థిస్తూ ...

నీలిమ గుండె దడదడా కొట్టుకుంది. ఏమడుగుతాడు?

'ఇవాళ బయట డిన్నర్ చేద్దాం! కాదనకూడదు!'

'ఈ రాత్రివేళ? బాగా లేట్ అవుతుందేమో?' అంది సంకోచంగా.

' రాత్రివేళ తినేదాన్నే డిన్నర్ అంటారు మేడమ్' పకపకా నవ్వాడు.

' ఏం ఫర్వాలేదు. తొమ్మిది గంటల్లోపు మీ ఇంట్లో దింపుతాను. సరేనా. అయినా మీ ప్రతీక్ సైన్స్ టూర్ కి వెళ్ళాడుగా'అన్నాడు అరవింద్

'సిటీ వ్యూ' హోటల్లో ఒక మూల టేబిల్ వద్ద కూర్చున్నారిద్దరూ. వాతావరణం చల్లగా వుంది. మ్యూజిక్ మంద్రంగా వుంది. మనసు కలవరంగా వుంది.

అరవింద్ తననే కన్నార్పకుండా చూస్తున్నట్టు తెలుస్తోంది. ఆ చూపు గిలిగింతలు పెడుతున్నట్టుగా వుంది. కొంచెం బిడియంగానూ వుంది. కొంచెం ఇష్టంగానూ వుంది.

‘ మీరిక్కడే వున్నారా? ’ ముఖం ముందు చేతివేళ్ళు ఆడిస్తూ అన్నాడు.

ఆమె తలెత్తి చూసింది. అతడు తనవైపే మురిపెంగా చూస్తూ కనిపించాడు.

'ఏమిటాలోచిస్తున్నారు? నేను అడిగింది విన్నారా?'

అడిగాడా? తనకే అలా అడిగినట్టు అనిపించిందా! ... తల వూపింది ఎటూ తేల్చకుండా.

'మీకు ఎలా చెప్పాలో తెలీడం లేదు. కానీ నేను పరిపూర్ణంగా కోరుకున్న లైఫ్ కంపానియన్ మీరు, మీ నడక, మీ నడత, మీ నవ్వు, మీ అందం, మీ గ్రేస్ఫుల్నెస్, మీ అభిరుచులు, మీ వ్యక్తిత్వం అన్ని ఇష్టమే నాకు. మీరు పరిచయం కాకుండా ఇన్నాళ్ళూ ఎలా వున్నానా అనిపిస్తోంది నాకు.'

‘అసలు భార్యపోయి పదేళ్ళ కూతురున్న ఓ నలభై ఏళ్ళ వ్యక్తి ఇలా మాట్లాడకూడదేమో? కానీ, మిమ్మల్ని చూడకుండా ఉండలేకపోతున్నాను నేను ఇది నా ఫస్ట్ లవ్! మీరు నమ్మినా, నమ్మకపోయినా ఇది నిజం. మంచి స్నేహితురాలు జీవిత భాగస్వామి అయితే అంతకంటే అదృష్టమేమీ వుండదేమో? '

నీలిమ ఏదో మాట్లాడబోయింది.

‘నన్ను చెప్పనివ్వండి ప్లీజ్. మీ భార్యను ప్రేమించలేదా అంటారేమో. మా మామయ్య నేను మెడిసిన్ చదవడానికి ఎంతో సహాయం చేసాడు. ఆ తరువాత వాళ్ళమ్మాయి రజనిని నాకిచ్చి పెళ్ళిచేసాడు. నాకు ఇష్టమనీ కాదు, పెద్దగా అయిష్టమూ లేదు. తను నన్నెంతో ఆరాధించేది. ఒకటి మాత్రం నిజం రజని వుండగా నేను ఇంకే ఆడపిల్ల వైపు కన్నెత్తి చూడలేదు. తనను అపురూపంగానే చూసుకున్నాను. దురదృష్టవశాత్తూ తనకి కోలుకోలేని జబ్బు వచ్చింది–కానీ ... మీ విషయంలో నా హృదయం తపించినట్టుగా ఇంతటి ఎమోషన్లో తన గురించి నేనెప్పుడూ లేను'. అతడు ఒక ఫ్లోలో చెప్పుకు పోతున్నాడు.

‘ కానీ–నా జీవితం అలా కాదు. విశ్వాస్ నన్ను ప్రాణంలో ప్రాణంగా చూసుకున్నాడు. ఒక అనాథగా పెరిగిన నాకు తల్లీ, తండ్రీ, స్నేహితుడూ, భర్తా తనలోనే లభించాడు. నేనిప్పటికీ తనని మర్చిపోలేక పోతున్నానంటే ... 'అమె గొంతు వణికింది.

అర్థం చేసుకున్నట్టుగా ఆమె చేతి మీదుగా చేయి వేసాడు అరవింద్.

'అతన్ని మర్చిపొమ్మని నేను చెప్పట్లేదు. కానీ, ముప్పై అయిదేళ్ళ మీ జీవితంలో జరిగిన విషాదాన్ని బ్రతుకంతా కొనసాగిస్తారా? అందరిలాగే ఆనందంగా జీవించడానికి మీకు అన్ని విధాలా అర్హతవుంది, హక్కు వుంది. మనిద్దరం కలిసి మీ బాబుని, నా పాపని చక్కగా పెంచుదాం. మీతో కొత్త జీవితం ప్రారంభించాలని నేను తహతహలాడుతున్నాను. 'ఒక్క

క్షణం ఆగి ' నా మనసెందుకో గట్టిగా చెబుతోంది మీరు కూడా నన్నిష్టపడుతున్నారని , దేనికైనా, ఎవరికైనా భయపడి మీరెక్కడ కాదంటారోనన్న ఊహ ఎప్పుడైనా వస్తేనే విలవిల్లాడుతోంది నా హృదయం. అసలు రాత్రిళ్ళు నిద్ర కూడా సరిగా పట్టడం లేదంటే నమ్మండి' ఒక్కక్షణం ఆగి 'ఇక మీరు చెప్పండి' అన్నాడు.

అప్పటిదాకా వింటున్న నీలిమ తప్పనిసరిగా తలెత్తిందే కానీ, అరవింద్ ని సూటిగా చూడలేకపోయింది.

ఏమైంది ఈ మనస్సుకి? తన కళ్ళు అతన్ని చూడలేకపోతున్నాయెందుకు? ఇదంతా ప్రేమేనా? ఇంతటి

సహృదయుడు, స్నేహితుడు, హృదయానికి దగ్గరగా వస్తే కాదనగలదా తను? ఇది విశ్వాస్ పట్ల ద్రోహమా? అతను కనుమరుగవగానే అతని పట్ల ప్రేమ పోయినట్లేనా ?

'మీలో చెలరేగే అలజడిని నేనూహించగలను నీలిమా! మీరు ఆలోచించాకే నాకు బదులివ్వండి. వెంటనే ఎస్ అనాలని కాదు. కానీ స్థిమితంగా ఆలోచించండి. సంఘం కోసమో, బంధువుల కోసమో కాకుండా మీ కోసం, మీ జీవితం కోసం మీరు ఆలోచించండి ప్లీజ్' ఎంతో ఉద్వేగంతో అన్నాడు అరవింద్.

దారిలో ఎవరూ మాట్లాడలేదు నీలిమ ఇంటి ముందు కారాపి డోర్ తీసే ముందు ఆమె చేతిని మెల్లిగా

తన చేతిలోకి తీసుకుని 'థాంక్స్. ఇవాళ నా హృదయం తేలిగ్గా వుంది. గుడ్ నైట్' అన్నాడు.

ఆమె ఇంట్లోకి వెళ్ళి డోర్ వేసుకునేదాకా చూసి వెళ్ళిపోయాడు.

మొబైల్ ఆగకుండా మోగుతూంటే కిచెన్లోంచి వచ్చి ఎత్తింది నీలిమ. ఊహించినట్లే అవతల అరవింద్.

' గుడ్ మార్నింగ్! ఎలా వున్నారు? నిన్న మధ్యాహ్నం నుంచీ మీరెలా వున్నారో , ఎంత డిస్టర్బ్ అయ్యారోనని

చాలా వర్రీ అవుతున్నాను.'

' ఫర్వాలేదు. కానీ, చాలా వేదనగా వుంది. అసలు ఈ పిల్లలు ఎటు పోతున్నారో అర్థం కావడం లేదు. తోటి మనిషిని ... అందునా ... ప్రీ ప్లాన్డ్ గా అంత బ్రూటల్లో చంపడం .... రాత్రంతా నిద్రపట్టలేదు' బదులిచ్చింది నీలిమ.

'నిన్ననే వద్దామంటే అమ్మకీ నాన్నకీ జ్వరాలు-చాలా వీక్ అయ్యారు. ఇటు క్లినిక్ లో కూడా చాలా రష్ వుంది. రాత్రి చాలా లేట్ అయ్యింది. ఇక ఆ వేళప్పుడు ఫోన్ చేయలేక పోయాను. ఇవాళ ఎంత లేట్ అయినా వస్తాను. మీతో మాట్లాడాలి 'అన్నాడు.

నీలిమ తత్తరపడింది. ఫర్లేదు మీరు ఇంట్లో పెద్ద వాళ్ళను చూసుకోండి. నాకేం ఇబ్బంది లేదు. కొంచెం వర్రీ అయ్యానంతే. మీరు టెన్షన్ పడకండి' గబగబా అంది.

నీలిమ ఇంగ్లీష్ లెక్చరర్ గా పనిచేస్తున్న ఇంజనీరింగ్ కాలేజీ స్టూడెంట్ తన క్లాస్మేట్ ఒకమ్మాయిని ప్రేమించానని వెంటబడి ఇటీవలే ఆమె పెళ్ళి కుదిరిందని తెలిసి ఆమె కాలేజీకి వస్తుంటే వేటకత్తితో నరికి చంపాడు. ఈ వార్త పట్టణంలోని వారందరినీ భయభ్రాంతుల్ని చేసింది. ముఖ్యంగా తల్లిదండ్రులు వణికిపోతున్నారు. నిన్నటి నుంచీ నీలిమ చాలా డిస్టర్బ్ అయింది. పదే పదే ఆ విషయమే ఆమె మనస్సును తొలిచివేస్తోంది. పోలీసుల రాకపోకలు, ఎంక్వైరీలు, ఎవరికి తోచిన అభిప్రాయాలు వాళ్ళు చెప్పుకోవడం కాలేజీ అంతా అట్టుడికినట్టు ఉడికిపోతోంది. వారం రోజులు కాలేజీకి సెలవులిచ్చారు.

❦❦❦

వాళ్ళిద్దరూ చాలా సేపట్నుంచి మాట్లాడుకుంటున్నట్టుగా టీపాయ్ మీదున్న తడారిన కాఫీకప్పులు చెబుతున్నాయి.

నీలిమ సోఫాలో కూర్చుని వుంది. రెండు మోచేతులూ కాళ్ళపైన వుంచి పెనవేసుకున్న రెండు చేతులు వేళ్ళూ నుదుటికి ఆనించుకుని వుంది. ఎంతో బాధను అణచుకుంటున్నట్టుగా తలను అశాంతిగా అటూ ఇటూ తిప్పుతోంది.

' అయితే ... ఏది మంచో, ఏది చెడో తెలియని ఆ పసివాడి కోసం మీరు మీ నిండు జీవితాన్ని పాడుచేసుకుంటారా నీలిమా? అసలు ఏం మాట్లాడుతున్నారో తెలుస్తుందా'ఆవేశంగా అన్నాడు అరవింద్.

అంతక్రితం నీలిమ చెప్పిన విషయాలు విని అతడు నిర్విణుడయ్యాడు. ఆమె చెప్పిన ప్రకారం ప్రతీక్ ధోరణి బాగా మారింది. తల్లిపట్ల వివరీతమైన పొసెసివ్ గా వుంటున్నాడు' అమ్మా! నన్ను వదిలిపెట్టి వెళ్ళకు ప్లీజ్' అంటూ నిద్రలో కూడా కలవరిస్తున్నాడట. ఈ మధ్యే క్రికెట్ టోర్నమెంట్ కి వేరే ఊరు వెళ్ళాల్సి వస్తుందని కాలినొప్పి వంకతో మానేశాడట. ఇంట్లో వున్నంతసేపూ అనుక్షణం నీలిమ కొంగు పట్టుకుని వెనకాలే తిరుగుతున్నాడట.

ఇంకో విషయం ఏమిటంటే అరవింద్ గిఫ్ట్ గా ఇచ్చిన వాటర్ కలర్స్ పెయింట్ బాక్స్ డస్ట్ బిన్ లో ఉంది. కలర్స్ ఎండిపోయాయని సమాధానం చెప్పాట్ట. ఎందుకో అరవింద్ రాకపోకలను గానీ, చనువునుగానీ ప్రతీక్ ఆమోదించలేకపోతున్నాడు.

' మైగాడ్! టిపికల్ చైల్డ్ సైకాలజీ'అన్నాడు అరవింద్.

'ఈ పెళ్ళి చేసుకుని నేను సుఖపడలేననిపిస్తుంది అరవింద్ గారూ. వాడి లేతమనసు గాయపడితే అది దేనికి దారితీస్తుందోనని భయమేస్తోంది. నా ఆనందం కోసం వాడి భవిష్యత్తును పణంగా పెట్టలేను.'

' ప్రతీక్ ని కూర్చోబెట్టి కన్విన్స్ చేద్దాం నీలిమా. ఇదేదో టెంపరరీ ప్రాబ్లెం. మెల్లిగా సర్దుకుంటుంది.'

'లేదండీ! ఒక లెక్చరర్ గా, అంతకంటే ఒక తల్లిగా చెబుతున్నా. చిన్న పిల్లల మనస్సులో ఒక ముద్ర పడితే అది తొందరగా పోదు. వాడిలో ఒక అభద్రతా భావం మొలకెత్తింది. దాన్ని ప్రేమగా, వాత్సల్యంతో పోగొట్టాల్సిన బాధ్యత నాపై వుంది. లేకపోతే.. ఒక్కక్షణం ఆమె ఒళ్ళు గగుర్పొడిచింది. మళ్ళీ కొనసాగించింది.

‘ అమ్మ తనకు దూరమైందనో, తన గురించి పట్టించుకోలేదనో ఊహ వాడిలో వస్తే చాలా కష్టం. పిల్లల మనస్సులో చిన్నప్పుడు కమ్ముకున్న నీలినీడలు జీవితాంతం వాళ్ళను వెంటాడుతాయి. వాడు నామీదో, నన్ను తన నుంచి మీ వైపుకు లాక్కున్నారని మీ మీదో ద్వేషం పెంచుకుంటే  అది నేను భరించలేను. అది పెరిగి పెరిగి సమాజంపైన కసిగా మారితే కూడా' దుఃఖంతో ఆమె గొంతు పూడుకుపోయింది.

‘అంత విపరీతంగా ఎందుకు ఆలోచిస్తున్నారు నీలిమా? లోకంలో ఎంత మంది భార్యలు, భర్తలు  తమ వాళ్ళు పోతే మళ్ళీ పెళ్ళి చేసుకోవడం లేదు? వాళ్ళల్లో చాలా మంది హాయిగా కొత్త జీవితం గడుపుతున్నారు. అంతెందుకు? నచ్చని వ్యక్తితో వైవాహిక జీవితం కొనసాగించలేని వాళ్ళు కూడా విడిపోయి వేరే వారిని జీవిత భాగస్వామిగా ఎంచుకుంటున్నారు. వాళ్ళకు ఇలాంటి ఆలోచనలు వచ్చి వుండవా? అసలు పెళ్ళనే మాటెత్తకుండా సహజీవనం చేస్తున్న వాళ్ళు వున్నారు. సమాజం ఇలాంటి వాళ్ళను పట్టించుకోవడం మానేసి చాలా రోజులయింది' ఒకింత ఆవేశంగా అన్నాడు అరవింద్.

‘కానీ, వాళ్ళల్లో అందరూ సుఖంగా ఏం లేదు. పిల్లలు మరీ ఊహ తెలియని చిన్నవాళ్ళయితేనో, అర్థం చేసుకోగలంత పెద్ద వాళ్ళయితేనో ఫర్వాలేదు. నాకు తెలిసి ఒకమ్మాయి అలా వెళ్ళిపోయిన తల్లిని జీవితాంతం క్షమించలేదు–ముఖం కూడా చూడలేదు–పెద్ద పెసిమిస్ట్ గా తయారై ఇంట్లో వాళ్ళందరికీ నరకం చూపించింది. మొన్నటి నిర్భయ, నిన్నటి దిశ, ఇవాల్టి మా కాలేజీ స్టూడెంట్ల విషయాలే చూస్తే, ఆ హంతకుల కుటుంబ వాతావరణం ఏమాత్రం సంస్కారవంతంగా లేదు. స్త్రీల పట్ల గౌరవం, మర్యాద అటుంచి కనీసం సాటి మనిషి అన్న గుర్తింపే లేదు. ఏదో కసి, ఉద్రేకం తప్ప కొంచెమయినా బాధ్యత ఏముంది? సామాజిక విశ్లేషకులు ఎన్నో మాటలు చెప్పచ్చు కాక! ఆ మగపిల్లల జీవితాల్లో ఏవో చేదు జ్ఞాపకాలు, అనుభవాలు ఉండొచ్చుగాక! కానీ, సమాజమంతా వాళ్ళనీ, వాళ్ళ తల్లిదండ్రుల్నీ నిందించిందిగా! సామాజిక బాధ్యత అంటే తెలియని వాళ్ళు పిల్లల్ని ఏదో గాలికి పెంచవచ్చుగానీ, మనలాంటి వాళ్ళు ఆ పని చేయకూడదు.

అరవింద్ గారూప్రేమ, సహజీవనం, పెళ్ళి ఇలాంటి విషయాల్లో ఎవరిష్టం వారిదే. ఎవరి సుఖం వారిదే. కానీ, వాళ్ళు తమ చుట్టూ అల్లుకున్న వ్యక్తులకు తీవ్ర నష్టం కలిగించే పని చేయకూడదు. ముఖ్యంగా పిల్లలకు రేపటి సమాజానికి చీడపురుగులను అందించే హక్కు మనకు లేదు. పిల్లలంటే ఒక బాధ్యత. దాన్ని గాలికొదిలేసి, మన సుఖం మనం చూసుకోవడం నేరం కూడా'

‘ ప్లీజ్ నీలిమా అలాంటి నిర్ణయానికి రాకండి. నేను మిమ్మల్ని ఎంతగా కోరుకున్నానో మీకు తెలియదు. నా కూతుర్నీ, ప్రతీక్ ని కూడా కూచోబెట్టి మాట్లాడుదాం. మా అమ్మా, నాన్నల్ని తీసుకొచ్చి మాట్లాడిస్తాను. బాబుని కన్విన్స్ చేయగలనన్న నమ్మకం నాకుంది!' ఆవేదనగా అన్నాడు అరవింద్ ఆమె ఎదురుగా మోకాళ్ళ మీద కూర్చుని.

"నేను వాడి తల్లిని అరవింద్! వాడిప్పుడు వినే స్థితిలో లేడు! "

'ఫర్వాలేదు–టైం తీసుకుందాం–కొన్నాళ్ళగుదాం–నో అని మాత్రం అనకండి. నాకు నమ్మకం వుంది. పోనీ ఇది చెప్పండి నేనంటే మీకు ఇష్టం లేదా?' ప్రశ్నించాడు.

ఏం చెబుతుంది తను? అతని లాలనలో హృదయం సేదతీరిందనీ, అతనిచ్చిన భరోసాతో జీవితానికి ఓ నిశ్చింత ఏర్పడిందనీ, అతని ప్రేమతో బలవంతంగా అణిచిపెట్టిన కోర్కెలు పురులు విప్పుకున్నాయనీ, ఇప్పుడు అతను దూరమయితే గుండెను కోసుకెళ్ళాక, ఉత్తి శరీరంతో జీవించినట్టేననీ. అరవింద్ అసలు పరిచయమెందుకయ్యాడు?

'చెప్పండి నీలిమా! మీరిప్పుడే డిసైడ్ చేయాలని లేదు నేను ఎదురు చూస్తాను. కానీ, ఎప్పుడో మీవాడు పెద్దయ్యాక, వయసొచ్చాక, ఇంకొకరి చిటికెన వేలు పట్టుకుని ఆమే సర్వస్వం అనుకొని–అప్పుడు అమ్మ అవసరం లేని వస్తువయ్యాక మాత్రం కాదు. నాక్కొంచెం స్వార్థం వుంది. మీకు మంచి జీవితం ఇవ్వడానికి మీరు నాకు అవకాశం ఇవ్వాలి. మీరు మెల్లమెల్లగా ప్రతీక్ కు నచ్చజెపుతానని నాకు మాటిస్తారా?' చేయి చాచాడు.

నీలిమ అసంకల్పితంగా చేతిలో చేయి వేసింది.

'మీరూ నాకు మాటివ్వాలి. నేను ఫెయిలయితే ఇక మా ఇంటికి రాకపోకలు మానెయ్యాలి. '

అతడు షాక్ తిన్నట్టు చెయ్యి వెనక్కు లాగేసుకున్నాడు.

'వస్తాను నీలిమా'అంటూ చకచకా నడిచి గేట్ వరకు వెళ్ళాడు.

అతడు అలవాటు ప్రకారం చేయి వూపాడు. ఆ వీడ్కోలులో ఒక ఆశ వుంది.

ఆమె కన్నీళ్ళతో నవ్వింది. ఆ నవ్వులో ఒక వాగ్దానం వుంది.

అతడు వెళ్ళిపోతూ అనుకున్నాడు' ప్రేమలో ఇంత విషాదం వుందా ? 'అని.

# శౌచం

## వడలి రాధాకృష్ణ

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం

కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో బహుమతి పొందిన కథ

**ఇంతలోనే** ఇలాగ అవుతుందనుకోలేదు. . ఆమాట విన్నప్పటినుండి చిలకయ్య తిట్టుకోలేకుండా ఉన్నాడు.

దుఃఖం ఆగడంలేదు. అదేపనిగా తన్నుకొచ్చేస్తూ ఉంది.

‘ అసలు పెద్దయ్య గుండె ఆగిపోవడమేమిటి! ఆయనకు మరణం ఏమిటి ?’ తల్చుకొని తల్లడిల్లిపోతూ ఉన్నాడు.

చిన్నారి మొగుణ్ణి దగ్గరకు తీసుకొంది. సముదాయించడానికి ప్రయత్నిస్తూనే ఉంది.

'ఊరుకో అయ్యా! పెద్దాయనికి భూమిమీద నూకలు చెల్లిపోయినాయి’ ఆమె నోటిమాట బరువుగా ఉంది. కొంత వ్యంగ్యత నిండుకొని ఉంది. ఆ వ్యంగ్యం లోనే గొంతు తడబడుతోంది.

' అయ్యా .... పెద్దయ్య..' విషయం తెలిసిన పదేళ్ళ కొడుకు గోవర్ధనం కూడ తండ్రిని పట్టుకు వదలడం లేదు.

'రామినీడు సారు వెళ్ళిపోయినాడు. ఇక మనకు దిక్కెవరంట!’ అతని వ్యధ అరణ్య రోదనగా ఉంది. ఒక వ్యధాభరిత వాస్తవం చిలకయ్యను చుట్టు ముట్టేసి అతలాకుతలం చేస్తూనే ఉంది. అవును ఈ మధ్యన రామినీడయ్యకు సుస్తీ చేసిందట.

చిన్నారి మాట్లాడటం లేదు. మౌనమే సమాధానంగా నిలుస్తూ ఉంది. ‘అసలు ఆ గొప్ప మనిషికి చావేమిటంట' మర్మం తెలియని చిలకయ్యలోని ఆవేదన ఆకాశపు హద్దుల్ని దాటిపోతోంది.

'ఊరుకో అయ్యా! ప్రాణం పోయింది. మనిషి ఎగిరిపోయినాడు’ చిన్నారి ఓదారుస్తూ ఉంది. ఆమాట కొంత వ్యంగ్యంగా అన్పిస్తూ ఉంది. వాస్తవాల్ని ప్రశ్నిస్తున్నట్లుగాను ఉంది.

‘నేను వెళుతున్నాను. నువ్వు వస్తావా?’

‘శవం ఎక్కడో హైదరాబాద్ నుండి రావాలంట! నేను రాను. నువ్వు పోయిరా’ నిర్లప్తత నిండిన ఆమె మాటలు మామూలుగానే ఉన్నాయి. విషయం ఊరంతా పాకేసింది.

‘పాపం రామినీడు దొర ఇంకా కనీసం ఇరవై ఏళ్ళు బ్రతకాల్సినోడు. అప్పుడే ఇలాగ?’

' ఏమో లేరా! ఆరికి టైమ్ అయిపోయింది. దిక్కుమాలిన కాలం వచ్చి అమాంతం ఎత్తుకుపోయింది.’ టైలర్ సాంబయ్య అదేపనిగా నొచ్చుకుంటున్నాడు. మొదటి నుండి ఊరికి పెద్ద దిక్కు రామినీడయ్యకు చొక్కా అయినా, లాల్చీ పైజమా అయినా అన్నీ టైలర్ సాంబయ్య మిషని మీదే తయారవుతాయి. రామినీడు ఒంటి కొలతలు తెలిసినట్లే ఆయన గురించి అన్నీ సాంబయ్యకు తెలుసును. రామనీడు పరోపకారి మాత్రమే కాదు. ఊరికి పనికొచ్చే మనిషి.

‘పెద్దయ్య శవం హైదరాబాద్ లో బయలుదేరి రెండు గంటలు అయిపోయింది. ఇక్కడ మరీసుపల్లికి రావడానికి మరో ఐదు గంటలు పట్టొచ్చును.’

విషయం తెలిసిన ఊరు ఊరంతా హడవిడిగా మారిపోయింది. ఆయనగారి ఎత్తు అరుగుల మిద్దె కొంప దగ్గర జనం పోగయిపోయారు.

ముందువైపు మూడు పెద్దపెద్ద శామియానాలు వెలిసి పోయినాయి. ఊరిలోని సప్లై కంపెనీలలో ఉన్న కుర్చీలన్నీ అక్కడికి తరలింప బడుతున్నాయి. 'సావు కూడా పెళ్ళిలాంటిదే బెదరూ' మూలవీధి అచ్చయ్య తనకు నచ్చిన పాత సినిమా పాటను అందుకుంటున్నాడు.

'అయ్యకు సావేమిటిరా సన్నాసి!' నూకాలు అదేపనిగా నేలమీద పొర్లిపోయి ఏడుస్తున్నాడు. ఊరిజనాలకు రామినీడు అంటే దేవుడు. తన పార్టీవాళ్ళకి ఇష్టమైన దేవుడు. అటువైపు పార్టీల వాళ్ళకి కష్టమైన దేముడు. ఈ విషయాల్ని అటుఇటుగా అక్కడ అందరూ తమదైన ధోరణిలో ప్రస్తావిస్తున్నారు. మూడు కార్లు, వెనుక ఐదు కార్లు మధ్యలో రామినీడు అయ్య.. మారీసుపల్లి చేరిపోయినాడు. ముందు శవపేటికలో శాశ్వతంగా నిద్రపోతూన్న రామినీడు వాహనం. అవును ఈ ప్రపంచంలో కొందరి మరణ సందర్భం కూడ పెళ్ళిలాగానే ఉంటుంది.

చిలకయ్యకు అవేమి తెలియవు. ఒంట పట్టవు కూడాను ఏడ్చి ఏడ్చి అతడి బుర్రపిడస కట్టుకుపోతూ ఉంది. పెద్దయ్య చావును జీర్ణించుకోలేకుండా ఉన్నాడు.

రామినీడుది పెద్ద కుటుంబం. ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు, పెద్ద బంధుగణం. అందరూ దుఃఖసముద్రాన మునిగిపోయి ఉన్నారు ఒక విషాద సందర్భం అక్కడ ఆవిష్కృతమయిపోయి శోక సంద్రమై ప్రవహిస్తూ ఉంది.

చిలకయ్యకు ఏమి అర్థం కాకుండా ఉంది. ఊరిలో ఏ తగవు లొచ్చినా తీర్చిదిద్దేవాడు. కొట్లాటలొచ్చినా నిలిచేవాడు. ఎవరినీ లెక్క చేసేవాడు కాదు. ఎదుటివాడు ఎంతటివాడయినా ఎదురునిల్చి మాట్లాడేవాడు. మాటకు మాట చెప్పేవాడు. చేతకు చేత తానయ్యేవాడు.

చాలామందికి రామినీడంటే హడల్. కానీ చిలకయ్యకు రామనీడంటే దేముడు. తనకు తన కుటుంబాన్ని నిలబెడుతూన్న మహామనిషి. ఎంతమందికి ఎదురొడ్డి నిలిచినా తనను ఒక్కమాట అనేవాడు కాదు. ఎవరైనా తనను మాట తూలితే ఒప్పుకొనేవాడు కాదు. అదే విషయాన్ని ఇంటిదగ్గర చిన్నారితో గొప్పగా చెబుతూ ఉండేవాడు.

చిన్నారి మాట్లాడేదికాదు. వ్యంగ్యంగా ఓ విసురు నవ్వునవ్వేది. ' కాదన్న దెవడు!' మరల చిన్నారిలో అదే నిర్దిష్టత, నిఖార్సుతనం. ఎందుకో తెలియదు కానీ అప్పుడప్పుడు ఆమె మూతి పళ్ళు బిగుసుకుపోయేవి. 'నేను పోతే నీ మెడలో తాళిబొట్టు ఉండేది కాదు. మొహాన బొట్టు ఉండేదికాదు. అంతా అయ్య దయ. మనం చేసుకున్న పుణ్యమూను' చిలకయ్య మాటలు చిన్నారికి ఒంటబడుతూనే ఉండేవి. ఇంట్లో ఏవిషయం చెప్పినా చక్కగా మాట్లాడే చిన్నారి ఎందుకో రామినీడు అంటేనే మిన్నకుండి పోతాది, మొహం అదోలా పెడతాది.

' అయ్య సాయం చెయ్యకపోతే గోవర్ధనం గాడిని స్కూలులో జాయిన్ చేసేవాళ్ళమా? ఆడు ఆరుక్లాసు చదువుకు వచ్చేవాడా? మొన్న ఆ మధ్యన రచ్చబండ దగ్గర తగిలినప్పుడు ఒరే చిలకా గోవర్ధనం గాడిని బాగా చదివించరా. ఆడు పెద్ద డాక్టరో, ఇంజనీరో అయి తీరాల! అన్నాడు. ఆరిది వెన్నలాంటి మనసు.'

చిన్నారిలో మరల మౌనం ఆ వెనక వ్యంగ్యమూను.

' గోవర్ధనంగాడు చదువుకుంటున్నాడు. ఇంకా గొప్పగా చదువుకోవాల అదే మనకు కావాల్సింది' అని మాత్రం అనగల్గింది.

రామినీడు పార్ధివ శరీరం పూలదండలతో మునిగిపోయి ఉంది. స్థానిక శాసన సభ్యులతో సహా ఎందరెందో వచ్చి శ్రద్ధాంజలి ఘటించి పోతున్నారు. తన చేత లబ్ధిని పొందినవారు, లబ్ధిపొందక అవమానం పొందినవారు, అవహేళన చేయబడినవారు దండలతో వచ్చి క్యూ కట్టి మౌనం పాటిస్తూనే ఉన్నారు. ఉండుండి చిలకయ్య మొద్దుబారిపోతున్నాడు. ఎప్పుడు తాను ఎదురు నిలబడినా ఊరుకునేవాడు కాదు. కుర్చోమనేవాడు, మెత్తగా సముదాయించేవాడు. ఏమి కావాలి అని అడిగేవాడు. అడగడం తడవు డబ్బు అయినా సరే, మరే ఇతర వస్తువయినా కాదనకుండా ఇచ్చి పంపేవాడు. ఒకవేళ అప్పుడు వీలు కాకపోతే తర్వాత అనేవాడు. ఆ తర్వాత గుర్తుపెట్టుకొని మరీ పంపిస్తూ ఉండేవాడు. చేరిందా లేదా అని ఆరాతీస్తూ ఉండేవాడు. మధ్యలో గోవర్ధనం గాడి ఆలనాపాలనా అడిగి తెలుసుకొనేవాడు. అటువంటి రామినీడు లేకపోవడాన్ని చిలకయ్య జీర్ణించు కోలేకుండా ఉన్నాడు.

అంతిమయాత్ర ఘడియలు సమీపించేశాయి. పంతులుగారు వచ్చి కార్యక్రమాన్ని గొప్పగా నిర్వహిస్తూ ఉన్నారు. భార్యపిల్లలు బంధువులు అందరూ చివరగా ఆయనకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నారు. పూలరధంలాగ తయారు చేసిన వ్యాన్ మీద శాశ్వత నిద్రలో ఒదిగిపోయిన అయ్యగారి ఊరేగింపు ప్రారంభమయిపోయింది.

దారి పొడవునా పూలు వర్షమై కురుస్తూ ఉన్నాయి. మారీసుపల్లి మాత్రమే కాదు కొమ్రాజు గుంట, దొమ్మూరు గడప ప్రాంతాలలోని ప్రజానీకం, అభిమానులు అంతా తరలి వచ్చేశారు. యాత్ర యాత్రలాగా సాగిపోతూ ఉంది. అన్ని వందల మందిమౌనంగా ముందుకు అడుగులు వేస్తున్నారు. దుఃఖాన్ని ఆపుకోలేక ఉడుక్కుంటూ వేస్తూన్న చిలకయ్య అడుగులు వెనకబడి పోతున్నాయి. భారంగా ముందుకు కదులుతూ ఉన్నాడు. దేముడు తనకోసమే ప్రత్యేక దూతగా రామినీడును ఈ భూమి మీదకు పంపించినాడేమో. చిలకయ్యకు తెలవడంలేదు.

'చూడండమ్మా! రామినీడు గారు ఎంతో అదృష్టవంతుడు. మీ అందరి చేతుల్లో చాలా గొప్పగా వెళ్ళిపోతున్నారు. చెప్పాలంటే మీపిల్లలు కడిగిన ముత్యాల వంటివారు. తండ్రి దహన సంస్కారాలు ఎంతో ఉన్నతంగా శ్రద్ధతో నిర్వహించారు. ఇప్పుడు ఇంటి దగ్గర భార్యపిల్లలు అందరూ శౌచ స్నానం చేసి దీపదర్శనం చేసుకు తీరాలని శాస్త్రం

చెబుతూ ఉంది' పురోహితులు సెలవిస్తున్నారు. అందరూ ఆయన చెప్పినట్లుగానే శౌచస్నానాలాచరించి దివ్య దీప దర్శనాన్ని చేసుకుంటున్నారు.

ఆ దృశ్యం చిలకయ్య మనసుకు హత్తుకునేలా ఉంది. ఎంతో ప్రభావితమవుతున్నాడు. చిలకయ్య ఇంటికి నడిచాడు భారంగా.

' రామినీడు అయ్యా వెళ్ళిపోయినాడు!' గద్గద స్వరంతో కంట కన్నీరు పెడుతూన్న వెర్రి భర్త ధోరణి చిన్నారిని పెద్దగా ప్రభావితం చేయడంలేదు. పైగా కొండంత వ్యంగ్యంగా అన్పిస్తూ ఉంది.

'అవును వెళ్ళిపోయినాడు ' తనలోతాను అనుకోవడమే తప్ప పెద్దగా సానుభూతి ఏమీ లేదు చిన్నారిలో.

' శవానికి అంత్యక్రియలు జరిగినాక భార్యాపిల్లలు మైలస్నానం చేసి ఆ తడిబట్టలతో దీపాన్ని దర్శించుకోవాలంటి పంతులుగాను చెప్పినారు. ఆరు చేసినారు' ఇప్పుడు మొగుడి మాటలకు చిన్నారి తీవ్రంగా చలించి పోతూఉంది. ఒక ఉద్వేగం తాలూకు అంతరంగ సంఘర్షణ ఆమెను ఉన్నట్టుండి అతలాకుతలం చేస్తూ ఉంది. తన ధోరణి తనకు వ్యంగ్యంగా ఉంది.

ఉదయం నుండి తానేమి తిన్నదిలేదు. సాయంత్రం వరకు బయటవరండాలో కొడుకును వేసుకొని కూర్చున్నదంతే!

ఇప్పుడు చిన్నారి కొడుకు గోవర్ధనం చేయినందుకొని వడివడిగా పెరట్లోని బావి దగ్గరకు నడిచింది. తాను తలారా స్నానంచేస్తూ ఉంది. బావి నీటితో పదేపదే స్నానమాచరిస్తూ ఉంది. రామినీడును తల్చుకుంటూ మరలా మరలా నీటిలో తడుస్తూ ఉంది.

అంతేనా గోవర్ధనం చేత తలారా మైల స్నానం చేయిస్తూ ఉంది. ఇద్దరు ఆ తడిబట్టలతోనే లోపల దేముడి గడపదగ్గర వెలుగుతూన్న దీపాన్ని కనులారా వీక్షించుకుంటున్నారు. అప్పుడుగాని ఆమె మనసు కుదుటపడినట్లు లేదు.

క్రమంగా ఆ ఉద్విగ్నక్షణాల నుండి చిన్నారి బయటకు వస్తూ ఉంది. మామూలు మనిషి తానవుతూ ఉంది.

విషయాన్ని చిలకయ్యలీలగా గ్రహిస్తూనే ఉన్నాడు. ఇప్పుడు అతగాడకి లోకం అర్థమవుతూ ఉంది. లోకంలోని రామినీడు అవగతమవుతూ ఉన్నాడు.

ఇంతవరకు పెద్దయ్య మరణం తనకు వ్యంగ్యంగా అన్పించలేదు. అందుకే ఆ దుర్వార్తను విని తట్టులేకపోయాడు. కానీ ఇప్పుడు ఈ లోకమే వ్యంగ్యంగా కన్పిస్తూ ఉంది. ఒక విధ్వంసకరమైన వాస్తవం తేటతెల్లమై ఇప్పుడు తనను పట్టుకొని కుదిపేస్తూ ఉంది. అందుకే తట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. తట్టుకోగల్గుతాడు కూడాను నిరంతరంగా. అర్థంకాని నిర్వికారమైన నవ్వు ఒకటి చిలకయ్య మనోఫలకం మీద మెరుపులా మెరిసి 'శౌచం తాలూకు' లోగుట్టును తేటతెల్లం జేస్తూనే ఉంది.

## శ్రేయోభిలాషి

శెట్టిపల్లి అరుణా ప్రభాకర్

అరేయ్ మై డియర్ ఫ్రెండూ,

నీకిలా ఉత్తరం రాయగలుగుతానని కలలో కూడా అనుకోలేదురా. నాకసలు లోకజ్ఞానం ఏమీ లేదా, నువ్వు ఆప్త మిత్రుడివి కాబట్టి దగ్గరుండి అన్నీ నేర్పించావా, పేకముక్క మొహం చూడని నాతో పేకమేడలు కట్టించావా, కూల్డ్రింక్ ఎరుగని నన్ను విస్కీలో ముంచావా – ఇవన్నీ అయ్యాక, ఇదిగో ఇలా ఆరోగ్యం చెడి హరీమని ఇక్కడ నరకానికి వచ్చి పడ్డా!! నా ప్రాణాలు పైకి పోతుంటే 'నేర్పించినోడు బాగానే ఉన్నాడు, మా ఆయనకే వచ్చింది రోగం' అని మా ఆవిడ ఏడుపు వినబడుతూనే ఉంది.

నరకం నుంచి ఉత్తరం ఎలా రాస్తున్నాను అనేది తరువాత చెప్తాను.

అంతకన్నాముందు ముఖ్యమైన విషయం, ఆప్త మిత్రుడివి కాబట్టి చెబుతున్నా. ఈ స్వర్గం, నరకం అన్నీ ఉత్త ట్రాష్, అవెక్కడేడ్చాయి అనుకునే వాళ్ళం కదా! అలా కాదురా. స్వర్గం ఉంది, నరకం ఉంది, వైతరణీ ఉంది. ఇక్కడ వీళ్లు పెట్టే బాధలు భరించలేక పోతున్నారా. కుంభీపాకమూ, క్రిమి భోజనమూ, రౌరవమూ ఇంకా నానా పేర్లు గల నరకాలు, శిక్షలూ అన్నీ ఉన్నాయిరా బాబూ. చిత్రమేమిటంటే చచ్చాక ఆత్మకు నొప్పేమిటి అనుకున్నాం గానీ అన్నీ ఉన్నాయి.

ఎటొచ్చీ వీళ్ళెన్ని చితహింసలు పెట్టినా ప్రాణం పోయి చావదు. ప్రాణస్నేహితుడివి కదా ముందు తెలుసుకుంటే నువ్వయినా జాగ్రత్త పడతావని ఈ ఉత్తరం రాస్తున్నా. ఇక ఈ ఉత్తరం రాసి నీకందజేసే అవకాశం ఎలా వచ్చిందో చెప్తా.

నేను పైకొచ్చిన కాస్సేపటికే పాపం మా ఆవిడా పైకొచ్చేసిందట. యమధర్మరాజు దగ్గర లైన్లో నా వెనకాల ఆమె కూడా ఉందట. అయితే ఈ విషయం మాకిద్దరికీ తెలియదు. నా వంతు వచ్చేసరికి యమధర్మరాజు నాకు నరకం అన్నాడు. మనం చేసిన పాపాలు తక్కువా మరి!. ఇక మా ఆవిడకేమో స్వర్గం దొరికింది. పుణ్యాత్మురాలుకదా పాపం. స్వర్గానికెళ్ళాక 'మా ఆయనేడీ?' అని అడిగిందట. మన ఆధార్ కార్డు లాంటి సిస్టమేదో వాళ్ళకీ ఉన్నట్టుంది. నా ఆచూకీ కనిపెట్టి 'అమ్మీ, మీ ఆయన నరకంలో ఉన్నాడు' అని చెప్పారట. అంతే! నానా గొడవా చేసిందట. 'నేనిక్కడుంటే మా ఆయన నరకంలో ఏమిటి, రప్పించండ'ని. పాపం, నేనంటే చాలా ఇష్టం రా. నేనే దాన్ని నిర్లక్ష్యం చేశాను. రూల్స్ ఒప్పుకోవని ఎంత చెప్పినా వినలేదట.

ఇక దాని గోల పడలేక ఒకసారి చూసి రమ్మని ఓ రథమూ, ఓ సారథినీ ఇచ్చి ఇక్కడికి పంపించారు. ఇక్కడ నన్నూ, నాకు వేస్తున్న శిక్షలనూ చూసి వలవలా ఏడ్చింది. 'మా ఆయన్ని పంపండి నా వెంట స్వర్గానికి తీస్కెళ్తా' అని యమధర్మరాజుతో పెద్ద పేచీ. ఆయనకు సావిత్రి దిగివచ్చినంత పనైంది.

ఈ ఆడవాళ్ళు అసాధ్యులురా బాబూ. చివరికి వాళ్లే ఏదో రూల్స్ అమెండ్మెంట్ లాంటిది చేసుకుని అదే రథంలో దాని వెంట నన్ను స్వర్గానికి పంపించే ఏర్పాటు చేశారు. అదిగో అప్పుడొచ్చింది నాకీ ఆలోచన. ఈ నరకమూ, శిక్షలూ వగైరాలు నిజంగా ఉన్నాయని నీకు తెలియజేస్తే జాగ్రత్తపడతావని. కానీ మార్గం లేదే. అదే విషయం మా ఆవిడతో చెప్తే 'చూద్దాం, దానికేం భాగ్యం' అని అక్కడే భూలోకానికి బయల్దేరుతున్న యమభటులు ఇద్దరు కనిపిస్తే పిలిచింది, 'అబ్బాయ్, ఓ ఉత్తరం ముక్క ఉంది. ఫలానా వారి కివ్వాలి' అని. ఈవిడ ప్రతాపం చూసి ఉన్నారు కాబట్టి వాళ్ళిద్దరూ మొహాలు చూసుకున్నారు. 'అదేందయ్యా, ఆమాత్రం చేయలేరా ఏంటి?' అన్నది మా ఆవిడ.

అప్పుడు చెప్పారు 'అమ్మా, ఉత్తరం ఇవ్వడానికి మాకేం అభ్యంతరం లేదు గానీ మేము ఎవరికైనా కనిపించామూ అంటే వారికి ఇంక నూకలు చెల్లినట్టే' అని. 'అంటే ఉత్తరం చదివే టైమ్ కూడా ఉండదా?' అన్నది మా ఆవిడ. 'దానికేం తల్లీ, ఉత్తరం చదవొచ్చు కానీ అకాల మరణం...' అన్నారు.

'అయితే ఆయనగారి అసలు చావెపుడో ఓ సారి మీ లిస్ట్ లో చూసి చెప్పు' అన్నది మా ఆవిడ వాళ్ళ చేతుల్లో ఉన్న చిట్టాలు గమనించి. వాళ్ళు ఆ చిట్టాలన్నీ వెదకి నీ పేరు పట్టుకున్నారు.

'తల్లీ, మేం గనక ఈ ఉత్తరం ఆయనకి అందిస్తే ఆయన అసలు టైమ్ కంటే పావుగంట ముందే పోతాడమ్మా' అని నసుగుతూ చెప్పారు.

'ఓస్ ఇంతేనా. వీళ్ళు పేకాటల్లో, మందు పార్టీల్లో రోజులు రోజులే తగలేశారు. ఓ పావుగంట తగ్గితే ఏం పోయింది' అన్నది మా ఆవిడ.

'అట్లా కాదు తల్లీ , మాలెక్కలో పావుగంట అది. మీ లెక్కలో పదిహేను సంవత్సరాలమ్మా' అన్నారు వాళ్ళు.

'మరేం పర్లేదు లెండి. మా ఆయన ఉత్తరం రాస్తారు. మీరు పట్టుకెళ్ళి ఆయనకి ఇచ్చెయ్యండి' అని మొత్తానికి యమభటులని ఒప్పించిందిరా మా ఆవిడ. గట్టి పిండం కదూ!. ఇదిగో ఇలా అవకాశం వచ్చిందని నీకీ ఉత్తరం పంపిస్తున్నా. జాగ్రత్త! మళ్ళీ మనం కలుస్తామో లేదో. ఇక ఉంటా." _ _ _ _ _ ఇట్లు నీ ప్రియ మిత్రుడు.

# స్వర్గం కన్నా మిన్న

డా.కనుపూరు శ్రీనివాసులు రెడ్డి

చంద్రయ్య తనకున్న రెండెకరాలు పూర్వీకులు ఇచ్చిన చేను . మరో రెండెకరాలు తన పొలంలో కలిసేది ఎట్లాగో ఒకలాగ కొన్నాడు. కానీ నీటి ఎద్దడి. నీటి కోసం బోర్లు వేసి చాలా ఖర్చు చేసాడు. వచ్చీ రానట్లుగా ఒక ఎకరానికి చాలీ చాలని తీర్థం జల్లింది. డబ్బు ఖర్చు అయ్యిందని, బాధపడలేదు.. రోజంతా పని చేసి, విశ్రాంతిగా గట్టు మీద కూర్చుని పరవశంతో వసంత వనంలా ఉన్న తోటను, ఆ ప్రక్కనే తన తల్లిదండ్రులు, తాతముత్తాతల సమాధుల వైపు దీక్షగా చూస్తూనే ఉంటాడు .అదొక జపం, తపం!!

ఎంత బడలిక అయినా మటుమాయం అయి పోతుంది. స్వర్గంకన్నా జన్మ నిచ్చిన తల్లి, ఆకలితీర్చే భూమాత, ప్రాణం అతనికి. భార్య, కూడు తెస్తే, తల్లి తండ్రి సమాధుల మధ్యలో పద్మాసనం వేసుకు కూర్చుని. ముందుగా పిత్రు దేవులకు ముద్ద పెట్టి, మరో ముద్ద దగ్గరకొచ్చే కాకులకు పెట్టి, భూ మాతను తలుచుకుని తినడం ప్రారంభిస్తాడు. భార్య వచ్చిన వెంటనే అత్తా మామల సమాధులకు మొక్కుకుని మొగుడికి కూడు పెడుతుంది. ఎన్నో ఊసులు, బాధలు, సమస్యలు నవ్వుతూ చతుర్లు ఆడుకుంటూ ఆ క్షణాలు గుండెల్లో దాచుకుంటారు.

బిడ్డలు ఇద్దరూ దగ్గరలో ఉన్న టౌనులో కొడుకు ఇంజినీరింగు ఆఖరు సవత్సరం. కూతురు పన్నెండో తరగతి చదువుతున్నారు. టౌను చాలా విస్తరించి పోయింది. ఎక్కడ చూసినా పెద్ద పెద్ద అంతస్తులు మేడలు. పొలాలన్నీ ఇండ్ల స్థలాలు అయిపోతున్నాయి. ఊరిదాకా వచ్చేసాయి. ఒకప్పుడు చెట్ల మధ్య టౌన్ కనిపించేది కాదు. వాళ్ళ జిమ్మడ ఈ రోడ్డు వెడల్పుకు ఏళ్ల తరబడి ఉన్న పెద్ద పెద్దమానులు చింత, మద్ది , మర్రి ,వేప, నేరేడు, అన్నీ తెగగొట్టి అమ్ముకున్నారు. ఒక చెట్టు అంత పెద్ద మాను ఆటుపోటు తట్టుకుని నీడ నివ్వాలంటే ఎన్నో సంవత్సరాలు పడుతుంది? కొంత కాలానికి కొత్త తరానికి ఆ చెట్లు పేర్లు గాని,రూపుగాని, ఉపయోగాలు గాని తెలియకుండా పోతాయి.బాధగా నిట్టూర్చాడు చంద్రయ్య.

చాలామంది ఉన్న పొలాలు అమ్ముకుని పెద్ద పెద్ద భవంతులు కట్టుకుని అంతస్తుకు మించి ప్రవర్తిస్తున్నారు . చాలా వరకు ఎక్కువగా ఇప్పటి కుర్రకారు కల్మషాలు, కపటాలు, అహంకారాలతో బలిసి, నలిగి నాశనం అయి తాటి కల్లు , బెల్ట్ షాపులు దగ్గర నాటు సారాయి మీటింగులు, కొట్టుకోవడం తన్నుకోవడం . కాడెద్దులు నాగలి రైతుల పలకరింపులు మాయమయిపోయాయి.కోడి కూత మరుగున పడిపోయింది.ఎక్కడికి పోతారో వేకువనే మోటారు బైకుల మోతలతో పల్లె ఉలిక్కిపడి నిదురలేస్తుంది.

ఏ నాడు చిన్న కష్టం కూడా కలిగించని ఎదురు చెప్పని, ఎచ్చులకు పోని , గౌరవాన్ని ప్రేమ ఆప్యాయతలను అందించే తమ బిడ్డలను తలుచుకుని, ఏ జన్మ పుణ్యమో అని భార్యా భర్తలు తృప్తితో మురిసిపోతూ, ఆ ఊళ్ళో పదిమందికి తలలో నాలుకగా ఉంటారు. ఇంతకంటే ఏం కావాలి. భూమాత కరుణిస్తే వాళ్ళిద్దరికీ పెండ్లిళ్ళు చేసి తీర్ధయాత్రలు చేసిరావాలని అంతిమ కోరిక వరమ్మకు చంద్రయ్యకు.

తల్లి సమాధి మీద పడుకుని ఆలోచిస్తున్న చంద్రయ్య కార్లు నిలిచినట్లు అనిపిస్తే లేచి చూసాడు. తన దగ్గరకు రాలేదు. నేరుగా పొలం చుట్టూ తిరిగి ఆ దిక్కూ ఈ దిక్కూ చూసుకుంటూ ,మాట్లాడుకుంటూ రోడ్డు మీదకు వచ్చారు. వాళ్ళతో తమ ఊరు తాగుబోతు తిరకాసుగాడు 'తిరిపాలు' ఉన్నాడు. అతనికి పనిపాట లేదు. ఉదయాన్నే టౌనుకు వెళ్ళడం బలాదూరుగా తిరగడం పొద్దుపోయి తాగొచ్చివొళ్ళు తెలియకుండా పడిపోవటం ఉదయం లేవగానే పెండ్లాంతో డబ్బుకోసం గొడవ పడటం. అప్పులు చెయ్యడం ఎగగొట్టటం, అడిగితే కొట్టబోవటం, లేదంటే కాళ్ళు పట్టుకోవడం.

తిరిపాలు వంగి వంగి దండాలు పెడుతూ, చేతులు ఊపుతూ పెద్ద పెద్దగా ఏదో మాట్లాడు తున్నాడు. చూసి పక్కకు తిరిగి పడుకున్నాడు చంద్రయ్య.

వాళ్ళిచ్చిన పదో పాతికో జేబులో వేసుకుని అలిసిపోయినట్లు ఊపిరి విడుస్తూ నవ్వుతూ చంద్రయ్య దగ్గరకు వచ్చి," మామా అదృష్టం అంటే నీది మావా!" అంటూ నలిగి పోయిన పొడుగు సిగరెట్టు సరి చేసుకుని ఎలిగించుకుని సమాధికి దూరంగా కూర్చున్నాడు.

అర్ధంగానట్టు చూసాడు చంద్రయ్య . " అదే మావా! ఏదో సారాయి కంపెనీ కడతారంట. నీ పొలం బలే నచ్చేసింది ." అంటూ భళ్ళున నవ్వాడు.

" సారాయా? ఇక్కడా? నచ్చితే?"

"అదే మావా! కొంటారంట. నీ సుడి తిరుగి పోయింది మావా! ఈ పాడు సేద్యం చేస్తే ఏమొస్తుంది. తెగుళ్ళు, వానలు అన్నీ ఎండబెడుతుండే !ఈ బురదలో పొల్లాడే దరిద్రం వదుల్తుంది మావా!"

కోపంగా చూసాడు తిరిపాలు వైపు చంద్రయ్య ." పిచ్చి చేష్టలు చెయ్యక. మళ్ళీ ఆ మాట ఎత్తావంటే మక్కెలిరగగొడతా! ఆ తల్లి దయ వలన కడుపులో చల్లకదలకుండా తృప్తిగా బ్రతుకుతున్నాము. ఆ ప్రకృతి తల్లి పసిడి దీవెనలు ఎన్ని కోట్లు పెట్టితే దొరుకుతుంది. కొనగలవా ? " అంటూ లేచాడు చంద్రయ్య.

"యాడికి పోతుండావు . కూర్చో! నా మాట యిను. అదృష్టం తలుపుతట్టుతుంటే కాలితో తంతా వేమి. కంపుకొట్టే మట్టిని పట్టుకుని, తల్లి, దేవత అంటావేంటి."

“నోరుమూసుకో! భూమాత, కన్న తల్లి. స్వర్గంకన్నా మిన్న !! పో... పో ! నీ ఏసాలు నా దగ్గరకాదు. అంతా అమ్మి తగలేసి, తాగేసి బిడ్డలను అడుక్కుతినేటట్లు చేస్తివే. ఇంకా బుద్ధిరాలేదా. మళ్ళీ నా దగ్గర ఆ మాట ఎత్తితే మాడుపగుల్తాది .” అంటూ ఊరి వైపు నడిచాడు.

తిరిపాలుకు కోపం వచ్చింది తనను ఎగతాళి చేసినందుకు,“ ఆ దరిద్రాన్ని నమ్ముకునే కొన్ని కోట్లమంది పుగుల మందు, దూలానికి తాళ్ళు ఏసుకుని పెండ్లాం పిల్లల్ని అడుక్కుతినమని నిలవన చచ్చారు. నీతో ఎందుకుకాని అత్తతో మాట్లాడుతా, అబ్బికి చెప్తా .ఇనుకుంటాడు.” అని వెనకనుంచి అంటున్న మాటలు వినిపించుకోలేదు చంద్రయ్య.

కాళ్ళూ చేతులు కడుక్కుని తుడుచుకుని కూర్చోగానే భార్య వరమ్మ మంచి నీళ్ళు తెచ్చి ఇచ్చింది. తాగి నడుం వాలుస్తూ,” అమ్మోల్లు ఇంకా రాలేదా?” అడిగాడు.

“ ఇంకా రాలేదయ్యా!” అంటుండగానే వచ్చారు.

“ ఏం అబ్బయ్యా ! పొద్దుపోయింది. మీకోసం చేప ఇగురు చేసుండా! తొరగా నీళ్ళు పోసుకు రండి. వడ్డిస్తా! ” అంటూ లోపలి వెళ్ళింది వరమ్మ.

కూతురు పుట్టమ్మ తండ్రికి దాక్ష పండ్లు తెచ్చి,” సైకిలు దారిలో చెడి పోయిందమ్మా!” అంటూ నోట్లో పెట్టి ముఖాన పట్టిన చెమటను తుండుతో తుడిచింది.

“ నా కెందుకమ్మా! ఇయన్నీ! ఎదగాల్సిన బిడ్డలు మీరు తినాలిగాని.” అన్నాడు చంద్రయ్య మురిసి పోతూ దగ్గరకు తీసుకున్నాడు.

“ఎదిగిన పిల్లలు దారిలో ఉండాలంటే మాకు నీడ,తోడు కావాలి నాయనా. మీరు బాగుంటేనే దారిలో ముళ్ళు మీరు తొక్కి, పూలు మాకు ఇస్తారుకదా !” అంది కూతురు.

“ఆమే, అబ్బ కూతురా ! లేచొచ్చి నీళ్ళు పోసుకో పొద్దు పోతాఉంది. లోకం తెలియదు అబ్బా కూతురుకి “ అని పిలిచింది వరమ్మ మురిపాన్ని ముడినిగట్టి, నిష్టూరపు మాత్సర్యాన్ని ప్రేమతో నింపి.

“ పోమ్మా! మళ్ళీ అరుస్తాది. పొద్దున్న ఎప్పుడు తిన్నావో. ముఖంచూడు ఎట్లా పీల్చుకు పోయిందో నా బంగారు తల్లికి. “ అని ముఖమంతా తడిమి సుతారంగా ముద్దు పెట్టుకుని తొందర చేసాడు చంద్రయ్య.

కొడుకు పక్కనొచ్చి ,” నాయనా సైకిలు టైరు పోయింది. రేపు ఎత్తుకెళ్ళి చేయించుకు రావాలా!” అన్నాడు కాళ్ళ దగ్గర కూర్చుని నులక మంచాన్ని సరిచేస్తూ.

“ఎందుకు రా నువ్వు తోసుకు పోవడం ఆ భద్రయ్య టాకటర్ పోతుండాది కదా! యేసి పంపు . వాడే దగ్గరుండి చేయించు కోస్తాడు.”

"ఎందుకులే అబ్బా! ఎట్లా చేస్తారో ఏమో ? నేనే పోతా! అట్టనే పోయిండేవోడిని. పుట్ట తల్లిని దించి పోదామని . పోద్దుకూకింది ఎందుకని...?" అని మంచం సరిచేయడంలో మునిగి పోయాడు కార్తికేయుడు.

తన పొలంలో ఉన్న పెద్ద కొండలాంటి పుట్ట, అందులో కొలువై ఉన్న నాగ దేవతలంటే విపరీతమైన భక్తి, అంతులేని నమ్మకం చద్రయ్యకు . ఎన్నో సార్లు చేతులు పైకి, కాళ్ళ కిందకూ వచ్చినా కరవ లేదు. దర్సనం ఇచ్చారు. అందుకనే కొడుక్కు ఆ పేరు, కూతురికి నాగ దేవతలుండే పుట్ట పేరు పెట్టాడు.నాగుల చవితి ఘనంగా చేయిస్తాడు.

"రా! అయ్యా! కూడుతిని పెందలాడే పడుకుందువుగాని. ఆ ఎండలో పోద్దుగూకలా పడుండి ముఖం మాడిపోయి బేజారుగా ఉండావు. ఏన్నీళ్ళు ఎట్టుండా , కొంచెం నీళ్లోసుకో పాణం కుదట పడుతాది." అంటూ గోముగా పిలిచింది వరమ్మ .

చంద్రయ్య లేచి ఎద్దలకు , ఆవులకు గడ్డి, వేరుశనగ ఆకేసి, వాటి వీపు సుతారంగా రుద్ది స్నానానికి పోయాడు. ఎందుకో వాటిని చూస్తే ఎనలేని తృప్తి. దేవుళ్ళు తన దగ్గరే ఉన్నారనే నమ్మకం.

ముగ్గరూ బోజనానికి కూర్చున్నారు. వడ్డిస్తూ వరమ్మ అంది." అయ్యా! పొలం ఎవురో అడిగినారంటనే! ఊళ్ళో అంతా చెవులు కోసుకుంటున్నారు. కోట్లు వస్తాయి అని. నిజమా?"

" తిరిపాలుగాడు వచ్చాడా?" అనడిగాడు అన్నం తింటూ.

"వచ్చాడు. పదిమందిని ఎక్కేసుకుని. ఊదరగోట్టాడు. అరిచేతిలో సొరగం చూపించాడు . అది అయ్య ఇష్టం అని తన్నబోయి తరిమేసా! " అంది. చంద్రయ్య జవాబు చెప్పక చుట్టముక్క తీసుకుని బయటకొచ్చాడు.

కొడుకు మంచం వాల్చి పక్క సర్దితే, నడుం వాల్చాడు చంద్రయ్య. వరమ్మ గిన్నెలు సర్ది వచ్చి పక్కనే కూర్చుని కాళ్ళు వత్తుతూ , " అయ్యా! అమ్మికి ఈ ఏడాది పెళ్లి చేసేస్తామయ్యా! యాడ తెస్తావు ఇంకా పెద్ద చదువులు చదివిస్తే !" అంది.

"చదువుకోనీవే ! బాగా చదువుతావుంది. చిన్న బిడ్డ."

"మీకట్లాగే అనిపిస్తాది. ఆడ పిల్ల చదివి ఏం ఉద్దరించాలంట ! వంటింట్లో పడి ఉండడానికి."

"నోరు మూసుకో! ఇందిరమ్మ, సరోజనమ్మ చదివి దేశాన్ని ఏలలా ? నా కూతురు పెద్ద కలెక్టర్ చేస్తా! పదిమందికి సేవలు చెయ్యాల."

"ఊ హూ! చేసినట్టే ఉంది .ఓ యేడాది ఎండిపోతే ఈ జొన్న కూడుకూడా దొరకదు."

"ఆ భూ తల్లి నన్ను ఎప్పుడూ మోసం చెయ్యదు. మన కోసం వాన దేవుడు నాలుగు చుక్కల తలం బ్రాలు వేస్తాడు." అని పక్కకు తిరిగి పడుకుంటూ కొడుకుతో," నాయనా రేపు డబ్బులు ఎత్తుకుని అమ్మికి నీకు మంచి గుడ్డలు కుట్టించుకో." అన్నాడు.

"ఎందుకయ్యా! ఇవే నాలుగు సంవత్సరాలు వస్తాయి. అమ్మికి కావల్సుంటే...?"

"నాకొద్దు! చాలా ఉండాయి .నాయన్ని అమ్మను డాక్టర్కి చూపించాలా తగ్గి పోతుండారు." అంది పుట్టి తల్లి.ఆ మాటకు మురిసిపోతూ చూడు నాబిడ్డ అన్నట్టు భార్య వైపు గర్వంతో చూసాడు.

"మురిసి ముక్కలుకాబోక. రేపు పెండ్లయితే మనం గుర్తుండం. నేనేం చేసినా? మా యమ్మా అబ్బా ఎట్టా ఉండారో ఒక్క రోజయినా అనుకున్నానా ? వాళ్ళ మంచి చెడ్డలు చూసానా ? పెండ్లయితే ఏ ఆడకూతురయినా అంతే " గొంతు బొంగురపోయింది వరమ్మ కు .

"నువ్వు రాకాసివి. నా బిడ్డ దేవత. మనల్ని మరిచి పోదు." అన్నాడు ఎగతాలిగా ఎత్తిపోడుస్తూ చంద్రయ్య. మూతి మూడు వంకరులు తిప్పింది వరమ్మ .

" నేను మరిచిపోయినానా ! ముందు మొగుడికంటేనా ! చాలీ చాలని బతుకు. యాదకున్నా ఏడ చేస్తాము. ఏడుచుకోవడం తప్ప." అంటూ ముక్కు చీదుకుని ముఖం తుడుచుకుంది వరమ్మ .

"అందుకే కదవే చదివిస్తుండేది."

" ఆడ పిలకాయ బతుకు మొగుడు కిందనే ! చెయినిస్తేకదా? వెనకేసుకొస్తుండావు . మొగుడు దొరికితే మనం...! "

"అమ్మా ! నువ్వు గమ్మనుండు. ఏం జరిగినా, ఎవడోచ్చినా ప్రాణమున్నంత వరకు మిమ్మల్ని నే నొదల ." అంటూ దగ్గరకొచ్చి కౌగలించుకుంది. చంద్రయ్య, వరమ్మ కళ్ళు ఆనందంతో చెమ్మగిల్లాయి.

"పెళ్లయ్యేంత వరకే ఈయన్నీ! అవతల...! ఆడికి పెళ్ళాం కొంగు, నీకు మొగుడి చెంగావి రంగు.' మాట పూర్తికానీలేదు కార్తికేయ.

"మీ కడుపున పుట్టి నోళ్ళవమ్మా ! మీ చేతులు మీద పెరిగినోళ్ళం ! బమ్మరాత మారాల్సిందే పది జన్మలెత్తినా మీ ఋణం తీర్చుకోలేము. అందరిలా మేము కాదు. ! " అంటూ వాళ్ళతో కలిసాడు.

అందరూ ఆనందంతో పడుకుని ఆదమరిచి నిదురపోసాగారు ఒక్క చంద్రయ్య తప్ప.

లేచి కూర్చుని చిరిగిన దుప్పటి కప్పుకుని, నులక మంచం మీద పడుకున్న కూతురిని, ,పైట చెరుగు ముఖ మీదకు లాక్కుని, దిండు కూడా లేకుండా చాప మీద పడుకున్న వరమ్మ , చేతులు ముడుచుకుని, కాళ్ళు కడుపులో దాచుకుని ఉండ చుట్టుకుని పడుకున్న కొడుకును చూసి లేచి వెళ్లి తన పైగుడ్డ కప్పి వచ్చి కూర్చున్నాడు. వాళ్ళ ముఖాలలో అసంతృప్తి ఏకోశానా కనిపించలేదు. కానీ తన బిడ్డలు పదిమంది మెచ్చుకునేటట్లు దర్జాగా బ్రతకాలని మనసులో ఉంది. అందుకే బాగా చదించి మంచి ఉద్యోగాలు వస్తే ...?ఖర్చులు జాస్తి అయి పోతున్నాయి. అయినా తన శక్తి మేరకు వాళ్లకు ఎలాంటి కొరత లేకుండా నెట్టుకొస్తున్నాడు.శక్తి తగ్గితే...తనకేమయినా జరిగితే ...వాళ్ళ చదువు... భవిష్యత్తు.?

ఎందుకో శరీరమంతా చెమట పట్టింది. తుడుచుకుని చెంబులోని మంచి నీళ్ళు తాగి పడుకోబోయే లోగా భార్య చివుక్కున లేచి చూసి, ఆత్రుతగా దగ్గరకొచ్చి," ఏందయ్యా! పడుకోలేదా? తల నొప్పిగా ఉందా? ఆకలిగా ఉందా ! పాలుమాలి ఉదయం కూరే పెట్టాను. కడుపు నొప్పిగా ఉందా?పంతుల దగ్గరకెళ్ళి వాయువ మాత్రతేనా ? వాతం చేసిందేమో? ఉండు కొంచెం గంజి కాసుకో నొస్తా! తాగి పడుకో. బిడ్డల్ని లేపేదా? " అంటూ ఆత్రుతతో తపించిపోయింది వరమ్మ . భయంతో కళ్ళల్లో నీళ్ళు వచ్చేసాయి. అది చూసి చంద్రయ్య ఆమె తపనకు, పిచ్చి ప్రేమ మనసులోని ఆలోచనలను తోలిగించింది.

ప్రేమతో," ఏం లేదులేవే! ఊరికే ! పడుకో!" అని వెల్లికిలా పడుకున్నాడు.

వరమ్మ దగ్గరకొచ్చి కాళ్ళు వత్తుతూ," నేను చూడ లేదయ్యా మిమ్మల్ని ఇట్లా! అందుకే ?' అంటూ తల కింద పెట్టుకోనున్న అమృతాంజనం నొసటకు కాస్త పూసుకుని దాన్ని చంద్రయ్య నొసలకు రుద్దుతూ మాట్లాడుతూ, మాట్లాడతూ, తల ఎద మీద వాల్చి గురక పెట్ట సాగింది.

చంద్రయ్య నవ్వుకుంటూ పక్కకు జరిపి తన దిండు వేసి చాప మీద పడుకోబెట్టాడు. ఆమె వైపు చాలా సేపు చూస్తూ ఉండి పోయి ఏనాడయినా తనకు ఇది కావాలి, ఇది తక్కువ అని అడిగిందా గుర్తు చేసుకున్నా అందలేదు. మెడలో పసుపుతాడు కనిపించగానే మనసు కలుక్కుమంది. పొలంలో బోర్లు వేసినప్పుడు అది కుదవ పెట్టాడు. కూతురు మెడలో సన్నని రోల్డుగోల్డు దండ తప్ప ఏం లేదు. ఖచ్చితంగా ఈ సంవత్సరం పంట రాగానే బంగారం కొనాలని తీర్మానించుకున్నాడు.

ఉదయం లేచి కాలకృత్యాలు తీర్చుకుని కూర్చోగాని భార్య తాగడానికి వేన్నీళ్ళు తీసుకొచ్చి," సద్ది కూడు తింటావయ్యా!" అని అడిగింది. పోలానికెల్లొచ్చి తింటానని బయలుదేరాడు.,

ఇంతలో," మావా! ఉన్నావా? పొలానికి పోయుంటావనుకున్నా!" అంటూ భద్రయ్య లోపలి వచ్చాడు. అతన్ని చూడగానే ఇంత ఉదయాన్నే ఏవిటి అనుకుంటూ కాఫీ తెచ్చి ఇమ్మని లోపలి కేకేసాడు.

"వద్దులే మావా! టౌనుకి పోవాల. ఇండ్ల స్థలం చూస్తున్నా! రోజూ రోజూకు ధరలు పెరిగి పోతుండాయి. ఇంకో రెండు సంవత్సరాలలో కోట్లకు పోతాది. ఈ రోజుల్లో రియల్ ఎస్టేట్ బగా బగా మండి పోతుంది. ఇట్లా కొనడం అట్లా అమ్మడం. రోజుల్లో కొటీస్వర్లు అయి పోతున్నారు. ఏం వస్తుంది మావా రెండు రూపాయులు, మూడు రూపాయిల వడ్డీకిస్తే నీబోటోడ్ని గట్టిగా అడగలేక పోతిమి. అదేమో చెదులు పుట్ట పెరిగి నాగుపాములు చెరి పోతుండే ! ఉండేది అమ్ముకున్నా తీరేటట్లు లేకపోయే."

ఆ మాటకు చంద్రయ్యకు ముఖం నల్లబడింది. ఎందుకో గుండెల్లో తట్టినట్లు అనిపించింది. ఇంట్లోకి చూసాడు భార్యా పిల్లలు దగ్గరున్నారేమోనని !!

" చాలా సంవత్సరాలు అయి పోయింది మావా! నిఖార్సయిన మనిషి, ఇస్తాడులే అనే నమ్మకం. నాకు అవసరం మావా! చెప్పాను కదా ఆ స్థలం కొనాలని... ఇక ఆగలేను .ఒక నెల రోజుల్లో...!!"

"చూస్తానబ్బయ్యా! ఇంటికి రావద్దులే నేనే వస్తా !" భయంగా వెనక్కు వెనక్కు చూస్తూ రహస్యంగా చెబుతూ అతను ఎదో మాట్లాడబోతున్నా, తానే బయటకు తీసుకు పోయాడు..

వచ్చి కూర్చుని ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ ఉంటే భార్యా, పిల్లలు వచ్చి చూసి,' అయ్యయ్యో ! అదేంది ! ఉదయాన్నే అంత చెమట?" అంటూ ఆత్రుతగా వచ్చి పైటతో తుడవ సాగింది వరమ్మ .కొడుకు కూతురి ముఖంలో కూడా విపరీతమైన ఆతృతను చూసాడు చంద్రయ్య." ఏం లేదు లేవే! ఏదో అజీర్తి చేసుంటాది." అని తేలిగ్గా నవ్వేసాడు.

కొడుకు కూతురు," కాదు నాయానా! చెమట అట్లా పోయికూడదు. ఆసుపత్రికి పోదాం. పద ! సద్ది తాగు." అంటూ తొందర చేసారు. కాదంటే ముగ్గురూ చాలా గొడవ చేసారు. కారణం తనకు తెలుసు కాబట్టి హసుపత్రి అంటే లేనిపోనివి చెప్పి అనవసరంగా డబ్బు గుంజుతారని ససేమిరా వద్దన్నాడు.

చలాకీగా ఉన్నట్లు లేచి పై గుడ్డ విదిలించుకుంటూ," చేలోకి పోయి బంతి, చేమంతి తెస్తా! కాలేజీకి ఎత్తుకుపోయి అందరికీ ఇయ్యమ్మా ! కూరకు ,గోంగూర నాలుగు వంకాయలు పచ్చి మిరప తెస్తా! ' అంటూ వసారాలోకి వచ్చి అక్కడ కట్టేసి ఉన్న కోడెలను , ఆవులను ఇప్పి తోలుకెళ్ళుతూ ," బిడ్డలకు సద్ది పోయిమాక. పోస్తే ఎఱ్ర బియ్యపు జావపోసి ఇవ్వు. నేనొచ్చేస్తా!! " అంటూ బిరా బిరా ఎల్లి పోయాడు.

"ఈ మడిసి మారడు. మన మాట ఇనడు." అంటూ నిట్టూర్పు విడిచి అందోళనగా చూస్తున్న బిడ్డల్ని చూసి నవ్వింది వరమ్మ . వాళ్ళూ నవ్వేసి కాలేజీకి తయారు కాసాగారు.

తలొంచుకుని ఆలోచిస్తూ పోతున్న చంద్రయ్యకు ఎవరో పిలిచినట్లు అనిపిస్తే చూసాడు 'శంకరయ్య.' ఎందుకో తెలియదు తడబడ్డాడు.వెనక్కు తగ్గాడు

"యాడికి మావా ! పొలానికా ? ఏం ప్రాణం మావా నీకు ఆ పొలమంటే ! నీలాగ అందరుంటే దేశంలో ఆకలి, కరువు ఉండనే ఉండవు . ఈ వయస్సులో కూడా ఎందుకు అంత కష్ట పడతావు?"

"కష్టపడక పోతే ఎట్లా? బతకబల్లా! బాగుండావా? నువ్వు యాడికి పోలానికేనా?"

" లేదు మావా! పొలం అమ్మేస్తినే ! ఎవరు పడుతారు ఈ కూలోళ్ళతో. రారు.. వస్తే చెయ్యరు మోపెడంత అడగతుండే. నువ్వు గాక పోతే... అయినా ఏం మిగులుతుంది మావా ! అప్పులు చెయ్యక తప్పదు. మధ్య తరగతి రైతు బ్రతకలేదు మావా! అన్నీ తాకట్టు పెట్టుకోవాల్సిందే! ఉరేసుకుని చస్త్న్నారు. ఈ గర్నమెంటోళ్ళు గిట్టు బాటు ధరంటారు..తోలుకు పోతే ముడుపులు చెల్లించాల్సి ఉండే. అందుకే అమ్మేసా! హాయిగా ఉంది. టౌన్లో యిండ్లు కొనుక్కుని

యాపారం పెట్టుకున్నా. పిల్లల చదువు బాగుంది. మాకు యాతన లేకుండా జబ్బుగిబ్బులేకుండా సుఖంగా ఉండాము. నీది కూడా ఎవరో అడిగినారంట నే! అమ్మోయ్యి మావా! మంచి ధరోచ్చిదంటనే ! అప్పులుంటివి . నాకు ఈయాలసిందికూడా అట్లాగే ఉండే. అమ్మోయ్యి!! బస్సు వస్తా ఉంది. మళ్ళీ మాట్లాడుతా " అంటూ వెళ్లి పోయాడు శంకరయ్య.

ఆలోచన మరీ ఎక్కువయ్యింది. కష్ట పడి శ్రమ పడి తీరుస్తాను. ప్రాణం ఉండగా అమ్మను అని మనసులో గట్టిగా అనుకుని పొలంలోకి వెళ్ళాడు.

ఆ రోజు రాత్రి తిండి తినడానికి ఇష్టపడలే ! వెల్లికిలా పడుకుని ఆకాశాన్ని, చిక్కగా కమ్ముకుని మెరుస్తున్న చుక్కల్ని, నడి రాత్రిపూట సడి చెయ్యని గాలి మోసుకొస్తున్న పారిజాతి పూల పరిమళాలు మనసును మైమరిపిస్తున్నా ఎదో తెలియని వెలితి. ప్రక్కకు వొత్తిగిలి చూసాడు. ఎద్దులు నెమరు వేస్తూ మాగన్నుగా, స్థిమితంగా సేద తీర్చుకుంటున్నాయి. గోమాత బిడ్డను అపురూపంగా నాకుతూ పక్కలోకి తీసుకుని తృప్తితో కళ్ళు మూసుకుంది. ఇంటి పైకప్పు పై కోళ్ళు, పుంజు సంరక్షణలో నిశ్చింతగా కునుకు తీస్తున్నాయి. మరి తను...భార్య దగ్గరలో, బిడ్డల మధ్య పడుకున్నా స్థిమితం....?

ప్రక్కకు తిరిగాడు . తీతువ పిట్ట చీకటిలో అరుస్తూ ఆకాశంలో దూసుకు వెళ్ళింది. గుండెలు జల్లుమన్నాయి. తెలియని ఆరాటం మనసునిండా అల్లుకుంది. అప్పులు తీర్చి బిడ్డలకు మంచి బతుకును ఇవ్వగలనా? నన్ను నమ్ముకుని ప్రాణంగా బతుకుతున్న భార్యకు నగా నట్రా కాకపోయినా మంచికూడు, గుడ్డ ఉందని ధైర్యం ఇవ్వగలనా అనే ఒకే ఆలోచన. చీకాకుగా లేచి కూర్చున్నాడు.

" ఏందయ్యా! నిదరపట్టలే ! " అని భార్య కదిలించేసరికి ఉలిక్కిపడ్డాడు. తిరిగి చూసి ," పడుకో! ఏం లేదులే! " ఆందోళనగా తననే చూస్తున్న ఆమె తలనిమిరి కళ్ళల్లోకి చూసాడు.

దగ్గరగా జరిగి, అతని చేయి తీసి గుండెల మీద పెట్టుకుంటూ," చెప్పరా! భయంగా ఉంది. ఎప్పుడూ వొళ్ళు తెలియకుండా నిదురోయేవాళ్ళు. ఈ రోజు ...చెప్పరా? పిల్లల్ని గురించా ? బాగా చదువుకుంటున్నారు. అప్పుసొప్పు ఏం లేదు. ఎందుకు అట్లా ?' ప్రాదేయ పూర్వకంగా అడిగింది.

లేచి పోయి చావిడి అంచుమీద కూర్చున్నాడు. తనూ లేచి పక్కనే వచ్చి కూర్చుని ఎక్కడో చూస్తూ ఏదోలా ఉన్న చంద్రయ్యను చూసి ఏం జరిగిందో అని చాలా దిగులు పడింది.

చాలా సేపటికిగాని చంద్రయ్య మాట్లాడలేదు. గుండెలు పిడికిట్లో పెట్టుకున్న బార్యను చూసి అబద్ధం చెప్పాలనిపించలేదు. అలాగని నిజం చెప్పి ఆమెను బాధ పెట్టడం కూడా ఇష్టం లేదు. కానీ ఇంకా దాచి పెట్టడం ఆమె నమ్మకాన్ని , బందాన్ని అవమానించినట్లు." ఏం లేదు లేవే! పోయి పడుకో! అదే...అబ్బయ్య ఉద్యోగం వచ్చే వరకు, అమ్మాయిని మంచి కాలేజీలో చేర్చేందుకు డబ్బుకావాలికదా ! నిన్ను డాక్టరు దగ్గర పరిక్షలు చేయించాలికదా? అందుకే... ఇప్పటికే అప్పు జాస్తి అయి పోతుంది. బిడ్డకు పెండ్లి అంటే నగానట్రా కొనాలికదా ! అందుకని.....?"

“అవన్నీ ఇప్పుడెందుకయ్యా ! చేతిలో ఉండే ఇప్పటిదాకా బతికామా? కాయ కష్టం చేసే బలం ఇంకా చావలే ! భూమాత చిన్న చూపు చూడలే! అంతగా గొంతు మీదకు వస్తే ఆ తల్లే మన ఋణం
తీర్చేదానికి ఆదు కుంటుంది.” అంది చద్రయ్య తల అడ్డంగా తిప్పాడు.

మారు మాట్లాడలేక చాలా సేపు అలాగే చూస్తుండి పోయి, గాఢనిట్టూర్పు వదులుతూ,” ఈ యాతనతో మీకు ఏదయినా అయితే మేం ఉంటామనుకున్నారా? మీ కంటే దేవుడుకూడా తక్కువే ! ఆరోగ్యంగా, సంతోషంగా మా పక్కనుంటే ఆ తల్లిని నూరింతలు చేస్తాము. అంత బాధ పెట్టె అప్పులుంటే అమ్మి అప్పులు తీర్చేయ్యండి. మనకు తగ్గ సంబంధం తెచ్చి పుట్టమ్మకు పెండ్లి చేసి, ఉంటే తాగుదాం లేకుంటే పస్తులుందాము. “ అంది చాలా తెగింపుతో అతని కళ్ళల్లోకి చూసి.

అమ్మడం అనే మాట ససేమిరా నచ్చలేదు. అయినా భార్యను దగ్గరకు తీసుకుని నొసట ముద్దు పెట్టుకున్నాడు. వరమ్మ “ఛీ.. పో’! వయసొచ్చినా కుతి తీరలేదు.” అంటూ నును సిగ్గుతో కువకువలాడింది. అలా ఎంత సేపు ఉన్నారో కోడి కూసెంత వరకు తెలియదు.

లేచి చిలిపిగా చంద్రయ్యను చూస్తూ లోపలి వెళ్ళింది వరమ్మ.. చంద్రయ్య పసువులు కొట్టాం శుభ్రం చేసి దగ్గరకు ప్రేమతో వచ్చిన కోడె దూడలను నిమురుతూ ఈ జన్మకు ఈ అదృష్టం చాలదా అనుకున్నాడు. అన్ని పనులు చేసుకుని వచ్చేసరికి వెడి వేడి రాగి జావ కాసిచ్చింది. తాగి పొలానికెళ్ళుతూ బార్య పిలిచినట్లు అనిపించి నిలిచాడు.

దగ్గరగా వస్తూ, ‘అయ్యా! అమ్మికి నాలుగు గుడ్డలు కొనకూడదా? రోజూ బడినుంచి వచ్చి ఉతుక్కొని అవే ఏసుకుంటా ఉండాది.” ఆశ్చర్యంగా చూస్తున్న చంద్రయ్య కళ్ళల్లోకి చూసి తల దించుకుంది.

గాఢ నిట్టూర్పు వదులుతూ,’ ముందుగా ఎందుకు చెప్పలేదు. నా తల్లి ఏ గుడ్డ ఏసినా మెరిసి పోతుంటే గమనించలా!” ఆలోచిస్తూ కూర్చున్నాడు.

“అవున్లే ! గారాలపట్టి ; దేవతమ్మ కదా! అది చిలక పలుకులు పలుకుతూ తిరుగుతావుంటే చాలు. లోకం తెలియదు. ఆ మగ బిడ్డ ఉండాడు ఏమయినా పట్టించుకుంటున్నారా! వాడికి పుస్తకాలు లేవంట. ఆళ్ళనీ ఈళ్లని అడగాలంటే సిగ్గుగా ఉందట.”

ఆ మాటలు వినగానే గుండెల్లో ఘాతం దిగినట్లు అనిపించింది. దిగులు ముంచుకొచ్చింది. కూర్చునేసాడు. భార్యా ఆదుర్దాగా వచ్చి పాలిపోయి మాడిపోయిన ముఖాన్ని చూసు,’ ఏందయ్యా! అట్లాగయి పోయావు. తప్పుగా మాట్లాడానా?’ అంటూ కళ్ళల్లో నీళ్ళు పొంగుతుంటే అడిగింది.

" ఏం లేదు లేవే! బిడ్డలు అంత సర్దుకుంటున్నారంటే దిగులయ్యింది." వొంట్లో సత్తువంతా జారి పోయినట్లు కూలబడి పోయాడు. తన పేదరికాన్నితట్టిలేపినట్లు అనిపించింది. అయినా ఒకరికి తలవంచకుండా పరువుగా బ్రతుకుతున్నాము అనే నమ్మకాన్ని కదిలించినట్లు అయ్యింది.

"ఏందయ్యా! ఏందయ్యా!" అంటూ ఆత్రుతగా దగ్గరకొచ్చింది

సర్దుకుని ఆమె ఆత్రుత తగ్గించాలని," నాతో ఎందుకు చెప్పడంలేదు.అంత భయపడుతున్నారా? రేపే కొందాం గుడ్డలు. అబ్బికి పుస్తకాలకు ఎంతకావాలో అడుగు. ఒకర్ని అడగటం ఎందుకు? దానికెందుకు బాధ." అని ఆలోచనల్లో మునిగి పోయాడు.

తెల్ల వార్లు ఆలోచించి..ఆలోచించి చివరకు ఉదయాన్నే మెల్లగా లేచి నేరుగా తన స్నేహితుడు,బంధువు, కష్ట సుఖాలలో తోడుండే సుందరయ్య దగ్గరకు వెళ్ళాడు.

చంద్రయ్యను చూడగానే సంతోషంతో," రా! రా!! ఎన్నాళ్ళకు?ఎన్నాళ్ళకు ? కూర్చో. ఏమ్మే! మీ బాబాయి వచ్చాడు. కాఫీ తీసుకురా!" అంటూ కుర్చీ చూపించాడు.

"నేను కాఫీ తాగను." ఏదో చెప్పాలన్నట్లు రెండు సార్లు సుందరయ్య కళ్ళల్లోకి చూసి తల దించుకున్నాడు.

అది గమనించి," ఏది మావా! ఏదో అలోచిస్తున్నావే ? నా దగ్గరెందుకు మోహమాటం" అన్నాడు.

"అదేమీ లేదు. చిన్న సలహాకోసం వచ్చా!"

"అదేంది మావా! అందరూ సలహా కోసం నీ దగ్గరకు వస్తుంటే నువ్వు నా దగ్గర...?"

"నువ్వు నా మంచికోరేవాడివని. లోకం తెలిసినోడివని..." మాట మధ్యలోనే నిలిపి చెప్పడానికి వెనుకాడాడు చంద్రయ్య.

దిగాలుగా ఆలోచనతో ముడుచుకు పోయిన చద్రయ్యను చూసి ఏదో పెద్దదే ఉంటుంది అనుకోని ," చెప్పు మావా! నా దగ్గరెందుకు మొహమాటం." అంటూ దగ్గర కూర్చున్నాడు సుందరయ్య.

"ఎవరితో చెప్పనని మాట ఇవ్వు" అంటూ చేయి ముందుకు చాపాడు చంద్రయ్య.

"అదేంది మావా! నీ గుట్టు నా గుట్టుకాదా! మనం సంబందీకులం!! గాలికి కూడా తెలవ నివ్వను."

మౌనంగా చాలా సేపు ఆలోచిస్తూ కూర్చుని," నా స్థితిగతులు నీకు బాగా తెలుసు. కాస్త అప్పు ఉన్న సంగతికూడా తెలిసే ఉంటుంది. పిల్లలు ఇంకా చదవాల్సింది ఉంది. పొలం అడుగుతున్నారు . నాకు అమ్మడం ఇష్టం లేదు. అప్పు ఇచ్చిన వాళ్ళు వొత్తిడి చేస్తున్నారు." అని నిలిపి సుందరయ్య కళ్ళలోకి చూసాడు చంద్రయ్య.

"నీకు పొలం అంటే ఎంత ప్రాణమో నాకు తెలుసు. కానీ దాన్ని కొనాలని చాలా మంది తిరుగుతున్నారని తెలుసు. రోజులు బాగాలేవు మావా! నువ్వు ఎంత కష్టపడినా నీ అప్పు త్వరగా తీర్చలేవు. కట్టలేని పరిస్థితి వస్తుంది. అప్పుడు

అమ్మాలంటే కూటి నీళ్ళకు అడుగుతారు. లేదంటే కబ్జా చేస్తారు. ఈ రియలేటర్స్ ఎంతకైనా తెగిస్తారు. చట్టం న్యాయం, ధర్మా ధర్మాలు, మంచి చెడులు ఆ జాతికి ఉండవు. అమ్మేసి అప్పులు తీర్చేసి, మిగిలిన డబ్బుతో నీ ఇష్ట ప్రకారం ఇంకెక్కడైనా ...?"

" ఇది నేను పుట్టిన గడ్డ. నా ప్రాణం ఇక్కడే పోవాల.అది నా తాత ముత్తాతలు ఇచ్చింది. భూదేవి నాతల్లి. ప్రాణమైనా ఇడుస్తానుగాని దాన్ని..,.?"

" పిచ్చి మావా! ఇవ్వనంటే నీ కొంపే ఉండదు. నీ పిల్లలతో సహా బూడిదవుతారు. నా మాట విని ఇచ్చెయ్యి .ఎక్కడైనా కొనుక్కోవచ్చు. నీ పిల్లల్ని బాగా చదివించుకోవచ్చు. జాగర్తగా వాడుకుంటే తరాలు సుఖంగా గడిచిపోతాయి."

ఆలోచిస్తూ మాట్లాడ లేకపోయాడు చంద్రయ్య. సుందరయ్య ప్రక్కకు చూసి ," ఒరేయ్! కార్తీ నువ్వేప్పుడోచ్చావురా! రా..రా ! మీ అత్త నిన్ను చూడాలని తెగ ఆరాట పడిపోతుంది." అంటూ లోపలి కేకేసాడు అల్లుడోచ్చాడని.

కార్తికేయుడ్ని చూడగానే తడబడ్డాడు చంద్రయ్య." బడికి పోలా" అంటూ ముఖానికి పట్టిన చెమటను తుడుచుకున్నాడు.

"నీ కోసం ఎవరో వచ్చినారు నాయనా! పొలం విషయం అర్జంటుగా మాట్లాడాలంట."

"అదే చెపుతున్నా అల్లుడా! ఎందుకు గొడ..."

"అంతా ఇన్నాను మావా! కాలేజీకి పోవాల. మళ్ళీ వస్తా " అంటూ తండ్రి వైపు చూసి పద పోదాం!' అనేసరికి లేస్తూ కార్తికేయుని ముఖం జేవురించి సెగలు చిమ్ముతున్నట్లు బాధతో ముఖం ముడుచుకు పోయినట్లు అనిపించింది.

బిడ్డకు అంతా తెలిసి పోయి ఉంటాదని దిగులు పడసాగాడు చంద్రయ్య.. నడుస్తున్నాడేగాని మనసు మనసులో లేదు. తలతిరిగినట్లాయి పడబోయాడు. కొడుకు పట్టుకున్నాడు. పొలం అమ్మి తను ప్రాణాలతో ఉండగలడా ? ఈ అప్పులు పిల్లల చదువు పూర్తి చేయగలడా? సుందరయ్య అన్నట్టు దౌర్జన్యం చేసి పిల్లల్ని ఏమన్నా చేస్తే? తన ప్రాణం నిలుస్తాదా?

ఇంటి దగ్గరకు రాగానే రెండు పెద్ద కార్లు, సూటుబూటువేసుకున్న మనుషులు కనిపించారు.భయం వేసింది వాళ్ళ ముఖాల్లో కనిపించే కాటిన్యం .లెక్కలేని తనం చూసి!!

వాళ్ళు ముందు ఎంతో మర్యాదగా అడిగారు. కాదు అనే సరికి ఎంతయినా ఇస్తామన్నారు. అప్పటికీ సరే అనక పోయేసరికి ఎట్లా ఇవ్వవో చూస్తాము. నీ అంతు తెలుస్తాము. నీ కొంప ముంచుతామని పైకి వచ్చారు. నా ఇంటి కొచ్చి నన్ను దబాయిస్తారా . అంత దూరం వస్తే తాడో పేడో తేల్చుకుంటా పొండి అని గట్టిగా అరిచి తరిమేసాడు. ఊరంతా ఇంటిముందు ఉన్న సంగతి ఈ గొడవలో గమనించ లేదు.

కోపంతో వణికి పోతూ, చెమటతో తడిచి పోయి ఏదేదో మాట్లాడుతున్న చంద్రయ్య దగ్గరకు రావడానికి కార్తికేయుడికి భయం వేసింది. పుట్టమ్మ ధైర్యం చేసి దగ్గర కూర్చుని ఏడ్చేసరికి కొంత స్థిమిత పడ్డాడు. వరమ్మ దగ్గరకు వచ్చి దిగులుగా భర్త ముఖంలోకి చూసి కన్నీళ్లు పెట్టుకుంది.

“ఏం లేదు లేవే! ఎందుకు ఆ ఏడుపు ముఖం . నా తల్లిని అడిగేసరికి వోర్చుకోలేక పోయినా! నేను చస్తే ఆ తల్లి వొడిలోనే చేర్చుతామని మాట ఇవ్వండి. వాళ్ళ వీళ్ళ మాటలు ఇనకండి.” ఆ మాటకు నోరు కప్పెట్టేసింది వరమ్మ . కన్నీళ్లు జల్లున రాలాయి. చేయి తీసి కన్నీళ్లు తుడిచి కొడుకు వైపు చూసాడు.

“మా ప్రాణంకంటే మీరు ముఖ్యం నాయానా! ఎట్లా తీసుకుంటారో చూస్తాను? ఏం చేస్తారో రానీ నా కొడుకుల్ని ఆడే పాతి పెట్టేస్తాను. “ ఎంతకైనా తెగించేటట్లు దృఢ నిశ్చయంతో అన్నాడు కార్తి కేయుడు.

ఆ రోజంతా ఏ ఒక్కరూ సంతోషంగా లేరు. కార్తికేయుడు చాలా దీర్ఘంగా ఆలోచిస్తూ ఉండి పోయాడు. పుట్టమ్మ పడుకోనున్న తండ్రి దగ్గర అదీ ఇదీ చెపుతూ మామూలు మనిషిని చెయ్యాలని ప్రయత్నిస్తూ కూర్చుంది. వరమ్మ ముక్కు చీదుకుంటూ, ముఖ తుడుచుకుంటూ పనులు చేసుకుంటూనే ఉంది. మధ్యాహ్నం ఎవ్వరూ సరిగా భోజనం చెయ్యలేదు. చంద్రయ్య తినీ తిననట్లు తిని పొలంకాడికి పోబోతుంటే కార్తికేయుడు కూడా వెళ్ళాడు.

ఇద్దరూ మౌనంగా చాలా సేపు పొలం వైపే చూస్తుండి పోయారు.

ఉన్నట్లుండి,’ ఇప్పుడు చాలా డబ్బు వచ్చే పంటలుండాయి నాయనా. మనకుండే నీళ్ళే సరిపోతాయి. అప్పు సంవత్సరం లోపే తీర్చేయొచ్చు. అటువంటి వాటికి గవర్నమెంటోళ్ళు వడ్డీ లేకుండా అప్పు ఇస్తున్నారు. రసాయినిక ఎరువులు వాడకుండా సేంద్రీయ ఎరువులుతో పండిస్తే, బోలెడంత డబ్బు. అమ్మకుండా ఉండేందుకు ప్రాణాలు ఇస్తాం. చూస్తాం ఎట్లా లాక్కుంటారో? ఏం చేస్తారో?” అని దృఢ నిశ్చయంతో తండ్రి వైపు చూసాడు. బిడ్డ కళ్ళల్లో కనపడిన ధైర్యం , తెగింపు చూసి నిట్టూర్పు వదులుతూ,” అబ్బయ్యా ! నువ్వు ఇంటి కెళ్ళు . నేను తరువాత వస్తా !” అని ముఖం పక్కకు తిప్పుకున్నాడు. రౌడి మూక అనుకుంటే ఏమయినా చేస్తారని పించింది.తన ప్రాణం కాదు బిడ్డల్ని ఏమయినా చేస్తే?

కార్తికేయుడు చాలాసేపు తండ్రినే చూసి ఎలా ఈయనను కాపాడుకోవాలా అని ఆలోచిస్తూ ఇంటి ముఖం పట్టాడు. ఎన్నో ఎన్నో ఆలోచనలు, ఎన్నో మార్గాలు. ఏది సరైనది అని తీవ్రంగా తర్జన భర్జనలు పడుతూ ఇంటి కొచ్చాడు . వొంటరిగా ఎందుకు వదిలి వచ్చావని తల్లి, చెల్లి కోప్పడ్డారు.సాయంకాలం తండ్రి రాకపోతే వెళ్లి తీసుకొచ్చాడు. కార్తికేయుడు ఇప్పుడు తండ్రిలాగా ముసుగు కప్పుకుని మాట్లాడకుండా పడుకోనేసాడు.ఏదో ఒకటి చెయ్యాలి. తండ్రిని దక్కించుకోవాలి. తమ చదువు, సంసారం సుఖంగా సాగాలి!!

రాత్రి అందరూ అరకొర మాట్లాడుకుంటా తిండి తిన్నాం అనిపించి పడుకున్నారు.

సగం రాత్రి పశువులు కోళ్ళ అరుపు విని గబుక్కున లేచాడు కార్తికేయుడు. తండ్రి మంచం వైపు చూస్తే కాళీగా ఉంది. గుండెలు దడ దడ లాడాయి.అమ్మా చెల్లి లేస్తారేమోనని గుట్టు చప్పుడుగాకుండా నాలుగు వైపులా వెతికి పొలం వెళ్ళాడు. అక్కడ సమాధులు మీద పడి ఉన్న చంద్రయ్య కనుపించాడు. పరుగెత్తుకెళ్ళి లేవదీస్తే ఆపులేకుండా ఏడుస్తున్నాడు. ఇంతలో తల్లి చెల్లి ఇద్దరూ పరుగెత్తుకు వచ్చారు.

ఎంతో సముదాయించి ఎన్ని విధాల చెప్పి, చివరకు మందుతాగి మీ కళ్ళముందు చస్తామంటే లేచి వచ్చాడు. దారిలో కార్తికేయుడు," అమ్మా! చీకటితో తిరుమలకు పోతున్నామే ! అన్నీ సర్దు!!' అన్నాడు.

వరమ్మ ఆలోచిస్తూ కొడుకు కళ్ళల్లోకి చూసి మారు మాట్లాడ లేదు. ఉల్లో వాళ్లకు ఉదయం ఇంట్లో ఎవరూ కనిపించలేదు .ఎక్కడికి వెళ్ళారో ఎవ్వరికి తెలియదు.

కొనాలనుకున్న వాళ్ళు రోజూ తిరుగుతున్నారు,ఎం ఆర్ వొ. వి ఆర్వోలను సంకలో వేసుకుని.పట్టాలు మర్చేయ్యమని, కంచె నాటాలని డబ్బులు ఇస్తున్నారని ఊళ్లు వాళ్ళు చెవులు కొసు కుంటున్నారు. చంద్రయ్య వాళ్ళు ఎప్పుడొస్తారో ? ఈ లోగా ఈ ఏం ఆర్వో లు, వి ఆర్వోలు కుమ్మక్కయి పొలం ఆక్రమించుకుంటా రేమో? మరేదయినా ఘాతకం చేసారేమో అని నానా రకాలుగా మాట్లాడుకోసాగారు. కానీ చందరయ్య ఆప్తుడు సుందరయ్య గట్టిగా అడ్డు నిలిఛి ఊరినంతా ఒకటి చేసాడు..

వారం రోజుల తరువాత గంపడు ఏడుకొండల స్వామి లడ్డులతో సంతోషంగా దిగారు చంద్రయ్య వాళ్ళు. ఎందుకో ఆ ఆనందం అని ఆశ్చర్య పోయారు. సాయంత్రంలోగా ఎండోమెంట్ వాళ్ళు వచ్చి పోలం ముందు దేవుని పొలం ఆక్రమిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకో బడును అని ఏం ఆర్వో బోర్డులు నాటించడం చూసి నోరెళ్ళ బెట్టారు. అంత ధర గల పోలం , కనక వర్షం కుమ్మరించేది...ఊరికే ..దేవుడుకి దానం ?? తెలివి తక్కువ దద్దమ్మలు లక్ష్మీదేవిని కాలదన్నారు మెతుకు పుట్టదు.అని ఎగతాళిగా వక్రీకరించారు. ఇక ఎవ్వరూ ఏం చెయ్యలేరు. ఎవ్వరైనా జుట్టు పీక్కోవాల్సిందే .తిక్కకుదిరింది రౌడీ గాడిదలకు అని కొందరు సంతోష పడ్డారు.

ఉదయం లేస్తూనే కార్తికేయుడు, పుట్టమ్మ , వరమ్మ సద్ది తీసుకుని పొలం ఎల్లారు. అదేవిటి? పిచ్చి పని..పిచ్చి పని అంత డబ్బు , దేవుడికి లేకనా అని ఎందరడిగినా నవ్వుకుంటూ వెళ్ళారు. సుందరయ్య మాత్రం సంతోషంగా వాళ్ళతో నడుస్తూ చంద్రయ్యతో," మావా! నీ అప్పులు తీర్చడానికి వడ్డీ లేకుండా నేనిస్తా డబ్బు." అన్నాడు. "సర్దుకుంటాములే మావా! కొత్త రకాలు సేంద్రీయ సాగు చెయ్యాలనుకుంటున్నాము." అన్నాడు కార్తికేయుడు.

సుందరయ్య చంద్రయ్య చేతులు పట్టుకుని తృప్తిగా నవ్వుకుంటూ ,“ జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి అనే మాటను నిలబెట్టి చిరంజీవివయ్యావు." అని ఆనందంతో పొంగిన కన్నీళ్లు తుడుచుకున్నాడు . డబ్బుకంటే, స్వర్గం కంటే గొప్పదయిన కూడుపెట్టిన భూమాతను , పుట్టిన గడ్డను దక్కించుకున్న చంద్రయ్యకు వేయిసార్లు మొక్కాడు. అతను

చిరంజీవి. డబ్బు తుచ్ఛమైంది. క్షణికమైంది. జన్మనిచ్చిన తల్లి ,పుట్టిన గడ్డ స్వర్గానికంటే మించింది అని గ్రహించిన వివేకి, త్యాగధనుడు అనుకుంటూ భార్యతో కూతురుతో సంతోషాన్ని పంచుకోవడానికి ఇంటి ముఖం పట్టాడు !!!

## ఊయల

తటవర్తి నాగేశ్వరి

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో బహుమతి పొందిన కథ

"అంత విలువైన ప్లేస్ లో ఊయల ఎందుకండీ.?" అంది లహరి.

"ఏదో అమ్మా, నాన్న ముచ్చటపడి వేయించుకొన్నారు.. వదిలేద్దూ.." అన్నాడు సూర్యనారాయణ.

అలా అతడు భార్యకు నచ్చచెప్పడం పదోసారి.

"అంతగా ఊయలలో ఊగాలని ఆ ఆదిదంపతులకు ఉంటే... అదేదో వరండాలో వేయించండి. ఎంచక్కా ఊగుతూ వాళ్ళు ఎంజాయ్ చేస్తారు"అంది లహరి వ్యంగ్యంగా.

భార్యని విచిత్రంగా చూశాడు."ఎవరో ఒకరు ఇంటికి వస్తూ వుంటారు పోతూ వుంటారు.వరండాలో ఊయల వేసుకొంటే మాత్రం ఏం ఎంజాయ్ చేయగలరు...?" అన్నాడు సూర్యనారాయణ.

"నా ఉద్యేశ్యం మీకు అర్థం కావడం లేదు.."అని భార్య ఏదో చెప్పబోతుంటే..

"ఆ విషయం వదిలెయ్యి.." అని చేతులెత్తి దండం పెట్టాడు.

"మీది మొద్దు బుర్ర..ఏదీ ఒక పట్టాన అర్థమై చావదు" గొణిగింది లహరి.

భార్యాభర్తల మాటలు , హాల్లో వున్న సరస్వతికి వినిపిస్తూనే వున్నాయి.ఆ సమయంలో ఆమె భర్త రఘురాం కూరగాయల కోసం మండీకి వెళ్ళి వున్నాడు.సాయంత్రం ఐదు కాగానే ఈశాన్య దిశలోని, ఆ ఖాళీ స్థలం లో వేసి వున్న ఆ

ఊయలలో ఊగడం ఆ దంపతులకు ఇష్టం. భార్యని ఆ ఊయలలో కూర్చోపెట్టి రఘురాం ఊపుతుంటాడు. ఒక్కోసారి రఘురాం కూర్చుంటే సరస్వతి ఊపుతుంది.

ఆ ఊయలలో కూర్చొని వున్నప్పుడే , భర్తకి ఇష్టంగా "టీ" తెచ్చి అందిస్తుంది సరస్వతి.

ఒక్కోసారి సరస్వతి ఊగుతూ ఎంజాయ్ చేస్తుంటే , రఘురాం తానే స్వయంగా వేడి..వేడి పకోడీలు వేసుకొని తెచ్చి ఇస్తుంటాడు. ఇద్దరూ ఊయల్లో కూర్చొని తింటారు. కొత్తగా పెళ్లైన దంపతులు కూడా అంత సంతోషంగా కన్పించరు. ఇద్దరికీ ఇష్టమైన ప్రదేశం అది. పాతికేళ్ళ సంసారిక జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు ఆ దంపతులు. అప్పట్లో కంపెనీకి అర్ధాంతరంగా లాకౌట్ ప్రకటిస్తే రఘురాం తల్లడిల్లి పోయాడు. ఏం పని చేసి పిల్లలని కాపాడుకోవాలి? చదివించు కోవాలి అని బెంగపడుతుంటే సరస్వతే ఆధారం అయ్యింది. కుట్టు మెషిన్ మీద పది మంది బట్టలు కుడుతూ , కుటుంబాన్ని నిలబెట్టింది. అప్పట్లో కరీంనగర్‌లో వుండేవాళ్ళు.ఒక మిత్రుడు ద్వారా జాబ్ రావడంతో, హైద్రాబాద్ కి షిఫ్ట్ అయ్యారు. సరస్వతి కుటుంబం పట్ల అంత బాధ్యతగా వుండేది.

అందుకే రఘురాంకి , భార్యపైన ఎనలేని ప్రేమ. సూర్యనారాయణతో పాటు ఆమనికి కూడా వాళ్ళు జన్మనిచ్చారు. ఆమనికి చిన్న వయస్సులోనే పోలియో సోకింది. భార్యాభర్తలు అల్లాడి పోయారు. సరస్వతి ఎంతో ఓర్పుతో కూతుర్ని చూసుకొనేది.ఇంటిని సముదాయించుకుంటూనే పిల్ల ఆలనాపాలనా చూసుకొనేది. ఒక్క పోలియో అయితే అంత సమస్య అయ్యేదికాదేమో..మెంటల్ మెచ్యూరిటీ కూడా తక్కువగా వుండేది ఆమనికి. బిడ్డల్ని కనురెప్పగా చూసుకొనేది సరస్వతి.

"ఇలాంటి బిడ్డను మాకెందుకు ఇచ్చావురా భగవంతుడా" అని కూతుర్ని చూసుకొని రఘురాం వాపోతే

"బంగారం లాంటి కొడుకుని కూడా ఆ దేవుడే కదండీ ఇచ్చింది. భగవంతుడు ఏమిస్తే అది స్వీకరించడం మన విధి.." ఓదార్చేది."మనుషుల సహనాన్ని పరిక్షించేందుకే భగవంతుడు ఇలా చేస్తుంటాడు. అలా బెంగ పడితేఎలాగండీ."అని కూడా అనేది.

మానసికంగా మెచ్యూరిటీలేకున్నా సూదంటు రాయిలా ఆకర్షించే రూపం ఉండడంతో ఆమనికి పెళ్లి సంబంధం కుదిరింది.కూతురికి పెళ్లి చేసిన తర్వాత సూర్య నారాయణ కెరీర్ కూడా వాళ్లకో సవాలుగా నిలిచింది. సూర్యం పెద్దగా చదువు మీద శ్రద్ధ పెట్టేవాడు కాదు.సరస్వతి దగ్గరుండి చదివించేది. ఎట్టకేలకు బి.టెక్ చేసి ఒక కంపెనీలో జాబ్ సంపాదించుకున్నాడు.లహరి ఇంటి కోడలయింది. అత్తా మామ అన్యోన్యత ఆ అమ్మాయికి ఎందుకో నచ్చేది కాదు.యువ దంపతుల్లా వాళ్లు తనకి కన పడేవాళ్లు. అంత ప్రేమ తనపై సూర్య చూపడం లేదని కూడా లహరి దెప్పుతూ వుండేది.

"మీ అమ్మా నాన్న చూడు... చిలుకా గోరింకల్లా ఎంతో చక్కగా కబుర్లు చెప్పుకుంటుంటారో. మీరు ఆఫీసులో పనిచేసేదే కాకుండా ఇంటికొచ్చి కూడా ఆ ల్యాప్‌ట్యాప్ ముందేసుకొని కాలక్షేపం చేస్తారు" అనేది.

"వర్క్ పెండింగ్‌లో వుంటే ఏం చేయాలి లహరీ.." అనేవాడు.

అన్నింటికంటే కూడా , అత్తామామ ఆ ఊయలలో కూర్చొని కబుర్లు చెప్పుకోవడం కిలకిలా నవ్వుకోవడం చూస్తుంటే ఆ అమ్మాయికి గుండె దహించివేస్తూ వుండేది. చీటికి మాటికి గొడవ పెట్టుకొనే తన తల్లిదండ్రులను ఊహించుకొనేది. వాళ్లు ఊహల్లోకి రాగానే అత్తా మామలపై మరింత అసూయ పెరిగేది. వాళ్ల సంపూర్ణ ఆనందానికి కారణమైన ఆ ఊయల తీసివేయించాలన్న నిర్ణయానికి వచ్చింది లహరి.

లహరి ఆలోచనల్లో వుండగానే మావయ్య రఘురాం బయటనుండి వచ్చాడు.

కూరగాయలు భార్య చేతికి ఇస్తూ.."కూరగాయల ధరలు మండిపోతున్నాయ్ సరసూ.."అన్నాడు.

"ఎంత మండినా కొనకా తప్పదూ..తినకా తప్పదు కదా..జీవుడు ఉన్నంతకాలం దేహ చింతన అనివార్యం కదా " అంది వేదాంత ధోరణిలో.

"టమాటాలు వందరూపాయలు అమ్ముతున్నారు. కాస్త జాగ్రత్తగా వాడండి..." చెప్పాడు.

అక్కడికి లహరి వచ్చింది. కూరగాయలు తీసి ఫ్రిజ్‌లో పెడుతూ...

"టమోటా ప్లేస్‌లో కాస్త చింతపండు వేసే సరిపోతుంది కదా మావయ్యా.." అంది.

"అవునమ్మా.ఆ మధ్య ఉల్లిపాయల ధరలు కొండెక్కినప్పుడు కూడా అసలు తాళింపులో ఉల్లిపాయలు వేసుకోవడమే మానేసాంగా" గుర్తు చేసాడు.

"మామా కోడళ్లు కాస్త పొదుపు చర్చలు ఆపండి" అంది కాస్త కోపంగానే సరస్వతి.

భార్య మూడ్ ఎందుకో బాగలేదని అర్థమైంది రఘురాంకి.

"ఇలా పైసా పైసా పొదుపు చేయబట్టే కదా ఇంత ఇల్లు కట్టించగలిగారు అత్తయ్యా" అంది లహరి.

"అవును తల్లీ..బాగా చెప్పావు" అన్నాడు రఘురాం.

"ఇల్లంటే నాలుగు ఇటుకరాళ్లు తలుపు ద్వారబంధాలు కాదు. అనురాగం ఆత్మీయత రంగరించుకున్న ఒక పొదరిల్లు." అంది సరస్వతి.

"మీ అంత పొయిట్రీ నాకు రాదులే అత్తయ్యా.అయినా మీ పొదరిల్లు కాన్సెప్ట్ కి భంగం ఏమైనా కలిగిందా.." అంది లహరి.కోడలి వైపు అదోలా చూసింది సరస్వతి.

"పుస్తక పరిజ్ఞానం మీ అత్త మన దగ్గరే బాగానే ప్రదర్శిస్తుందిలే తల్లీ... కాస్త కాఫీ కలిపి పట్టుకు రామ్మా" అన్నాడు రఘురాం.

"అలాగే మావయ్య." అని లహరి వంటగదిలోకి వెళ్లింది.

కోడలు లోపలికెళ్లాక "ఈ ఇంట్లో ఏ మూల చూసినా నువ్వే కన్పిస్తావు సరసూ" అన్నాడు.

"గుర్తు కు రావడం ఏంటండీ.. " అంది వింతగా భర్తను చూస్తూ.

"నీ కొడుకు ఒక ప్రపోజల్ తెచ్చాడు." చెప్పాడు అంకురార్పణగా వంటగదివైపు చూస్తూ...

కోడలు వినడం లేదని నిర్ధారించుకున్నాక "ఈ ఇల్లు అమ్మేసి గేటెడ్ వే కమ్యూనిటీలో అపార్ట్మెంట్ తీస్తాడట. ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బుని డౌన్ పేమెంట్ కింద కడతాడట." చెప్పాడు.

పక్కలో బాంబు పడ్డట్టు అదిరి పడింది సరస్వతి. "వాడికి ఇదేం బుద్ధి..?" గొణుక్కుంది.

"భార్య ఉయ్యాల మాత్రమే కూల్చాలనుకుంది. మొగుడు ఇల్లే లేపెయ్యేలనుకుంటున్నాడా?" అనుకుంది స్వగతంలో. కొడుకు కోడలు మధ్య జరిగిన సంభాషణ చెప్పాలనుకుంది.

"ఇల్లే అమ్మాలనుకున్న తర్వాత ఇక ఉయ్యాలదేముంది..?" అనుకుంది.

ఇంటికి స్థలాన్ని సమకూర్చుకోవడానికి ఆ తర్వాత ఇల్లు కట్టుకోవడానికి ఎంత కష్టపడ్డారో అంతా గుర్తుకొచ్చింది సరస్వతికి. సకాలంలో అద్దె కట్టకపోతే , ఇంటి యజమానులు మాట్లాడే మాటలు చాలా అవమాన కరంగా ఉండేవి. "ఇంత ఇంటికి రెంట్ కట్టలేకపోతే , ఎక్కడన్నా మీ స్థాయికి గుడిసె దొరికితే అందులో చేరిపోండి" అనేవారు కొందరు. "ప్రభుత్వం మీలాంటి 'పేదలకోసమే ఇల్లు కడుతుంది ధర ఖాస్తు చేసుకోండి." అని సలహా ఇచ్చేవాళ్లు మరికొందరు. భర్త సంపాదించిన డబ్బును పొదుపు చేస్తూ , తాను కూడా ఎంతో కొంత సంపాదిస్తూ.. దాచుకున్న డబ్బుని చీటీ వేసి , ముందుగా స్థలం కొన్నారు. పిల్లల్ని ఒక వైపు చదివించుకుంటూనే మరోవైపు పొదువు చేస్తూ , ఇల్లు మొదలు పెట్టారు.ఇంటికి ఈశాన్యం వైపు జాగా మిగిల్చి , అందులో ఊయల వేయాలన్నది సరస్వతి కోరిక. రఘురాం భార్య కోరికను కాదనలేదు. ఖాళీ జాగాలో రెండు ఇనుప స్తంభాలు పాతి, బలంగా ఉండే విధంగా పెద్ద చక్క బల్లతో ఊయల పెట్టించాడు.

సరస్వతి జీవితంలో తనని ఏమీ కోరుకోలేదు. రక్త మాంసాలు కరిగించి తనకీ,పిల్లలకీ చాకిరి చేసింది. వానప్రస్థ దశలో కోరిన చిన్న చిలిపి కోరిక ఇష్టంగా తీర్చాడు. ఇల్లు అమ్మేస్తే తను ఇష్టపడి ఏర్పాటు చేసుకొన్న ఊయల ఆ గేటెడ్ వే కమ్యూనిటీ అపార్ట్మెంట్ లో వేసుకోవడం సాధ్యంకాదు. అసలు అంత జాగా కూడా వుండే అవకాశం ఉండదు. అందుకే ఇల్లు అమ్మాలన్న కొడుకు ఆలోచనకు 'నో ''చెప్పాలని నిర్ణయించుకున్నాడు రఘురాం.

"ప్లాన్ రివర్స్ అయిందన్నమాట" అంది లహరి.

"ఏంటీ..?" అన్నట్టు చూశాడు సూర్య నారాయణ...

"అదే.. ఇల్లు అమ్మి గేటెడ్ వే కమ్యూనిటీలో ఇల్లు కొనాలనుకున్న నీ ప్లాన్ రివర్స్ అయిందన్న మాట.."

"ఇందులో ప్లాన్ ఏముంది. ఇల్లు అమ్మడం ఇష్టం లేదని నాన్నచెప్పాడు. కాదనే హక్కు నాకెక్కడిది"అన్నాడు

"బుద్ధావతారం.." అనకుంది.

భార్యముఖం మాడిపోవడం చూసి "నువ్వేమీ నిరుత్సాహ పడకు. అమ్మతో కూడా మాట్లాడుతాను." చెప్పాడు.

"మీ నాన్న మాట , మీ అమ్మ అంగుళం కూడా జవదాటదు.." అంది.

"అదేం లేదు..అమ్మ నా మాట వింటుంది." చెప్పాడు ధీమాగా.

"చూద్దాం.." అంది తలెగరేస్తూ.

తండ్రి బయటకు వెళ్లడం చూసి తల్లిని కదిలించాడు సూర్యనారాయణ.

కొడుకు వైపు ఎగాదిగా చూస్తూ. "ఇంత విశాలమైన ఇల్లు , మంచివాతావరణం అక్కడ దొరుకుతుందంట్రా.." అంది.

"అక్కడే అన్నీ దొరుకుతాయ్ మమ్మీ... ఇలా కూరగాయలకు నాన్న మార్కెట్‌కువెళ్లనవసరం లేదు. పచారి కొట్టు సామాన్లు కూడా వెళ్లనక్కరలేదు. అన్నీ మన దగ్గరకే వస్తాయ్" చెప్పాడు.

"అక్కడ జైల్లో ఉన్నట్టు వుంటుందిరా మీ నాన్నకు అసలు ఊపిరి ఆడదు. కాలూ,చెయ్యి ఆయనకు ఒక దగ్గర వుండదు కదా... ఇదిగో ఇప్పుడు చూడు..కూరగాయల కోసమని వెళ్తాడా , రెండుమూడు గంటలు 'స్నేహితుతో బాతాఖానీ వేసుకొని వస్తాడు. ఆయనకదో ఆనందం." అంది.

మాట్లాడేది ఇక ఏమీ లేక భార్య దగ్గరకొచ్చి అదే చెప్పాడు.

"ఎక్స్పెక్ట్ చేశా.." అంది లహరి.

భార్యవైపు సూర్య అదోలా చూశాడు.

"అవునండీ నేను ఊహించినట్టే ఆమె మాట్లాడారు.."అంది లహరి.

"సరేలే , ఇక ఆలోచించకు. గేటెడ్ వే కమ్యూనిటీలో చేరే అదృష్టం ఇప్పటికి లేదనుకుంటాను"అన్నాడు.

లహరి ఆలోచిస్తూ "మనస్సుంటే మార్గం ఉండకపోతుందా " అనుకుంది.

గేటెడ్‌వే కమ్యునిటీ ఆలోచన భర్తకు చెప్పింది లహరే.

కొడుకు అభ్యర్థన గురించి చెప్పింది సరస్వతి. "అమ్మని రాయబారిగా పంపాడా?" అడిగాడు.

"రాయబారం ఏం లేదు.వాడి మనసులో మాట చెప్పాడు.నే చెప్పాల్సింది చెప్పాను." అంది.

"ఏం చెప్పావు ?"అడిగాడు.

"మీతో ఎందుకు చెప్తాను?" అంది నవ్వుతూ. భార్యవైపు సుదీర్ఘంగా చూసాడు. చెదరని చిరునవ్వు ఎన్ని కష్టాలు వచ్చినా బెదరని ధీరత్వం సరస్వతికే సొంతం. సంసారం ఈదడానికి ఎన్నో సమస్యలను ఎదుర్కొన్న సహనశీలి

తను.క్షమయా ధరిత్రి అన్న పదానికి నిలువెత్తు నిదర్శనం తను. ఎవరినీ కోప్పడినట్టు తను చూడలేదు.ఎంతో ఓర్పు ఆమె స్వంతం.కాలం అంచుల వెంట నడుస్తూ ఇచ్చే కొండంత ఓదార్పు తనకి ఊరటనిస్తుంది. కరణేశు మంత్రిలా తానిచ్చే ప్రతి సలహా జీవిత పర్యంతం వరకూ వినియోగపడుతూనే వున్నాయ్. శయనేశు రంభ అని ఎందుకన్నారో తెలీదు కానీ తనతో సరస్వతి గడిపిన ప్రతి నిముషం ఒక అద్భుత ఘడియే. మధురమైనరోజే. సంపూర్ణ స్త్రీ తత్వంతో తొణికిసలాడే తన భార్య సరస్వతి ఆ రోజు కుప్పకూలినప్పుడు తనకి ఊపిరాడలేదు.

సూర్యకి అప్పటి కింకా పెళ్లి కాలేదు. జాబ్‌లో చేరాడు. ఆ సమయంలో ఆఫీసుకి వెళ్లివున్నాడు.

అన్ని పరిక్షలు అయ్యాక డాక్టర్లు “ఎన్ని రోజులు బ్రతుకుతుందో చెప్పలేం "అన్నారు.

తనకి వినపడలేదని అనుకున్నాడు కానీ తను చప్పున భర్త చేయి పట్టుకొని “వాడికి చెప్పకండీ..” అంది.

“చెప్పకుండా ఎలా ఉండగలనూ సరసూ” అన్నాడు.

“చెబితే వాడి గుండె అసలు తట్టుకోలేదండీ” అంది

దిగాలుగా చూశాడు. అన్నింటికీ తనపై ఆధారపడే కొడుకు ధ్యాసని మరో స్త్రీ వైపు మళ్లించాల నిర్ణయించుకొని “ నెలలో వాడి పెళ్లి చూడాలని వుంది” అంది.

“అంత తొందరగా సంబంధం ఎక్కడ దొరుకుతుంది?” అన్నాడు.

దూరపు బంధువు లహరి గురించి చెప్పింది. తనని ఆ మధ్య ఒక పెళ్లిలో చూసిన విషయం గురించి చెప్పింది. లహరి తలితండ్రుల గురించి రఘురాంకి తెలుసు. విడాకుల వరకూ ఆ పిల్ల తల్లితండ్రులు వెళ్లారు.

“ఆ ఇంటి సంబంధం మనకెందుకు సరసూ..?” అన్నాడు.

“తల్లిదండ్రుల తప్పులకు పిల్లల్ని శిక్షిస్తారా?” అంది. రఘురాంకి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

“పిల్ల బంగారు బొమ్మ లా వుందండీ ”అని భర్తని కన్విన్స్ చేసింది.

తనకి తెలిసిన సమాచారం చెబుతూ “వంటా వార్పు లో అమ్మాయి మంచి ప్రావీణ్యురాలే” అని ప్రమోట్ చేసింది.రఘురాం “ఊ'కొట్టక తప్పలేదు.

సూర్యనారాయణ “నీ ఇష్టం మమ్మీ..” చెప్పాడు.

నెల తిరిగేసరికల్లా కొడుక్కి పెళ్లి చేశారు,.సరస్వతి ప్రాణం గట్టిదే... ప్రాణం నిలిచింది.

“చిన్నప్పుడు ఆరుబయట వెన్నెల్లో ఊయల ఊగాలని నాకు ఉండేది. అదిగో అక్కడ ఒక ఉయ్యాల నాకోసం వేయించండి ” అంది.

రఘురాం కాదనకుండా ఆ పని చేశాడు. ఊయల ఊగేప్పుడు సరస్వతి కళ్లలో మెరిసే మెరుపంటే అతడికి చాలా ఇష్టం. ఏరికోరి కోడల్ని తెచ్చుకుంటే కోడలు తల కొరివిలా మారిందా? సరస్వతి తల విదిల్చింది.

"సరే నువ్వు చెప్పినట్టే ఇల్లు అమ్మే ఆలోచనను వాయిదా వేద్దాం నాన్నా. కానీ.." అని ఆగాడు సూర్య.

భర్త పక్కన ఉన్న లహరి ఎంటరయిపోయి "ఆ ఊయల కట్టిన స్థలంలో రెండు షాపు రూంలు వేయిస్తే అద్దె వస్తుంది కదా మావయ్యా.." అంది.

రఘురాం కి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

"ఊయల కావాలంటే పెరట్లో వేయిస్తాం " అంది.

"పెరట్లో ఇరుకు స్థలంలో ఊయల ఊగడానికి , ఇలా ఆరుబయట విశాలమైన స్థలంలో ఊగడానికి తేడా లేదా? అలల్లా తేలి వచ్చే మలయ పవనం మధ్య ఊయల ఊగడం అనే ఇష్టమైన ఆ ప్రక్రియ సాగుతుంటే సరస్వతి మనస్సు ఎంతో ఆనంద పడుతూ వుంటుంది. ఎందుకు వీళ్లకి ఈ స్థలం మీద దృష్టి మళ్లింది. ఈ ఆఖరి రోజుల్లో సరస్వతిని ఆనందపెట్టకుండా ఎలా ఉండగలడు..?"

రఘురాంలో ఎడతెరిపి లేని ఆలోచనలు. "నిన్న వీరాస్వామి దారిలో కన్పించాడు నాన్నా. తన సిమెంట్ వ్యాపారం కోసం బస్తాలు వేసుకోవడానికి మన ఊయల పెట్టిన స్థలంలో షాప్‌రూంల్లా షెడ్ వేసిస్తే తీసుకుంటానని చెప్పాడు. అద్దెకూడా ఇరవై వేలకు పైగా ఇస్తానన్నాడు. పైగా షాపు రూము కట్టడానికి అయ్యే ఖర్చు కూడా తనే భరిస్తానని చెప్పాడు.మనకిచ్చే రెంట్‌లోనే అతడి అప్పు కట్ చేసుకొంటానని చెప్పాడు" చెప్పాడు, సూర్య నారాయణ.

"ఇంతోటి స్థలానికి అంత అద్దె రావడం అంటే మాటలు కాదు కదా మావయ్యా.." అంది లహరి.

వీరాస్వామి లహరికి దూరపు బంధువు కూడా. సరస్వతి వింటూ నిల్చొంది.

"అందరి కళ్లూ ఈ స్థలం మీదే" గొణుగుతూ బయటకు నడిచాడు రఘురాం.

"ఆయనకి ఇష్టం లేని పనిని చేయమని ఎందుకు ఫోర్సు చేస్తారు? " అంది సరస్వతి.

"మావయ్యగారి మీద ఎందుకు చెప్తారు , మీకిష్టం లేదని చెప్పండి అత్తయ్యా.." అంది లహరి కోపంగా.

కోడలి వైపు చురుగ్గా చూసింది సరస్వతి.

అదేం పట్టించుకోకుండా "ఈయనగారి సంపాదన మీ కీమో థెరఫీకి, మామయ్యగారి మందులకే సరిపోతుంది. చంద్రునికో నూలుపోగులా ఈ స్థలం ఉపయోగపడి నాలుగు డబ్బులు పోగు పడితే అవి మీ అబ్బాయికి వేడినీళ్లకి చన్నీళ్లలా ఉపయోగపడతాయి కదా..!" అంది లహరి.

"మీ మావయ్యకి సిమెంట్ వాసన పడదు. ఆయనకి ఆస్తమా సమస్య కూడా వుంది. సిమెంట్ గోడౌన్ ఎలా కడతారు?" అంది సరస్వతి.

"దేశంలోని అన్ని వ్యాధులు మన ఇంట్లోనే ఉన్నట్టు వున్నాయ్" అంది లోగొంతుకతో లహరి.

సూర్యనారాయణ భార్యవైపు కాస్త కోపంగా చూశాడు.

"నామీద కారాలు మిరియాలు నూరడం కాదు. మీ అమ్మా నాన్నల దగ్గర చూపండి మీ ప్రతాపం." అని లోనికి వెళ్లింది.

"ఏం చెప్పినా కాదనడానికి మీరు నిర్ణయించుకున్నారా అమ్మా" అన్నాడు సూర్య నారాయణ.

కొడుకు వైపు చురుగ్గా చూసింది సరస్వతి...

"లేకుంటే ఈ వయస్సులో ఊయల ఊగాలనే కోరిక ఎందుకమ్మా. ఆ ల్యాండ్ ప్లేస్ ఇస్తే , షాపు రూంలు కట్టుకుంటాం కదా? పైగా లహరి చెప్పిన ప్లాన్ కూడా బాగుంది. మొన్నామధ్య వీరాస్వామి ఇంటికి వెళితే ఆయన భార్య కూడా లహరికి ఈ సలహానే ఇచ్చిందట."

సరస్వతి కొర కొరా చూసింది.

"ఏదో ఇంట్లో బోరుగా వుంది అలా మా బంధువు వీరాస్వామి ఇంటికి వెళ్లొస్తా అత్తయ్యా అంటే వెళ్లమని తాను చెప్పింది. ఇలా రాయబేరాలు నడుపుతుందని తను అనుకోలేదు.

"రాత్రికి మీ నాన్నతో మాట్లాడుతాలేరా.." అంది సరస్వతి.

★★★★★★★★★★★★★

"నాది పోయే ప్రాణమేగా , నాకోసం ఆ స్థలం ఎందుకు వృధా చేస్తారు పిల్లాడి మాట వినండి.." అంది సరస్వతి. భార్య వైపు తదేకంగా చూశాడు రఘురాం.

ప్రక్కరోజు ఎర్లీమార్నింగ్ ఒక నిర్ణయానికి వచ్చి వెళ్లి కొడుకూ కోడలు పడుకున్న గది దగ్గరకెళ్ళి తలుపు తట్టాడు. అప్పటికింకా సరస్వతి నిద్ర లేవలేదు.

"ఏంటి నాన్నా?" అని కళ్లు నులుము కుంటూ బయటకు వచ్చాడు సూర్య నారాయణ. విడిపోయిన జుట్టు ముడి వేసుకుంటూ , లహరి కూడా వచ్చింది.

"ఏంటి మావయ్యా, అత్తయ్య కేమయినా నలతగా వుందా?" అడిగింది.

"కాదమ్మా.. నాకే నలతగా వుంది" అని కొడుకు వైపు తిరిగి "మీరు ఇల్లు ఖాళీ చేసి వెళ్లండ్రా" అన్నాడు.

పిడుగు పడ్డట్టూ ఇద్దరూ అదిరి పడ్డారు. "ఏంటి నాన్నా?" అని అడిగాడు సూర్య.

"నువ్వు సరిగ్గానే విన్నావురా. నీకు జీతం వస్తుంది. అద్దె కట్టుకోలేని స్థితిలో లేవు. దయచేసి ఇల్లు ఖాళీ చేసి వెళ్లండి. నేను ఇలా ఖాళీ చేయమని చెప్పిన విషయం మీ అమ్మకి చెబితే నా మీద ఒట్టే."

చెప్పి వెనుతిరిగాడు రఘురాం. వారం రోజుల వ్యవధిలో సూర్య ఇల్లు ఖాళీ చేశాడు.

"ఇంత సడన్‌గా ఈ నిర్ణయం మేంట్రా ?" అడిగింది సరస్వతి.

"కంపెనీకి దగ్గరగా ఏదో ఇల్లు చూసుకున్నాడట. వాడి కంఫర్ట్ వాడు చూసుకోవాలి కదా.పోనివ్వు సరస్వతీ" అన్నాడు రఘురాం. లహరి ఏమీ మాట్లాడలేదు.

"ఆ స్థలం వీరాస్వామికి ఇస్తాం లేరా, షాపులకి రెంట్ కూడా వస్తుంది కదా.. " అంది సరస్వతి.

స్థలం ఇవ్వనందుకు వెళ్తున్నాడేమో అనుకొని అంది సరస్వతి,

"ఆ వచ్చే రెంట్లోవో మీరే తీసుకోండి అత్తయ్యా. మీకసలే ఒంట్లో బావోలేదు కదా.." అంది లహరి.

"మంచిదమ్మా. వర్షం వస్తుంది..బయలు దేరండి.." తొందర చేశాడు రఘురాం.

సూర్య తల్లి దగ్గరకు వచ్చి "నువ్వేం బెంగపడకమ్మా..రెండ్రోజుల కొకసారి వచ్చి నిన్నూ నాన్నని చూసుకుంటాం..." అన్నాడు.

"దానిదేముంది లేరా..సిటీలోనేగా మీరుండేది. మాకు చూడాలనిపిస్తే మేమే వస్తాం.మీకు చూడాలనిపిస్తే మీరూ వద్దురు.." అన్నాడు రఘురాం.

కొడుకూ కోడలు లగేజీతో వెళ్లి పోయాక... "మీరేమైనా బెదరగొట్టి పిల్లల్ని వెళ్లగొట్టడం లేదు కదా"అంది సరస్వతి.

"అవేం మాటలే.." అన్నాడు రఘురాం.

"మనస్సు బాగలేదు. ఊయలు ఊపుదురు రండి.." అని ఊయల దగ్గరకి వెళ్లింది సరస్వతి.

నవ్వుతూ వెంట నడిచాడు రఘురాం. ముందురోజు వీరాస్వామిని కలిసి గదమాయిస్తే అతడి పెదవి విప్పి చెప్పిన మాటలు గుర్తొచ్చాయ్ రఘురాంకి.

"నేను చేసే సిమెంట్ వ్యాపారానికి , ఇప్పటికే రెండు గొడౌన్‌లు ఉన్నాయ్ బాబాయ్. మీ స్థలం నేను ఏం చేసుకోను? ఇదంతా మీ కోడలు పిల్ల మా ఆవిడా వేసిన స్కెచ్. ఆ స్థలంలో ఊయల వేసి మీరు ఎంజాయ్‌చేస్తున్నారు కదా. అది చూసి మీ కోడలు కళ్లల్లో నిప్పులు పోసుకుంది. మీతోనే ఆ ఊయల తీసేయించాలనేది మీ కోడలిగారి అంతరంగం. నిజానికి ఆ స్థలంలో షాపు రూంలు కడితే ఎవరైనా కళ్లకి అద్దుకొని తీసుకుంటారు. ఆ విషయం మీకూ తెలుసు.ఆమె ఆనందానికి వెలగట్టగలిగే షరాబులం కాదు కదా మనం" అన్నాడు వీరాస్వామి.

వీరాస్వామికి , సరస్వతికి ఉన్న అనారోగ్య సమస్య తెలుసు.

"కూర్చొని పది నిమిషాలు అయింది. ఊపరే.." అంది సరస్వతి."

"కాస్త ఉండవే " అన్నాడు రఘురాం తన లుంగీ సర్దుకుంటూ...

# నిష్క్రియత్వం

నవులూరి వెంకటేశ్వర రావు

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

తట్టుకోలేక, పైనుంచీ కాలేజీ డౌన్ రోడ్డు దొర్లి దొర్లి వచ్చి దానిని ఆకర్షించే మెయిన్ రోడ్డును కలిసే చోట, దక్షిణం వైపు ఫుట్ పాత్ చివర నిలబడున్నాడు కోదండం, మెయిన్ రోడ్డును తనివితీరా చూస్తూ. కళాశాల ఇసుకకొండ మీద ఉంది. దాని రాతి భవనం మీది నుంచి పక్షికైతే ఒక నిముషం చాలు సముద్రాన్నిచేరడానికి. మనిషికి రెక్కలు లేవు.

కొంచెంగా కాలేజ్ రోడ్డు వైపు తలతిప్పి కిలకిలరావాలు చేస్తున్న ఆడపిల్లలను చూసాడు. కళాశాల నుంచీ నడిచొచ్చి వివిధ కారణాల వాళ్ళ అక్కడ నిలబడ్డ ఆడపిల్లల్లో ఒకమ్మాయి మీద పడిందతని దృష్టి. చంద్రుడుంటే ఆకాశంలో ముందు దానినే చూసినట్టు. క్షణాలలో అతని మనసు వర్తమానగోడ ఇవతలి నుంచీ గతంలోకి తొంగి చూసింది. పీలగా, తీరని ఆకలి పీడిస్తు న్నట్టు బడిలో కనిపిస్తుండే పదేళ్ల పిల్ల వెంటనే గుర్తుకు వచ్చింది. ఆ పిల్లే ఇపుడు ఇరవై ఏళ్ళు పైబడిన ఈ అమ్మాయి అనిపించింది. ఇప్పుడూ ఆకలితో బాధపడుతున్నట్టే ఉంది. పీలాగానే ఉంది – వాటిని మార్చే శక్తి కాలానికి లేనట్లు. ఆమె అవునాకాదా అన్నశంక మిగిలుంటే నిమిషం అవకుండానే పటాపంచలయ్యిందది.

ఆ మెరుపు పదమూడో నెంబరు బస్సు రాంగానే క్షణంలో జొరబడి మాయమయింది. అతని మనసును చెంగుకు ముడేసుకుని పోతున్నట్టు అనిపించి ఆశ్చర్యపోయాడు. అపుడు ఒకరితో ఒకరికి పరిచయమున్న జ్ఞాపకం లేదు. దశాబ్దం క్రితం ఆమెను చూసుండాలి. ఈ ఊళ్ళో ఆమె అతని కంటపడడానికి నాలుగేళ్లు పట్టింది. ఇక్కడ మూడు లక్షల జనాభాయేవున్నా. అర్ధ శతాబ్దం పడుతుంది తిరిగి ఆమె కంట బడటానికి. కంటబడక పోతేనేమి? అతని దగ్గిరే జవాబు లేదు. అతని కళ్ళుతీసిన ఛాయాచిత్రం అతని మనోఫలకం పై ముద్రితం అయ్యింది. ఊహలూ దానితో మిళితమయ్యాయి.

రాగి రంగు పలుచటి జుట్టు. చామంతి పువ్వు లాంటి కుచ్చుతో అంతమైన జెడ. వెనుకకు దువ్వుకున్నా తిరుగుబాటు చేసి, నుదుటిపై దాడి చేసే ముంగురులు. నునుపుదనం లేని ఎర్రటి ముఖం. జెవురిస్తే తుమ్మల్లో పొద్దు గుంకినట్టుంటుందేమో. బద్ధకపు కనురెప్పలు. ఎదుటి వాడిని గుండె లోతులలోకి చూస్తున్నభ్రమను కలిగించే కనులు.

పలుచటి పెదవులు. బత్తాయి పండ్లంత వక్షోజాలు. వాటినే మోయలేక ఒంగిన బలహీనపు నడుము. గట్టి ఆలింగనంతో ముక్కలై రాలిపోయేంత పెళుసుగా కనిపించే శరీరం. తొంగి చూసే దాచుకున్న గర్వం. ఆమె రూపం అతన్నిఆకర్షించింది. అందర్నీ ఆమె ఆకట్టుకో లేక పోవచ్చు.

మధ్యపాపిట తీసి వెనుకకు దువ్విన దట్టమైన జుట్టు. కలిసిన కనుబొమలు. కుడి కంటి కింద, ముక్కు దూలం పక్కన నల్లటి పుట్టు మచ్చ, అలాంటి మరొకటి గడ్డంచివర. బక్కపలచటి కోదండం ఎవరి కళ్ళకూ ఆకర్షణీయంగా కనిపించడు అని చెప్పడం కష్టం. ఆమె కోదండాన్నిఆకర్షించ గలిగినపుడు, అతనూ ఆకర్షించొచ్చు ఆమెను కాకపోయినా మరొకరిని. చూసే కళ్ళలోనే అందం, ఆకర్షణా ఉండేది.

అతనూ, ఆమే ఒకే ఊళ్ళో ఒకే ఉన్నత పాఠశాలలో చదివారు. ఆమె తన చదువును అక్కడే పూర్తి చేసుండక పోవచ్చు. మధ్యలో ఏ కారణాల వల్లో – బహుశా తండ్రి ఉద్యోగం కారణంగా – ఈ ఊరు చేరుండొచ్చు. ఒక సంవత్సరం ప్రీ యూనివర్సిటీ కోర్సు చదివి పై చదువులు చదవాలనే అత్యాశతో ఈ ఊరు వచ్చాడు కోదండం. ఆమె చదువుతున్నకళాశాలలో, బహుశా ఆమె చేరిన సంవత్సరమే, సీటు దొరకలేదు, నూట యాభై రూపాయలు కళాశాల రుసుము చెల్లించే అవకాశాలు లేక చదువును సముద్రంపాలు చేసి ఒక సంవత్సరం ఒంటరిగా, సోమరిగా గడిపాడు వెలమపేటలో. ఆ కాలంలో ఎన్నో వయసుకు మించిన ఆలోచనలు కలిగాయి, మనసంతా విషంలా నైరాశ్యం వ్యాపించి మరణంతోనే పోతానంది. దేనికీ పూనుకోడానికి అవసరమైన చొరవా, ధైర్యం లేకుండా పోయాయి. ఆ సంవత్సరపు వ్యక్తిత్వ లక్షణాలు స్థిరపడ్డాయి. ఈ ఊరొచ్చిన సంవత్సర మూడు నెలలకు గుమస్తాగా ఒక ప్రభుత్వ సంస్థలో చేరాడు.

ఆ కొన్ని నిముషాలపాటూ ఆమెను చూసినపుడు భవిష్యత్తు మీద ఆమె గంపెడు ఆశ పెట్టుకుని ఉన్నట్టేగాక, ఆమెకు ఆమెపై ఎంతో విశ్వాసం ఉన్నట్టు అతను ఊహించుకున్నాడు. ఆమే తానూ ఒకే ధ్రువాలా లేక ఉత్తర–దక్షిణ ధ్రువాలా? ఏది ఆ విషయం రుజువు చేయగలదో! ఏ ఊహకూ తావు ఇవ్వకుండా ఉండ వలసిన దానికి బదులు అతిగా ఆలోచించడం చేస్తున్నాడు. ఆమెన్ తిరిగి చూడాలన్నకోర్కె బలంగా, బాధించేంతగా ఉంటె రేపు, తరువాత రోజులలో కూడా ఇక్కడే, ఈ సమయానికే వేచి ఉండే ప్రయత్నం చేయవచ్చే? అలాంటి పట్టుదల చిన్న విషయంలో కూడా పూజ్యం. అవకాశాలు తన పాదాల దగ్గిరకు పాక్కుంటూ వచ్చి ఎత్తుకో మనాలి. అసలు, ఆమెను తిరిగి ఎందుకు చూడాలి? చూసి దేనికి పూనుకో బోతున్నట్టు? సమాధానాలు ఇచ్చుకునే బరువును మనసు మీద మోప దలచుకో లేదు. వారం పాటు ఆమే ఆలోచనలు వేధించి మరుగున పడ్డాయి. క్షణం ఆగిన జీవితం యథావిధిగా ముందుకు పోతోంది.

రెండెళ్ళపాటు ఆ జనాభాలో దాక్కుని ఒక రోజు అతని ఆఫీసు బస్టాపులో కనిపించింది – కరుణిస్తున్నట్టో. వేధించ బోతున్నట్లో. ఆమే చెంతకు వెళ్లి నిలుచోడానికి సంకోచించాడు. రెండు నిమిషాల అనంతరం తెగువ ఊడిపడి దగ్గిరగావేళ్ళాడు. జుట్టును సర్దుకుంటోంది అతన్ని గమనించకుండా.

"క్షమించండి. మీతో గతంలో ముఖ పరిచయమున్నట్టు అనిపిస్తోంది. మీరు నేనూ ఒకే బడిలో చదివామేమో."

"నేను ఈ ఊళ్ళో ఏ బడిలో చదవలేదు."

"నేనూ మరో ఊర్లో చదివాను," అని ఆ ఊరి పేరూ, బడి పేరూ చెప్పాడు.

"అవును. నేను అక్కడే చదివాగాని మీరు నాకు గుర్తులేరు. నిజానికి ఆ బడి జ్ఞాపకాలు నాలో ఏమీ మిగల లేదు. నేను ఆ బడిని వదిలేసి చాలా కాలమయ్యింది. మీకు జ్ఞాపక శక్తి ఎక్కువనుకుంటా. నన్ను గుర్తించుకున్నందుకు కృతజ్ఞతలు."

తనకున్నట్లు, ఆమెకు ఆమె గతం అంటే అంత ఇష్టం లేదా?. బాధను ఏమాత్రం రేకెత్తిస్తుందనిపించినా ఆమే ఆ గతాన్నిమరిచి పోగలదా?

ఆమే ఎక్కవలసిన బస్సు వచ్చి ఆమెను అతని నుంచీ వేరు చేసింది. అది కడుతున్న ఐదంతస్తుల భవనం. నేల అంతస్తు ఒక పై అంతస్తూ పూర్తయ్యాయి. రెండవది ఒక రెక్కపూర్తయి రెండో దాంట్లో పని జరుగుతోంది. అద్దె కడుతూ అక్కడ ఉంచడం ఎందుకని కొన్ని కార్యాలయాలు ఇక్కడికి మార్చారు. విశాలమైన ఆవరణ. మరుసటి రోజు మబ్బు మబ్బుగా ఉంది. పదిన్నరకు కాఫ్టీరియాలో  కాఫీ తాగి వెళుతూ గరాజు దగ్గిర ఆగి ఒక వ్యక్తితో మాట్లాడుతున్నాడు. జల్లు ఆరంభమయింది. వెలుపలికి వెళ్లే ద్వారం నుంచి పవిట కొంగు మొహానికి తలకూ అడ్డుపెట్టుకుని ఒక స్త్రీ రావడం కోదండానికి కనిపించింది. మొఖం కప్పి ఉంచినా గుర్తు పెట్టగల శక్తి ఆమె విషయంలో మాత్రం తనలో ఉందని అతనికి అనిపించి ఆశ్చర్యపడ్డాడు. నడకలో కళ ఉంది. నాట్యం కాకపోవచ్చు. కొన్ని నడకలూ నాట్యంలా చూడడానికి బావుంటాయనిపించింది కోదండానికి. ఆమె తనను నాలుగేళ్లుగా ఆమెకే తెలియ కుండా వెన్నంటుతున్నట్టనిపించింది. భౌతికంగా అటుంచీ ఏదో అదృశ్య శక్తి, ఏ ఉద్దేశంతోనే ఇలా చేస్తుందేమో అనిపించి కాస్త సంతోషం కలిగింది. అణుమాత్రంగా ఆశా ఉందేమో.

వేగంగా గుర్రంలా ఆమెకు ఎదురెళ్ళాడు.

"బాగున్నారా? నేను గుర్తున్నానా? తడిపేస్తోంది వర్షం."

బిడియాన్ని దాచుకోకుండా, ఏదో అవకాశాన్ని నియోగించుకో గలుగుతున్నన్నందుకు సంతోషంగా తడబడుతూ అన్నాడు.

"నిన్నేగా మనం కలిసింది?"

ఆమె మరువనందుకు సంతోషించాడు. ఆమె సమాధానం వేరుగా ఉంటే బాగుండేదనిపించింది. ఎలా ఉండాలో మాత్రం తోచలేదు. తోస్తే బాగుండు అనుకున్నాడు. తనది పదునైన, చురుకైన మనసు కానందుకు విచారించాడు. ఇక్ష్వాకులనాడు తనను కేవలం చిన్నపిల్లగా  చూసి, ఎలాంటి పరిచయం లేకపోయినా యువతిగా మారి ఆరేడేళ్లు అయిన తరువాత కూడా గుర్తుంచుకోడమే కాక, అతను ఆ విషయం చెప్పడం ఆమెకు గర్వమే కాక అతనంటే సదాభిప్రాయం కూడా నిజానికి కలగాలి. అతని మొహంలో అమాయకత ఆమె కళ్ళకు కొట్టొచ్చినట్టు కనిపించింది.

"నా గది నేల అంతస్తులోనే. అభ్యంతరం లేకపోతే కాసేపు కూర్చుని మీ పని మీద వెళ్లొచ్చు."

"నా పని ఇందులోనే. పని జరగాల్సిన చోటే కూర్చుని ఊపిరి పీల్చుకో వచ్చు."

ఆమెతో పరిచయానికి తాను పాకులాడుతున్నట్టు ఆమె ఆ మాటలవలన పెడార్థం తీసుకో వచ్చు. కొంచం సున్నితంగా, మర్యాదగా మాట్లాడుంటే బాగుండునేమో అనిపించింది ఆమెకు అతనితో తనకు ఏ పరిచయం లేకపోయినా.

"ఎక్కడా మీ గది? పోదాము మీ పనికి ఆటంకం లేకపోతే."

ఈ మాటలు కాస్త నయమేమో అనిపించింది ఇద్దరికీ.

ఇద్దరూ వేగంగా నడిచి అతని గదికి వెళ్లారు. ఒక కుర్చీని తన కుర్చీకి దగ్గిరగానూ, దూరంగానూ కాకుండా లాగి దానిలోకి "ఆసీనులు కండి" అన్నట్టు చూపించాడు. కొత్త వాసన కొడుతోంది విశాలమైన ఆ గది. ఇలాంటి వాతావరణంలో తిప్పటలేని ఉద్యోగం దొరికితే బాగుండు అనుకుంది. వెళ్లి ఎవరికో కాఫీ తెమ్మని చెప్పాడు. ఆమె తన 5 X 5 అంగుళాల రుమాలుతో తల, ముఖం అద్దుకుంది.

"వానంటే ఇష్టపడతాము. కానీ మనం పడమన్నప్పుడు పడాలి!" వ్యంగ్యంగా అనింది.

అతను అవసరాన్ని మించి నవ్వాడు.

కాఫీ తాగిన వెంటనే "వస్తానండీ" అని వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోతున్నపుడు మళ్ళీ ఈమె ఈ కార్యాలయానికి రావాల్సి ఉంటుందో లేదో, వివరాలు చెప్పలేదు. ఆమె అతని పై అధికారన్నట్టు వినయంగా లేచి నిలబడి తలుపు దాకా రావడం ఆమె గమనించింది. ఆమె రాకముందు ఆ గదిలోశూన్యం లేనట్టు ఇపుడు కొత్తగా అది ఏర్పడినట్టు అనిపించిందతనికి. ఆమె ఏదో పరిమళం ఒదిలి వెళ్ళింది. తలలోని మూడు నాలుగు విచ్చిన మల్లెలదో, ముఖానికి పూసుకున్న పౌడర్ వాసనో, మరో సుగంధమో, గతపు వాసనో, "నా భ్రమో?" ఇంద్రియాలూ మోసం చేసేవే.

మరునాడు గది ద్వారంవైపే దృష్టంతా ఉంచాడు. పదకొండు గంటలయ్యింది. ఇక రాదేమో అనుకున్నాడు. పొద్దుటి నుంచీ కాఫీ తాగలేదు – ఎలాగూ ఆమె రావచ్చు. ఒక వేళ రాకపోతే అప్పుడు తాగాలనిపిస్తే ఒక్కడే తాగ వచ్చని. వచ్చింది నిట్టూరుస్తూ. వెంటనే కాఫీ తెప్పించాడు.

"మీ వాళ్ళ దగ్గిరి నుంచీ సమాచారం సేకరించడం కష్టమండీ. పీకల మీద కూర్చున్నట్టు ఎదురుగా గంట కూర్చున్నా ఫలితం అంతంత మాత్రం."

"ఏ విభాగం? ఏమి సమాచారం?"

చెప్పింది. అతను లేచాడు.

"ఎవరడిగినది అంటే, ఏమి చెబుతారు?"

"ఎవరో మహిళ నిన్న వచ్చి అడిగారట కదా అంటే సరిపోదా?"

"సరిపోకపోతే? నా పేరు అడిగి ఉండవచ్చుగా? నేనైనా చెప్పుండవచ్చు. వరూథిని...సంస్థ నుంచీ అని చెప్పండి."

కోదండం తన పేరు చెప్పేడు. పేరు బాగుందని నవ్వింది. చిన్నపుడు పిల్లలకు వేసే కోదండం ఆమెకు గుర్తు వచ్చి ఉండవచ్చు అనుకున్నాడు.

అతను కోదండం మిత్రుడే. మరునాడు కావలసిన దానిని ముందు రోజు చెబుతుంటుంది. అరగంటలో ఇస్తానన్నాడు. ఇలాంటి సాయం తరచూ సంతోషంగా చేస్తూ వచ్చాడు కోదండం.

ఆమె ప్రభుత్వరంగ సంస్థలు నాలు గయిదు తిరిగి సమాచారాన్ని సేకరించి ఢిల్లీ కార్యాలయానికి పంపాలట. రెండు నెలల పాటు రెండు లేక మూడు రోజులకొకసారి ఇక్కడికి రావాలట. ఆమె ఎమ్మెస్సీ చేసింది. ఆఫీసరు హోదాలో ఉంది. బడి గురించి  గానీ, ఆ రోజుల గురించి గానీ ఆమె ఏమాత్రం మాట్లాడకపోవడం అతను గమనిస్తూ వస్తున్నాడు. ఇద్దరూ పరిచయస్థులవడానికి కోదండంలోని ఆమెను చూసిన జ్ఞాపకమే పునాది. రెండు నెలలపై కాలంలో కనీసం ఇరవై సార్లు ఆమె అతన్నికలిసింది. ఆమె ఒక గిరి గీసుకుకుని చాలా నిగ్రహంతో మాట్లాడటం అతను గ్రహించాడు. చొరవ ఎలా ఇవ్వకూడదో ఆమెకు బాగా తెలుసు. అలా అని అంటీ ముట్టనట్టుండదు ఆమెకు అవసరమైనపుడు. ఏ సడలింపన్నా అవసరార్థమే.

ఆమె కోదండంకన్నాతెలివయినది. ఆంగ్ల పుస్తకాలు బాగా చదివింది. ఒక సారి ఎయిర్పోర్ట్ నవల కథాసంగ్రహాన్నిఅతనికి చెప్పింది. దాన్ని చదివి ఉండనందుకు అతను బాధపడ్డాడు. సినెమా మాత్రం చూశానన్నాడు తప్పు చేశాను అన్న ధోరణిలో. బర్ట్ లంకాస్టర్ అన్నపేరు జార విడిచాడు. ఆ పుస్తకం ఆమె భుజం సంచీలో ఉంది. అందులో నుంచీ తీసి అతని బల్ల అంచున సగం మేరకు పెట్టింది. దాన్నిచదవమని ఆమె అతనికి ఇస్తున్నన్నట్టో, లేనట్టో. దాన్ని తీసుకుని పుటలు తిప్పి తీసిన చోటే పెట్టేసాడు. చదివివ్వండి అంటే అప్పుడు తీసుకో వచ్చని. తాను చదివానని అతను తెలుసుకోవాలనే గాని, అతను దాన్ని చదవాలని ఆమె ఉద్దేశం కాదు.

రోమనీస్కు గానూ, బూడిద రంగు కళ్ళు, గడ్డంలో సొట్టతోనూ స్టీవన్ బాయ్డ్ అంత అందమైన పురుష ముఖం హాలీవుడ్ లో లేదు – అందొక రోజు. ఆ పేరు వెంటనే గుర్తుకు రాలేదు. క్లింట్ ఈస్టవుడ్ కూడా బావుంటాడు అన్నాడు.

నామూలంగా మీకు కాఫీ ఖర్చుగదా, నేను కాఫీ విషయంలో మాత్రం మొహమాట పడను, కాఫీ వ్యసనపరురాలిని అనింది. అలా అనడంలో కొంచం గర్వం ఆమెలో ఉన్నట్లనిపించింది కోదండానికి ఆమె ఆమె గురించీ చెప్పే ప్రతి అంశం లాగే. ఆ ఒక్క గర్వం తానూ పడవచ్చు గనుక నేనూ అంతే అన్నాడు. కనీసం ఒక విషయంలో ఇద్దరికీ సారూప్యం ఉండటం అతనికి సంతృప్తినిచ్చింది.

“అదెంత ఖర్చండి. దాన్ని భరించలేని ఆర్థిక పరిస్థితిలో లేను అన్నాడు.”

“మీతో కలిసి తాగడం లోని ఆనందానికి ఖరీదు కట్టలేను” – అని అనడానికి తాను చేయ లేని సాహసం కావాలి అనుకున్నాడు. ఆమె రుమాలు నోటికి అడ్డుగా పెట్టుకుని నిశ్శబ్దంగా నవ్వింది – నవ్వడం రహస్యంగా చేయాలిసిన పనన్నట్లు.

బడి విషయాలు ఎన్నో గుర్తుచేసి ఆమెను నవ్విద్దాం అనుండేది. అడిగినట్లు అప్పు ఇచ్చానుకదా అని చొరవ చూపబోయిన లెక్కల అధ్యాపకుడిని డెలీలా [హెడీ డెమర్] లాగా ఉండే డ్రిల్లు అధ్యాపకురాలు ఇంటికి పిలిచి కాళ్ళు విరగకొట్టించిన విషయం...సీమపందిని పోలిన హిందీ అధ్యాపకుడిని తరగతిలో ఉండగానే బైటినుంచీ వచ్చిన చదువుకునే కుర్రవాడు కొట్టి, గోడ దూకి, పరిగెత్తడం...ఒక అమ్మాయి తరచూ మూర్ఛతో తరగతి గదిలో పడిపోతుండడం... ఎన్నో. ఆమెకు జ్ఞాపకాలు ఎందుకో గిట్టేవని గ్రహించాడు. పరిహాసాస్పదంగా తోచేవేమో. వాటిపై ఇష్టం మానసిక బలహీనతను సూచిస్తాయన్నఅభిప్రాయమో, తన బాల్యమంటే అనిష్టమేమో. కొన్ని ప్రమాణాలు ఏర్పరచుకుని జీవితాన్ని తదనుగుణంగా మార్చుకోవాలన్న దృఢ సంకల్పంతో రాజీపడ దలచుకోలేదేమో – జీవితాన్నిచాలా సీరియస్సుగా తీసుకుని. తనలాంటి పైవాళ్ళు లేనపుడు, ఇంట్లో కావలసిన వాళ్ళ మధ్య ఉన్నపుడు ఆమె రూపం, స్వభావం వేరేలా వ్యక్తం కావచ్చు. మనిషి స్వాభావికంగా కపటజీవి.

ఫోటో ఇస్తే చిత్రం గీస్తానని అంటున్నాడు నా మిత్రుడు. నాది దానికి అర్హమైన మొహం అనిపించక ఇవ్వలేదు. మీ ఫోటో ఉంటే ఇవ్వండి చిత్రం గీయిస్తాను అన్నాడు కాస్త బెరుకుగా. ఆమె మాట్లాడలేదు. ఆ తరువాత రెండు సార్లు అన్నాఆమె మౌనం వహించింది. ఆ ప్రస్తావన తేవడం మానేసాడు.

అతని మనసంతా ఆమె ఆలోచనలతో క్రిక్కిరిసిపోయేది. ఆమె వచ్చిన రోజంతా ఆమెకు అతనికీ జరిగిన సంభాషణ వల్లె వేసుకుంటుండే వాడు పడుకుని నిద్ర పోయేదాకా. ఆమె తిరిగి కలుసుకోబోయే రోజు గురించి ఎదురు చూస్తుండటం. ఏదో జరుగబోతోందన్నఉద్వేగం, ఉత్కంఠ. ఏమి జరగాలని కోరుకుంటున్నాడో అతనికే తెలియక

పోయినా. ఆ విషయాన్ని ఆలోచించే సాహసం చేయలేదు. ఏది జరగాలో అది జరగడం గురించీ ఎదురు చూస్తుండడమే తన పని అనుకున్నాడు. ఇద్దరూ కలిసి విడిపోయిన ప్రతీ సారీ తాను ఆమెకు కాస్తన్నాగుర్తుంటానా. తన గురించీ ఏమన్నాఆలోచిస్తోందా? అనుకునే వాడు. తన గురించీ ఆలోచించడానికి ఆమెకు ఏముంటుంది? ఆమెకూ అతని గురించిన అస్పష్ట, అనిర్వచనా భావన ఏదన్నాఉంటే?

ఆమెతో గడిపే క్షణాలు మధుర స్వప్నం. ఇద్దరూ కలసి గడిపిన కాలం కొలవలేనిధి. ఎంత కాలం గడిచినా అది క్షణంతో సమానం. అదొక పున్నమి వెన్నెల వెల్లువ, వేసవి మిట్టమధ్యాన్నాం కురిసి ఉరుములూ మెరుపులూ లేని కుండపోత వర్షం, తీయ్యదనంతో చంపే ఆలాపన, కళాకారుడు చిత్రించలేని చైతన్యవంతమైన దృశ్యం.

ఒక రోజు – "మీ సంస్థతో నా ఋణం తీరిపోయిందండీ. సమీప భవిష్యత్తులో రానక్కరలేదు," అంటూ ధ్వనించబోయిన సంతోషాన్ని దాచుకుంది.

తిరిగి ఆమె అదృశ్యమైంది. గతంలోలా కలవొచ్చు. కలవక పోనూ వచ్చు. ఎదురు చూస్తుండడం కన్నా చేసేదేముంది? నిస్సారంగా రోజులు గడుస్తున్నాయి.

శనివారం సగం రోజే కార్యాలయం ఉంటుంది. ఇంటికి బయలుదేరాడు. కాస్త దూరంలో పారిశ్రామికవాడ నుంచి వచ్చిన బస్సు దిగి ఆమె ఒక వ్యక్తి తానున్న చోటికే నడిచొచ్చి పక్కన నిలబడింది.

"మీరేబస్సెక్కాలి?"

చెప్పేడు. ఏడు వందల అడుగులు వెయ్యాలి.

"పదండి."

"నేను ఇప్పుడు మరో సంస్థనుంచీ సమాచారాన్నిరాబట్టాలి. వాళ్లకు ఒంటిపూట బడిలా ఒంటిపూట ఆఫీసు."

'ఈ విధంగా మనం కలిసే అవకాశం వచ్చింది.".

తల ఊపి ఊరుకుంది. "నాకు" అనాలిసింది," అనుకున్నాడు.

"కంపు కంపు ఈ ప్రాంతమంతా."

అలాంటి సంభాషణల అవసరమూ ఉంది అనిపించింది ఆమెకు. ఆమె స్వరం వినడం కావాలి అతనికి అది అనవసర సంభాషనైనా. ఆమె కనబడుతుండడం కావాలి మౌనం దాల్చినా.

"ఒకనాడు ఉప్పుటేరు ఈ ప్రాంతమంతా. టిసొ అనే రోమన్ కాథలిక్ మిషనరీ ఆంగ్ల ప్రభుత్వం దగ్గిరనుంచీ కౌలుకు పుచ్చుకుని పూడ్చాడు పంటలు పండించి తాను పెట్టబొయ్యే అనాథాశ్రయానికి వినియోగిద్దామని. ఊరి మురికి నీరంతా ఇక్కడికి చేరుతుంటుంది."

"చరిత్రంటే మీకు ఇష్టమా?"

"గతంలోనే ఎక్కువ జీవిస్తా."

"అనారోగ్యకరం కదా అది?నాకు చరిత్ర పేరు చెబితే బొమికలు గుర్తుకొచ్చి భయమేస్తుంది."

"శరీర మంతా బొమికల మయమేగా?"

"అవును. కానీ అవి మాంసం, రక్తం, కొవ్వుతో కప్పి ఉంటాయి. పైన చర్మం కనబడనీయదు లోపలివాటిని. అవి ఉన్న ధ్యాస ఉండదు."

"వర్తమానం తాత్కాలికం. గతం శాశ్వతం. మీకు నోస్టాల్జిక్ గా ఎప్పుడూ ఉండదా?"

"మానును కాని నాకూ ఆ అనుభూతి అరుదుగా నైనా ఉంటుంది. అది తర్కరహితమైనది. ఒకనాటి హిమ సమూహాల గురించీ, గొప్పవాళ్ళ గుంచీ, అందగత్తెల గురించీ ఇప్పుడు వాపోవటం అర్థరహితమే కదా – కవి విల్లోన్ కూడా అదే చెప్పాడు. నిరుటి హిమ సమూహాలు ఏమయ్యాయో ఆ వ్యక్తులూ అదే అయ్యారన్నాడు. ఒకటి ఎంత సహజమో రెండోదీ అంతే. ఇప్పుడూ, ఎప్పుడూ హిమ సమూహాలు ఉంటూనే ఉంటాయి, కొంత కాలం తరువాత కరిగి పోతాయి. అలాంటి మనుషుల చావులూ, పుట్టుకలూ, అనుభవాలూ, అనుభూతులూ ఎప్పుడుండవనీ? ప్రేమ లానే అదీ ఒక భ్రమ అనుకుంటా."

"నోస్టాల్జియా మనసున్న ప్రతి వ్యక్తికీ తప్పదు. దాని వలన అపకారం లేదు. ఆనందం, విచారాల మేలు లయిక. సహజమైన అనుభూతి. అది లేని వారు అసహజమైన వ్యక్తులు. ప్రేమానుభవం మీకు కలగక పోవడం వలన ప్రేమను కొట్టి పారేశారేమో? జీవితంలో అనిర్వచనీయమైన వాటిలో స్త్రీ, పురుషుల మధ్యనుండి ప్రేమా ఒకటి."

"ఒకే లాంటి అనుభూతులు మానవాళి మొత్తానికీ ఉన్నపుడు, ఏదన్నాలేక పోతే అది అసహజం అవుతుంది కానీ వేరే విధంగా కాదు. ప్రేమ గురించీ మీరు బాగా ఆలోచించి ఉండాలి! నిజమైన ప్రేమ మీ జీవితంలో సంభవించి ఉండాలి! అసలు – పురుషుడు, స్త్రీ లైంగికానుభవానికి దీరితీసే ఇష్టాన్నిప్రేమగా నిర్వచించవచ్చో లేదో నాకు తెలియదు."

"ఒక సీసా శీతల పానీయం తీసుకుని వెళదాం. మీకు తాగాలని లేకపోయినా నాగురించీ?"

ప్రాధేయ పడుతున్నట్టు అడిగాడు. ఆమెను వేడెక్కించిన అతని తప్పుకు మూల్యం చెల్లించ దలచినట్టు. అడుగుతున్నది కేవలం శీతల పానీయం తాగుదామనే కానీ, ప్రేమ భిక్ష పెట్టమని కాదు కాబట్టి "అలాగే" అంది ప్రసన్నంగా. తాగిన దానికి అతనే డబ్బు ఇచ్చాడు. ఆమె వారించలేదు.

స్టేషన్ ముందు నిలబడగానే బస్సొచ్చి వెంటనే తిరుగు ప్రయాణం ఆరంభించింది. ఖాళీగా ఉన్న బస్సు ముందు నుంచీ ఆమె, వెనుక నుంచీ ఆతను ఎక్కారు. ముందు ఖాళీ ఉన్నాఆమెకు చేరువగా కూర్చోడానికి అనవసర బిడియం అడ్డొచ్చి వెనుక సీట్లో కనబడే ఆమె తల వెనుకను చూస్తూ కూర్చున్నాడు. బుర్ర రహస్యాల పేటిక. ఆమె ఒక్క

సారికూడా వెనుకకు చూడలేదు. చిన్న విషయంలో కూడా ముందు చూపేనేమో. గతం మార్గదర్శకంగా కూడా ఆమెకు అవసరపడదేమో అనుకుని ఆమె వైపు చూడటం మానేసాడు. అతను దొండపర్తి దగ్గిర దిగిపోయాడు. ఆమె యాత్ర కొనసాగింది.

రెండు నెలలలో రెండు సార్లు మాత్రమే వాళ్ళు కలుసుకోవడం జరిగింది, అదీ ఎప్పటిలా కాకతాళీయంగా. ఒక వారం ఆమెకై ఎదురు చూడడం గ్రహించి, "ఈ నాలుగడుగులూ నడవడం గురించీ నాకై ఎదురు చూడకండి," అంది. దాన్ని మందలింపుగా తీసుకున్నాడు. 'ఏడొందలడుగులు," అందామనుకుని అనలేదు. అతనితో అన్నిసార్లు కలవడం ఆమెకు అనిష్టం కావచ్చు. కానీ కూడబలుక్కుని ఇరువురూ కలవడం లేదు. ఆమె కోణం నుంచీ చూసినపుడు – ఇద్దరూ కౌమార ప్రేమికులు కాదు. కనీసం ఇరవైమూడేళ్ల వాళ్ళు. ఉద్యోగస్థులు. తెలిసినవాళ్ల దృష్టిలో పదే పదే పడడం క్షేమదాయకం కాకపోవచ్చు. క్రింద పడటం కన్నా దృష్టిలో పడటం ఎక్కువ ప్రమాదకరం. "నా ఒక్కడి గురించిన గుసగుసలు నన్నేమీ చెయ్యలేవు. ఆమె గురించినవి ఆమెకు హానికరం." అతను ఐదు నిముషాలు కార్యాలయం నుంచీ ముందుగానే బయలుదేరే వాడు. ఆమెకు ఎదురుబడకుండా ఉండటం ఇష్టం లేకపోయినా. ఆ కొన్నిగజాల దూరం మైలు దూరం నడుస్తున్నట్టు, కాళ్లకు ఇనుప గుండ్లు గొలుసులతో కట్టేసినట్టుండేది. ఆ తరువాత ఆ పండువెన్నెల లాంటి మెరుపు, లేక మెరుపు లాంటి పండువెన్నెల ముగిసి, వాళ్ళిద్దరినీ కలుపుతూ వచ్చిన శక్తి మీద ఆశ పెట్టుకుని ఆగామికాలంకై ఎదురుచూడడం అలవాటయ్యింది.

మూడు నెలల తరువాత ఒక ఆదివారం బీచ్ కి వెళ్ళాడు ఒక్కడే. ఒంటరితనంలోనే సుఖాన్నిపొందడం అంతకు ముందు కొన్నేళ్లుగా అతనికి అలవాటయ్యింది. బైటికి వస్తే ఇంతమంది దర్శనం ఇస్తుండగా ఒంటరితనం ఏమిటి? అని ఆత్మవంచన చేసుకోవడం పాత కథే.

"ఈ ఇసుకలో ఎన్నిపాదముద్రలు పడ్డాయో, చెరిగాయో కాలపు సైకతాల మీద లాగే. గతాన్నిఎక్కువగా ప్రేమించడం, దానీతో రమించడం, గత కాలం గుర్చి వాపోవడం అధికం అయినట్టుంది నాలో," అనుకుని, నవ్వుకుంటూ ఉత్తర దిశగా నడుస్తున్నాడు. వరూథిని అతన్నిఆకర్షించడానికి ఒక కారణం ఆమె గతాన్ని కొంత కాలంపాటు పంచుకోడం.

ఒక ఆడామగల జంటకు అతి చేరువగా వచ్చేదాకా అతను ఇసుక నుంచీ, నీటి నుంచీ దృష్టి మరల్చలేదు. అందమైన జంట. కోదండం ఆమెను గుర్తించకుండా పరధ్యానంగా ఉన్నందుకేమో వరూథిని చిరునవ్వునవ్వుతోంది. తను వాళ్ళను చూడకుండా వెళ్లిపోవాలని కోరుకుందా? ఆ ఇంద్రజాలికుడు మళ్ళీ ఏ సాకుతోనో ఇద్దరినీ ఇలా కలపడం నమ్మలేని నిజం. అతనికి కోదండం గురించీ ముందే చెప్పిందేమో పలకరింపుగా నవ్వుతున్నాడు. అంతవరకూ కూర్చుని, వెళ్లిపోవడానికి లేచుంటారు.

"మా బావ నిరంజన్. ఈ సంవత్సరంతో మెడిసిన్ పూర్తయింది ఆంధ్రా మెడికల్ కాలేజీలో."

హౌదుయుదూలు అయ్యాయి.

"గొప్ప సంస్థలో పనిచేస్తున్నారు. అది లేకపోతే విశాఖపట్నం లేదు."

"ఒక గొప్ప సంస్థలో ఒక ఇసుక రేణువు లాంటి చిరు ఉద్యోగిని, డాక్టర్!"

"ఇసుక రేణువు గొప్పదనం ఇసుక రేణువుది. మానవమాత్రులు సృష్టించ లేనిది. అవన్నీకలిస్తేనేగా బీచి?"

తల ఊపి ఊరుకున్నాడు కోదండం. అతని కలుపుగోరుతనం నచ్చింది కోదండానికి.

"రెస్టోరాన్ లో ఒక కప్పు కాఫీ తాగి మాట్లాడుకుందాం రాండి," అన్నాడు నిరంజన్.

"వారికి చాలా కప్పుల కాఫీ బాకీ ఉన్నా."

"మీరు వెళ్లి రాండి నేను అలా ముందుకెళ్తాను," ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరిస్తూ ముందుకు సాగాడు.

అరగంట తరువాత వెనక్కు మరలినపుడు ఇసుకలో నడిచే బదులు రోడ్డును ఎన్నుకున్నాడు, వాళ్ళూ, తాను తిరిగి కలుసుకునే వీలు తక్కువగా ఉంటుందని. ఆమె, అతను అన్నిసార్లు కలవడం విడిపోవటంలో వాళ్ళిద్దరి ప్రమేయం లేనట్టే ఇప్పుడు ఆ జంటను కలవ కూడదని లేదు.

మరుసటి రోజు జోగారావు నుంచీ ఆఫీసుకు ఫోన్ వచ్చింది. ఎప్పటి, ఎక్కడి జోగారావు? ఎలా నన్ను వెదికి పట్టుకున్నాడు అని ఆశ్చర్యపడ్డాడు కొన్నిక్షణాలు. నిజానికి అతను ఏమి చేసినా ఆశ్చర్యపడరాదు. అతను కాలేజీలో బి.వె. ఆఖరి ఏడు చదివేప్పుడు, కోదండం పీయూసీ చదివాడు. రోజూ కాలేజీకి వెళ్ళేటప్పుడు సాధారణంగా ఒకే బసులో కలిసే వాళ్ళు. విరామం లేకుండా జోగారావు మాట్లాడుతుండేవాడు. ఫ్రెంచి కవి విల్లోన్ గత విలాసం, విలాపాలలోని స్త్రీలలో ఒకర్తే రోమన్ సుందరి ఫ్లోరాను గుర్తుకు తెచ్చేఒక అందమైన యువతీ [గతించిన అందెగత్తె లందరూ ఫ్లోరాలే అనుకుంటే సరి] లక్ష్యంగా. ఆమె ఒకే బస్సులో కాలేజీకి వచ్చేది. ఆతను మంచి మాటకారీ, వక్తా. అతన్ పక్కన వీలయితే చోటిచ్చేవాడు కోదండానికి. జోగారావు వేసవి సెలవల్లో విశాఖకు వచ్చి వెదికి పట్టుకున్నాడు కోదండాన్ని. పోస్ట్ గ్రాద్యుయేషన్ చేయాలని అతని ప్రణాళిక. మెడిసిన్ చదవాలని కోదండం అత్యాశ. అతను ఆఖరి సంవత్సరం తప్పాడు. కోదండం చావబోయి కన్ను లొట్టతో బయటపడ్డాడు. ఏవీయన్ కాలేజ్ డిగ్రీ చదువుకు కూడా అవకాశం ఇవ్వను పొమ్మంది. జోగారావు యూనివర్సిటీ హాస్టల్లో మరొక విద్యార్థి ఖాతాలో అతనితో పాటు ఉండేవాడు. కోదండం పదవ నంబర్ బస్సు ఎక్కి వెళ్లి రోజూ అతన్ని కలుస్తుండే వాడు. మధ్యాహ్న ఫలహార ఖర్చు అతనే భరించే వాడు ఏరోజుకారోజు అప్పుల్లో ఉన్నా. తాను చేసే అప్పు తీర్చాలిసింది కాదు అని జోగా రావు అభిప్రాయం. తరువాత అతను అదృశ్యం అయ్యాడు విశాఖ నుంచీ. ఇప్పుడు ప్రత్యక్షమయ్యాడు.

అతను చెప్పిన వేళకు డాబాగార్డెన్సులో అతను దిగిన లాడ్జింగ్ కు వెళ్లాడు. అతను ఇతన్ని ఆప్యాయంగా పలకరించాడు. "పెళ్లాడా ఒక పని అయిపోతుందని, సంతానాన్నికన్నామరొక పని అయిపోతుందని – నిజానికి అవి పనులు కావనుకోండి," అన్నాడు. ఇంకా గ్రాడ్యుయేషన్ పూర్తి చెయ్యలేదు. అవసరం లేదన్నాడు. మరి ఉద్యోగం మాటా? :మా ఆవిడ మంచి ఉద్యోగం చేస్తున్నపుడు నాకు ఆ బాదరబందీ ఎందుకు?" అన్నాడు. అతను అందరూ తొక్కే త్రోవ తొక్కడు. అతని త్రోవ అందరూ తొక్కరు. ఒక చోట మునిగి మరో చోట తేలుతుంటాడు కాల సముద్రంలో. అస్థిరత్వం అతని తోడూ, నీడా. అరగంట సేపు అతనూ, కోదండం కలిసి చదివిన కళాశాల సంగతులు నెమరు వేసుకున్నారు. ఇంకేమీ మిగల లేదు.

"మీ చిరునామా, ఫోను నెంబరూ ఎలా కనుక్కున్నానో తెలుసా?"

"అది ఊహించడానికి నాకు సాధ్యపడదు," అని లొంగుబాటును వ్యక్తం చేసాడు.

జోగారావు చెప్పాడు. కోదండం కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యం వ్యక్తం చేసాడు.

"వరూథిని నా మరదలయి సంవత్సరం ఆరు నెలలయింది. నీవు అన్ని సంస్థలూ తిరుగుతుంటావు కదా ఈ పేరూ, ఇలాంటి రూపు గల వ్యక్తి నీకు తారసపడ్డారా అని అడిగాను. నీవు కాఫీ ఇప్పిస్తుంటావని చెప్పింది."

"ఆమె తాగిన కాఫీ నాకు ఒక గుర్తింపు ఇచ్చినందుకు ఆమెకు నా కృతజ్ఞతలు చెప్పండి ఈసారి కలిసినపుడు."

"కాఫీతో ఆమెను మెప్పించావేమో, మీ కాఫీ వృథాగాపోదు అని ఆశిద్దాము."

"ఏ కానుక వస్తుందీ?"

"తిండి ద్వారా హృదయానికి చేరువవ్వచ్చు అని పెద్దలంటారు. ప్రేమే కానుకగా రావచ్చు."

"నా గురించీ మరేమీ చెప్పలేదా?"

"ఏదన్నాచెప్పాలని అనుకుంటున్నారా?"

"నేను చెప్పడానికి ముందు. ఆమెకు మనసులో ఏముందో నాకు తెలియదు."

"ప్రేమించడం లేదు కదా?"

'"అదేమిటో ముందునాకు తెలియాలి. అపుడు సమాధానం చెప్పడానికి వీలవుతుంది. పెళ్ళికో, లైంగిక కలయికకో దారి తీసే ఇష్టం లేక వికారం అని అనుకున్నా ఆమె నన్ను ప్రేమించడానికి నాలో అర్హతలుండాలి. అవి ఆమెకు తెలుస్తాయి. ఆమె ఒకసారి అనింది ప్రేమ భ్రమ లాంటిది అని. నోస్టాల్జియా కూడా ఆ బడిలోనిదే అని ఆమె మనోగతం. నేను ఆమె గురించి గ్రహించినదేమిటంటే ఆమె ఆలోచనా పటిమ నాదాని కన్నా ఘనమైనది, లోతైనది."

'"మీలో నాకు తెలిసీ ఆత్మన్యూనతా భావముంది. లేకపోతె ఆమె క్లియోపాత్రా అన్నట్టూ, ఆమె అనుగ్రహించాలన్నట్టూ, మీరు నీవు ఆమెకన్నా తక్కువ వాడినన్నట్లూ మాట్లాడుతున్నార నిపిస్తోంది. మీరు సమఉజ్జీగా భావించే ప్రయత్నం చెయ్యండి. ఉద్యోగం, చదువు, అందం, డబ్బు– ఇవి మాత్రమే పడికట్టురాళ్లు కాదు ఒక స్త్రీ, పురుషుడూ ఏకం కావడానికి. మీలా ఆలోచించుంటే నా భార్య నన్ను పెళ్లి చేసుకోడం మాట అటుంచీ, దగ్గిరికి రానిచ్చినాతో కాఫీ కూడా తాగుండదు. మీ అభిప్రాయం తప్పుదుది అనే సాహసం చెయ్యను. నా మరదలు నా భార్యలా అల్పసంతోషి కాదు. మీరు భావుకులు. మీది అందమైన మనసు. దాని సౌందర్యాన్ని చూడడానికి అంతర్చక్షువులు కావాలి. మీరు ఆమెకన్నాఅభౌతిక విషయాలలో అధికులు,"

"మీరు ఆమె అయుంటే ఎంత బాగుండేది!"

"ప్రతి పురుషుడు, ప్రతి స్త్రీలో మగత్వం, ఆడత్వం ఉంటాయి. శారీరకంగా కలిసి సహజీవనం చేసే, సంతానాన్నికనే వీలుండక పోవచ్చుఇద్దరు స్త్రీలు, ఇద్దరు పురుషులు వేరు వేరుగా."

''ఆమె తన బావను పెళ్లి చేసుకో బోతున్నపుడు ఆ విషయంలో తర్కవితర్కాలు అంత అవసరం లేదేమో."

"మీరు ఊహా జీవి."

"కొన్ని ఊహలు తప్పవుతాయి. అదీ అలా తప్పా?"

"వాళ్ళు పెళ్లి చేసుకోవాలని అనుకోడమూ లేదూ, అది సాధ్యమూ కాదు."

కోదండం మొహంలోకి స్వల్పంగా వెలుతురొచ్చి చేరింది.

"మీది ఒకరకంగా ఆరాధనేమో అనిపిస్తోంది. ఆరాధనకు వరంగా ప్రేమ లభిస్తుందా? ఇంకేదన్నా భావం కలుగుతుందా అన్న విషయం మా ఆవిడను అడగాలి. నా మరదలు కన్నాతెలివైనది నా భార్య."

"ఆరాధన పెద్దమాట. వరూధిని ప్రేమించడానికి అవసరమైన అర్హతలున్నాయా లేవా నాకు అన్నవిషయాన్ని పక్కనుంచితే, వాటితో సంబంధం లేకుండా ఆమెను ఆశించడంలో ఆనందం ఉంటె దాని గురించీ ఆ పని చేయ వచ్చుగదా."

"దాన్నిప్రేమోన్మాదం అంటారో అనరో, ఆత్మగౌరవ సమస్య తలెత్తుతుందో లేదో! అలాంటి ఆనందం విషాదంగా ముగుస్తుంది."

"పిల్లి చెలగాటం ఎలుకకు ప్రాణ సంకటం."

"వరూధినికి తనకన్నాఒక మెట్టన్నాపైనుండేవాడు కావాలనుంది. అయితే వాడికి ఈమె ఒక మెట్టు కిందున్నా రాజీపడే మనస్తత్వం ఉండాలి."

"ఎత్తులో ఆమెకన్నానేను ఒక అంగుళం కురచ."

"ఆ అంగుళం ఆమెకు దేనికి అడ్డొస్తుంది గనుక?" విరగబడి నవ్వుతూ అన్నాడు జోగారావు.

"రాజీపడ వలసిన అవసరం ఆమెకు కనబడనప్పుడు సెంటీ మీటరు తక్కువైనా ఆమె లోపంగా భావించి తిరస్కరించవచ్చు," ఈ సారి కోదండం నవ్వుతూ అన్నాడు.

"నేను మీ తరఫున మాట్లాడుతున్నా. మీరు ఆమెకు వకాల్తా పుచ్చుకున్నారు. మీకు ఆమె అప్పుడే బాగా కావలసిన మనిష అయ్యుండాలి ఆమె తిరస్కార భావంతో ఉన్నాసరే!"

"నాది డెవిల్స్ అడ్వొకేసి అనుకుని క్షమించండి."

"నేనే సాహసించి, ఆమెను మీ తరఫున అడగనా? నా భార్య సహాయం కూడా తీసుకుంటా."

కోదండం నిస్చేష్టుడయ్యాడు.

"ఆమె నిరాకరిస్తే దాన్ని భరించడం కష్టం, అడగకుండా కార్యం సానుకూలపడే అవకాశం లేకపోయినా సరే."

"మీరు ఆ కార్యాన్ని సఫలీకృతం చేసుకో లేరు, మరొకరి జోక్యం పనికి రాదు, వైఫల్యాన్ని తట్టుకో లేరు! తమర్నిచూస్తుంటే నాకు తాగాలనుంది."

జోగా రావు సీసా కార్కును నోటితో లాగి అవతలికి ఊసే, రెండు గ్లాసుల్లో ద్రవాన్ని పోసి, "రెండోది తమ గురించీ," అన్నాడు.

"ఇంతవరకూ తాగలేదు. ఇదొక్కటే తక్కువా నాకు?"

"ఇంకేవేవి తక్కువో నాకు తెలియదు. ఇది తాగి తరించడానికి అర్హతలేమీ అక్కరలేదు. దేవదాసుగా మారి తాగుబోతవడం కన్నా మరో మార్గం లేదు మీకు."

"అంత బలీయమైన కొరికె, ఆశాభంగత్వం, వైరాగ్యం నాలో లేవు."

"మీరు మారరన్నమాట. ఉగ్గుగిన్నెడంత పోసాను. దాన్నిండా ఐసుముక్కలేయబోతున్నా. దాన్నితాగితే మీకు వ్రత భంగం కాదు. తాగేది వేరే రూపంలో బయటికి వచ్చేదే."

"నకు స్నేహం ఎలా కుదిరిందా అని ఆశ్చర్యపోతున్నారా?"

"పెళ్లిళ్లే కాదు, స్నేహాలూ స్వర్గంలోనో నరకంలోనో ఏర్పరిచి ఉంటాయి."

కోదండం లేచిపోబోయాడు.

"నా పురిటి కూతురుని చూడరా? పొద్దున్నేఇద్దరం శ్రీకాకుళం వెళుతున్నాం. మా మామ అక్కడే చిన్నఉద్యోగం చేసుకుంటున్నారు. ఆరున్నరకల్లా బస్సు డిపోకు రాండి, సాయంత్రానికల్లా ఇక్కడికి తిరిగి మీరు ఒచ్చేయ వచ్చు. నేను అక్కడే ఉండిపోతా."

ఇద్దరూ ఆ ఊరు వెళ్లారు. వరూథిని దిగువ మధ్య తరగతి కుటుంబం పెద్దది. తండ్రిది చాలా చిన్నఉద్యోగం. పాత గ్రూపు ఫోటో చూపించి అందులో వరూథినిన్ గుర్తుపట్టమన్నఅగ్నిపరీక్ష పెట్టారు. ఉత్తీర్ణుడయ్యాడు. రాత్రి ఏడు గంటలకల్లా ఇంట్లో ఉన్నాడు.

కోదండాన్ని సముద్రపు ఒడ్డుకు విసిరేసింది ఆఫీసు. అక్కడ మూడేళ్లు గడపాలి. నిజానికి అది అజ్ఞాతవాసం లాంటిది. అతని మనస్తత్వానికి తగినదే. ఎంత చూస్తున్నాతనివి తీరని కాలువ, దాని అవతల కొండ, సముద్రపు గాలి, ప్రశాంతత, నోస్టాల్జియా రోగులు ఇష్టపడే వందల సంవత్సరాల నాటి విదేశీ భవనం.

మూడేళ్ళ కాలం అంతం కాబోతుండగా అతనితో పాటు ఒక రోజు పొద్దున్న వరూథిని బస్సు దిగింది. తప్పిపోయిన ఆత్మీయురాలిని కనుగొన్న అనుభూతితో పలకరించాలనిపించింది కానీ ఆమె అతన్ని చూసే ఎడముఖంగానూ, వేగంగానూ వెళ్ళిపోతోందని అతనికి రూఢీ అయ్యి ఆ ఆలోచనను విరమించుకున్నాడు. ఆమెకు సహకరించ దలచుకుని తన నడక వేగాన్ని తగ్గించుకున్నాడు. ఇక ఏమాత్రం పలకరించినా దాన్నిఆమె ఇబ్బందిగా భావిస్తుందని అర్థమయ్యింది. తాను కార్యాలయం నుంచీ ఒకటి రెండు నెలలో వెళ్లే వరకూ పలకరించే ప్రయత్నం చేయదలచ లేదు. ఆమె తన సీటుకు ఒక్కసారీ రాలేదు కష్టమో, నష్టమో ఆమెకు అతని వలన వాటిల్లినట్టు. తానంతట తాను వెళ్లి ఆమెను కలిసి, మాట్లాడాలనిపించ లేదు మనసు చివుక్కుమని. ఒక సారి మనసు ఊరుకోక గ్లాసుతో టీ పంపాడు. ఆమె తాగలేదు. కాఫీ మాత్రమే ఆమె తాగుతుందట. అది అక్కడ దొరకదు. ఆమె తనను అవమానపరిచినట్టు, ఏ క్రిమిగానో కీటకంగానో తనను జమ వేసినట్టు అనిపించింది. ఏదన్నాఅపరాధ భావము ఆమె నీలుక్కు పోయేలా చేసిందేమో.

అతను తిరిగి బదిలీ మీద ఇప్పుడున్న కార్యాలయాన్ని ఒదిలేయ వలసిన ఆఖరి రోజది. ఆమెకు కేటాయించిన గదిలో ఉండుంటుంది. వెళ్లిపోతున్నాఅని ఆమెకు మర్యాదపూర్వకంగా ఉంచెప్పాలిసిన అవసరం లేదు. నోస్టాల్జియా ఊరుకోనీయ లేదు. అవతలి వ్యక్తి చర్యకు ప్రతిచర్య లేక ప్రతీకార చర్య చేస్తూ పొతే ఆ వ్యవహారం స్పాగెట్టీ ఫిలింలా మారుతుంది. హృదయం గాయపడి రక్తం కారినపుడల్లా అలా చేసిన వ్యక్తి రక్తం కళ్లజూడాలనుకోవడం అన్నివేళలా సాధ్యపడే విషయమూ కాదు. సమాధాన పడాలి ప్రతి దాన్నీదిగమింగుకుని. నిజానికి ఆమె తనకు నష్టం వాటిల్లే పని, గాయపరిచే పని కావాలని ఏమి చేసింది? తాను ఏదైనా ఆశించి, కావాలని అవతలి వ్యక్తి ఏమీ అపకారం చేయకపోయినా భంగ పడితే అది తన తద్దినం తాను పెట్టుకున్నట్టే. తప్పులను, అంతగా తప్పులు కానీ వాటినీ ఎవరికి

వాళ్ళు వాళ్ళావిగా భావించగల సంస్కారం అలవరచుకుంటే  లోకంలో కొంత ప్రశాంతత ఉంటుంది. మెట్లు దిగుతూ, ఆమెను కలవాలన్న అంతరాంతరాలలోని కోర్కెకు అనుగుణమైన తార్కిక ఆలోచన చేసానా అని అతన్ని అతను ప్రశ్నించుకున్నాడు.

ఆమె ఒక్కర్తే ఉంది. ఏటో చూస్తున్నామనిషి అడుగుల చప్పుడు వినబడంగానే, పనిలో నిమగ్నమయి ఉన్నట్టు తల దించి కాగితాలు చూస్తోంది. ఆమె ఎదురుగా న్యాయమూర్తి ముందు ముద్దాయిలా నిలబడ్డాడు. ఆమె కనురెప్పలు పక్షి రెక్కల్లా కొట్టుకున్నాయి, దేన్నివిదిలించుకోడానికో.

“చాలా కాలమైంది మనం కలుసుకుని.”

అవునన్నట్టో, కాదన్నట్టో తల ఊపింది. “నేను కలవడమనే శిక్ష ఆమెకు వేసినందుకు చికాకుపడుతుండవచ్చు,” అనుకున్నాడు.

ఎదో ఒకలాంటి శిక్ష ఆమెకు వేస్తున్నందుకు అతనికి ఆనందం కలుగక పోలేదు.

“జిప్సీలా తిరగటం ఈ ఉద్యోగంలో తప్పదు కదా,” సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్టు అనింది.

“కష్టమే,” నిర్లక్ష్యంగా అన్నాడు.

“ఇందులోనూ కొంత థ్రిల్ లేక పోలేదు,” అతని సానుభూతిని నిరాకరించదలచుకున్నట్టు అనింది.

“నిజమే,” అన్నాడు.

ఆమె మెడలో నల్లపూసలు కనిపించాయి. ఆమెకు పెళ్లి అయ్యుంటుందన్నవిషయం రెండేళ్ల క్రితం ప్రేమ సమాజం రోడ్డులో వెళుతూ గ్రహించాడు. ఒక స్కూటర్ వెనుక కూర్చుని మేఘాలలో దూసుకుపోతున్నట్టు కనిపించింది. దాని మీద ముందున్న వ్యక్తి  లావుగా, బలంగా ఉండి వాటికి న్యాయం చెయ్య దలచుకున్నట్టు. వెనుక కూర్చున్నామే గాలిలోకి ఎగిరి రోడ్డు పాలయ్యే అవకాశం ఉందన్న విషయం గమనించనట్టు నడుపుతున్నాడు. అది పొడవైన రోడ్డు. వెనుక నుంచీ ఆమె కోదండాన్ని చూసుండాలి. కనీసం అతన్ని దాటుతున్నపుడన్నా. ఆమె ముందుచూపు మాత్రమే గలిగున్నట్టు, నిమిషం సేపు ఆ రోడ్డులో క్రమంగా దూరమవుతున్నా ఒక్క సారీ తల తిప్పలేదు. “ఆమె చూడ లేదులే,” అనుకున్నాడు.

కనీసం శుభలేఖన్నాపంపలేదు అనుకున్నాడు. ఈ రోజుల్లో ముఖ పరిచయం లేకపోయినా దాన్ని పంపే ఆనవాయితీ ఉంది కదా. పైగా వాళ్ళ కుటుంబంతో కూడా కొంచం పరిచయముందే. ఆమె పెళ్ళికి వచ్చినపుడు జోగారావు కోదండాన్నికలవలేదు. ఇలా వచ్చి, అలా వెళ్లిపోయాడేమో. వాళ్ళిద్దరినీ తన మిత్రులుగా భావించాడు కోదండం. వాళ్ళతో అతనికి గల స్నేహంలో లేక పరిచయంలో ప్రత్యేకతుంది. వాళ్ళ దృష్టిలో తాను అలా ఉండాలని ఏ లిఖిత నీతిశాస్త్రంలో ఉండుండక పోవచ్చు. అలిఖిత నీతి శాస్త్రాలూ, రాజ్యాంగాలూ కూడా ఉన్నాయి .

అతనికి ఆమె సన్నిధి నుంచీ వెళ్లిపోవాలని లేదు, అదే పెన్నిధి అన్నట్టు. కంటికి కనబడని అయస్కాంత శక్తి, మాయాజాలం తేలికగా ఒదలం అంటున్నాయి. ఆమె లోని శారీరక ఆకర్షణ సాధారణమైనదే. విచారం, ఆనందం, అబ్బురం ఉండే నోస్టాల్జియాకి తోబుట్టువు లాంటి అనుభూతి కోదండం మనసును వశం చేసుకుంది.

ఎవరన్నా వస్తారు, ఏకాంతంలో ఇతగాడితో మాట్లాడటం ఎందుకూ అన్న భావం ఆమెలో ఉందేమో! నా సన్నిధి ఆమెకు ఇబ్బందికరమైనదిగా తోస్తోంది. "వెళ్ళిరండి," అన్నాఅనవచ్చు.

"మీ అమ్మ గారిని తీసుకుని మా ఇంటికి రండి."

"తప్పకుండా!"

"పెళ్లి చేసుకోండి."

తన మేడలో తాళిబొట్టు లేకపోయినా తనకు ఇంకా పెళ్ళవలేదని ఎలా తెలిసిందో. అలా అంటే ఒక వేళ పెళ్ళయుంటే అయిపోయిందని ఎలాగూ చెబుతాడని ఆమెకు తెలుసు. ఆమె మీద మోజుతో పెళ్ళిని ఆలస్యం చేశాననుకుని గర్వపడిందా? తన వ్యామోహాన్నిగ్రహించ లేని మూర్ఖురాలు కాదు.

"అలాగే. పెళ్లనే లంపటం ఇప్పటినుంచే ఎందుకని తాత్సారం చేశా – ఇంకో కారణం ఏమీ లేదు."

అసంకల్పితంగా ముని వేళ్ళతో ఆమె నల్లపూసలను తాకింది. మనసును కట్టుంచిన భావాన్నితోలివేసి, స్వేచ్ఛగా నిలబడ్డాడు. ఆమె కుర్చీలో కూర్చునే ఉంది నిలబడ వలసిన అవసరం లేదు అన్నట్టు.

అయిదేళ్లుగా అణిగిమణిగి ఉన్న ఉక్రోషం నేను తాళ లేను అంటోంది. పరోక్షంగా కారణభూతమైన వ్యక్తిని పక్షి ఈకతో నన్నా కొట్టాలి. కానీ ఎలా? తోచినా అది పరిహాసాస్పదంగా, బాలుడి చర్యలా ఉంటుంది. ఉక్రోషం తీరనందుకు మరికొంత ఉక్రోషం.

"ఒడి రోజులలో ఎక్కడ నివసించే వాళ్ళు మీరు?"

"శరభయ్య గుడుల దగ్గిర. ఏం?"

ఆమె అతనికే ఏమీ బాకీ లేదు. కాఫీ తప్ప. కానీ మనిషీ మనిషికి గల సంబంధం బాకీ మీద మాత్రమే ఆధారపడి లేదు. దాంట్లొ కించత్ వెచ్చదనాన్ని చొప్పించ గలిగితే ఎవరికీ నష్టం ఉండదు.

# యానం స్ఫురిత మైలవరపు

మీటింగ్ పూర్తయ్యి తన కాబిన్ కి వచ్చి చూసుకునే సరికి సమయం రెండయ్యింది. విరించి కి ఒక పక్క ఆకలికి కడుపు కాలిపోతోంది, మీటింగ్ లో చెప్పిన "డెడ్ లైన్" కి బుర్ర తిరిగిపోతోంది.

"మీకు విజయానికి కొలమానాలు చావు గీతల ట్రా?" ఎప్పుడు రమ్మన్నా ఏదో ఒక ప్రాజెక్టు పని అని చెప్తుంటే తండ్రి అన్న మాటలు గుర్తొచ్చాయి. ఎంత వద్దనుకున్నా తండ్రితో తన ఉద్యోగం ఎంచుకునే విషయం లో పడ్డ ఘర్షణ ఏదో రకంగా గుర్తొస్తూనే ఉంటుంది. "దీనికోసమేనా అంతలా పోరాడావు?" అని వెక్కిరిస్తూనే ఉంటుంది.

రోజంతా మీటింగులు అని చంపుతారు, పనులు మాత్రం ఇవ్వగానే అయిపోవాలి అని తిట్టుకుంటూ ఒక పక్క నాలుగు మెతుకులు నోట్లో వేసుకుంటూనే, అలవాటుగా ఫోను కేసి చూసాడు. అయిదు మిస్డ్ కాల్స్. అన్నీ అమ్మ దగ్గరనుంచే. ఇన్ని సార్లు చేసింది... ఏ సంబంధం వచ్చిందో మళ్ళీ, అనుకుంటూ ఒక పక్క భోజనం చేస్తూనే అసౌకర్యంగా చెవి దగ్గర ఫోను పెట్టుకుని తల్లికి కాల్ చేసాడు.

విజయ, ఫోను ఎత్తుతూనే ఏ పలకరింపులూ, ఉపోద్ఘాతాలు లేకుండా అడిగింది, "ఏరా? ఎప్పుడొస్తునావు, రైలు రిజర్వేషను చేయించుకున్నావా?" అని. ఆ మాటకి గుర్తొచ్చింది విరించికి, వచ్చే వారమే తండ్రి పదవీ విరమణ మహోత్సవం అని.

"ఈ సారైనా అయ్యగారికి కుదురుతుందా?" వెనకనుంచి తండ్రి గొంతు. ఈ ఉద్యోగంలో చేరినప్పటి నుండీ తండ్రికీ తనకు మధ్య సంభాషణలు అన్నీ అమ్మ మధ్యవర్తిత్వం లోనే.. బాసు గారి చేతిలో ఎన్ని తిట్లు తిన్నా సరే, ఎలాగో అలా స్ఎలవు సంపాదించాలని నిర్ణయించుకుని, "దొరికేస్తుందమ్మా.. అరుణ్ కి చెప్పి పెట్టాను టికెట్ రిజర్వ్ చేయించమని" అని చెప్పి ఫోన్ కట్ చేశాడు.

★★★★★★★★★

చెయ్యాల్సిన పని అంతా ముందే పూర్తి చేసి ఇచ్చినా, తన సొంత డబ్బులతో ప్రయాణం ఖర్చులు భరిస్తున్నట్టు మొహం పెట్టుకుని వదిలిపెట్టాడుబాసు. చివరి నిమిషంలో ప్రయాణం. అతి కష్టం మీద తత్కాల్‌లో దొరికిన సెకండ్ క్లాస్ రిజర్వేషన్. భోగీ మొత్తం కోలాహలం గా వుంది. ఒక్కో బెర్తూ ఇద్దరికి అమ్మేరేమో అన్నట్టున్నారు జనాలు. తల పగిలిపోతుందేమో అనిపించింది ఆ గోల కి.

"మీకు లాగా జనరల్ కంపార్ట్మెంట్ ప్రయాణాలతో జీవితం మొత్తం సర్దుకుపోతూ బతకలేను...". అవకాశం దొరికినప్పుడల్లా గతం గుర్తు చేసే అంతరాత్మ తన మాటలు తనకే రీలు వేసి చూపించింది. "అవును సెకండ్ క్లాస్‌కి ప్రమోషన్ తెచ్చుకున్నా..." తనలో తనే నవ్వుకున్నాడు.

★★★★★★★

భార్య, కొడుకుతో కలిసి బడి లో అడుగు పెట్టారు నారాయణ మూర్తి గారు. తమ మాస్టారిని చూడగానే పిల్లలంతా లేచి నిలబడి కరతాళ ధ్వనులతో బడి ఆట స్థలం మొత్తం ముంచెత్తేసారు. ప్రస్తుత విద్యార్థులే కాకుండా పూర్వ విద్యార్థులు కూడా చాలా మందే వచ్చారు. అందరి కళ్ళల్లో ఒక రకమైన ఉద్వేగం. కొంతమంది పిల్లలకైతే రేపట్నుండీ మాస్టారు రారన్న ఊహతో కన్నీళ్లు ఆగడం లేదు. ఏదో హీరోని చూసినట్టు ఆయన నడిచి వెళ్తుంటే దార్లోనే కాళ్ళకడ్డు పడిపోతున్నారు. చేతులు పట్టేసుకుంటున్నారు. వేదిక కి కొంత దూరం ఉందనగా ఎర్ర తివాచీ పరిచి, కొంత మంది పిల్లలు దానికి అటూ ఇటూ నిల్చుని మాస్టారి మీద అభిమానంగా పూలు జల్లారు.

నారాయణ మూర్తి గారితో ప్రస్తుతం పని చేస్తున్న వాళ్ళు, ఎన్నో ఏళ్ల క్రితం పని చేసిన మాస్టార్లు, ఒకప్పుడు ఆయన దగ్గర చదువుకుని, రకరకాల వృత్తుల్లో స్థిర పడ్డ పూర్వ విద్యార్థులు చాలా మంది ఆయన గురించి మాట్లాడారు. ఎవరూ కూడా తయారు చేసుకున్న ప్రసంగాలు చదివినట్టు కనిపించలేదు. ఆయన మీద మనసులో ఉన్న అభిమానం, గౌరవం కలిపి మాట్లాడినట్టే అనిపించాయి అందరి మాటలూ.

"వీడెప్పుడు పోతాడా అని ఎన్ని రోజులుగా ఎదురు చూస్తున్నానో రా బాబూ..." ఆఫీస్ లో సీనియర్ మేనేజర్ విరమణ కి మొక్కుబడిగా పెట్టిన చిన్న సభలో సమోసా కొరుకుతూ తనతో పాటూ పనిచేసే రమేష్ అన్న మాటలు అప్రయత్నం గా గుర్తొచ్చాయి.

సన్మానం తర్వాత, తన ఉన్నతాధికారితో మాట్లాడుతున్న నారాయణ మూర్తి గారు, విరించిని పిలిచి ఆయనకు పరిచయం చేశారు. "మా అబ్బాయి సాఫ్ట్ వేర్ ఇంజనీర్" అని చెబుతున్నప్పుడు ఆయన స్వరం లో తొణికిసలాడిన గర్వం విరించి దృష్టిని దాటిపోలేదు. "ఆహా మంచి తెలివైన అబ్బాయి. చక్కగా స్థిరపడ్డాడన్నమ్మాట.. మీకింక ఏ చీకూ చింతా లేదు. మా అబ్బాయి కూడా ఇంజనీరింగ్ చేస్తున్నాడు మాస్టారూ. కాస్త మీ అబ్బాయి చేత ఏదైనా సలహాలు ఇప్పించండీ" అంటుంటే నారాయణ గారు మరింత ఆనందంగా "దానికేమండీ మా వాడి ఫోను నంబర్ ఇస్తాను. ఏదైనా సాయం కావాలన్నా, సందేహాలు ఉన్నా మా వాడితో మాట్లాడమనండి. మా వాడు ఏదైనా చాలా చక్కగా వివరంగా చెబుతాడు". ధైర్యంగా మాట ఇస్తున్న తండ్రి నమ్మకం మొయ్యలేనేమో అన్న అనుమానం రాగానే అక్కడ నుంచి నెమ్మదిగా తల్లి ఉన్న వైపు నడిచాడు.

"విరించి అంటే బ్రహ్మ అని కదా మాస్టారూ? మంచి పేరు పెట్టారండీ అబ్బాయికీ"... వెనక నుంచి ఇంకా వాళ్ళ మాటలు వినపడుతున్నాయి.

★★★★

"నా తలరాత నేను రాసుకో గలిగితే చాలు. వేరొకరి తల రాతలు రాయక్కర్లేదు".... పెద్ద చప్పుడు తో తలుపు వేసి బయటకు నడిచిన జ్ఞాపకం విసురుగా వచ్చి ముఖానికి తగిలింది.

★★★★

"మాస్టారు పిల్లలకే కాదు, మాకు కూడా గురువే అని చెప్పాలి. ఎప్పుడు ఎలాంటి సందేహం ఉన్నా మాస్టారిని అడిగితే చాలు చక్కగా చెప్పేవారు. ఆయనకి ఒక వేళ తెలియని విషయం అయితే తెలుసుకుని మరీ చెప్పేవారు..."

"ఏవయ్యా విరించీ ఆ కొత్త కుర్రాడికి అంతలా అన్నీ చెబుతున్నావు? మనం ఎదగాలంటే పక్కవాళ్ళని తొక్కెయ్యాలయ్యా... ముందు రాజకీయం రావాలి. తరవాతే పని..."

చీకట్లో పడుకుని కళ్ళైతే మూసుకోగలిగాడు గానీ, మనసు కి కళ్ళెం వెయ్యలేకపోతున్నాడు. ఎంత కట్టేసి కూచోపెట్టాలన్నా వినకుండా, తనకు తోచిన జ్ఞాపకాలకి ముదులు పెట్టుకుంటూ గతంలోనూ, వర్తమానం లోనూ కలియ తిరిగేస్తోంది అల్లరి మనసు.

"నమస్తే మాస్థారూ""

బయట గదిలోనుంచి పొద్దున్న రాలేకపోయిన మురళి తో తండ్రి మాటలు వినపడడం తో విరించి ఈ లోకం లోకి వచ్చాడు.

"ఆ! మురళీ! బాగున్నావా? ఏం చేస్తున్నావ్? ఎక్కడుంటున్నావ్?" ఒక ప్రత్యేక అభిమానం తండ్రి గొంతు లో వినపడుతోంది.

"బాగున్నాను. ఇస్రోలో శాస్త్రవేత్తగా చేసున్నాను."

"ఓ చాలా బాగుంది. నీ పరిశోధన కి, అభిలాష కి అనుకూలంగా ఉందా?"

"ఉంది మాస్టారూ. దీనికన్నా ఎక్కువ డబ్బులు వచ్చే ఉద్యోగాలు చాలా వచ్చినా ఇందులోనే నా మనసుకి హాయిగా ఉంది. ఇది మీరు చూపించిన దారే.

మురళి మాటలు విరించి మనసుని ముల్లులా గుచ్చుతున్నాయి.

"ఏవిటి రా, లైటు కూడా వేసుకోకుండా పడుకుని ఆలోచిస్తున్నావూ?" అప్పుడే గదిలోకి మడత పెట్టిన బట్టలు పట్టుకొచ్చిన విజయ, లైట్ వేసి విరించిని చూస్తూ అడిగింది.

“ఏమీ లేదమ్మా, ఇలా కూర్చో” అని తల్లి ఒళ్ళో తల పెట్టుకుని పడుకున్నాడు.

ఎప్పుడైనా మనసు బాగోలేనప్పుడే అలా పడుకుంటాడని తెలిసిన విజయ కొంత సేపు ఏమీ మాట్లాడించకుండా విరించి తల నిమురుతూ ఉండిపోయింది.

“అమ్మా! నేను తీసుకున్న నిర్ణయం తప్పు అని నీకెప్పుడైనా అనిపించిందా?” తల్లి మొహం లోకి చూస్తూ అడిగాడు.

“ఏం నీకలా అనిపిస్తోందా?” తన ప్రశ్న తనవైపే తిరిగొచ్చింది.

“ఊ... ఎంత కాదు అని సర్ది చెప్పుకుంటున్నా అలాగే అనిపిస్తోంది”. నెమ్మదిగా లేచి కూర్చుంటూ చెప్పాడు.

“నాన్న నా ఉద్యోగం ఎంచుకునే విషయం గురించి చాలా చెప్పేవారు. చాలా వాదించేవారు. నువ్వెప్పుడూ ఏమీ చెప్పలేదు ఎందుకమ్మా?” మౌనం గా ఉన్న తల్లితో మళ్ళా విరించే అన్నాడు.

“మీరు చూసే ప్రపంచంలో మా అభిప్రాయాలకి, అనుభవానికి ఎంత విలువ ఉందో తెలియకుండా సలహాలు చెప్పకూడదు చిన్నా! ఒక వయసు వచ్చాక, సొంత పిల్లలకైనా సరే అడిగినప్పుడే ఏదైనా చెప్పాలి. అయినా నీకు ఇప్పుడు నీ నిర్ణయం తప్పని ఎందుకనిపిస్తోంది రా?” చదువుతూ ఆపిన పుస్తకం ఎక్కడ ఆగిందో వెతుకుతూ అడిగింది విజయ.

“ఇదీ అని చెప్పలేను కానీ... రోజూ ఏదో నిరాశ గానే అనిపిస్తుందమ్మా. ఇవాళేదో గొప్పగా చేశాను అనిపించడం దాన్నేవంటారూ?... ఒక తృప్తి...అది నా పనిలో లేదనిపిస్తోంది.”

“పనిలో లేదా? నువ్వు చేసే విధానంలో లేదా?” పుస్తకంలో నుంచి తల తిప్పి అడిగింది విజయ.

“విరించీ... ఒక్కటి గుర్తు పెట్టుకో... మనం చేసే ఏ పనీ ఎవరితోనో సరితూగడానికి చేసినంత కాలం నువ్వన్న తృప్తి నీకు దొరకకపోవచ్చు. ఎప్పుడూ మన మనసులో ఒక భాగం నువ్వు చేసేది తప్పో ఒప్పో చెబుతూనే ఉంటుంది. మొదటి అడుగుతోనే ప్రయాణం పూర్తవ్వదు. ప్రతి అడుగులోనూ చాలా దారులు కనపడతాయి. నీ మనసుకి ఏది చేస్తే తృప్తి అనిపిస్తుందో ఆ దారినే ఎంచుకుంటూ వెళ్ళినప్పుడే గమ్యం చేరినప్పుడు...నీకే నువ్వు నెగ్గావని తెలిసిపోతుంది.”

“ఇంతకన్నా ఎక్కువ చెప్పాల్సిన అవసరం లేదు. నీకు నువ్వు అలోచించుకోగలవని తెలుసు... పద అన్నం తిందువుగానీ... మళ్ళా పొద్దుటే ప్రయాణం” అంటూ లేచింది విజయ.

తండ్రితో మాట్లాడిన మురళీ నెగ్గాడు. నాకు గెలుపు అంటే ఏవిటో ఇప్పుడే తెలుస్తోందా ?...

★★★★★★★★★★★★★★★★

రైలుకి బయలుదేరుతూ కాళ్ళకి నమస్కారం పెట్టిన విరించి వైపు ఆశ్చర్యంగా చూశారు నారాయణ మూర్తి గారు.

తెల్లవారుతూ సూర్యుడు తొలి కిరణాలతో నులివెచ్చగా బయటకు వస్తున్నాడు. రైలు ఎక్కడానికి వచ్చిన వాళ్ళు, వాళ్ళకి వీడ్కోలు చెప్పడానికి వచ్చిన వాళ్ళ తో కలిసి రైలు మొత్తం కోలాహలంగా ఉంది.

విరించికి ఆ "గోల" అంతా "సందడిగానే" కనిపిస్తోంది ఇవాళ.

# జంప్ జిలాని

జి.ఎస్.లక్ష్మి

"మా  వెంగళప్పకి చిన్నప్పుడు వేపకాయంత వెఱ్రే వుండేదండి. ఈ మధ్యే అది కాస్తా పుచ్చకాయ సైజుకి మారింది."

పెళ్ళిపందిట్లో కూర్చున్న వెంగళప్ప మేనమావ ఆడపెళ్ళివారితో చెప్పేడు.

"మా పుల్లేశ్వరికీ అంతేనండి.. చిన్నపుడు సూదిబెజ్జమంతేనండీ.. ఇదిగో పెద్దయేకే యిలా దబ్బనం సైజుకి వచ్చేసింది.."

అక్కడే కూర్చున్న పుల్లమ్మ మేనమావ మగపెళ్ళివారితో మాట కలిపేడు.

వీళ్ళిద్దరి మాటలూ విన్న ఆ ఊళ్ళో పెద్దలు "దొందూ దొందే.." అనుకుంటూ ముసిముసినవ్వులు నవ్వుకున్నారు.

అసలింతకీ ఈ పిచ్చిపుల్లమ్మ, వెఱ్రివెంగళప్ప లిద్దరూ ఎవరనుకుంటున్నారా..

వీళ్ళిద్దరూ పక్కపక్కనే వున్న ఊర్లలో వుంటారు. బాగా పొలాలూ, తోటలూ వున్న సంపన్నులు. ఇద్దరూ కూడా అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్ళూ లేకుండా ఒక్కరిగానే పుట్టడం వల్ల మహా గారాబంగా పెరిగేరు. డబ్బుకి లోటు లేదు. ప్రేమానురాగాలకి కొరత లేదు. ఇక్కడ పుల్ల తీసి అక్కడ పెట్టే పని లేదు. పదిరూపాయిలు అడిగితే వందరూపాయిలిచ్చే పెద్దలు. ఆ డబ్బు ఏం చేసేవని మళ్ళీ అడగరు వాళ్ళు. ఇవన్నీ కలిసి పిచ్చిపుల్లమ్మనీ, వెఱ్రివెంగళప్పనీ ఏమాత్రం సవ్యంగా ఆలోచించక్కర్లేకుండా చేసేసేయి.

అసలు పిచ్చిపుల్లమ్మ పేరు అదికాదు. వాళ్ళ అమ్మమ్మ అసలుపేరు పూర్ణమ్మ. ఆ పేరే పెట్టేరు మనవరాలికి. చిన్నప్పుడు "నీ పేరేంటమ్మా.." అని ఎవరైనా అడిగితే "పూర్ణమ్మ.." అనడం రాక "పుల్లమ్మ.." అనేది.

దానికితోడు ఆమె చేసే చేష్టలు కూడా అలాగే వుండేవి. స్కూల్లో బుద్ధిగా కూర్చుని పాఠం వినకుండా అటూ ఇటూ బెంచీల్లో వున్న అమ్మాయిల్ని కూడేసి, బెంచీలు పక్కకి జరిపేసి, గచ్చకాయలూ, చింతపిక్కలూ ఆడేది. స్కూల్లో అలా ఆడకూడదూ అని మాస్టారు పుల్లమ్మకి చెపితే పుల్లమ్మకి ఖోపం వచ్చేసింది. ఏం.. స్కూల్లో కబడ్డీ, ఫుట్ బాలూ ఆడొచ్చుకానీ గచ్చకాయలూ, చింతపిక్కలూ ఆడకూడదా అని ఆయన్ని ఎదురు ప్రశ్నించింది.

అలా ఉట్టినే ప్రశ్నించి ఊరుకోకుండా ఈ గచ్చకాయలూ, చింతపిక్కల ఆటలని కూడా స్కూళ్ళల్లో జరిగే ఆటలపోటీల్లో పెట్టాలనే ప్రతిపాదన తీసుకొచ్చింది. మళ్ళీ అలా ప్రతిపాదించి ఊరుకోకుండా ఈ రెండింటినీ నేషనల్ గేమ్స్ లో చేర్చాలని దానిని ఒక ప్రతిపాదనగా చేసి కాపీ టూ సి.ఎం కీ, కాపీ టూ పి.ఎం కీ ఉత్తరాలు రాసి పడేసింది.

ఇదంతా చూసిన హెడ్ మాస్టరూ, మిగిలిన మాస్టర్లకీ ఏం చెయ్యాలో తెలీక జుట్టు పీక్కుని పుల్లమ్మ అమ్మమ్మ దగ్గర మొరపెట్టుకున్నారు. ఆవిడ తన మనవరాలి తెలివి ముందు ఈ స్కూళ్ళూ, చదువులూ చాలా చిన్నవిగా అనిపించి పుల్లమ్మని  స్కూల్ మానిపించేసింది. అలాగని ఇంట్లో ఖాళీగా వుంచకుండా పొద్దున్నే ఇంత పెరుగన్నం పెట్టి ఇంకో ఇద్దరమ్మాయిల్ని తోడిచ్చి గుడికి పంపేది. గుళ్ళో ప్రసాదంకూడా తిన్నాక, తోటల్లో కోతికొమ్మచ్చులాడుకుని, కోసుకున్నన్ని పళ్ళూ, కాయలూ తిని, ఇంటికొచ్చి బుద్ధిగా భోంచేసి పడుకునేది పుల్లమ్మ.

ఇంక సాయంకాలమైందంటే తన సావాసగాళ్ళ నేసుకుని అన్ని వీధులూ తిరుగుతూ, అందరిళ్ళల్లోని సమాచారాలూ సేకరించి, ఇక్కడి వక్కడా...అక్కడి విక్కడా చెప్పేది. ఆ చెప్పడంలో పుల్లమ్మ తనకున్న అమోఘమైన సృజనాత్మకత కూడా కలిపి, వాళ్ళు చెప్పిన మాటలకి మామూలు అర్థాలే కాకుండా పెడర్థాలు కూడా తీసి ఇక్కడి వక్కడ అక్కడి విక్కడ మాటలు మోసేది. దానివల్ల ఆ ఊళ్ళో కుటుంబాల మధ్య యుద్ధాలైపోయేవి. తర్వాత వాళ్ళు ఇదంతా పుల్లమ్మ పుణ్యమని అర్థం చెసుకున్నారు. అప్పట్నించీ పుల్లమ్మని పిచ్చిదానిగా భావించి, ఆ పిల్ల చెప్పేదేమీ పట్టించుకోకుండా "పిచ్చిపుల్లమ్మ చెప్పిందా.. అయితే వదిలెయ్యి.." అనుకునే స్థాయికి వచ్చేసేరు. అప్పటినించీ పుల్లమ్మపేరు పిచ్చిపుల్లమ్మగా స్థిరపడిపోయింది.

ఇదంతా చూసిన పుల్లమ్మ తండ్రి నరసింహం అలాంటి పేరొస్తే కూతురికి పెళ్ళవడం కష్టమని బాగా ఆలోచించి పుల్లమ్మకి స్మార్ట్ ఫోన్ ఒకటి కొనిచ్చి, ఫేస్ బుక్, ట్విట్టర్, వాట్సప్, ఇన్స్టాగ్రామ్ లాంటివాటిల్లో అకౌంట్లు పెట్టించేసేడు. అలా అన్నిచోట్లా అకౌంట్లు పెట్టుకున్న పుల్లమ్మ ఆనందానికి అవధులు లేకుండా పోయేయి. ఇదివరకు వీధి వీధీ తిరిగితేకానీ విశేషాలు తెలిసేవి కాదు. కానీ ఇప్పుడు ఎంచక్క అరిచేతిలోనే ఒక్క ఊళ్ళోనే కాదు మొత్తం ప్రపంచంలోని వింతలూ, విశేషాలూ కనపడుతున్నాయి. ఇంక పుల్లమ్మ విజృంభించేసింది. దానివల్ల పిచ్చిపుల్లమ్మ అనే పేరు ఒక్క ఊళ్ళోనే కాకుండా ప్రపంచమంతా తెలిసిపోయింది.

మరింక మన వెర్రివెంగళప్పయితే పిచ్చిపుల్లమ్మకి ఏమాత్రం తీసిపోనివాడు. స్కూల్లో చదువుకుంటున్నప్పుడే క్లాసులో పాఠాలు అతనికి చాలా చిన్నవిగా అనిపించేవి. అందుకని స్కూల్ కి వెళ్ళకుండా ఎక్కువగా తోటల్లో తిరిగేవాడు. అలా తిరుగుతున్నప్పుడే అతనికి బ్రహ్మాండమైన అవిడియాలు వచ్చేవి. “అసలు ఈ బ్రహ్మ ముసలాడైపోయి ఏవీ సరిగ్గా సృష్టించలేకపోతున్నాడు. అందుకే ఇంత పెద్ద చింతచెట్టుకి అలా చిన్న చిన్న కాయలు వేళ్ళడదీసేడు. అదే ఎంతో చిన్న తీగైన గుమ్మడిపాదుకి అంతంత గుమ్మడిపండ్లని కాయిస్తున్నాడు. బుర్రున్నవాడెవడైనా పెద్దచెట్టుకి పెద్ద కాయలూ, చిన్నచెట్టుకి చిన్నకాయలూ పెడతాడు కానీ...ఇలా చేస్తాడా” అనుకుంటూ ఈ విషయమై బ్రహ్మగారికి తెలిసేలా ఒక పెద్ద థీసిస్ లా రాసి, దాన్ని గుడిలో వున్న హుండీలో పడేసేడు.

ఆ మర్నాటినుంచీ “బ్రహ్మగారి దగ్గర్నుంచి జవాబొచ్చిందా?” అంటూ పూజారిగారిని సతాయించడం మొదలెట్టేడు.

వెంగళప్ప ప్రశ్నలేమిటో తెలుసుకున్న పూజారిగారు ఊళ్ళో పెద్దల్ని ఆశ్రయించేరు. అతని థీసిస్ గురించి విన్న వాళ్ళంతా కలిసి వెంగళప్ప తండ్రికి చెప్పి అతన్ని వేరే ఊళ్ళో చదువుకుందుకు పంపించేసేరు.

చాలా కష్టపడి స్కూల్ చదువు పూర్తి చేసుకున్న వెంగళప్ప కాలేజీ చదువు కూడా అలాగే వెలగబెట్టేడు. డిగ్రీ పరీక్షలు రాస్తున్నప్పుడు కూడా ప్రశ్నాపత్రంలో ఏ ప్రశ్న వున్నా తన బుర్రని అస్సలు కష్టపెట్టకుండా నాలుగో తరగతిలో చదివిన “అశోకుడు రోడ్లు కిరువైపులా చెట్లు నాటించెను..” అనే వాక్యాన్నే పేజీ అంతా రాసేసి, పేజీలకి పేజీలు నింపేసేవాడు. అలా మార్చీ సెప్టెంబరూ, మార్చీ సెప్టెంబరూ గజనీ దండయాత్రల్లా పరీక్షలు రాసేడు. పేపర్లు దిద్దినవాళ్ళెవరో కానీ ఆరేళ్ళకన్న ఈ హింస భరించలేక దానికే పాస్ మార్కులు వేసేసి, అతని చేతిలో డిగ్రీ పెట్టేసేరు.

మరింక పై చదువులు చదివే ఉద్దేశ్యం కానీ, ఉద్యోగంలో చేరాలనే ఆరాటం కానీ లేవు అతనికి. కానీ అసలు సమస్య ఇక్కడే వచ్చింది. మరి కాలం గడవడం ఎలా! వెర్రి వెంగళప్ప ఏమైనా తెలివితక్కువవాడా యేంటీ.... ఈ రోజుల్లో ఆ వయసులో అతనికి కాలక్షేపం వెదుక్కోవడానికి కష్టమేవుందీ! అందుకే వెంటనే ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్, వాట్సప్ లలో అకౌంట్లు పెట్టేసుకున్నాడు. వాటిల్లో వున్న అన్ని గ్రూపుల్లోనూ చేరిపోయేడు. ఉదయం గుడ్ మార్నింగ్, శుభోదయాలతో మొదలుపెట్టి రాత్రి గుడ్ నైట్, శుభరాత్రి చెప్పేవరకూ ఇంకతనికి అదే పని.

ఈ గ్రూప్ లో పజిల్ ఆ గ్రూప్ లో పెట్టడం, అందులోది ఇందులోకి ఫార్వార్డ్ చెయ్యడం, మధ్యమధ్యలో జోకులూ, చిన్న చిన్న వీడియోలు అప్లోడ్ చెయ్యడంతో వెంగళప్ప మహా బిజీ అయిపోయేడు.

ఇంక అన్నిచోట్లా వెర్రివెంగళప్ప, పిచ్చిపుల్లమ్మల పేర్లు మారుమోగిపోయేయి. వేలకొద్దీ ఫ్రెండ్సూ, వందలకొద్దీ లైకులూ, కామెంట్లూ వీళ్ళ ఖాతాలో చేరిపోయేయి.

వెంగళప్ప విజయవిహారం విన్న వాళ్ల నాన్నమ్మ మనవడికి ఓ పదికిలోల లడ్లు దిష్టితీసి పడేసింది.

పిచ్చిపుల్లమ్మ వాళ్ల అమ్మమ్మ అయితే మరో మెట్టు ఎక్కువగా ఇరవైకిలోల మైసూర్ పాకు దిష్టి తీసేసి, మనవరాలి నుదుటన మెటికలు విరిచేసింది.

ఫేస్ బుక్ లోనూ, వాట్సప్ లోనూ ఫ్రెండ్స్ అయిన వెర్రివెంగళప్ప, పిచ్చిపుల్లమ్మల ఒకేలాంటి అభిరుచులు గమనించిన పెద్దలు సాంప్రదాయబద్ధంగా వాళ్ళిద్దరికీ వివాహం నిశ్చయించేరు. ఇష్టాలూ, అభిరుచులూ కలిసిన తమిద్దరికీ ఇలా పెళ్ళి కుదరడం వల్ల వాళ్ళిద్దరి ఆనందానికీ అవధులు లేకపోయేయి. అంబరాన్నంటిన సంబరాలతో జరిగిన నిశ్చితార్థం రెండూళ్ళవారినీ రెండురోజులపాటు ఇంట్లో గేస్ స్టవ్ వెలిగించుకోనివ్వలేదు. మరింక పెళ్ళికయితే అందరూ పదహారురోజుల పండుగ వరకూ గేస్ స్టవ్ కోసం లైటర్ కూడా వెలిగించుకోనక్కర్లేదని రెండూళ్ళవాళ్ళూ తెగ సంబరపడిపోయేరు.

నిశ్చితార్థం జరిగిన మర్నాడు వెంగళప్ప పుల్లమ్మకి ఫోన్ చేసేడు.

"బంగారం, మనం కూడా అందర్లాగే చేసుకోవాలా పెళ్ళీ! స్పెషల్ గా ఏమైనా చేద్దాం." అన్నాడు.

"ఏం చేస్తాం బుల్లూ..పెద్దవాళ్ళన్నీ బాగానే చేస్తున్నారుగా.."అంది పుల్లమ్మ.

"ఊహు..మనకి ఆన్ లైన్ లో అంతమంది ఫ్రెండ్స్ వున్నారు. వాళ్లందరూ కూడా 'అబ్బో' అనేలా ఏదైనా చేద్దాం."

"అంటే పెళ్ళిపత్రిక ఆన్ లైన్ లో పెట్టేద్దామా.. బోల్డుమంది వస్తారు ఎంచక్కా." ఆనందంగా అడిగింది పుల్లమ్మ..

"ఉహూ.. కాదు. ఇప్పటివరకూ ఎవ్వళ్ళూ చెయ్యనిది చెయ్యాలి. ఆలోచిద్దాం.." అన్నాడు వెంగళప్ప.

"అయితే ఓ పని చేద్దాం. ఈమధ్య పెళ్ళి కుదరగానే ఆ పెళ్ళికూతురూ పెళ్ళికొడుకూ సినిమాలో హీరో హీరోయిన్లలాగా డ్యూయట్లు పాడుకుంటూ తోటల్లోనూ, కొండలమీదా వీడియోలు తీసుకుని, పెళ్ళికి ముందే ఫేస్ బుక్ లో పెట్టేసుకుంటున్నారు. అలా చేద్దాం.."అంది పుల్లమ్మ.

"అబ్బే.. అది ఇప్పటికే చాలామంది చేసేసేరు. అలాగ బురదలోపడి దొర్లుతూకూడా వీడియోలు తీయించుకుని పెట్టేరు.. ఇంకేదైనా.." అన్నాడు వెంగళప్ప.

"అయితే మన పెళ్ళిని ఆన్ లైన్ లో అందరూ చూసేలా చేసుకుందాం.."

"ఊహు.. అది కూడా అప్పుడే చాలామంది చేసేసేరు."

పుల్లమ్మ దీర్ఘంగా ఆలోచించి, ఉత్సాహం పొంగిపోతుంటే యిలా చెప్పింది. "ఒక మంచి కొరియొగ్రాఫర్ ని పెట్టుకుని మన పెళ్ళిలో మనిద్దరమే స్టేజ్ మీద డాన్సు చేద్దాం."

"ఈమధ్యే మా ఫ్రెండొకడు అలా చేసేసేడుగా. ఎవ్వళ్ళూ చెయ్యనిది చెయ్యాలి." అన్నాడు వెంగళప్ప అంతకన్న దీర్ఘంగా ఆలోచిస్తూ.

ఆలోచించే రిద్దరూ. ఒకరోజు కాదు రెండురోజులు కాదు. పదిరోజులు ఆలోచించేరు. బ్రహ్మాండమైన అవిడియా వచ్చింది వెంగళప్పకి.

"బంగారం, మనం జంప్ జిలానీ చేద్దామా.." ఉత్సాహంగా అడిగేడు పుల్లమ్మని.

"అంటే!" అంది పుల్లమ్మ.

"అదే.. సరిగ్గా తెల్లారితే పెళ్ళనగా పెళ్ళికూతురు కానీ, పెళ్ళికొడుకుకానీ ఇంట్లోంచి జంపై పోతారు. అలాంటి సినిమాలు

బ్రహ్మాండంగా ఆడేయి. సినిమాల్లో తప్పితే అలా నిజంగా మన చుట్టూ ఎవరూ చెయ్యలేదు. మనం చేద్దాం.

మనవాళ్ళందరూ మనం ఏమైపోయేమోనని ఖంగారు పడిపోతారు. భలే థ్రిల్లింగ్ గా వుంటుంది."

పుల్లమ్మ ఈ అవిడియాకి మురిసిపోయింది. మళ్ళీ ఏదో అనుమానం వచ్చింది.

"కానీ, సినిమాల్లో పెళ్ళికొడుకో పెళ్ళికూతురో ఒక్కరే జంపై పోతారు కదా. మరి మనిద్దర్లో ఎవరం జంపవుదాం."

"వాళ్లలాగే మనవూ చేస్తే ఇంక మన గొప్పేవుందీ! ఇద్దరం జంపై పోదాం."

"అయినా పెళ్ళి ఇష్టం లేనివాళ్ళుకదా అలా జంపై పోతారూ. మనిద్దరికీ ఈ పెళ్ళి ఇష్టమేకదా!" సందేహించింది పుల్లమ్మ.

"ఇష్టమైనా సరే.. మనిద్దరం జంపై పోతే మీవాళ్ళూ మావాళ్ళూ మనకోసం తెగ వెతికేసి ఖంగారు పడిపోతారు. అప్పుడు ఇద్దరం కలిసివచ్చి స్టయిల్ గా వాళ్ల ముందు నిలబడి, వాళ్ళని ఫూల్స్ చేసేసేవని చెప్దాం.. భలే వుంటుంది."

వెంగళప్ప చెప్పిన అవిడియా భలే నచ్చేసింది పుల్లమ్మకి. ఎగిరిగంతేసినంత పన్చేసింది.

వెంటనే "డివ్వీ డివ్వీ డివ్విట్టం...నువ్వంటేనే నాకిష్టం.." అంటూ పాడుతూ, డాన్సు చేసి, వీడియోతీసి వెంగళప్పకి వాట్సప్ లో పంపేసింది.

"డీడిక్కందీ అదృష్టం.. గట్టెక్కిందీ మన కష్టం.." అంటూ వెంగళప్ప కూడా దీటుగా పాటపాడి, డాన్సు చేసి, వీడియోతీసి పుల్లమ్మకి పంపేసేడు.

ఇద్దరూ కలిసి వాళ్ళ అవిడియాకి తగ్గ ప్లాన్ వేసుకున్నారు. ఒకటికి రెండుసార్లు ఆ ప్లాన్ తిరగేసి, మరగేసేరు. లొసుగులు కనిపిస్తే సరిదిద్దుకున్నారు. మొత్తం రెడీ చేసేసుకున్నారు.

తెల్లారితే పెళ్ళి. ఆ రాత్రి అచ్చం సినిమాలో హీరోయిన్ లాగా పుల్లమ్మ ఒక చిన్న బేగ్ లో అలమార్లో వున్న తన చీరలు రెండు పడేసింది. డ్రాయర్ లాగి కనపడ్డ నోట్లకట్టలను అలవోకగా అలా బేగ్ లోకి విసిరేసింది. బేగ్ జిప్ మూసి, భుజానికి తగిలించుకుని, మొబైల్ చేత్తో పట్టుకుని బాల్కనీలో కొచ్చింది. బాల్కనీమీంచి తన చీర నొకదాన్ని కిందకి పడేలా కట్టి, దాన్ని పట్టుకుని కిందకి దిగింది.

వెంగళప్పకూడా అదే టైమ్ కి డ్రాయర్ లో వున్న నోట్లకట్టలను ఓ పదింటిని తన జేబుల్లో కుక్కుకుని, మొబైల్ చేత్తో పట్టుకుని, కిటికీలోంచి లాఘవంగా బైట కొచ్చి శబ్దం చెయ్యకుండా కాంపౌండ్ వాల్ ని సమీపించి, వీరోచితంగా ఏడడుగుల కాంపౌడ్ వాల్ కష్టపడి యెక్కి రోడ్డు మీదకి అతి లాఘవంగా దూకేడు.

కానీ అదేంటో ఇద్దరూ కాస్త సద్దుకుని తలలెత్తి చూసేటప్పటికి ఇంట్లో పెళ్ళికొచ్చిన బంధుజనంతో సహా ఇంట్లో పెద్దవాళ్ళు వీళ్ళవైపు పరుగెత్తుకొస్తూ కనిపించేరు.

పిచ్చిపుల్లమ్మ, వెర్రివెంగళప్ప వాళ్లందర్నీ చూసి తెల్లబోయేరు. ఇంత రహస్యంగా జంప్ జిలానీ అవుతున్న సంగతి వాళ్లకెలా తెల్సిందో వీళ్ళకస్సలు అర్ధం కాలేదు.

"చేసిన నిర్వాకం చాలూ, ఇంక ఇంట్లోకి పదండి" అంటూ పెద్దలు ఇద్దర్నీనాలుగు కూకలేసి ఇంట్లోకి తీసికెడుతుంటే వెంగళప్ప నెమ్మదిగా పక్కనున్న నాన్నమ్మ నడిగేడు..

"నాన్నమ్మా, మేమిలా జంపై పోతున్నామని మీకందరికీ ఎలా తెలిసిందీ!" అంటూ.

"హోరి వెర్రినాగన్నా.. మీరిద్దరూ అలా జంపై పోతూ వీడియో తీసుకుంటూ, అలవాటు ప్రకారం ఆ లైవ్ వీడియోని అదేదో వాట్సప్ ట అందులోకి పంపించేరుట. అందుకే మీరు నేల మీద కాలు ఆన్చేలోపల అందరం అక్కడున్నాం." అంటూ అలవాటుగా వెర్రివెంగళప్పకి కిలో లడ్డూలు దిష్టి తీసి పడేసింది.

తెల్లారేక అంగరంగవైభవంగా అలంకరించిన పెళ్ళివేదిక మీద పిచ్చిపుల్లమ్మ, వెర్రివెంగళప్ప మొబైల్ లో "డిప్పీ డిప్పీ డిప్పిట్టం...నువ్వంటేనే నాకిష్టం.. డీడిక్కంది అదృష్టం.. గట్టెక్కిందీ మన కష్టం.." అనే పాట హై సౌండ్ లో పెట్టేసుకుని ఊగిపోతూ డాన్సులు చెయ్యడం మొదలెట్టేరు.

అది చూసి పందిట్లో అందరూ నవ్వుకుంటూంటే, అదుగో అప్పుడే ఇద్దరి మేనమావల మధ్యా ఈ సంభాషణ జరిగింది.

"మా వెంగళప్పకి చిన్నప్పుడు వేపకాయంత వెర్రే వుండేదండి. ఈ మధ్యే అది కాస్తా పుచ్చకాయ సైజుకి మారింది."

పెళ్ళిపందిట్లో కూర్చున్న వెంగళప్ప మేనమావ ఆడపెళ్ళివారితో చెప్పేడు.

“మా పుల్లేశ్వరికీ అంతేనండి.. చిన్నపుడు సూదిబెజ్జమంతేనండీ.. ఇదిగో పెద్దయేకే యిలా దబ్బనంసైజుకి వచ్చేసింది..”

అక్కడే కూర్చున్న పుల్లమ్మ మేనమావ మగపెళ్ళివారితో మాట కలిపేడు.

వీళ్ళిద్దరి మాటలూ విన్న ఆ ఊళ్ళో పెద్దలు “దొందూ దొందే..” అనుకుంటూ పగలబడి నవ్వుకున్నారు.

కౌముది

కౌముది